ఈనాడు
విజయవాడ 6-2-2026 శుక్రవారం సిటీ సంపుటి 52 . సంచిక 177
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 6-50 పేజీలు 14
www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

అందుబాటులోకి భారత్ ట్యాక్సీ

- ప్రారంభించిన అమిత్‌షా
- తొలుత దిల్లీ, గుజరాత్‌ల్లో సేవలు
- మూడేళ్లలో దేశవ్యాప్తంగా విస్తరణ

ఈనాడు బిజినెస్ లో

'కల్తీ నెయ్యి'పై సమన్వయానికి.. కూటమి పార్టీల త్రిసభ్య కమిటీ

- తెదేపా నుంచి సత్యనారాయణరాజు ఖరారు
- జనసేన, భాజపా నేతల పేర్లు నేడు వెల్లడి?

8లో

ఏపీఈఏపీ సెట్ దరఖాస్తులకు గడువు మార్చి 7

- జూన్ 1న ఫలితాల విడుదల
- ఈసెట్, ఐసెట్‌లకు గడువు మార్చి 2

11లో

మేఘాలయ బొగ్గు గనిలో పేలుడు 18 మంది మృతి

లోపలి పేజీలో

వెంకన్నకు మకిలి అంటించే మహాకుట్ర

సొంత మనిషి ధర్మారెడ్డి ద్వారా జగన్ అమలు చేశారు

- తితిదేకి కల్తీ నెయ్యి సరఫరా దానిలో భాగమే
- సీఎం చంద్రబాబు ధ్వజం
- మహాపచారానికి పాల్పడ్డవారిని కఠినంగా శిక్షిస్తామని వెల్లడి

"దేవదేవుడైన వెంకన్న సన్నిధిలో వైకాపా నాయకులు ఘోరమైన అపచారాలు చేశారు. చేసిన దుర్మార్గాలన్నీ బయటపడేసరికి వాటిని అడ్డగోలుగా సమర్థించుకోవడమే కాకుండా, బూతులతో ఎదురు దాడి చేస్తున్నారు."
- చంద్రబాబు


సమావేశంలో మాట్లాడుతున్న చంద్రబాబు. చిత్రంలో పీవీఎన్ మాధవ్, పవన్ కల్యాణ్, లోకేశ్, సత్యకుమార్, రామనారాయణరెడ్డి, పార్థసారథి

నెయ్యి కల్తీ.. పక్కా ఆన్ రికార్డ్

ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

8లో

పాలే సేకరించని డెయిరీ నుంచి లక్షల లీటర్ల నెయ్యి ఎలా?

భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్

8లో

ఈనాడు, అమరావతి: వైకాపా ప్రభుత్వ హయాంలో తితిదేకి కల్తీ నెయ్యి సరఫరా వేంకటేశ్వరస్వామిని అపవిత్రం చేసేందుకు పన్నిన భారీ కుట్రలో భాగమని ముఖ్యమంత్రి చంద్రబాబు ధ్వజమెత్తారు. అది ఉద్దేశపూర్వకంగా మీరు పంపించిన ఈవో (ధర్మారెడ్డి) ద్వారా అమలు చేసిన మహాకుట్ర.. అని మాజీ సీఎం జగన్‌ను ఉద్దేశించి మండిపడ్డారు. 'అది కేవలం డబ్బు కక్కుర్తితో చేసింది కాదు. ఏదో ఒకసారి తప్పు జరిగితేనో, కిందిస్థాయి ఉద్యోగులెవరైనా చేస్తేనో క్షమించొచ్చు. కానీ కల్తీ నెయ్యి వ్యవహారం తిరుమల ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు ఆయన (జగన్) మనుషుల ద్వారా అమలు చేసిన పన్నాగం' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. కల్తీనెయ్యి కుంభకోణం తితిదే అప్పటి ఛైర్మన్ (వైవీ సుబ్బారెడ్డి)కి తెలిసే జరిగిందన్నారు. అప్పట్లో ఛైర్మన్, బోర్డు సభ్యులు కూర్చుని టెండర్ నిబంధనల్ని

(మిగతా 8లో)

ప్రతి ఎకరాకూ నీరివ్వాలి

- సాగునీటి సంఘాలు తలచుకుంటే రాష్ట్రం సస్యశ్యామలం
- మీరు చేసే పనులకు జీఎస్టీ ఇబ్బందులు తొలగిస్తాం
- సాగునీటి సంఘాల అధ్యక్షుల, ఉపాధ్యక్షుల సదస్సులో సీఎం చంద్రబాబు

2లో


రాజధాని అమరావతిలో నిర్వహించిన సదస్సులో ప్రసంగిస్తున్న సీఎం చంద్రబాబు

రాష్ట్రపతిని అవమానించారు

ఎన్నికల్లో వరుస ఓటములతో ప్రతిపక్షాల్లో అసహనం



- మండిపడిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ
- చొరబాటుదారులను మమత కాపాడుతున్నారంటూ ధ్వజం
- రాష్ట్రపతికి ధన్యవాద తీర్మానంపై రాజ్యసభలో ప్రసంగం
- లోక్‌సభలో ప్రధాని సమాధానం లేకుండానే తీర్మానం ఆమోదం

దిల్లీ: 'కాంగ్రెస్ నన్నేమీ చేయలేదు. ఎన్నికల్లో వరుస ఓటములను జీర్ణించుకోలేక ఆ పార్టీ నాపై విద్వేష ప్రచారం చేస్తోంది' అని రాజ్యసభ వేదికగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్రంగా ధ్వజమెత్తారు. లోక్‌సభలో అంతరాయం కలిగించడం ద్వారా పేద, గిరిజన రాష్ట్రపతినే కాకుండా రాజ్యాంగ అత్యున్నత పదవిని ఆ పార్టీ అవమానించిందని విమర్శించారు. కేంద్ర మంత్రి బిట్టూను ద్రోహిగా పేర్కొనడం ద్వారా సిక్కులను రాహుల్ గాంధీ అవమానించారని వ్యాఖ్యానించారు.

(మిగతా 11లో)

ఏపీ దళిత బిడ్డను కాంగ్రెస్ అవమానించింది

- ప్రధాని మోదీ ఆక్షేపణ

11లో

వివేకా హత్య కేసులో తదుపరి దర్యాప్తు



సుప్రీంకోర్టు అనుమతి

- ట్రయల్‌కోర్టు ఉత్తర్వులకు సమర్థన
- కొత్త అంశాలు వెలుగుచూస్తే తదుపరి విచారణకు సీబీఐకి స్వేచ్ఛ
- అదనపు సమాచారం ఉంటే సీబీఐకి అప్పగించడానికి సునీతకు అవకాశం

ఈనాడు, దిల్లీ: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో కిరణ్ యాదవ్, అర్జున్‌రెడ్డిల మధ్య జరిగిన సమాచార మార్పిడిపై తదుపరి విచారణ చేసే క్రమంలో తెలిసిన కొత్త విషయాలపై దర్యాప్తు చేసే స్వేచ్ఛ సీబీఐకి ఉంటుందన్న ట్రయల్ కోర్టు ఉత్తర్వులను సుప్రీంకోర్టు సమర్థించింది. ఈ కేసుకు సంబంధించి అదనపు సాక్ష్యాధారాలు, సమాచారం ఉంటే సీబీఐకి సమర్పించడానికి పిటిషనర్, వివేకా కుమార్తె సునీతా నర్రెడ్డికి స్వేచ్ఛనిచ్చింది. ఈ కేసులో నిందితుడైన సునీల్ యాదవ్ సోదరుడు కిరణ్ యాదవ్, మరో నిందితుడైన వైఎస్ భాస్కరరెడ్డి సోదరుడి కుమారుడు అర్జున్‌రెడ్డిల మధ్య వివేకా హత్య జరిగిన రోజు జరిగిన సమాచార మార్పిడిపై నెలలోపు దర్యాప్తు పూర్తి చేయాలంటూ సీబీఐ కోర్టు గత ఏడాది డిసెంబర్ 10న ఉత్తర్వులిచ్చింది. ఈ కేసు దర్యాప్తును కేవలం వారిద్దరి మధ్య జరిగిన సమాచార మార్పిడికే పరిమితం చేయకుండా, కొత్త విషయాలు వెలుగులోకి వస్తే

(మిగతా 8లో)

'టాటూతో చూపు పోవడం అవాస్తవం'


జగదీశ్

ఈనాడు, విశాఖపట్నం: 'కళ్లలో టాటూ వేయించుకోవడం వల్ల చూపు పోయిందన్న వార్తలు అవాస్తవం. తాజాగా కంటి వైద్యుడిని సంప్రదించి పరీక్షలు చేయించుకున్నా. ఎలాంటి సమస్యా లేదన్నారు' అని విశాఖకు చెందిన టాటూ డిజైనర్ జగదీశ్ తెలిపారు. 'కంట్లో టాటూ.. చూపు కోల్పోయిన యువకుడు' అని గురువారం 'ఈనాడు'లో వచ్చిన చిత్రవార్తకు జగదీశ్ స్పందించారు. తనది విశాఖ అని, గిన్నిస్ బుక్ రికార్డు సాధన కోసం కళ్లలో టాటూ వేసుకున్నట్లు తెలిపారు. టాటూపై మక్కువతో దేశాలలో చూపు పెట్టానని, కంటి చూపు బాగుందని వివరించారు.

గ్రహం అనుగ్రహం

6-2-2026 శుక్రవారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; ఉత్తరాయణం; శిశిర రుతువు; మాఘ మాసం, బహుళ పక్షం

పంచమి: రా. 2-46 తదుపరి షష్ఠి

హస్త: రా. 2-05 తదుపరి చిత్త

వర్జ్యం: ఉ. 9-42 నుంచి 11-23 వరకు

అమృత ఘడియలు: రా. 7-47 నుంచి 9-28 వరకు

దుర్ముహూర్తం: ఉ. 8-50 నుంచి 9-35 వరకు తిరిగి మ. 12-36 నుంచి 1-21 వరకు


రాహుకాలం: ఉ. 10-30 నుంచి 12-00 వరకు

సూర్యోదయం: ఉ.6.35; సూర్యాస్తమయం: సా.5.53

చలి పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
విజయనగరం	15.0	29.0
అనంతపురం	16.5	34.2
కడప	18.0	31.0
శ్రీకాకుళం	18.0	31.0
రాజమహేంద్రవరం	18.0	35.0
తిరుపతి	18.4	31.6
హైదరాబాద్	18.6	29.0
విశాఖపట్నం	18.8	31.2
గుంటూరు	19.0	32.0
తాడేపల్లిగూడెం	19.0	32.0
నరసాపురం	19.2	33.2
కర్నూలు	19.4	33.6
విజయవాడ	19.7	30.6
ఒంగోలు	20.6	31.7
నెల్లూరు	21.3	31.2

ఇదీ సంగతి!



పెద్దవాళ్లు ఎందుకు చెబుతున్నారో విను.. మన సార్ కూడా ఆటలో ఇలాగే పోరాడకుండా పరువు కాపాడుకున్నారు నాడు!!

ప్రతి ఎకరాకూ నీరివ్వాలి

కాలువలు, డ్రెయిన్ల నిర్వహణ, వారబందీ మీ బాధ్యతే ● సాగునీటి సంఘాల అధ్యక్షులు, ఉపాధ్యక్షుల సదస్సులో సీఎం చంద్రబాబు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలోని ప్రతి ఎకరాకూ నీరిచ్చేలా సాగునీటి సంఘాల ప్రతినిధులు కృషి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు. కాలువలు, డ్రెయిన్ల నిర్వహణ, వారబందీ బాధ్యత సాగునీటి సంఘాలదేనన్నారు. నీటి తీరువా కూడా వసూలు చేసి, ఆ నిధులు మీరే ఖర్చు చేసే జలవనరులు మరింత బాగుపడతాయని పేర్కొన్నారు. సాగునీటి సంఘాలు సైన్యం తలుచుకుంటే రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేయగలరన్నారు. అమరావతి రాజధానిలోని పరేడ్ మైదానంలో గురువారం రాష్ట్రంలోని సాగునీటి సంఘాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులతో నిర్వహించిన సమావేశంలో సీఎం మాట్లాడారు. 'రాష్ట్రంలో ప్రతి సాగునీటి సంఘానికి రూ.10 లక్షల వరకు నామినేషన్‌పై పనులు చేసుకునే వీలు కల్పించాం. సంఘాలు ఉత్సాహంగా పనులు చేస్తున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.344 కోట్లతో 7,197 నిర్వహణ పనులు చేశారు. ఈ పనులు చేయడం వల్ల మీకు జీఎస్టీ ఇబ్బందులు, పెన్షన్ ఇబ్బందులు ఉన్నట్లున్నాయని తెలిసింది. వాటన్నింటినీ తొలగిస్తాం' అని సీఎం ప్రకటించారు. మే 15 నాటికే ఖరీఫ్ సాగులో నాయుళ్లకు నీళ్లిస్తామని, ఆ తర్వాత జూన్ నాటికి పోలాలు సాగు చేసుకుంటామని చెప్పారు. తుపాన్ల వల్ల ఇబ్బందులు రాకుండా ఖరీఫ్ త్వరగా పూర్తి చేసుకుని రబీ పనులకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. 'సాగునీటి సంఘాల ప్రతినిధులు జలవినియోగంలో ఆలోచించి కొత్త ఆలోచనలతో ముందుకు రావాలి. రూ.10 లక్షలు ఇస్తే రూ.12 లక్షల పని చేసేలా ఉండాలి. ఒకప్పుడు రైతుల ఆత్మహత్యలకు కేంద్రంగా ఉన్న రాష్ట్రాన్ని రైతు సాధికారాంధ్రప్రదేశ్‌గా మారుస్తున్నాం' సీఎం పేర్కొన్నారు. ఆయన ప్రసంగంలో ముఖ్యాంశాలివీ..

పోలవరం- నల్లమలసాగర్‌కు అభ్యంతరమేంటి?

గోదావరి నుంచి ఏటా సగటున 2000 టీఎంసీల నీళ్లు సముద్రంలో కలుస్తున్నాయి. పోలవరం నుంచి 200 టీఎంసీలు నల్లమలసాగర్‌కు తీసుకువచ్చి అనుసంధానం చేస్తే రాష్ట్రంలో కరవు అనేది ఉండదు. రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణ గోదావరిపై ఎగువన కాళేశ్వరం ప్రాజెక్టు కట్టింది. అభ్యంతరమున్నది తెలుగువారే కదా అని మనం దానికి అభ్యంతరం చెప్పలేదు. అలాగే పోలవరం నుంచి నల్లమలసాగర్ అనుసంధానానికి ఎవరూ అభ్యంతరం చెప్పాల్సిన అవసరం లేదు. సముద్రంలోకి వెళ్లే నీళ్లే తీసుకుంటున్నాం.


సాగునీటి సంఘాల రాష్ట్ర సదస్సులో అల్ల గోపాలకృష్ణను సన్మానించి, మంత్రి కందుల దుర్గేష్‌తో కలిసి జ్ఞాపిక అందజేస్తున్న సీఎం చంద్రబాబు. చిత్రంలో డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్లు వెంకటరమణారెడ్డి, నిరంజన్, మంత్రి అచ్చెన్నాయుడు, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, మంత్రి నిమ్మల రామానాయుడు

దయ్యాం వాల్ విధ్వంసంతో రూ.1,000 కోట్లు వృథా

రాష్ట్రంలో ప్రాజెక్టులు పూర్తి చేసే క్రమంలో సమస్యల్ని పరిష్కరిస్తాం. గోదావరి పుష్కరాల కన్నా ముందే పోలవరం ప్రాజెక్టు పూర్తి చేస్తాం. జగన్ హయాంలో పోలవరం ప్రాజెక్టును భ్రష్టు పట్టించారు. రూ.440 కోట్లతో మనం కట్టిన డయాఫ్రం వాల్‌ను జగన్ పట్టించుకోపోవడంతో అది సర్వనాశనమయింది. దీంతో రూ.వెయ్యి కోట్లు పెట్టి మళ్లీ డయాఫ్రం వాల్ కట్టాల్సి వచ్చింది. దీంతోపాటు ప్రాజెక్టు ఆలస్యమయింది. 2014-19 మధ్య సాగునీటి ప్రాజెక్టుల కోసం రూ.68 వేల కోట్లు ఖర్చు చేశాం. ఆ ఫలితాలే ఇప్పుడు వస్తున్నాయి.

రాయలసీమ ఎత్తిపోతల వైకాపా ప్రభుత్వంలోనే ఆగింది

రాయలసీమ ఎత్తిపోతల ప్రాజెక్టును జగన్ ప్రభుత్వం ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మిస్తుంటే జాతీయ హరిత ట్రైబ్యునల్ నిలిపివేసింది. దాన్ని మన ప్రభుత్వం ఆపేసినట్లు వాళ్లు దుష్ప్రచారం చేస్తున్నారు. శ్రీశైలం జలాశయంలో అత్యంత దిగువ నుంచి నీళ్లు ఎత్తిపోసేలా ముచ్చుమర్రి ఉంది. దాని నుంచి పోతిరెడ్డిపాడు ద్వారా సీమ జలాశయాలన్నింటికీ నీళ్లు తీసుకువెళ్లవచ్చు. రాష్ట్రంలోని అన్ని జలాశయాల్లో 91%, చెరువుల్లో 65% నిండాయి. అన్ని జలాశయాల్లో కలిపి 846 టీఎంసీల నీళ్లు నిల్వ ఉన్నాయి. ఏడాదికి మనకు 1,300 టీఎంసీలు సరిపోతాయి. ఈ ఏడాది కోస్తాలో కన్నా రాయలసీమలోనే ఎక్కువ వర్షాలు పడ్డాయి. భూగర్భజలాలు కూడా రాయలసీమలోనే ఎగువకు ఉన్నాయి. ఒకప్పుడు ఎడారిగా మారిపోతుందన్న అనంతపురం జిల్లాను మనం పండ్ల తోటల వనంగా మార్చాం. రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా మార్చేందుకు ఎన్డీయే ప్రభుత్వం కృషి చేస్తోంది. బియ్యం నిల్వలు తగ్గిపోతున్నాయి. అందువల్ల చిరుధాన్యాలు, పండ్ల తోటలు పెంచాలి. వీటి వల్ల ఆరోగ్యంతోపాటు ఆదాయమూ పెరుగుతుంది. ప్రకృతినీ దృష్టిలో ఉంచుకుని జియో ట్యాగింగ్ చేసే సర్టిఫికేషన్ చేస్తాం.

సదస్సులో సీఎం నిర్ణయాలు

✦ రాష్ట్రంలోని అన్ని చెరువులు, కాలువలు, ప్రాజెక్టులు డిజిటలీకరణ చేస్తాం. వాటిపై అవసరమైన చోట కెమెరాలు ఏర్పాటు చేస్తాం. సాగునీటి సంఘాల నాయకులు ఇంట్లో కూర్చుని వర్చువల్‌గా కాలువలు, జలాశయాలను తనిఖీ చేసే రోజు త్వరలోనే వస్తుంది. ✦ వచ్చే ఐదు నెలలూ చాలా ముఖ్యం. కాలువల, డ్రెయిన్ల నిర్వహణ పనులు త్వరగా చేపట్టాలి. ఈ పనులన్నీ సాగునీటి సంఘాలతోనే చేయిస్తాం. ✦ 2019-24 మధ్య ప్రాజెక్టుల, సాగునీటి సంఘాల పెండింగ్ బిల్లులన్నీ క్లియర్ చేస్తాం. ✦ మూడేళ్లలోపు ఉత్తరాంధ్ర ప్రాజెక్టులను పూర్తి చేస్తాం. ✦ వెలిగొండ ప్రాజెక్టును ఈ సీజన్‌లోనే పూర్తి చేస్తాం. చింతలపూడి ప్రాజెక్టు తొలిదశ ఈ ఏడాది పూర్తి చేసి నీళ్లందిస్తాం. ✦ కాలువలపై చెట్లు పెట్టి పళ్లలు అమ్మి లేదా సౌర విద్యుత్తు ఉత్పత్తి చేసి ఆదాయం రాబట్టాలి.

నెయ్యి కల్తీ జరిగిందా లేదా?

'వైకాపా పాలనలో తిరుమలలో నెయ్యి కల్తీ జరిగింది అవునా? కాదా? నాసిరకం ప్రసాదం తయారు చేశారు అవునా కాదా?' అంటూ సీఎం సాగునీటి సంఘాల ప్రతినిధులను సభలో ప్రశ్నించారు. 'అవును, అవును' అంటూ వారంతా ముక్తకంఠంతో సమాధానం ఇచ్చారు. 'ఆ నెయ్యిలో జంతువుల కొవ్వు ఉందని, రసాయనాలు కలిపిన నివేదికలు వచ్చాయి. అలాంటి అపచారాన్ని క్షమిస్తామా' అని ప్రశ్నించగా 'లేదు లేదు' అని నినదించారు.


సదస్సుకు వచ్చిన సాగునీటి సంఘాల సభ్యుల నుంచి వినతిపత్రాలు స్వీకరిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు. చిత్రంలో అచ్చెన్నాయుడు, శ్రవణ్‌కుమార్, నిమ్మల రామానాయుడు, మాధవ్, కందుల దుర్గేష్

రాయలసీమ ఎత్తిపోతల ఎవరి హయాంలో ఆగింది?

● జగన్ హయాంలో కాదా? మరిప్పుడు సీమలో అల్లరి ఎందుకు

● జలవనరులశాఖ మంత్రి రామానాయుడి నిలదీత



ఈనాడు, అమరావతి: 'రాయలసీమ ఎత్తిపోతల పథకం ఎవరి హయాంలో ఆగిపోయింది? 2020 మే 20న ఈ ఎత్తిపోతల నిలిపివేయాలని ఎన్జీటీ ఆదేశాలిచ్చిందా? అనుమతులు తెచ్చుకోలేక జగన్ హయాంలోనే ఆ పనులు ఆపిలేదా? పనులు ఆగిపోయింది వైకాపా సర్కారులో, వాళ్లే సాగునీటి ప్రాజెక్టు కాదని తెల్సి చెప్పేశారు. మరి ఈరోజు సీమలో వైకాపా నాయకులు ఎందుకు ఈ పథకంపై హడావుడి చేస్తున్నారు? రాయలసీమ ప్రజల్ని మోసం చేయడానికా' అని జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు నిలదీశారు. అమరావతి గురువారం నిర్వహించిన సాగునీటి సంఘాల ప్రతినిధుల సదస్సులో మంత్రి మాట్లాడారు.

వెలిగొండ పూర్తిచేయకుండా..

వెలిగొండ ప్రాజెక్టుకు 1996లో చంద్రబాబు తన పుట్టినరోజున శంకుస్థాపన చేశారు. ఆ ప్రాజెక్టు జగన్ హయాంలో పూర్తిచేయలేదు. ఆ పనులు పూర్తిచేయకుండా వెలిగొండను జాతికి అంకితం చేసేశారు. ఈ సీజన్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు వెలిగొండ పూర్తిచేసి యాలని ఆదేశం నిర్దేశించారు' అని మంత్రి చెప్పారు.

డయాఫ్రం వాల్ గురించి కూడా తెలియని మంత్రి

'వైకాపా ప్రభుత్వంలో పోలవరం ప్రాజెక్టును విధ్వంసం చేశారు. నాడు ఒక జలవనరులశాఖ మంత్రికి డయాఫ్రం వాల్ ఏ ప్రాజెక్టులో ఉంటుందో, ఏ ప్రాజెక్టులో లేదో కూడా తెలియదు. (ఈ విషయం చెబుతుంటే సాగునీటి సంఘాల ప్రతినిధులు అంబటి రాంబాబు అంటూ అరిచారు. దీంతో నేను చెప్పకపోయినా మీరు చెబుతున్నారంటే వారి ఖ్యాతి ఎంతుందో అర్థమవుతోంది అని మంత్రి వ్యాఖ్యానించారు). గత ప్రభుత్వం రూ.18వేల కోట్ల పెండింగ్ బిల్లులు ఒక్క సాగునీటి రంగంలోనే మా నెత్తిన పెట్టి వెళ్లిపోయింది. ఆ బిల్లులు చెల్లిస్తున్నాం. ఆ రోజుల్లో కాలువల నిర్వహణ కూడా చేయలేదు. మా ప్రభుత్వంలో రూ.878 కోట్లు వెచ్చించి అంతవరకు సాగునీటి నిర్వహణ పనులు చేశాం' అని మంత్రి రామానాయుడు వివరించారు.

గోరకల్లు మరమ్మతులకూ నిధులివ్వని జగన్ సీమకు ఏం న్యాయం చేశారు

గోరకల్లు జలాశయం కట్టకు లీకేజీలు ఉన్నాయి. జగన్ హయాంలో ఆ ప్రాజెక్టు మరమ్మతులకు నిధులు ఇవ్వలేదు. గోరకల్లు నిండితేనే అవుకు, గండికోట, చిత్రావతి బ్యాలెన్సింగ్ జలాశయం నిండుతాయి. అక్కడి నుంచే పులివెందులకు నీళ్లు వెళ్తాయి. గోరకల్లుకు రూపాయి నిధులివ్వని జగన్‌కు రాయలసీమ ఎత్తిపోతలపై మాట్లాడే అర్హత ఉందా' అని మంత్రి నిలదీశారు.

కూటమి పాలనలో నీటిపారుదల రంగం సుసంపన్నం

తుళ్లూరు, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న పోలవరం ప్రాజెక్టును తెదేపా ప్రభుత్వంలో 72% పూర్తిచేస్తే వైకాపా ప్రభుత్వం 2% కూడా పూర్తి చేయలేక చతికిలపడింది. చంద్రబాబు దూరదృష్టితో సాగునీటి సంఘాలను ఏర్పాటుచేసి జలవనరుల ప్రాజెక్టుకు దశ, దిశ నిర్దేశిస్తున్నారు. ప్రధాని మోదీ రాష్ట్రాభివృద్ధికి సహాయ సహకారాలు అందిస్తున్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అన్ని విషయాల్లో సీఎం చంద్రబాబుకు పూర్తి మద్దతు ఇస్తున్నారు. అనివార్య కారణాలతో ఉప ముఖ్యమంత్రి హాజరుకాలేకపోవడంతో ఆయన ఆదేశాలతో నేను వచ్చాను.

–కందుల దుర్గేష్, రాష్ట్ర మంత్రి

కాలువలు, చెరువులు పరిరక్షించుకోవాలి

సాగునీటి సంఘాల పదవులు రాజకీయాల కోసం కాదు.. అవి బాధ్యతతో కూడుకున్నవి. రాష్ట్రంలో కాలువలు, చెరువులను పరిరక్షించుకోవాలి. దేశంలో నీటి సంరక్షణకు కేంద్రం బడ్జెట్‌లో నిధులు కేటాయించింది. ఉద్యాన పంటలతో పాటు వ్యవసాయ రంగానికి కేంద్రం సహాయ సహకారాలు అందిస్తుంది. సీఎం చంద్రబాబు అడుగు జాడల్లో నడుస్తూ రాష్ట్రాన్ని ప్రగతిపథంలో నడిపించి ప్రజల్లో కూటమి స్ఫూర్తిని నింపేలా కార్యకర్తలు పనిచేస్తున్నారు.

–పి.వి.ఎన్.మాధవ్, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు

పట్టాలు తప్పిన చెన్నై సెంట్రల్-న్యూజల్పాయిగుడీ ఎక్స్‌ప్రెస్

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: చెన్నై సెంట్రల్ -న్యూజల్పాయిగుడీ ఎక్స్‌ప్రెస్ (రైలు నంబరు 22611) ఒడిశాలోని జాజ్‌పూర్ జిల్లాలో పట్టాలు తప్పింది. గురువారం ఉదయం 8.50 గంటల సమయంలో జజపూర్ రైల్వే స్టేషన్ సమీపంలో రైల్లోని ఒక ఏసీ, రెండు సాధారణ బోగీలు పట్టాలు తప్పాయి. దీంతో ప్రయాణికులు భయంతో రైలు నుంచి దిగిపోయారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని రైల్వే అధికారులు స్పష్టం చేశారు. ఘటనా సమయంలో రైలు నెమ్మదిగా వెళుతుండటంతో పెద్ద ప్రమాదం తప్పినట్లు భావిస్తున్నారు. ప్రమాదానికి కారణాలు తెలియరాలేదని, 81143 82367 హెల్ప్‌లైన్ నంబరు ఏర్పాటు చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఈ మార్గంలో వెళ్లే రైళ్ల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా చర్యలు తీసుకున్నారు.

రైలు ఢీకొని చిరుత మృతి

ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే: కర్నూలు జిల్లాలో రైలు ఢీకొని చిరుత మృతి చెందింది. ఆదోని రైల్వే పోలీసు స్టేషన్ పరిధిలోని కుప్పగల్లు-కోసిగి రైల్వే స్టేషన్ల మధ్య ఈ ఘటన చోటుచేసుకుంది. రైల్వే ట్రాక్ వద్ద చిరుత కళేబరం ఉండటంతో ఆదోని అటవీ శాఖ రేంజ్ అధికారిణి తేజశ్రీ, రైల్వే పోలీసులు గురువారం ఉదయం ఘటనా స్థలాన్ని పరిశీలించారు. తేజశ్రీ మాట్లాడుతూ.. గుర్తుతెలియని రైలు ఢీకొని చిరుత చనిపోయిందని, కళేబరానికి వైద్యాధికారులు శవపరీక్ష నిర్వహించారని, నివేదికను జిల్లా అధికారులకు పంపుతామని చెప్పారు. చిరుత మృతదేహాన్ని దహనం చేసినట్లు పేర్కొన్నారు. నెలన్నర కిందట ఇదే ప్రాంతంలో రైలు ఢీకొని ఓ చిరుత మృత్యువాత పడటం గమనార్హం.


కుప్పగల్లు-కోసిగి రైల్వే స్టేషన్ల మధ్య చిరుత కళేబరం

నేడు కర్నూలు జిల్లాకు సీఎం చంద్రబాబు

ఈనాడు, అమరావతి: 'మీ భూమి-మీ హక్కు' కార్యక్రమంలో భాగంగా కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు నియోజకవర్గంలోని కలుగొట్లలో శుక్రవారం జరిగే పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీలో సీఎం చంద్రబాబు పాల్గొంటారు. ఉదయం 11.30 గంటలకు కలుగొట్ల చేరుకుని, పట్టాదారు పాసు పుస్తకాలు పంపిణీ చేస్తారు. పార్టీ కార్యకర్తల సమావేశంలోనూ పాల్గొంటారు.

2014-19 సాగునీటి రంగంలో స్వర్ణయుగం

● మంత్రి అచ్చెన్నాయుడు

ఈనాడు, అమరావతి: 'రాష్ట్రంలో 2014-19 మధ్య సాగునీటి ప్రాజెక్టులపై రూ.68 వేల కోట్లు ఖర్చు పెట్టారు. రాష్ట్ర సాగునీటి రంగ చరిత్రలోనే అది స్వర్ణయుగం. నీటి సంరక్షణకు, భూగర్భజలాల పెంపునకు రైతుల సహకారం కోసం చంద్రబాబు సాగునీటి సంఘాల వ్యవస్థను తీసుకువచ్చారు. నాటి తెదేపా ప్రభుత్వంలో రాష్ట్రంలో ఎన్నో పనులు చేశారు' అని వ్యవసాయశాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు గుర్తుచేశారు. సాగునీటి సంఘాల ప్రతినిధుల సదస్సులో గురువారం ఆయన మాట్లాడారు. నీటి సంఘాలు రైతుల సమస్యలు పరిష్కరించాలని భూగర్భ జలాల వృద్ధికి అవసరమైన పనులు చేపట్టాలని ఆయన పిలుపునిచ్చారు. వరి తగ్గిస్తూ, ఉద్యాన పంటలు సాగు చేద్దామని, సీమను హార్టికల్చర్ హబ్‌గా మారుస్తున్నామని చెప్పారు. మంత్రులు దుర్గేష్, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, జనసేన ఎమ్మెల్సీ పి.హరిప్రసాద్, స్థానిక ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్, జలవనరులశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, సలహాదారు వెంకటేశ్వరరావు, కడా కమిషనర్ ప్రశాంతి, గుంటూరు జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, సాగునీటి సంఘాల ప్రతినిధులు అల్ల వెంకట గోపాలకృష్ణ, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రదర్శన తిలకించిన సీఎం

సదస్సుకు ముందు అక్కడ ఏర్పాటు చేసిన ప్రదర్శనను ముఖ్యమంత్రి చంద్రబాబు తిలకించారు. మట్టి నమూనా పరీక్షలు, భూగర్భజలాలకు సంబంధించిన ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. భూగర్భ జలవనరుల శాఖ డైరెక్టర్ కొంపెల్ల సుబ్రహ్మణ్యశాస్త్రి రెండు ప్రతిపాదనలు సీఎం ముందు ఉంచారు. గోదావరి జిల్లాల్లో భూగర్భజలాలు ఉప్పుగా మారుతుండటానికి కారణాలు, పరిష్కారానికి చేయాల్సిన పరీక్షలపై వివరించారు. సీఎం ఎంత ఖర్చవుతుందని ప్రశ్నించి, ఆ ప్రతిపాదనలు తనకు పంపాలని ఆదేశించారు. వ్యవసాయంలో ఉపయోగించే డ్రోన్లు, రిమోట్ కంట్రోల్ ద్వారా నడిపే వ్యవసాయ మోటార్లను సీఎం పరిశీలించారు. పోలవరం ఎడమ కాలువ పనుల తీరుపై ఉంచిన ఫొటో ప్రదర్శన చూస్తూ మార్చి నాటికి పనులు పూర్తి చేయాలని కోరా అని ప్రశ్నించారు. అక్కడే ఉన్న మంత్రి నిమ్మల రామానాయుడు పూర్తి చేస్తామని సమాధానమిచ్చారు.

రేపటి నుంచి గేట్ పరీక్షలు

● పోటీపడనున్న 10 లక్షలమందికిపైగా అభ్యర్థులు

ఈనాడు, హైదరాబాద్: దేశవ్యాప్తంగా గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజినీరింగ్(గేట్)-2026 ఆన్‌లైన్ పరీక్షలు మొదలుకానున్నాయి. ఐఐటీ గువాహటి ఆధ్వర్యంలో ఈ నెల 7, 8, 14, 15 తేదీల్లో పరీక్షలు జరగనున్నాయి. మొత్తం 30 సబ్జెక్టుల్లో ఈ పరీక్షలు నిర్వహించనుండగా....గతంలో ఎన్నడూ లేనంతగా ఈసారి అభ్యర్థుల సంఖ్య 10 లక్షలు దాటినట్లు సమాచారం. గతేడాది ఈ సంఖ్య 9.36 లక్షలే. బీటెక్‌తోపాటు బీఎస్సీ బీకాం విద్యార్థులు ఈ పరీక్ష రాస్తారు. తెలుగు రాష్ట్రాల నుంచి లక్ష మందికిపైగా దరఖాస్తు చేసినట్లు అంచనా. పరీక్షలో సాధించిన స్కోర్‌కు మూడేళ్లపాటు విలువ ఉంటుంది. గేట్ స్కోర్‌తో ఎంటెక్‌లో చేరితే ఏఐసీటీఈ నుంచి కోర్సు పూర్తయ్యే వరకు రెండేళ్లపాటు ప్రతినెలా రూ.12,400 చొప్పున స్టైపెండ్ అందుతుంది. అదే స్కోర్‌తో ఓఎన్‌జీసీ, ఎన్‌టీపీసీ, బీహెచ్‌ఈఎల్, ఈసీఐఎల్, ఇండియన్ ఆయిల్, గెయిల్ ఇండియా, డీఆర్‌డీఓ, సెంట్రల్ సిల్క్ బోర్డు తదితర పలు కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు(పీఎస్‌యూ) ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నాయి. ఈ గేట్ స్కోర్ ఆధారంగా ఇంటర్వ్యూకు ఆహ్వానించి కొలువులను ఎంపిక చేస్తాయి. కొన్ని సంస్థలు పీహెచ్‌డీలో కూడా చేరేందుకు అవకాశం కల్పిస్తున్నాయి. ఐటీ రంగంలో అనిశ్చితి నేపథ్యంలో అభ్యర్థులు ప్రభుత్వ ఉద్యోగాల వైపు చూస్తుండటంతో 'గేట్'కు పోటీ పెరుగుతున్నట్లు భావిస్తున్నారు.

పరీక్షా కేంద్రాలు

✦ ఏపీ(19 నగరాలు/పట్టణాలు): చీరాల- బాపట్ల, చిత్తూరు, గుంటూరు, కడప, నంద్యాల, నెల్లూరు, ఒంగోలు, తిరుపతి, భీమవరం, ఏలూరు, కాకినాడ-సూరంపాలెం, రాజమహేంద్రవరం, శ్రీకాకుళం, తాడేపల్లిగూడెం, విజయవాడ, విశాఖపట్నం, విజయనగరం, అనంతపురం, కర్నూలు

✦ తెలంగాణ(11 నగరాలు/పట్టణాలు): హైదరాబాద్, నల్గొండ, సంగారెడ్డి/మెదక్, ఆదిలాబాద్, కరీంనగర్, ఖమ్మం, కోదాడ, కొత్తగూడెం, నిజామాబాద్, సూర్యాపేట, వరంగల్.

ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్

మావోయిస్టు పార్టీ ప్లటూన్ నంబర్-30 ఇన్‌ఛార్జి ఉధమ్‌సింగ్ మృతి

చర్ల, న్యూస్‌టుడే: ఛత్తీస్‌గఢ్-తెలంగాణ సరిహద్దు బీజాపూర్ జిల్లాలో గురువారం ఉదయం జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు పార్టీ ప్లటూన్ నంబర్-30 ఇన్‌ఛార్జి, దక్షిణ బస్తర్ డీవీసీఎం(డివిజనల్ కమిటీ మెంబర్) ఉధమ్‌సింగ్ మృతి చెందారు. ఎస్పీ డాక్టర్ జితేంద్రకుమార్ యాదవ్ తెలిపిన వివరాల ప్రకారం.. "తర్రెమ్ పోలీసుస్టేషన్ పరిధిలోని దక్షిణ ప్రాంత కొండల్లోని చిననెల్లెగూడ-పెదగెల్లూరు అడవుల్లో ఇరువర్గాల మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. సంఘటనా స్థలం నుంచి ఏకే-47, ఇతర సామగ్రితోపాటు మావోయిస్టు ఉధమ్‌సింగ్ మృతదేహాన్ని బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. ఉధమ్‌సింగ్.... 2021 ఏప్రిల్‌లో సుక్మా-బీజాపూర్ జిల్లాల సరిహద్దు టెర్రమ్-టేకులగూడెం అడవుల్లో జరిగిన మెరుపుదాడిలో 22 మంది జవాన్ల మృతి ఘటనలో, జీరగుట్ట క్యాంపు దాడిలో పాల్గొన్నాడు" అని తెలిపారు. మరోవైపు బీజాపూర్‌లో 8 మంది మహిళలు సహా 12 మంది కీలక మావోయిస్టులు ఆయుధాలతో సహా లొంగిపోయారు. వీరందరిపై రూ.54 లక్షల రివార్డులు ఉన్నట్లు పోలీసులు పేర్కొన్నారు.



మహిళా ఇంజినీరింగ్ కళాశాల తరగతి గదిలో బాంబ్ స్క్వాడ్ తనిఖీలు

ఆంధ్ర విశ్వవిద్యాలయానికి బాంబు బెదిరింపు

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: విశాఖలోని ఆంధ్ర విశ్వవిద్యాలయానికి గురువారం ఉదయం ఈ మెయిల్ ద్వారా బాంబు బెదిరింపు వచ్చింది. వెంటనే అప్రమత్తమైన వర్సిటీ అధికారులు సైబర్ క్రైం, పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు బాంబ్, డాగ్ స్క్వాడ్ సాయంతో ఏయూ ఇంజినీరింగ్, మహిళా ఇంజినీరింగ్ కళాశాలలు, మహిళల వసతి గృహాల్లో తనిఖీలు చేశారు. ఎటువంటి అనుమానాస్పద వస్తువులు, బాంబ్ లభించలేదని పోలీసులు తెలిపారు. దీనిపై లోతుగా దర్యాప్తు చేయాలని ఏయూ అధికారులు సైబర్ క్రైం విభాగాన్ని కోరారు.

9తో ముగియనున్న ఏపీసెట్ దరఖాస్తు గడువు

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయి అర్హత పరీక్ష ఏపీసెట్-2026 ప్రవేశ పరీక్షకు దరఖాస్తు గడువు ఈ నెల 9తో ముగియనుందని సెట్ కార్యదర్శి ఆచార్య జి.ఎం.జె.రాజు తెలిపారు. పరీక్షలు మార్చి 28, 29 తేదీల్లో నిర్వహిస్తారన్నారు. రూ.2 వేల అపరాధ రుసుముతో ఫిబ్రవరి 25 వరకు, రూ.5 వేల అపరాధ రుసుముతో మార్చి 5 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు. మార్చి 19 నుంచి హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని వివరించారు.

విడదల రజిని, కాకాణిలకు నోటీసులివ్వండి

పోలీసులకు హైకోర్టు ఆదేశం

ఈనాడు, అమరావతి: వైకాపా నేతలు, మాజీ మంత్రులు విడదల రజిని, కాకాణి గోవర్ధన్‌రెడ్డి, మరికొంత మంది వైకాపా కార్యకర్తలపై నమోదుచేసిన కేసులలో బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 35(3) ప్రకారం నోటీసు ఇచ్చి వివరణ తీసుకోవాలని సంబంధిత పోలీసులను హైకోర్టు ఆదేశించింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి గురువారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చారు. శ్రీవారి లడ్డూ తయారీకి కల్తీ నెయ్యి వాడారన్న దుష్ప్రచారంపై ఆలయంలో పూజలు చేసేందుకు వెళుతున్న తమపై దూషించి దాడి చేయడమే కాకుండా విద్వేషాలు రెచ్చగొట్టామంటూ షేక్ రజా అహ్మద్ పోలీసులకు ఫిర్యాదు చేశారని, దీంతో పల్నాడు జిల్లా యడ్లపాడు పోలీసులు తమపై పెట్టిన కేసును కొట్టేయాలని రజిని, ఇతర నిందితులు హైకోర్టును ఆశ్రయించారు. ఇదే అంశంపై కులమతాల మధ్య విద్వేషాలు రగిల్చేలా తాను మాట్లాడానంటూ తెదేపా నేతలు మస్తాన్‌బాబు, రామిరెడ్డి ఇచ్చిన ఫిర్యాదుల ఆధారంగా శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా పొదలకూరు, దర్గామిట్ట పోలీసులు నమోదుచేసిన కేసులను కొట్టేయాలని కాకాణి హైకోర్టులో వ్యాజ్యాలు వేశారు. పోలీసులు నమోదు చేసిన సెక్షన్లు ఏడేళ్లలోపు శిక్షకు వీలున్నవి కావడంతో నోటీసు ఇచ్చి వివరణ తీసుకోవాలని పోలీసులను న్యాయస్థానం ఆదేశించింది.



చెవిరెడ్డి, మరో వ్యక్తి అనుబంధ పిటిషన్లపై ముగిసిన వాదనలు

- మద్యం కేసులో లిఖితపూర్వక వాదనలు సమర్పించేందుకు విచారణ 9కి వాయిదా

ఈనాడు, అమరావతి: మద్యం కుంభకోణం కేసులో నిందితులు, ఏపీ బెవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ పూర్వ ఎండీ వాసుదేవరెడ్డి(ఏ-2), ఎక్సైజ్‌శాఖ ప్రత్యేక అధికారి దొడ్డా వెంకట సత్యప్రసాద్(ఏ-3)లకు ముందస్తు బెయిలు ఇవ్వొద్దని సహ నిందితుడు, వైకాపా నేత చెవిరెడ్డి భాస్కరెడ్డి(ఏ38), మూడోపక్షం సువర్ణరాజు అనే వ్యక్తి దాఖలుచేసిన ఇంప్లీడ్ పిటిషన్ల విచారణార్హతపై గురువారం హైకోర్టులో వాదనలు ముగిశాయి. లిఖితపూర్వక వాదనలు సమర్పించేందుకు విచారణను ఈ నెల 9కి వాయిదా వేస్తున్నట్లు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రకటించారు. అప్రూవర్లుగా మారతామనే కారణంతో ముందస్తు బెయిలివ్వాలని కోరుతూ వాసుదేవరెడ్డి, సత్యప్రసాద్ హైకోర్టులో పిటిషన్లు వేశారు. ఈ పిటిషన్లలో తమను ప్రతివాదులుగా చేర్చుకుని వాదనలు వినిపించేందుకు అవకాశం ఇవ్వాలంటూ చెవిరెడ్డి భాస్కరరెడ్డి, సువర్ణరాజు హైకోర్టులో అనుబంధ(ఇంప్లీడ్) పిటిషన్లు వేశారు. వీటిపై వాసుదేవరెడ్డి, సత్యప్రసాద్ తరఫు న్యాయవాది అభ్యంతరం తెలిపారు. దీంతో ఇంప్లీడ్ పిటిషన్ల విచారణార్హతపై గురువారం హైకోర్టులో వాదనలు జరిగాయి. చెవిరెడ్డి తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ దవే వాదనలు వినిపించారు. వాసుదేవరెడ్డికి, సత్యప్రసాద్‌లకు దర్యాప్తు సంస్థ (సీఐడీ) సహకరిస్తోందన్నారు. వీరిద్దరికీ రాష్ట్ర ప్రభుత్వం, సీఐడీ క్షమాభిక్ష ప్రసాదించేందుకు అనుకూలంగా ఉన్నాయన్నారు. క్షమాభిక్ష ప్రసాదించాలంటే దిగువ కోర్టులో మద్యం కుంభకోణం కేసు విచారణ ముగిసేవరకు వారిద్దరు జ్యుడీషియల్ కస్టడీలో ఉండాల్సి వస్తుందన్నారు. ఈ నేపథ్యంలోనే ముందస్తు బెయిలు కోసం హైకోర్టులో పిటిషన్ వేశారన్నారు. క్షమాభిక్ష ప్రసాదిస్తే ఆ ప్రభావం చెవిరెడ్డిపై పడుతుందన్నారు. ముందస్తు బెయిలు ఇవ్వొద్దని కోరారు. న్యాయమూర్తి స్పందిస్తూ.. నిందితుల ముందస్తు బెయిలు పిటిషన్లను వ్యతిరేకిస్తూ సహ నిందితులు అనుబంధ పిటిషన్లు దాఖలు చేసిన సందర్భాలు ఏమైనా ఉన్నాయా?, ఈ విషయమై సుప్రీం కోర్టు ఏమైనా తీర్పులిచ్చిందా? అని ప్రశ్నించారు. సిద్ధార్థ దవే స్పందిస్తూ.. సుప్రీంకోర్టు తీర్పులు ఇవ్వలేదన్నారు. నిందితుల బెయిలు పిటిషన్లను వ్యతిరేకిస్తూ సహ నిందితులు పిటిషన్లు వేసిన ఉదంతాలు లేవన్నారు.

సహ నిందితులకు, మూడో పక్షానికి ఎలాంటి పాత్రా ఉండదు: పోసాని

సీఐడీ తరఫున సీనియర్ న్యాయవాది పోసాని వెంకటేశ్వర్లు వాదనలు వినిపిస్తూ.. "ముందస్తు బెయిలు వ్యవహారం నిందితులకు, ప్రాసిక్యూషన్‌కు మధ్య విషయం. ఇందులో సహ నిందితులకు, మూడో పక్షానికి ఎలాంటి పాత్ర ఉండదు. వాసుదేవరెడ్డికి, సత్యప్రసాద్‌కు క్షమాభిక్ష ప్రసాదిస్తూ దిగువ కోర్టు ఏమైనా ఉత్తర్వులిస్తే వాటిని సవాలు చేసుకోవడానికి మాత్రమే సహ నిందితులకు అధికారం ఉంటుంది. ఎస్సీ ఎస్టీ కేసుల్లో బాధితులకు మాత్రమే ఇంప్లీడ్ పిటిషన్ వేసి వాదనలు వినిపించే వెసులుబాటు ఉంది. శాసనకర్తల ఉద్దేశమూ అదే. వాసుదేవరెడ్డి, సత్యప్రసాద్ ముందస్తు బెయిలు పిటిషన్లలో సహ నిందితుడు చెవిరెడ్డి భాస్కరరెడ్డి ఇంప్లీడ్ పిటిషన్ వేయడానికి వీల్లేదు" అని అన్నారు.

★ వాసుదేవరెడ్డి, సత్యప్రసాద్ తరఫున సీనియర్ న్యాయవాది పరమేశ్వర్ వాదనలు వినిపిస్తూ.. ఇంప్లీడ్ పిటిషన్ వేసే అధికారం చెవిరెడ్డి భాస్కరరెడ్డి, మూడో పక్షం సువర్ణరాజుకు లేదన్నారు. వారు దాఖలుచేసిన ఇంప్లీడ్ పిటిషన్లను కొట్టేయాలని కోరారు.



బీసీల ఐక్యత చాటుతున్న ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణ, గౌడ కార్పొరేషన్ ఛైర్మన్ వీరంకి గురుమూర్తి, దూదేకుల కార్పొరేషన్ ఛైర్మన్ నాగుల్‌మీరా, మైలవరం మార్కెట్ యార్డ్ ఛైర్మన్ నవ్యశ్రీ, ఎన్టీఆర్ జిల్లా తెదేపా ప్రధాన కార్యదర్శి చిట్టిబాబు తదితరులు

జోగి ఇప్పటికైనా నోరు అదుపులో పెట్టుకోవాలి

లేకుంటే రాజకీయంగా అంతుచూడడం ఖాయం ● ఆర్టీసీ ఛైర్మన్ నారాయణ హెచ్చరిక

కొండపల్లి, న్యూస్‌టుడే: జోగి రమేష్ ఇప్పటికైనా నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని.. లేకపోతే రాజకీయంగా అంతుచూడడం ఖాయమని ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణ హెచ్చరించారు. ఎన్టీఆర్ జిల్లా కొండపల్లిలో గురువారం నిర్వహించిన నియోజకవర్గ బీసీల ఆత్మగౌరవ సభలో ఆయన మాట్లాడారు. జోగి రమేష్‌ను జైలుకు పంపింది పార్ట్‌నర్ అద్దేపల్లేనని.. తెదేపా కాదన్న సంగతి జోగి గుర్తుకు తెచ్చుకోవాలని సూచించారు. కోటి మంది సభ్యులు కలిగిన పార్టీ తెదేపా అన్న సంగతి రాష్ట్రంలో ఉనికి కోల్పోయిన వారు గుర్తుంచుకోవాలన్నారు. బీసీల కంచుకోటలోనే తెదేపా ఉందన్న సంగతి వైకాపా నేతలు మర్చిపోకూడదన్నారు. రెచ్చగొట్టే ఉద్దేశంతో ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్‌లపై జోగి రమేష్ విమర్శలు చేసి దుర్భాషలాడారన్నారు. "ఎదుటి వారిని తిడితే వైకాపాలో పదవులు వస్తాయి. అదే తెదేపాలో క్రమశిక్షణ చర్యలు ఉంటాయి. జోగి ఇంటిపై జరిగిన దాడిలో 43 మంది తెదేపా వారిపై కేసులు పెట్టడమే ఇందుకు ఉదాహరణ" అని అన్నారు. రాష్ట్ర దూదేకుల కార్పొరేషన్ ఛైర్మన్ నాగుల్‌మీరా మాట్లాడుతూ.. సైకో పాలనను తిరిగి చూడాలని ఏ ఒక్కరూ అనుకోవడంలేదని వ్యాఖ్యానించారు. జోగి లాంటి వ్యక్తిని వైకాపా పెంచి పోషించడం ఆ పార్టీకే చేటు అన్న సంగతి గుర్తుంచుకోవాలన్నారు. బీసీలమని చెప్పుకొంటున్న ఆ పార్టీ నాయకులకు అమర్నాథ్‌గౌడ్ గుర్తుకురాకపోవడం విచారకరమన్నారు. కార్యక్రమానికి ఎన్టీఆర్ జిల్లా తెదేపా ప్రధాన కార్యదర్శి చిట్టిబాబు అధ్యక్షత వహించగా.. తెదేపా బీసీ కౌన్సిలర్లు, నియోజకవర్గ తెదేపా బీసీ నాయకులు హాజరయ్యారు.

గర్భిణుల్లో రక్తహీనత పరిష్కారానికి ఎఫ్‌సీఎం ఇంజెక్షన్లు

ఈనాడు, అమరావతి: బాలింతల్లో రక్తహీనత సమస్య పరిష్కారానికి ఇచ్చే ఫెర్రిక్ కార్బాక్సీ మాల్టోజ్ (ఎఫ్‌సీఎం) ఇంజెక్షన్లు.. ఇకపై గర్భిణులకూ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. రూ.1,478.40 విలువైన ఈ ఇంజెక్షన్‌ను గతేడాది సెకండరీ ఆసుపత్రుల్లో 53,500 మంది బాలింతలకు ఇచ్చారు. ఈసారి రక్తహీనత సమస్య ఉన్న గర్భిణులకు సైతం ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలపడంతో 18,500 మందికి త్వరలో అందుబాటులోకి తేనున్నారు. రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణులు, బాలింతలకు ఐరన్ సుక్రోజ్ ఇంజెక్షన్లు ఇస్తున్నారు. సమస్య తీవ్రతను బట్టి 7 నుంచి 10 ఇంజెక్షన్లు ఇవ్వాల్సి వస్తోంది. అందుకోసం బాధితులు పలుమార్లు ఆసుపత్రులకు రావాల్సివస్తోంది. దీంతో ఒకట్రెండు ఎఫ్‌సీఎం ఇంజెక్షన్లు ఇస్తే సమస్య పరిష్కారం అయ్యేలా చర్యలు చేపట్టారు. ఇప్పటికే బాలింతలకు అవసరమైన ఇంజెక్షన్ నిల్వలు పీహెచ్‌సీలకు 80, ప్రాంతీయ ఆసుపత్రులకు 175, జిల్లా ఆసుపత్రులకు 400 చొప్పున జిల్లాలకు పంపించారు. గర్భిణులకు కేటాయించిన నిల్వలు త్వరలో చేరవేస్తారు. ఎఫ్‌సీఎం ఇంజెక్షన్ అవసరమైన గర్భిణులు ఆసుపత్రులకు వెళ్లేలా తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ ద్వారా ఉచిత రవాణా సౌకర్యం కల్పిస్తామని వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ తెలిపారు.

బకాయిలు చెల్లించకుంటే జయలలిత ఆస్తుల వేలం

మద్రాసు హైకోర్టుకు ఆదాయపు పన్ను విభాగం సమాధానం

చెన్నై, న్యూస్‌టుడే: దివంగత ముఖ్యమంత్రి జయలలిత చెల్లించాల్సిన ఆదాయపు పన్ను, సంపద పన్ను బకాయిలను చెల్లించకుంటే ఇప్పటికే స్తంభింపజేసిన ఆమె ఆస్తులను వేలం వేయడానికి చర్యలు చేపట్టనున్నట్లు మద్రాసు హైకోర్టుకు ఆదాయపు పన్ను విభాగం తెలిపింది. జయలలిత బకాయి ఉన్న ఆదాయపు పన్ను రూ.13 కోట్లు చెల్లించాలని కోరుతూ పంపిన నోటీసును సవాలు చేస్తూ.. ఆమె అన్న కుమార్తె దీప తరఫున మద్రాసు హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ వ్యాజ్యంలో ఆమె సోదరుడు దీపక్‌నూ చేర్చారు. గతంలో ఈ పిటిషన్ విచారణకు రాగా.. మొదట రూ.36 కోట్ల సంపద పన్ను బకాయిలు ఉన్నట్లు నోటీసు పంపిన ఆదాయపు పన్ను విభాగం ప్రస్తుతం రూ.13 కోట్లుగా పేర్కొందని, దీనిపై స్పష్టత ఇస్తే ఆ మొత్తాన్ని చెల్లించడానికి సిద్ధంగా ఉన్నట్లు పిటిషన్‌దారులు తెలిపారు. దీనిపై హైకోర్టు ఆదేశాల మేరకు ఆదాయపు పన్ను విభాగం బుధవారం సమాధాన పిటిషన్ సమర్పించింది. అందులో.. 2026 జనవరి 31 వరకు రూ.9,00,17,962 సంపద పన్ను, రూ.11,08,08,730 ఆదాయపు పన్ను బకాయిలు చెల్లించాలని తెలిపింది. అందులో రూ.1,12,50,000 దీపక్ చెల్లించారని పేర్కొంది. ఈ పిటిషన్ 18న మళ్లీ విచారణకు రానుంది.


ఈనాడు

ధనస్వామ్యమే అంతా!

బలవంతులకు, బలహీనులకు అన్నింటా సమాన అవకాశాలు లభించే ప్రజాస్వామ్యాన్ని మన దేశం పట్టుగొమ్మ కావాలని జాతినిర్మాతలు ఆశించారు. జనతంత్ర రథానికి సారథ్యం వహించే ప్రజాప్రాతినిధ్య వ్యవస్థలో ఆ సమానత్వం అడుగంటిపోతుందని వారు ఊహించలేకపోయారు. సంపన్నులు తప్ప సామాన్యులెవరూ అడుగుపెట్టలేనంతగా మన ఎన్నికల ప్రక్రియ భ్రష్టుపట్టడం స్వతంత్ర భారత తొలినాళ్లలోనే మొదలైంది. విధాన నిర్ణయాలను తమకు అనుకూలంగా మార్చుకోవాలనుకునే స్వార్థశక్తుల ద్వారా రాజకీయ పార్టీలకు, వాటి అభ్యర్థులకు వెల్లువెత్తుతున్న నల్లధనం గురించి సంతానం కమిటీ 1964లోనే ఆందోళన వ్యక్తంచేసింది. ఎన్నికల్లో నెగ్గుకురావడానికి భారీగా డబ్బు అవసరమవుతుండటం, దానికోసం నేతలు భూరి విరాళాలిచ్చేవారిని నమ్ముకోవడం... ఇదంతా పెద్ద అవినీతి వలయాన్ని సృష్టిస్తోందని పేర్కొంది. అలా ఎలక్షన్ల కాసుల మూలాల చుట్టూ పరిభ్రమించడం మొదలై ఇప్పుడు కోటీశ్వరులు తప్ప వేరొకరు ఎవరూ ప్రధాన పార్టీల అభ్యర్థిత్వాలు దక్కించుకోలేని దుస్థితి దేశవ్యాప్తంగా దాపురించింది. తాజాగా తెలంగాణ పురపాలక ఎన్నికల బరిలోనూ అదే ధనస్వామ్యం పెత్తనం చేస్తోంది!

ప్రజల్లోంచి ఎదిగివచ్చిన వారే ప్రజాస్వామ్యంలో నాయకులు కాగలరన్నది ఒకప్పటి మాట! ప్రచారార్భాటాలకు, ఓట్ల కొనుగోళ్లకు ఎన్ని కోట్లు వెదజల్లగలరు అన్నదే నేటి ఎన్నికల్లో పోటీకి ప్రధాన అర్హత! అయితే పంచాయతీ నుంచి పార్లమెంటు వరకు ప్రతి ఎన్నికలోనూ ధనబలమున్నవారే అభ్యర్థులవుతున్నారు. మున్సిపల్ ఎలక్షన్లో నిలబడాలంటే రూ.50లక్షలు, మేయర్ లేదా ఛైర్మన్ కావాలంటే రూ.3-5కోట్లు సొంతంగా ఖర్చుపెట్టే సత్తా ఉండాల్సిందేనని తెలంగాణలోని ప్రధాన రాజకీయ పక్షాలు ఆశావహులకు తేల్చిచెప్తున్నట్లు కథనాలు వెలువడుతున్నాయి. నిజాయతీ, ప్రజాసేవానురక్తి లాంటి కొలమానాలు కాసుకుకొరగానప్పుడు అన్ని సొమ్ములు పోసి గెలిచినవారు అంతకంతా సంపాదించుకోవడమే పనిగా పెట్టుకుంటారు కదా! రాష్ట్రాలకు అతీతంగా దాదాపుగా అన్ని పార్టీలూ ఒకే తానుముక్కలవుతున్న తరుణంలో ప్రతిచోటా ఇవే దృశ్యాలు పునరావృతమవుతున్నాయి. ధనప్రాబల్యాన్ని కట్టడి చేసే ఎన్నికల సంస్కరణలు సుదూర స్వప్నాలవుతున్న వేళ- సిద్ధాంతాలూ ప్రగతి ప్రణాళికల ప్రచారాన్ని పక్కకునెడుతున్న పార్టీలు పోటాపోటీగా ఓట్లకు వెలకడుతున్నాయి. అది చాలదన్నట్లు ఓటర్లకు మద్యమూ ఇతరేతర ప్రలోభాల ఎరవేస్తూ జనతంత్రాన్ని మేడిపండు చందం చేస్తున్నాయి!

'ఎన్నికల్లో ధన ప్రమేయాన్ని తగ్గించకపోతే క్రమంగా ప్రజాస్వామ్య వ్యవస్థ మనుగడను డబ్బే శాసిస్తుంది. ఆ పరిస్థితి అనివార్యంగా అత్యంత దారుణమైన రాజకీయ అవినీతికి దారితీస్తుంది. దాంతో అన్ని స్థాయుల్లో అక్రమాలు కట్టలుతెంచుకుంటా'యని న్యాయపాలిక 1974లోనే హెచ్చరించింది. 2004లో లోక్‌సభకు ఎన్నికైన వారిలో కోటీశ్వరులు 30శాతమైతే- 2024లో ఆ సంఖ్య 93శాతానికి పెరిగింది. దేశవ్యాప్తంగా 4,092 మంది ఎమ్మెల్యేల ప్రమాణపత్రాలను ప్రజాస్వామ్య సంస్కరణల సంఘం (ఏడీఆర్) నిరుడు పరిశీలించింది. 3,388 మంది శాసనసభ్యులు కోటీశ్వరులని, మరో 694 మంది లక్షాధికారులని అది తేల్చింది. అఫిడవిట్లలో చెప్పనివి, బంధుమిత్రుల పేరిట ఉన్నవి కలిపితే మన నాయకుల ఆస్తులెంతో ఎవరికీ తెలియదు. అత్యాచారాల వంటి హేయ నేరాభియోగాలను నెత్తినమోస్తున్న వారి నుంచి ఆర్థిక నేరగాళ్ల వరకూ అందరూ డబ్బుతోనే నేతలుగా చలామణీ అవుతుంటే- ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పాక్షికంగా జరగాలన్న రాజ్యాంగ ఆదర్శానికి అర్థమేముంటుంది? తిలా పాపం తలా కొంచెం పంచుకుంటున్న పార్టీలు ఈ అవ్యవస్థను సరిదిద్ది ప్రజాప్రయోజనాలను కాపాడటానికి ఎప్పటికి ముందుకొస్తాయి?



అవసరం అయితే తప్ప, గుర్తురాము... అని నిష్ఠూరంగా అంటూ ఉంటారు కొందరు. చీకట్లో ఉన్నప్పుడే కొవ్వొత్తి గుర్తొస్తుంది. అవసరం తీర్చగల, సాయపడే స్థితిలో ఉన్నందుకు సంతోషించాలి.

– ఖాన్ అబ్దుల్ గఫార్‌ఖాన్

పంచ సూత్రాలు

భూమి నిశ్చలంగా ఉన్నట్లు కనిపించినా, అది ప్రతిక్షణం చలనంలో ఉంటుంది. మరి ఈ స్థిరత్వం ఎక్కడి నుంచి వస్తోంది? పురాణాల ప్రకారం, భూమిని నాలుగు దిగ్గజాలు(ఐరావతాలు) మోస్తున్నాయి. ఆ దిగ్గజాల పేర్లు విరూపాక్షుడు, భద్రుడు, మహాకాలుడు, మహాపద్ముడు. ఈ పేర్లలో దాగి ఉన్న నాలుగు శక్తులు - జ్ఞానం, ధర్మం, కాలజ్ఞానం, శాంతి. ఈ నాలుగింటిని ఒక్కటిగా ముడిపెట్టే అయిదో శక్తే... భక్తి.

తూర్పుదిక్కున విరూపాక్షుడు రూపాలకు అతీతమైన దృష్టికి ప్రతీక. జ్ఞానమంటే కేవలం చదవడం కాదు, అవగాహన. నిజాన్ని చూడాలంటే చైతన్యం ముఖ్యమని విరూపాక్ష దృష్టి చెబుతుంది. మనిషిలో అవగాహన ఉన్నప్పుడే సత్యం కనిపిస్తుంది. జ్ఞానం మనసుకు సరైన దిశనిచ్చే దివిటీ. అదే భూమిని స్థిరంగా ఉంచే మొదటి బలం. ఉత్తరాన్ని భద్రుడు పాలిస్తాడు. ఆయన పేరు శుభాన్ని సూచిస్తుంది. ధర్మమే నిజమైన భద్రత; ఆత్మనిబద్ధతే అంతిమ రక్షణ. ధర్మాన్ని కాపాడినవాడే సురక్షితంగా ఉంటాడు.



అంతర్యామి

ధర్మం ఆత్మ తాలూకు కర్తవ్యబోధ. ధర్మం ఉన్నచోట న్యాయం వెల్లివిరుస్తుంది. మహాభారతంలో యుధిష్ఠిరుడు ధర్మరాజుగా, ధర్మమే సమాజ స్థిరత్వానికి మూలమని నిరూపించాడు. వేదాలు సైతం ప్రజలు ధర్మం నుంచే ఉద్భవిస్తారని చెబుతాయి. పశ్చిమ దిక్కున మోసే మహాకాలుడు కాలస్వరూపుడు. కాలం మనకు అవగాహన కలిగించే గురువు. సమయాన్ని సరిగ్గా అర్థం చేసుకున్నవాడు భాగ్యవంతుడవుతాడు. సమయాన్ని వ్యర్థం చేసినవాడు జీవితాన్ని వృథా చేసుకుంటాడు. కాలజ్ఞానం ఉన్నవాడు సృష్టిలో స్థిరంగా నిలబడతాడు. భగవద్గీతలో శ్రీకృష్ణుడు కాలాన్ని తన స్వరూపంగా చెప్పాడు. ఇక, దక్షిణ దిక్కున మహాపద్ముడు శాంతి, కరుణ, నిర్మలత్వానికి చిహ్నం. పద్మం మలినజలంలో పుట్టినా స్వచ్ఛంగా ఉంటుంది. అదే జీవన తత్త్వం. పరిస్థితులు ఎలాంటివైనా మనసును నిర్మలంగా ఉంచుకోవాలి. శాంతి అంటే సమత్వం. శాంతి మనసుకు లభించే అంతరానందం. శాంతి ఉన్న చోటే దైవం ఉంటాడు. మహాపద్ముడు మనకు క్షమ, ప్రేమ, సహనం, తపస్సు నేర్పుతాడు.

భక్తి అంటే దైవంపై నమ్మకమే కాదు, మనలోని దివ్యత్వంపై విశ్వాసం. సమర్పణతో కూడిన భక్తి అంటే భగవంతుడిలో విలీనం కావాలనే తపన కలిగి ఉండటం. భక్తి లేకుంటే జ్ఞానదీపం వెలగదు, ధర్మం నిలవదు, శాంతి దొరకదని భగవద్గీత చెబుతోంది. భక్తి విశ్వానికి హృదయ స్పందన. దాన్ని వినగలిగితే దైవాన్ని దర్శించడం కష్టం కాదు. ఈ పంచతత్త్వాలు మనలో మేల్కొన్నప్పుడే... జ్ఞానంతో వివేచన, ధర్మంతో న్యాయం, కాలజ్ఞానంతో సమయోచిత నిర్ణయాలు, శాంతితో సహనం, భక్తితో ఐక్యత అలవడతాయి. భూమి నిలబడేది గజాలపై కాదు, విలువలపై. మానవత్వం నిలబడేది జ్ఞానం, ధర్మం, కాలజ్ఞానం, శాంతి, భక్తి అనే పంచసూత్రాలపై!

– శ్రీధర్ కక్కెర్ల

భయమా... విశ్వాసరాహిత్యమా?



కశ్మీర్ యువతలో అపారమైన ప్రతిభ, మేధ, సృజనాత్మకత ఉన్నాయి. అదే సమయంలో, లోయను దాటి బయటి ప్రపంచంలోకి అడుగుపెట్టాలన్న ఆలోచనను ఏదో తెలియని భయం ఆపేస్తోంది. అది వ్యక్తిగతమా, సామాజికమా, సాంస్కృతికమా? ఒక తరం మనసుల్లో సుడులు తిరుగుతున్న నిశ్శబ్ద సంభాషణను వినే ప్రయత్నం జరగాల్సి ఉంది.

కశ్మీర్ యువతకు 'బయటి ప్రదేశం' అనేది కేవలం భౌగోళిక సంబంధమైన అంశం కాదు. అది ఒక అపరిచిత ప్రపంచం. అక్కడ భాష విభిన్నం, సంస్కృతి వేరుగా ఉంటుంది, స్పందనలు ఊహించలేనివిగా ఉంటాయి అన్న భావన వారిలో బలంగా నాటుకుపోయింది. లోయ బయట మనల్ని ఎలా చూస్తారు? మన మాటల్ని, మన మౌనాన్ని ఎలా అర్థం చేసుకుంటారు? అనే సంశయం అంతిమంగా 'ఇక్కడ ఉంటేనే సురక్షితం' అన్న భావనగా మారి, ఒక రక్షణాత్మక ధోరణిగా స్థిరపడుతోంది. వాస్తవానికి ఇది సౌకర్యం కాదు, కాలక్రమంలో గట్టిపడిన మానసిక స్థితి. ఈ భయం ఒక కారణం వల్ల పుట్టింది కాదు. ఒక సంఘటన ఫలితం కాదు. కాలం, పరిస్థితులు, మాటలు, మౌనంతో పెరిగిన భావన అది. సాంస్కృతికంగానూ ఈ భయం లోతుగా ఉంది. కశ్మీర్ సంస్కృతి ఒక ప్రత్యేక లయలో నడుస్తుంది. దాన్ని విడిచి బయటికి వెళ్లడం అంటే, తన సొంత గుర్తింపును తాత్కాలికంగా పక్కనపెట్టాల్సి రావడమనే ఆలోచన ఇక్కడి వారిని వేధిస్తోంది. అలాగే, కొత్త ఆహారం తినడం, కొత్త మాటలు నేర్చుకోవడం కన్నా 'బయట నేను నెగ్గుకురాగలనా?' అన్న సందేహం కొందరిని ఎక్కువగా బాధిస్తుంది. అందుకే కశ్మీర్ యువతలో చాలామందికి బయటి ప్రపంచం పెద్ద పరీక్షలా కనిపిస్తుంది.



అందరిలాగే వారూ...

కొన్ని భయాలు వ్యక్తిగత అనుభవాల నుంచి పుట్టవు. ఎవరికో ఎదురైన సంఘటన, ఇంకొకరి హెచ్చరిక, వేరెవరిదో మౌనం.. ఇవన్నీ కలిసి ఒక ఊహాత్మక ప్రపంచాన్ని నిర్మిస్తాయి. రాజకీయ కోణం గురించి ఎక్కువగా చెప్పాల్సిన అవసరం లేదు. అది యువత మనసుల్లో లేకపోయినా, నేపథ్యంగా ఉంటుంది. ఒకవైపు టెక్నాలజీ ప్రపంచాన్ని దగ్గర చేస్తోంది. దాని సాయంతో లోయలో కూర్చునే యువత ప్రపంచంలోని ఏ విశ్వవిద్యాలయం గురించి అయినా తెలుసుకోగలుగుతుంది. అవసరమైన సమాచారం పొందుతుంది. మరోవైపు, అదే టెక్నాలజీ భయాలనూ వేగంగా పెంచుతుంది. ఒక్క వీడియో లేదా పోస్టు చాలు బయటి ప్రపంచం ప్రమాదకరం అన్న భావనను బలపరచడానికి! సామాజిక మాధ్యమాల ఉద్ధృతిలో నిజం, అతిశయోక్తి మధ్య తేడా క్రమంగా మసకబారుతోంది. ఇక్కడే ఒక తాత్విక ప్రశ్న ఉద్భవిస్తుంది. భయం అంటే ఏమిటి? అది ప్రమాదానికి స్పందనా? లేదంటే అపరిచిత పరిస్థితులకు ఇచ్చే పేరు మాత్రమేనా? కశ్మీర్ యువతలో కనిపించే భయం చాలాసార్లు రెండో దానికి దగ్గరగా ఉంటుంది. వారి ప్రపంచాన్ని అదే పరిమితం చేస్తోంది.

'భయపడొద్దు, బయటికి వెళ్లండి' అని చెప్పడం సులభం. కానీ జీవితం సలహాలతో కాదు, అనుభవాలతో మారుతుంది. అందుకే ఈ భయానికి పరిష్కారం కూడా ఉపదేశంలో కాదు, సామాజిక పరిస్థితుల్లో ఉంది. కశ్మీర్ యువతకు బయటి ప్రపంచం పరాయిదిగా కాకుండా, అవకాశాల గనిలా కనిపించాలి. విధానాల స్థాయిలో ఆలోచిస్తే, మొదట వారికి చేరువకావాల్సింది భద్రతా భావం. ఇది భౌతిక భద్రత మాత్రమే కాదు, సామాజిక భద్రత కూడా. లోయ బయట చదువుకునే, పనిచేసే కశ్మీర్ యువతకు, 'మీరు ఒంటరిగా లేరు' అన్న నిశ్శబ్ద భరోసా ఉండాలి. ఇది భారీ ప్రకటనల ద్వారా కాకుండా, స్థిరమైన వ్యవస్థల ద్వారా సాధ్యమవుతుంది. అంటే మెంటార్‌షిప్ వ్యవస్థలు, విద్య సంబంధ విషయాల్లో స్నేహపూర్వక మద్దతు, సాంస్కృతిక పరిచయ కార్యక్రమాలు లాంటివి అందుకు తోడ్పడతాయి. అదే సమయంలో, సాధారణ ప్రజల వ్యవహార శైలీ ముఖ్యమే. కశ్మీర్ యువత బయటి ప్రపంచంలోకి వచ్చినప్పుడు వారిని ఒక ప్రతీకలా చూడటం ఆపాలి. అందరిలాగే వారు విద్యార్థులు, ఉద్యోగార్థులు, సహచరులు అన్నట్లుగా మెలగాలి. ప్రత్యేకంగా చూడటమూ ఒక రకమైన దూరాన్ని పెంచుతుంది. అలాగే, కశ్మీర్ బయటికి వెళ్లినవారి అనుభవాలు, విజయ గాథలు తిరిగి లోయకు చేరాలి. అవి అతిశయోక్తులతో కాకుండా, భరోసాను కల్పిస్తూనే వాస్తవాన్ని ప్రతిబింబించేలా ఉండాలి. 'అంతా చాలా తేలిక' అనే మాటకన్నా, 'మొదట్లో కాస్త కష్టంగా అనిపించినా, మెల్లగా సాధ్యమైంది' లాంటి మాటలు ఎక్కువ ధైర్యాన్నిస్తాయి. భయాన్ని అణచాలంటే, దాన్ని పూర్తిగా ఖండించాల్సిన అవసరం లేదు. అర్థం చేసుకుంటే చాలు!

మానవీయ ప్రయాణం కావాలి

కశ్మీర్ యువత ఇప్పుడు ఒక మలుపు దగ్గర నిలబడి ఉంది. చిరపరిచితమైన లోయ ఒకవైపు, అపరిచితమైన ప్రపంచం మరోవైపు. ఈ రెండు దారుల్లో ఏదైనా ఎంచుకోవడం తప్పు కాదు. కానీ, భయం వల్ల కాకుండా స్పష్టతతో జరిగితేనే అది నిజమైన, సరైన ఎంపిక అవుతుంది. వాస్తవానికి, ఒక తరం మనసుల్లో నిశ్శబ్ద భయం ఉంది. అదే సమయంలో ఒక ఆశా ఉంది. ఆ ఆశకు కొంచెం స్థలం, సమయం, విశ్వాసం దొరికితే లోయ బయట అడుగుపెట్టడం ఒక భీతావహ ప్రయాణంలా కాకుండా, ఒక సహజమైన విషయంలా మారుతుంది. భయాన్ని పోగొట్టుకోవాలన్న ఆతృత కంటే, దాన్ని దాటి ముందుకు సాగగల విశ్వాసాన్ని పెంచుకోవడం అత్యంత కీలకం. ఎందుకంటే భయం ఒక శత్రువు కాదు. అది ఒక భావన. దాన్ని అర్థం చేసుకుని, తమలో దాగి ఉన్న సామర్థ్యాన్ని గుర్తించినప్పుడే కశ్మీర్ యువత నిజంగా లోయను దాటి, ప్రపంచంతో కలిసే అవకాశం పొందుతుంది. అయితే, అది ఒక రాజకీయ ప్రాజెక్టులా మారకూడదు. ఒక మానవీయ ప్రయాణంలా మాత్రమే సాగాలి.

– డాక్టర్ నూకరాజు బెందుకుర్తి
సహాయ ఆచార్యులు, కశ్మీర్ కేంద్రీయ విశ్వవిద్యాలయం

శ్రీకర్ చాలా బిజీ మనిషి. ఎప్పుడు చూసినా హడావుడిగా కిందామీదా పడుతూ కనిపిస్తాడు. ఎంత పనిచేసినా రోజు గడిచేసరికి చాలా పనులు అసంపూర్తిగా మిగిలిపోతాయి. ఇంకా ఏవేవో చేయలేకపోయానన్న అసంతృప్తి అతణ్ని ఎప్పుడూ వెన్నాడుతూ ఉంటుంది. ఇంట్లోనూ ఆఫీసులోనూ... ఎక్కడా పూర్తి న్యాయం చేయలేక సతమతమవుతుంటాడు.

తనలాంటి ఉద్యోగమే, తన ఈడువాడే, తనకన్నా ఎక్కువ సంసార బాధ్యతలు ఉన్న పక్కింటి రవి మాత్రం దేనికీ కంగారుపడక ఎప్పుడూ శాంతంగా, స్థిరంగా ఉండటం చూసి శ్రీకర్ ఆశ్చర్యపోయేవాడు. ఉండబట్టలేక ఒకరోజు 'ఏంటి నీ విజయ రహస్యం?' అని అడిగేశాడు రవిని. 'అలవాట్లే నాకున్న బలం' అని అతడు చెబితే అర్థంకానట్టు మొహం పెట్టాడు. 'అయితే విను. ద ఎర్లీ బర్డ్ క్యాచెస్ ది వార్మ్ అని సామెత. అంటే ముందుగా బయల్దేరిన పక్షికే ఆహారం దొరుకుతుంది.



అలవాట్లే... అద్భుతాలు చేస్తాయి!

అలాగే ఉదయాన్నే లేచిన మనిషికి బోలెడంత వెసులుబాటు ఉంటుంది. ఏయే పనులున్నాయి, వాటిని ఎప్పుడెప్పుడు ఎలా చేయాలో ప్రణాళిక వేసుకునే సమయం దొరుకుతుంది. దాంతో రోజంతా కంగారు లేకుండా ఆ టైమ్ టేబుల్‌ను ఆచరణలో పెట్టేయవచ్చు. పొద్దున్నే లేవడం అనే చిన్నమార్పు మొత్తంగా రోజంతా చేసే పనుల్ని ప్రభావితం చేస్తుంది. ఇంకో ముఖ్యమైన విషయం ఏంటంటే, లేవగానే కనీసం రెండు గంటలపాటు ఫోన్ మొహం చూడను. ఏదైనా కాల్ వస్తే మాట్లాడటం తప్ప వాట్సప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాల జోలికి వెళ్లను. దాంతో ప్లాన్ చేసుకోవడానికే కాదు, పనుల్ని సకాలంలో ముగించడానికి కూడా బోలెడంత సమయం ఉంటోంది. మరో ముఖ్యమైన విషయం- పాతిక పనులు పెట్టుకుని, అవి ఎలా అవుతాయా అన్న టెన్షన్‌తో ఏదీ పూర్తిచేయక ఇబ్బంది పడటం చాలామంది చేసే పొరపాటు. పొద్దున్నే ప్లానింగ్ చేసుకునేటప్పుడే ప్రాధాన్యతాక్రమంలో పెట్టుకుంటే- అత్యవసరమైన పనుల్ని ఒక్కటొక్కటిగా ముందు పూర్తిచేయవచ్చు. నిజానికి ఇలా చేయడం వల్ల మనకి ఏవి ముఖ్యమైనవో, ఏవి కావో తెలిసిపోతుంది. ఎక్కడ సమయం వృథా చేస్తున్నామో అర్థమవుతుంది. ఇంపార్టెంట్ పనులు చేయగానే రిలీఫ్‌గా ఉంటుంది. అప్పుడిక మిగతావి నిదానంగా పూర్తిచేయవచ్చు. ఖాళీ సమయమూ మిగులుతుంది. వాకింగ్‌కి వెళ్లొచ్చు, పిల్లలతో గడపొచ్చు. చదవడమో, రాయడమో ఏదో ఒక హాబీకి కూడా టైమ్ ఉంటుంది' అంటూ వివరించాడు రవి.

ఒకింత అపనమ్మకంగానే ఉన్నా, గంట ముందు లేవడమే కదా, ప్రయత్నించి చూద్దామనుకున్నాడు శ్రీకర్. ఒక వారం చాలా కష్టపడ్డాడు లేవడానికి. పది రోజులు దాటేసరికి అలవాటైపోయింది. అదే ఊపులో పనులూ చేసేసేవాడు. విచిత్రంగా ఫోనుచూసే అలవాటు పోయింది. బోలెడంత తీరిక సమయం దొరుకుతోంది. సాయంత్రం పిల్లల్ని తీసుకుని పార్కుకెళ్లి నడుస్తున్నాడు. ఉత్సాహంగా, చురుగ్గా ఉంటున్నాడు. తనతో పాటు పిల్లలూ క్రమశిక్షణ అలవరచుకోవడం చూసి ఆశ్చర్యపోయాడు. అలవాట్లతో అద్భుతాలు చేయొచ్చని అనుభవంతో తెలుసుకున్నాడు శ్రీకర్.

– శ్రీహరి

రోగాల పడగ నీడలో...

డయేరియా, కలరా వంటి ప్రాణాంతక రోగాలను కట్టడి చేయాలంటే నీటి వసతి, సెప్టిక్ ట్యాంకులు ఉన్న మరుగుదొడ్లు తప్పనిసరి అవసరం. ఇలాంటి మెరుగైన పారిశుద్ధ్య వసతులు పర్యావరణ కాలుష్యాన్ని నివారిస్తాయి. పిల్లల ఆరోగ్యం దెబ్బతినకుండా తోడ్పడతాయి. మహిళల గౌరవప్రద జీవనం, భద్రతకు అవి భరోసానిస్తాయి. అయితే, 2024 నాటికి ప్రపంచవ్యాప్తంగా 11.1శాతం జనాభా మెరుగైన పారిశుద్ధ్య వసతులు వినియోగించడం లేదు. ఆయా ప్రాంతాల్లో అలాంటి అభాగ్యులు ఎందరున్నారంటే... (శాతాల్లో)

ఓషియానియా	57.4
సబ్ సహారన్ ఆఫ్రికా	46.5
మధ్య, దక్షిణాసియా	8.6
ఆగ్నేయ ఆసియా	6.9
ఉత్తర ఆఫ్రికా, పశ్చిమాసియా	6.7
లాటిన్ అమెరికా, కరీబియన్	5.7
ఐరోపా, ఉత్తర అమెరికా	1.4

(ఆధారం: డబ్ల్యూహెచ్‌వో, యునిసెఫ్ నివేదిక-2025)

ప్రగతి పథంలో 'బుల్లెట్' వేగం!



ముంబయి-అహ్మదాబాద్ ప్రాజెక్టు పూర్తయ్యి ఇండియాలో తొలి బుల్లెట్ రైలు ఎప్పుడు పరుగులు తీస్తుందా అని అంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కేంద్రం తాజా బడ్జెట్‌లో ఏకంగా ఏడు హైస్పీడ్ రైల్ ప్రాజెక్టులను ప్రకటించింది. వాటిలో మూడు హైదరాబాద్ కేంద్రంగా ప్రారంభం కానున్నాయి. అందులో రెండింటితో పాటు మరోటి కలిపి మొత్తం మూడు ప్రాజెక్టులు ఆంధ్రప్రదేశ్ మీదుగా వెళ్లనున్నాయి. ఆయా ప్రాంతాల అభివృద్ధికి బుల్లెట్ రైళ్లు ఊతమవుతాయి.

రైలు ప్రయాణం అనగానే సుదీర్ఘ సమయం, తీవ్ర అలసట అనే భావన ప్రజల్లో నెలకొంది. బుల్లెట్ రైళ్లు ఆ దృక్పథాన్నే మార్చేయనున్నాయి. హైదరాబాద్ నుంచి ముంబయి, బెంగళూరు, చెన్నై వంటి నగరాలకు రైళ్లలో, రోడ్డుమార్గంలో వెళ్లాలంటే ప్రస్తుతం ఎనిమిది నుంచి 12గంటల సమయం పడుతుంది. బుల్లెట్ రైల్లో ఆ సమయం రెండు మూడు గంటలకు తగ్గిపోతుంది. ఆయా నగరాలకు విమానంలో వెళ్లినా గంటన్నర సమయం పడుతుంది. చెకిన్ కోసం ముందుగానే ఎయిర్‌పోర్టుకు చేరుకోవాలి. ఈ సమయమంతా లెక్కిస్తే విమానం కంటే బుల్లెట్ రైల్లోనే త్వరగా ఇతర నగరాలకు చేరుకోవచ్చు. నేటి పోటీ ప్రపంచంలో ప్రతి గంటా కీలకమే. బుల్లెట్ రైళ్లతో ప్రయాణ సమయం తగ్గి వ్యాపార, పారిశ్రామిక, సేవా రంగ కార్యకలాపాలు కొత్త వేగం సంతరించుకుంటాయి. హైదరాబాద్-చెన్నై బుల్లెట్ రైలు ఏపీ రాజధాని అమరావతి మీదుగా వెళ్తుంది. హైదరాబాద్-బెంగళూరు బుల్లెట్ రైలు రాయలసీమ మీదుగా సాగిపోతుంది. వాటివల్ల వెనకబడిన ప్రాంతాల ఆర్థికాభివృద్ధికి అవకాశం లభిస్తుంది. హైస్పీడ్ రైల్ కారిడార్లను పిల్లర్లపై నిర్మిస్తారు. దానివల్ల పట్టాలపైకి వాహనాలు, మనుషులు, జంతువులు వచ్చి ప్రమాదాలు జరగడానికి ఆస్కారం ఉండదు.

జాతీయ అభివృద్ధి వ్యూహం

జపాన్, చైనా, ఫ్రాన్స్, జర్మనీ, స్పెయిన్, ఇటలీ, దక్షిణ కొరియా వంటి దేశాల్లో హైస్పీడ్ రైల్ వ్యవస్థలు విజయవంతంగా కొనసాగుతున్నాయి. అమెరికా, బ్రిటన్ వంటివీ పరిమిత స్థాయిలో హైస్పీడ్ రైల్ ప్రాజెక్టులను ప్రారంభించాయి. ఆసియాలో జపాన్, చైనా తరవాత దక్షిణ కొరియా బుల్లెట్ రైళ్ల ద్వారా తన రవాణా రంగాన్ని పూర్తిగా మార్చుకుంది. యూరప్‌లో ఫ్రాన్స్, జర్మనీ, స్పెయిన్ దేశాల అభివృద్ధిలో హైస్పీడ్ రైళ్లు కీలక పాత్ర పోషిస్తున్నాయి. ప్రపంచంలోనే మొట్టమొదటి బుల్లెట్ రైలు జపాన్‌లోని టోక్యో-ఒసాకా మధ్య 1964లో ప్రారంభమైంది. అప్పటి దాకా టోక్యో కేంద్రంగా కొనసాగిన ఆర్థిక కార్యకలాపాలు బుల్లెట్ రైళ్లతో ఒసాకా, నాగోయా వంటి ఇతర నగరాలకు విస్తరించాయి. బుల్లెట్ రైళ్లు జపాన్‌లో పరిశ్రమలు, సేవా రంగం వికేంద్రీకరణకు తోడ్పడ్డాయి. వాటివల్ల ఉప నగరాలు వేగంగా అభివృద్ధి చెందాయి. రియల్ ఎస్టేట్, పర్యాటకం ఊపందుకున్నాయి. ఉపాధి అవకాశాలు గణనీయంగా పెరిగాయి. జపాన్‌లో బుల్లెట్ రైళ్లు జాతీయ అభివృద్ధి వ్యూహంగా మారాయి.

హైస్పీడ్ రైళ్ల విషయంలో చైనా ప్రపంచానికే మార్గదర్శకంగా నిలుస్తోంది. గత ఇరవై ఏళ్లలో బుల్లెట్ రైళ్ల వ్యవస్థను ఆ దేశం భారీగా విస్తరించి ఆర్థిక విప్లవమే సృష్టించింది. బీజింగ్, షాంఘై, గ్వాంగ్‌జౌ-షెన్‌జెన్ వంటి కారిడార్లు చైనా ఆర్థిక వృద్ధికి వెన్నెముకగా మారాయి. బుల్లెట్ రైళ్లతో చైనా తీర ప్రాంతాలను అనుసంధానించింది. వాటివల్ల వెనకబడిన ప్రాంతాల్లో పరిశ్రమలు నెలకొన్నాయి. చిన్న నగరాలు ఆర్థిక కేంద్రాలుగా ఎదిగాయి. ఫ్రాన్స్, జర్మనీ తదితర దేశాల్లో నగరాల సమతుల అభివృద్ధికి బుల్లెట్ రైళ్లు తోడ్పడ్డాయి. పారిస్‌పై ఒత్తిడిని తగ్గించేందుకు ఫ్రాన్స్ హైస్పీడ్ రైళ్లను వినియోగిస్తోంది. దానివల్ల చిన్న పట్టణాలు ఆర్థికంగా బలోపేతమయ్యాయి. కార్లు, విమానాలపై ఆధారపడే అవసరాన్ని తగ్గించి, పర్యావరణ అనుకూల రవాణా సాధనంగా అవి నిలిచాయి. జపాన్, చైనాలు బుల్లెట్ రైళ్లను కేవలం వేగం కోసం కాకుండా, ప్రాంతీయ అసమానతలను తగ్గించేందుకు, ఆర్థిక విస్తరణకు వాడుకుంటున్నాయి.

స్పష్టతతో సాగితేనే...

భారీ జనాభాతో పట్టణీకరణ శరవేగంగా సాగుతున్న ఇండియాకు బుల్లెట్ రైళ్లు విలాసం కాదు. పోటీ ప్రపంచంలో అవి ఒక అవసరం. ప్రయాణాలను వేగవంతం చేయడం ద్వారా బుల్లెట్ కారిడార్లు దేశ ఆర్థిక పటాన్ని మార్చే అవకాశం ఉంది. అయితే- ఖర్చులు, భూసేకరణ, పర్యావరణ అంశాలపై స్పష్టతతో ముందుకు సాగినప్పుడే హైస్పీడ్ రైల్ ప్రాజెక్టులను నిర్ణీత కాల వ్యవధిలో పూర్తిచేయడానికి వీలవుతుంది. ముంబయి-అహ్మదాబాద్ బుల్లెట్ రైలు ప్రాజెక్టు విషయంలో చవిచూసిన సవాళ్లు, సమస్యల నుంచి పాఠాలు నేర్చుకోవాలి. భూసేకరణ అంశం రాష్ట్రాల పరిధిలో ఉన్నందువల్ల కేంద్రం వాటితో సమన్వయం చేసుకుంటూ త్వరితగతిన ఆ ప్రక్రియను పూర్తిచేయాలి. అప్పుడే భారతదేశంలోని నగరాల మధ్య హైస్పీడ్ రైళ్లు వీలైనంత త్వరగా పరుగులు తీయడానికి అవకాశముంటుంది.

– సుతారపు సోమశేఖర్

ఏకాగ్రత పెరుగుతుంది



హాలో ఫ్రెండ్స్..! మొదట ఒక పెద్ద రింగ్‌ను శరీరంతో గిరగిరా తిప్పుతూ, అలా మెల్లమెల్లగా మరిన్ని జతచేస్తూ కింద పడకుండా వాటిని కాళ్లుచేతులతో ఆడిస్తే సరి! ఇంతకీ ఇదంతా దేని గురించి అంటారా..! హూలాహూప్ అనే ఆట గురించి! ఓ నేస్తం అందులో అద్భుతమైన ప్రదర్శనలిస్తూ బోలెడు రికార్డులు సాధిస్తోంది..!

రాజస్థాన్‌లోని గోపాల్‌పుర్‌కు చెందిన సినయా బియానికి ఎనిమిదేళ్లు. తను హూలాహూప్ ఆటలో చక్కగా రాణిస్తోంది. 30 సెకన్లలోనే 101 రొటేషన్లు చేసి వరల్డ్ ఛాంపియన్‌గా నిలిచింది. ఈ విభాగంలో ఇంతకు ముందున్న 30 సెకన్లలో 94 రొటేషన్ల ప్రపంచ రికార్డును బ్రేక్ చేసింది. అంతే కాకుండా తక్కువ సమయంలో ఎక్కువ రొటేషన్లు చేసినందుకు 'గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్'లోనూ చోటు దక్కించుకుంది. హూలాహూప్ రింగ్‌ను తిప్పడం అంత సులభమైన పనేం కాదు నేస్తాలూ! ఆపకుండా అంతసేపు, అన్ని రొటేషన్లు చేయాలంటే దానికి చాలా క్రమశిక్షణ, ప్రాక్టీస్ కావాలి. అందుకే సినయా రోజూ ప్రాక్టీస్ చేస్తుంది. 'ఒకసారి ఎగ్జిబిషన్‌కు వెళ్లినప్పుడు, అక్కడ హూలాహూప్ ఆటను చూసి సినయా చాలా ముచ్చటపడింది. తనూ అలా చేస్తానంది. దాంతో ఆ రింగ్ కొన్నాం. ఎలాంటి శిక్షణ లేకుండానే చక్కగా రింగ్‌ను తిప్పగలిగింది. అలా తన హూలాహూప్ ప్రయాణం మొదలైంది' అని చెబుతున్నారు వాళ్లమ్మ పూర్వ బియాని. సినయా ఇప్పటి వరకు 60కు పైగా ప్రదర్శనలు ఇచ్చి.. 'జైపుర్ హూపర్' అనే పేరు సంపాదించుకుంది. తను యంగెస్ట్ హూలాహూప్ ట్రైనర్ కూడా. 'హూలాహూప్‌లోనే కాకుండా చదువులోనూ ఎప్పుడూ ముందే ఉంటుందట నేస్తాలు. 'హూలాహూప్ ప్రతిఒక్కరూ నేర్చుకోవాల్సిన విద్య. ఎందుకంటే అది శారీరక దృఢత్వాన్నే కాకుండా ఏకాగ్రతనూ పెంచుతుంది.. ఉత్సాహంగానూ ఉంచుతుంది. దానివల్ల మనం మిగతా అంశాల్లోనూ ముందంజలో ఉంటాం' అని చెబుతోంది సినయా.

నేనెవర్ని?

1. ఆరు అక్షరాల ఆంగ్ల పదాన్ని నేను. నాలోని.. 5,2,3,4 అక్షరాలను కలిపితే 'తూర్పు' అని.. 1,2,6,3 అక్షరాలను కలిపితే 'అంగారకుడు' అనే అర్థాన్నిస్తాను. నేనెవర్ని?
2. నేనో అయిదక్షరాల ఆంగ్ల పదాన్ని. నాలోని.. 1,5,2,3 అక్షరాలను కలిపితే 'ఏమిటి' అని.. 4,2,3 అక్షరాలను కలిపితే 'పిల్లి' అనే అర్థాన్నిస్తాను. నేనెవరినో తెలిసిందా?

జవాబు: 1.MASTER 2.WATCH

తెలుగే వెలుగండి.. మరొకటి మేలండి!



గొల్లపూడి వద్ద తెలుగులో మాత్రమే ఏర్పాటు చేసిన బోర్డులు...

విజయవాడ బైపాస్ వద్ద ఏర్పాటు చేసిన బోర్డులతో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే డ్రైవర్లు అయోమయానికి గురవుతున్నారు. హైదరాబాద్-విజయవాడ మార్గం వైపు వివిధ రాష్ట్రాల నుంచి లారీల డ్రైవర్లు వస్తుంటారు. ఈ క్రమంలో లారీలు, వాహనాలను గొల్లపూడి వద్ద నుంచి విజయవాడ బైపాస్ మీదుగా విశాఖపట్నం తదితర ప్రాంతాలకు మళ్లించేందుకు తెలుగులో చక్కగా బోర్డులను ఏర్పాటు చేశారు. అయితే ఇతర రాష్ట్రాలకు చెందిన లారీల డ్రైవర్లకు మన భాష అర్థం కాక బైపాస్ వద్ద వాహనాలను నిలిపి ట్రాఫిక్ పోలీసులు, అక్కడ ఉన్న వారిని అడగాల్సిన పరిస్థితి నెలకొంది. అదే హిందీ, ఆంగ్లంలో కూడా బోర్డులను ఏర్పాటు చేస్తే డ్రైవర్లు సులభంగా తెలుసుకునే వీలుంటుంది. - గొల్లపూడి, న్యూస్‌టుడే



మత్తు పోతే.. భవిత నీదైతే..

జీవితాన్ని ప్రేమించు- డ్రగ్స్‌కు దూరంగా ఉండు' అనే నినాదంతో గురువారం నున్న పోలీసుస్టేషన్ పరిధిలో పోలీసులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. విద్యార్థుల కళానృత్యాలు, అవగాహన కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ప్రయోజలం లేని పనులు

తాగునీరు లేక విజయవాడ ఆటోనగర్ కార్మికుల అవస్థ

ఆటోనగర్, న్యూస్‌టుడే

తాగునీరు లేక ఆటో నగర్ కార్మికులు అవస్థ పడుతున్నారు. ఆటోనగర్‌లో చిన్న, మధ్య, భారీ పరిశ్రమలు సుమారు 2600 ఉన్నాయి. దాదాపు 80 వేల మంది కార్మికులు పనులు చేసుకుంటూ బతుకుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది... తాగునీటి కష్టాలు తీరుతాయని కార్మికులు ఆనంద పడ్డారు. కానీ ప్రభుత్వం వచ్చి సుమారు 19 నెలలు అవుతున్నా.. ఈ సమస్య పరిష్కారం కాలేదు.


నిరుపయోగంగా ట్యాంకు

సుమారు 12 ఏళ్ల కిందట..

★ ఆటోనగర్‌కు తాగునీటి కోసం 12 ఏళ్ల కిందట కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు మంజూరు చేశాయి. వీఎంసీకి చెందిన గంగిరెద్దుల దిబ్బ వాటర్ ప్లాంట్ నుంచి ఆటోనగర్‌కు పైప్ లైన్ వేశారు. అందుకు సుమారు రూ.3.2 కోట్లు ఖర్చు చేశారు. కొన్ని నెలలు నీరు సరఫరా అయింది. బిల్లుల చెల్లింపు విషయమై వీఎంసీ, ఐలా మధ్య తేడా వచ్చి సరఫరా నిలిచిపోయింది. ★ వీఎంసీ తాగునీటితో సంబంధం లేకుండా బోరు నీటిని ట్యాంక్‌కు ఎక్కించి.. ఆటో నగర్‌కు సరఫరా చేయాలని 2022లో రూ.3.32 కోట్లు ఖర్చు చేసి 6 లక్షల లీటర్ల సామర్థ్యంతో వాటర్ ట్యాంక్, ఆర్వో ప్లాంట్ నిర్మించారు. ★ 12 ఏళ్ల కిందట వేసిన పైపు లైన్ల పరిస్థితిపై అంచనా లేకుండా ట్యాంకు నిర్మించారు. చాలా ప్రాంతాల్లో వాల్వ్‌లు కనిపించడం లేదు. ఆటో నగర్‌లో భూగర్భ జలాలు కలుషితమైనందున.. తాగకూడదని తేలడంతో మళ్లీ వీఎంసీ నుంచి తాగునీటి సరఫరాకు యత్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రజాప్రతినిధులు ట్యాంక్‌ని పరిశీలించారు. పటమట ప్రాంతంలోని వీఎంసీ పైపులైన్ నుంచి ట్యాంకుకు పైపులైన్ ఏర్పాటుకు రూ.కోటి కేటాయిస్తామని చెప్పారు. ఏడు నెలలైనా ఆ దిశగా అడుగులు పడడం లేదు. ట్యాంక్ నిరుపయోగంగా మారింది.

త్వరలో టెండర్లు

'తూర్పు' ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ.. 'ఆటోనగర్ ట్యాంక్‌కు వీఎంసీ నీరు సరఫరా చేసేలా పైపులైన్ల ఏర్పాటుకు నిధులు మంజూరు చేశారు. త్వరలో టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తారు.' అని తెలిపారు.

విద్యాంజలి పోర్టల్‌పై అవగాహన



మాట్లాడుతున్న డీఈఓ చంద్రకళ

విజయవాడ సిటీ: పాఠశాలలకు కావాల్సిన వసతుల వివరాలు విద్యాంజలి పోర్టల్‌లో నమోదు చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ అన్నారు. విద్యాంజలి పోర్టల్‌పై జిల్లాలోని ఎంఈఓలు, క్లస్టర్ ప్రధానోపాధ్యాయులు, విద్యా కమిటీ ఛైర్మన్లు, రిసోర్స్‌పర్సన్లకు ఒక రోజు శిక్షణ నగరంలోని సీవీఆర్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... పోర్టల్‌లో వివరాలు నమోదు చేయడం వల్ల వివిధ సంస్థల అధినేతలు, ప్రతినిధులు సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా ఆయా పాఠశాలల్లో వసతులు కల్పించే అవకాశం ఉంటుందని తెలిపారు. పూర్వ విద్యార్థులు, ప్రవాసాంధ్రులు, గ్రామస్థులు స్పందించే అవకాశం ఉందని అన్నారు. అధికారులు పి.సురేశ్‌కుమార్, రజనికుమారి, ఎస్.అశోక్‌బాబు, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

ముంగిట మృత్యుగంట

☛ రద్దీ సమయాల్లోనే ఎక్కువ ప్రమాదాలు...
☛ మరణాలు కూడా ఆ సమయాల్లోనే...


కోడూరుపాడులో ప్రమాదంలో నుజ్జయిన వాహనం



రద్దీ సమయాల్లోనే ఎక్కువ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. మరణాలు కూడా ఈ సమయాల్లోనే అధికంగా నమోదవుతున్నాయి. నిబంధనలు సరిగా పాటించకుండా నిర్లక్ష్యంగా నడపడంతోనే ప్రమాదాలు పెరుగుతున్నాయి. ప్రమాదాలు ఎక్కువగా ద్విచక్ర వాహనాల కారణంగానే జరుగుతున్నాయి. వీరు సరైన జాగ్రత్తలు తీసుకోకుండానే నడుపుతున్నారు. సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 9 గంటల మధ్య కూడా ఆందోళనకర స్థాయిలో ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. విద్యార్థులు, ఉద్యోగులు ఇళ్లకు వెళ్లే సమయంలోనూ ఇదే పరిస్థితి. - ఈనాడు, అమరావతి

ఏయే వాహనాలు కారణంగా..?	ప్రమదాలు	మరణాలు
ద్విచక్ర వాహనం	377	137
ఆటో	133	28
కారు, జీపు, వ్యాన్	263	69
ట్రక్కు, లారీ	195	81
ఆర్టీసీ బస్సు	48	18
ప్రైవేటు బస్సు	17	3
మినీ, స్కూల్ బస్సు	7	1
ట్రాక్టర్, ట్రక్కు	31	18
ఇతర వాహనాలు	34	18

అతివేగం.. నిర్లక్ష్యం..

☛ వాహనదారుల నిర్లక్ష్యమే ప్రమాదాలకు ప్రధాన కారణం. ట్రాఫిక్ నిబంధనలను పాటించకుండా అడ్డదిడ్డంగా వాహనాలు నడుపుతున్నారు. దీని వల్ల వారి ప్రాణాలతో పాటు ఎదుటి వారి ప్రాణాలు పోవడానికి కారకులవుతున్నారు. అవసరాలకు తగ్గట్లుగా నగర రోడ్లు విస్తరించలేదు. బెజవాడలో ఉన్న కెనాల్ రోడ్డు, బందరు, ఏలూరు రోడ్లు ప్రధానమైనవి.

☛ వీటితో పాటు నగరవ్యాప్తంగా దాదాపు 1200 కి.మీ మేర అంతర్గత రహదారులు ఉన్నా ఇరుకుగా మారాయి.

☛ నగరంలో వాహనాలు కూడా ఇబ్బడిముబ్బడిగా పెరుగుతూనే ఉన్నాయి. ఫలితంగా ప్రమాదాలు అదుపులోకి రావడం కష్టతరంగా మారింది.

☛ యువత 350 సీసీ బైకులు, స్పోర్ట్స్ బైకులనూ అతి వేగంగా నడుపుతూ ఇతరులకు ఇబ్బందులు కలిగిస్తున్నారు. రద్దీగా ఉండే రోడ్లపై కూడా అత్యంత వేగంగా నడుపుతున్నారు. ద్విచక్ర వాహనదారులలో ఎక్కువ మంది తలకు గాయం కావడంతోనే మరణిస్తున్నారు. రద్దీగా ఉండే రహదారులపై పాదచారులు రోడ్డు దాటాలంటే అనేక ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

ఓవర్‌టేక్ చేసే సమయాల్లో జాగ్రత్త...

- వాసు, 'వీడు' స్వచ్ఛంద సంస్థ, విజయవాడ

ద్విచక్ర వాహనదారులు తు.చ తప్పకుండా నిబంధనలు పాటించాలి. లేన్ డిసిప్లిన్ పాటిస్తే చాలా వరకు ప్రమాదాలను నివారించవచ్చు. బైకులు నడిపేవాళ్లు భారీ వాహనాలు ఓవర్‌టేక్ సమయాల్లో జాగ్రత్తలు పాటించాలి. అతివేగంతో వాహనాలు నడపకూడదు. ఎక్కువగా అధికవేగం, నిర్లక్ష్యం కారణంగానే ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయన్న విషయాన్ని గుర్తుంచుకోవాలి.

ఉద్యోగులూ.. మీరే ప్రగతి వారధులు

బెజవాడలో సందడే సందడి



మంత్రులు పయ్యావుల కేశవ్, సత్యకుమార్‌యాదవ్‌లను గజమాలతో సత్కరిస్తున్న ఏపీ జేఏసీ అమరావతి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, టి.వి.ఫణి పేర్రాజు, సెక్రటరీ జనరల్ పలిశెట్టి దామోదరరావు, మహిళా విభాగం నేతలు

విజయవాడ (గాంధీనగర్), న్యూస్‌టుడే: నాలుగో మహాసభలను పురస్కరించుకొని ఏపీ ఐకాస అమరావతి ఆధ్వర్యంలో గురువారం లెనిన్ సెంటర్ నుంచి ఏలూరురోడ్డు మీదగా తుమ్మలపల్లి కళాక్షేత్రం వరకు ఉద్యోగులు భారీ ర్యాలీ నిర్వహించారు. రాష్ట్రం నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో ఉద్యోగులు తరలిరావడంతో నగరం కోలాహలంగా మారింది. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, బొప్పరాజు నాయకత్వంలో డిమాండ్లు సాధించుకుంటాం అంటూ దారి పొడవునా ఉద్యోగులు పెద్దఎత్తున నినాదాలు చేశారు. మహిళా ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ర్యాలీ అనంతరం తుమ్మలపల్లి కళాక్షేత్రం వద్ద జెండా ఆవిష్కరించి సభను ప్రారంభించారు. ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రివర్గ ఉప సంఘం సభ్యులకు ఐకాస నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ముఖ్యమంత్రే నేరుగా ఉద్యోగ సంఘాల చర్చల్లో పాల్గొడంపై ఆనందం వ్యక్తం చేశారు.

క్యాబ్ తరహాలో.. కిసాన్ డ్రోన్ల బుకింగ్

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: డ్రోన్ల సేవలను సులభంగా రైతులకు చేరువ చేయడానికి మరో ముందడుగు వేసినట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి డి.ఎం.ఎఫ్.విజయకుమారి తెలిపారు. ఇందుకు కిసాన్ డ్రోన్ ఉబరైజేషన్‌కు రూపకల్పన చేసినట్లు గురువారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ఇందుకోసం చరవాణిలో యాప్ డౌన్‌లోడ్ చేసుకోవడం లేదా రైతుసేవా కేంద్రాల్లోని క్యూఆర్ కోడ్ స్కాన్ ద్వారా సేవలను యాక్సెస్ చేయవచ్చని సూచించారు. డ్రోన్లతో అతి తక్కువ వ్యవధిలో 10 నిమిషాల్లో ఒక ఎకరం పొలంలో పురుగు నివారణ మందును సమానంగా పిచికారీ చేయడం సాధ్యమని వివరించారు. జిల్లాలో ఆర్‌కేవీపై 2024-25 పథకం కింద 35 కిసాన్ డ్రోన్లను అందించినట్లు తెలిపారు. యాప్ ద్వారా డ్రోన్లను బుక్ చేసుకుని, వినియోగించుకోవాలని ఆమె అన్నదాతలకు విజ్ఞప్తి చేశారు.

జలవనరులకు జవసత్వాలు

✧ దెబ్బతిన్న గట్లకు శాశ్వత మరమ్మతులు
✧ 140 పనులకు రూ.37 కోట్లు మంజూరు

ఈనాడు, అమరావతి

బుడమేరు వరదలకు విజయవాడ అతలాకుతలమైంది. వరద తీవ్రతకు బుడమేరు గట్టు... చెరువులు, డ్రెయిన్ల గట్లు కోతకు గురై బలహీన పడ్డాయి. కూటమి ప్రభుత్వం ఇప్పటికే బుడమేరు గట్లు బలోపేతం చేయగా... చెరువులు, డ్రెయిన్ల గట్ల బలోపేతం, పునర్నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. ప్రస్తుతం ప్రక్రియ టెండర్ల దశకు చేరుకోగా ఏప్రిల్‌లోగా పనులు పూర్తి చేయాలని కసరత్తు చేస్తున్నారు.
★ బుడమేరు వరద తాకిడికి గన్నవరం, గుడివాడ, మైలవరం, పామర్రు, నూజివీడు నియోజకవర్గాల్లో గట్లు ఎక్కువగా బలహీనపడినట్లు అధికారులు గుర్తించారు. వీటి బలోపేతం.. మరీ ఎక్కువ దెబ్బతిన్న ప్రాంతాల్లో పునర్నిర్మిస్తారు. భారీగా కొట్టుకుపోయిన చెరువులకు తాత్కాలిక మరమ్మతులు చేయనున్నారు. ★ 110 చెరువు గట్ల పునర్నిర్మాణానికి రూ.27 కోట్లు మంజూరు చేశారు. 30 ప్రాంతాల్లో డ్రెయిన్ల గట్ల బలోపేతానికి రూ.10 కోట్లు కేటాయించారు. ★ వారంలో టెండర్లు పిలిచి ఫిబ్రవరిలో ప్రక్రియ పూర్తి చేసి మార్చిలో పనులు మొదలు పెట్టి ఏప్రిల్ నాటికి పూర్తి చేయాలనేది జలవనరులశాఖ లక్ష్యం.


మైలవరం పరిధిలో కోతకు గురైన డ్రెయిన్

పాతాలు నేర్వాలి.. ★ వరదలతో రూపు చెదిరిన బుడమేరు గట్ల బలోపేతానికి రూ.43 కోట్ల విలువైన 126 పనులు మంజూరు చేస్తే.. ఓ ప్రజాప్రతినిధి 20 శాతం కమీషన్ తీసుకుని వైకాపా నేతలకు సన్నిహితంగా ఉండే కడప గుత్తేదారులకు అప్పనంగా అప్పగించారు. వారు అరకొరగా పనులు చేసి సొమ్ము చేసుకున్నారు. ★ అత్యవసర పనుల పేరుతో ప్రభుత్వ అనుమతులు రాకుండానే పనులు చేయించేసి మరో పెద్ద తప్పు చేశారు. ★ ముందు పనులు చేసిన గుత్తేదారులకే పనులు అప్పగించేందుకు అధికారులపై ఒత్తిడి చేశారు. ★ ఇలాంటి వ్యవహారాలు పునరావృతమైతే పనుల్లో నాణ్యతకు నీళ్లొదిలినట్లే. ★ దీనిపై ఇరిగేషన్ ఎస్‌ఈ మోహనరావు మాట్లాడుతూ.. టెండర్లు, పనులు నిబంధనల ప్రకారం చేస్తామనీ, అతిక్రమణలకు తావుండదని తెలిపారు.

తీరంలో అలలపై తేలిపోదామా..

★ భవానీ ద్వీపం ఒడ్డున హౌస్‌బోటు కార్యకలాపాలు ప్రారంభం ★


కృష్ణానదిలో విద్యుత్తు కాంతులతో సిద్ధం చేసిన బోట్లు

కృష్ణానది అలలపై విహారం చేస్తూ అందాల్ని తిలకించేలా ఏర్పాటు చేసిన హౌస్ బోట్ కార్యకలాపాలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. నగర వాసులతో పాటు పర్యాటకులకు సరికొత్త అనుభూతిని కలిగించేలా ఏపీ పర్యాటకాభివృద్ధి సంస్థ(ఏపీటీడీసీ), ప్రైవేటు సంస్థ ఆధ్వర్యంలో హౌస్‌బోట్‌లను ఏర్పాటు చేశారు. కేరళ, తదితర ప్రాంతాల్లోనే నీటిపై హౌస్‌బోట్లు ఉన్నాయి. కృష్ణానది మధ్యలో ఉన్న భవానీద్వీపం ఒడ్డున ఈ బోట్లను ఉంచారు. ప్రస్తుతం మూడు రకాల బోట్లు అందుబాటులో ఉన్నాయి. సందర్శకులు, పర్యాటకులు కృష్ణానది విహారంతో పాటు హౌస్ బోటులోనే బస చేసే అవకాశం ఉంది. కపుల్ ఫ్లోటింగ్ హోం, రొమాంటిక్ ఫ్లోట్ ఎన్ డెన్, ఫ్లోట్ పీవోడీ పేరుతో బోట్లను సిద్ధం చేశారు. రాత్రి సమయంలో బోట్లలోనే బస చేసే వీలుంది. భోజనం, అల్పాహారం, టీవీ వీక్షణ తదితర సౌకర్యాలు ఉన్నాయి. ఒక్కో బోటును బట్టి ప్యాకేజీలు రూపొందించారు. **- భవానీపురం, న్యూస్‌టుడే**

తుపాకీతో బెదిరించి.. కౌంటర్‌లో నగదు దోచి!

★ వేతనాలు ఇవ్వలేదు... ఉద్యోగం నుంచి తీసేశారని కక్షతో..
★ గ్యాస్ ఏజెన్సీలో ఉద్యోగినులను బెదిరించి రూ.లక్షతో పరారు


ధీరజ్ భజరంగ్ దినేష్

ఈనాడు - అమరావతి, న్యూస్‌టుడే - భవానీపురం: తమకు వేతన బకాయిలు ఇవ్వకుండా ఉద్యోగం నుంచి తొలగించడంతో... ఆగ్రహంతో గ్యాస్ ఏజెన్సీకి వెళ్లి తుపాకీతో బెదిరించి.. కౌంటర్‌లో డబ్బు తీసుకెళ్లిన ఘటన విజయవాడలో చోటుచేసుకుంది. వైకాపా నేత మల్లాది విష్ణు సోదరుడి గ్యాస్ ఏజెన్సీలో బుధవారం రాత్రి జరిగిన ఘటన కలకలం సృష్టించింది. సీసీపుటేజీ మేరకు.. అది అసలు తుపాకీ కాదనీ, బొమ్మ తుపాకీ అని పోలీసులు భావిస్తున్నారు.

కస్టమర్ల ఫిర్యాదుతో..: విద్యాధరపురంలో మల్లాది రాజేంద్రప్రసాద్ గ్యాస్ ఏజెన్సీ నడుపుతున్నారు. ఇందులో గ్యాస్ డెలివరీ బాయ్స్‌గా రాజస్థాన్ నుంచి వచ్చిన ఎనిమిది మందిని నిరుడు జూన్‌లో పనిలో పెట్టుకున్నారు. వసతి కూడా కల్పించారు. వీరికి తెలుగు రాకపోవడం, హిందీలోనే మాట్లాడటంతో కస్టమర్లు పలుమార్లు ఫిర్యాదు చేశారు. వీరిని మార్చి స్థానికులను పెట్టుకోమని సూచించారు. కస్టమర్ల ఒత్తిళ్లతో ఇటీవల వీరిని తొలగించగా.. ఆరుగురు రాజస్థాన్ వెళ్లిపోయారు. జోధ్‌పూర్‌వాసి భజరంగ్, బికనీర్‌వాసి దినేష్‌లే మిగిలారు.



విద్యాధరపురంలోని గ్యాస్ ఏజెన్సీ

పక్కా ప్రణాళికతో..: వీరికి యాజమాన్యం జీతాలివ్వలేదు. తమకు బకాయిలిస్తే.. మంగళగిరి వెళ్లి పని చేసుకుంటామన్నారు. బుధవారం రాత్రి 8.45 గంటలకు గ్యాస్ ఏజెన్సీకి భజరంగ్, దినేష్‌లు ధీరజ్‌తో వచ్చి.. యూనిఫామ్ అప్పగించారు. అప్పుడు ఇద్దరు ఉద్యోగినులు ఆరోజు కలెక్షన్లు లెక్కిస్తున్నారు. తమ జీతం గురించి వీరు ఉద్యోగినులతో గొడవపడ్డారు. యాజమాన్యానికి ఫిర్యాదు చేస్తామని ఉద్యోగినులు హెచ్చరించగా భజరంగ్ తుపాకీతో వారిని బెదిరించాడు. ఒకరు బయటకెళ్లి షట్టర్ దించగా.. ఇద్దరు కౌంటర్‌లోని రూ.లక్ష, రెండు ఫోన్లతో ఉడాయించారు.

ద్విచక్ర వాహనంపై పరారు: గ్యాస్ ఏజెన్సీ బయట నిలిపిన ద్విచక్ర వాహనంపై ముగ్గురూ పరారయ్యారు. ఈవిషయాన్ని ఏజెన్సీ నిర్వాహకులు భవానీపురం పోలీసులకు చెప్పగా.. వారొచ్చి సీసీ కెమెరాలను పరిశీలించారు. క్లూస్ టీమ్ ఆధారాలను సేకరించింది. ఏజెన్సీ వద్ద ఆధార్, పాన్‌కార్డుల్లో చిరునామాల మేరకు విచారణ ప్రారంభించారు. సితార సెంటర్ వైపు వెళ్లినట్లు సీసీ కెమెరాల్లో నమోదైంది. వీరు రాజస్థాన్ వెళ్లి ఉండొచ్చని భావిస్తున్నారు. అర్ధరాత్రి బస్టాండు, రైల్వేస్టేషన్‌లో సీసీపుటేజీ పరిశీలించినా జాడలేదు. ఫోన్లు స్విచ్ఛాఫ్ చేశారు. నిందితుల స్వస్థలాలకు ప్రత్యేక బృందాన్ని పంపిస్తున్నారు. వారు వాడింది అసలు తుపాకీ అయితే ఎక్కడి నుంచి తెచ్చారోనని ఆరా తీస్తున్నారు.

తిరువూరులో ఏకైక బార్‌కు పోటాపోటీ

లాటరీ ద్వారా 21 బార్లు కేటాయింపు

న్యూస్‌టుడే, సూర్యారావుపేట: ఎన్టీఆర్ జిల్లాలో మిగిలిపోయిన బార్లకు గురువారం ఉదయం కలెక్టరేట్‌లో లాటరీ తీశారు. ఎన్టీఆర్ జిల్లాలో మొత్తం 55 బార్లు మిగిలిపోగా వాటిలో నాలుగు అంత కన్నా ఎక్కువ దరఖాస్తులు వచ్చిన 21 బార్లకు కలెక్టర్ లక్ష్మీశ లాటరీ తీసి కేటాయించారు. తిరువూరు మున్సిపాలిటీ పరిధిలో ఒకే ఒక బార్ ఉండగా దానికి 9 మంది పోటీ పడ్డారు. ఉత్కంఠభరితంగా సాగిన లాటరీలో చలసాని హేమసునీల్ బార్‌ను గెలుచుకున్నారు. ఒక బార్‌కు ఒకే ఒక దరఖాస్తు పడడంతో నిబంధనల ప్రకారం లాటరీ తీయలేదు.

కొండపల్లిలో మూడింటికి పోటీ.. కొండపల్లి మున్సిపాలిటీలో మూడు బార్లకు పోటీ వచ్చింది. రెండు బార్లకు నలుగురేసి చొప్పున దరఖాస్తులు ఇవ్వగా వాటికి లాటరీ తీసి ఒక్కొక్కరికి కేటాయించారు. కొండపల్లిలోని మరో బార్‌కు పాలడుగు కిరణ్‌కుమార్ మూడు దరఖాస్తులు వేయగా, పెదర్ల కుటుంబరావు ఒకే దరఖాస్తు వేశారు. దీనికి లాటరీ తీయగా ఒకే దరఖాస్తు వేసిన కుటుంబరావుకు లాటరీ దక్కింది.


సీరియల్ నంబరు చూపుతున్న కలెక్టర్ లక్ష్మీశ

17 బార్లకు ఏకగ్రీవం: గురువారం నిర్వహించిన లాటరీలో మిగిలిన 17 బార్లకు ఒక్కొక్కరే నాలుగేసి దరఖాస్తులు వేశారు. దీంతో లాటరీ తీయనవసరం లేకుండానే వారికి కేటాయించారు. కలెక్టర్ లక్ష్మీశ లాటరీ తీసి లబ్ధిదారులకు కేటాయించారు. కార్యక్రమంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ టి.శ్రీనివాసరావు, అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆర్.వి.రామశివ అధికారులు పాల్గొన్నారు.

నదీతీరం.. ఆకతాయిలకు నిలయం

☛ గత నెల 11న ఇద్దరు రౌడీషీటర్లు, మరో ముగ్గురు మద్యం మత్తులో పున్నమిఘాట్ సమీపంలో కారులో వేగంగా చక్కర్లు కొట్టారు. కారును ఎందుకు వేగంగా వెళ్తున్నారంటూ అక్కడ ఉన్న వారు ప్రశ్నించడంతో వారిపైకి పోనిచ్చారు. దీంతో తొమ్మిదేళ్ల బాలుడు సహా ముగ్గురు గాయపడ్డారు.

☛ గత నెల 15న రాత్రి నది ఒడ్డున పిండాల ఘాట్ వద్ద ఏఆర్ కానిస్టేబుల్ ఎం.శ్రీను, మరో ఇద్దరిపై ఆకతాయిలు మద్యం మత్తులో అకారణంగా కొట్టారు.

ఈ సంఘటనలే కాకుండా అనేక సంఘటనలు నదీతీర ప్రాంతంలో ఇటీవల కాలంలో జరుగుతున్నాయి. పోలీసుల గస్తీ తగ్గడంతో ఆకతాయిలు, రౌడీషీటర్లు, గంజాయి బ్యాచ్ చేరిపోయి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. కృష్ణా నదీ తీరం ఆకతాయిలకు అడ్డాగా మారుతుంది. ముఖ్యంగా గంజాయి, బ్లేడ్ బ్యాచ్‌లకు నిలయంగా మారింది. చీకటి పడితే వారంతా నదీతీర ప్రాంతం వద్దకు వచ్చి ఉంటున్నారు.

భవానీపురం, న్యూస్‌టుడే

విజయవాడ బస్టాండ్ సమీపంలోని పద్మావతి ఘాట్ వద్ద నుంచి పున్నమి, భవానీ, గొల్లపూడి, సూరాయిపాలెం, పవిత్ర సంగమం తదితర స్నానఘాట్‌ల వద్దకు ఎక్కువ మంది ఆకతాయిలు వస్తున్నారు. కొందరు అక్కడే మద్యం తాగి గొడవలకు దిగుతున్నారు.



పున్నమిఘాట్ వద్ద సందర్శకులు

చీకటిపడితే అసాంఘిక కార్యక్రమాలు

కృష్ణానదీ తీరంలో ఇటీవల కాలంలో ఎగ్జిబిషన్‌లు, ఈవెంట్లు, తదితర కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. దీంతో సందర్శకుల సంఖ్య క్రమక్రమంగా పెరుగుతుంది. వారాంతం రోజుల్లో ఆ విధంగా వచ్చే వారి సంఖ్య ఎక్కువగా ఉంటుంది. అయితే... నదీ తీర ప్రాంతంలో గస్తీ నిర్వహణకు ప్రత్యేకంగా చర్యలేమీ చేపట్టని పరిస్థితి. దీంతో ఆకతాయిలు ఎక్కువ మంది చీకటి పడితే అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నారు. వారికి సామాజిక మాధ్యమాల్లో ఖాతాలు ఉండడంతో అసభ్యంగా రీల్స్ చేస్తున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే ఎదురుదాడికి దిగుతున్నారు. మందుబాబులు ఆటోల్లో ఘాట్‌ల వద్దే మద్యం తాగుతున్నారు. దీంతో నగర వాసులు కుటుంబసమేతంగా రావాలంటే హడలిపోతున్నారు.

పర్యవేక్షణ అవసరం...

బస్టాండ్ సమీపంలో ఉండే పద్మావతి, సీతమ్మవారి పాదాలు, భవానీపురంలోని పున్నమి, భవానీఘాట్‌లు నిత్యం సందర్శకులతో రద్దీగా ఉంటుంది. దీంతో గంజాయి, బ్లేడ్ బ్యాచ్ సభ్యులు ఎక్కువగా వస్తున్నారు. ఇబ్రహీంపట్నంలోని పవిత్ర సంగమం ప్రాంతం ఆకతాయిలు, మందుబాబుల అడ్డాగా ఉంది. పోలీసులు ఆయా ప్రాంతాల్లో దృష్టి సారించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

మత్తుకు దూరంగా ఉంటే బంగారు భవిష్యత్తు

ఈగల్ టీం ఐజీ ఆకే రవికృష్ణ

పాయకాపురం, న్యూస్‌టుడే: మత్తుకు దూరంగా ఉంటే ప్రతి ఒక్కరికి బంగారు భవిష్యత్తు సాధ్యపడుతుందని రాష్ట్ర ఈగల్ టీం ఐజీ ఆకే రవికృష్ణ అన్నారు. 'జీవితాన్ని ప్రేమించు-డ్రగ్స్‌కు దూరంగా ఉండు' అనే నినాదంతో పదో రోజు అవగాహన ర్యాలీ నున్న పోలీసుస్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. వాంబేకాలనీ జీబ్లాక్ నుంచి ర్యాలీ ప్రారంభమై సాయంత్రం రాధానగర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ముగిసింది. 200 మంది విద్యార్థులు సైకిల్ తొక్కుతూ యాత్ర నిర్వహించారు. మొత్తం 114 కి.మీ యాత్ర నగర పోలీసుల ఆధ్వర్యంలో కొనసాగగా, నున్న పోలీసుస్టేషన్ పరిధిలో గురువారం 15 కి.మీ ఈ యాత్ర కొనసాగింది. ఆకే రవికృష్ణ మాట్లాడుతూ...ప్రతి వీధి, ప్రతి రోడ్డుపై డ్రగ్స్ వినియోగానికి ఆస్కారం ఉన్న చోట ప్రత్యేక డ్రైవ్‌లు, తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఐదుగురు మహిళా పోలీసు అధికారుల భాగస్వామ్యంతో 500 కి.మీకు పైగా జిల్లా అంతటా డ్రగ్స్‌పై దండయాత్ర పేరుతో విస్తృత యాంటీ డ్రగ్స్ ప్రచారం కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు. ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ...గత వైకాపా ప్రభుత్వ హయాంలో 9వేల ఎకరాలలో గంజాయి సాగు జరిగేదని, నేడు ఆ పరిస్థితి పూర్తిగా మారిపోయిందన్నారు. గంజాయి సాగును పూర్తిగా నిర్మూలించడంతో పాటు, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే డ్రగ్స్ సరఫరాను నియంత్రించామని తెలిపారు. ఏపీని డ్రగ్స్‌ఫ్రీ రాష్ట్రంగా మార్చేందుకు సీఎం చంద్రబాబు, ఆయన తనయుడు లోకేశ్‌లు అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. నగర పోలీసు కమిషనర్ రాజశేఖర్‌బాబు మాట్లాడుతూ... నగరంలో 12వేల సీసీ కెమెరాలు, డ్రోన్‌లు, న్యాట్‌గ్రిడ్ డేటా బేస్ ద్వారా నిఘా కొనసాగిస్తున్నామన్నారు. ఎక్కడైనా నేరం జరిగిన వెంటనే తక్షణ చర్యలు తీసుకునేలా వ్యవస్థను బలోపేతం చేశామని తెలిపారు. డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే 112 లేదా 1972కు తెలపాలని ఆయన కోరారు. అనంతరం డ్రగ్స్ వద్దు బ్రో గోడపత్రికను ఆవిష్కరించారు. సాయంత్రం ముగింపు కార్యక్రమంలో ఏడీసీపీ జి.రామకృష్ణ, ఏసీపీ స్రవంతిరాయ్, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సంధ్యామాధురి, నున్న పోలీసుస్టేషన్ సీఐ కృష్ణమోహన్, తదితరులు పాల్గొన్నారు. ర్యాలీలో పలు కళాశాలలకు చెందిన విద్యార్థులు ప్రదర్శించిన కళానృత్యాలు, అవగాహన కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. డ్రగ్స్ తీసుకుంటే వచ్చే సమస్యలను వారు ప్రదర్శించారు.



సైకిల్‌ర్యాలీలో ఐజీ ఆకే రవికృష్ణ, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, సీపీ రాజశేఖరబాబు తదితరులు

సేవాభావంతో సాగునీటి సంఘాల పనులు

జీఎస్టీ విధానం తొలగించాలని సీఎంకు ఆళ్ల వినతి

విజయవాడ (ఎన్టీఆర్ కలెక్టరేట్), న్యూస్‌టుడే: సాగునీటి సంఘాల పరిధిలో కాల్వల నిర్వహణ, మరమ్మతుల పనులు రైతు ప్రతినిధులు సేవాభావంతో చేస్తున్న క్రమంలో ప్రస్తుతం ఉన్న జీఎస్టీ విధానాన్ని తొలగించాలని సీఎం చంద్రబాబుకు వినతిపత్రం సమర్పించినట్లు ఏపీ సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావు తెలిపారు. రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు సమక్షంలో దీనిపై సీఎంకు వివరించినట్లు పేర్కొన్నారు. అమరావతిలో నీరు-ప్రగతి-జలహారతి పేరిట గురువారం జరిగిన రాష్ట్ర సాగునీటి వినియోగదారుల సమావేశంలో రాష్ట్ర ప్రతినిధిగా ఆళ్ల హాజరయ్యారు. అనంతరం విజయవాడలోని సాగు నీటి సంఘాల సమాఖ్య కార్యాలయంలో సాయంత్రం ఆ వివరాలు వెల్లడించారు. సాగునీటి సంఘాల అధ్యక్షులు, డీసీ, పీసీ కమిటీల ఛైర్మన్లు ఎదుర్కొంటున్న సమస్యలపై పూర్తి వివరాలతో సీఎంకు వినతి పత్రం అందజేసినట్లు పేర్కొన్నారు. చిన్నతరహా నీటి పారుదల వ్యవస్థలో సాగు నీటి చెరువులు ప్రస్తుతం [illegible] సంఘాల పరిధిలో ఉన్నాయని, ఆర్థిక వనరులు దుర్వినియోగం అవుతున్నాయని అంశాలను వ్యక్తం చేశారు. ఈ క్రమంలో వీటి నిర్వహణ బాధ్యతలను సాగునీటి సంఘాలకు అప్పగించాలన్నారు.

ఆళ్లను సత్కరించిన సీఎం.. నాగార్జునసాగర్ ఎడమ కాలువ మూడో జోన్‌లో ఆయకట్టుకు సమర్థంగా నీటి యాజమాన్యం నిర్వహించి 20వేల ఎకరాల అదనపు పంటలకు సాగునీరు, 92 చెరువులకు తాగునీరు ఇచ్చి లబ్ధి చేకూర్చిన డీసీ వైస్-ఛైర్మన్, సాగునీటి సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఆళ్లను, సీఎం చంద్రబాబు శాలువాతో ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు.

22, 23 తేదీల్లో పీడీఎస్‌యూ జాతీయ మహాసభలు

విజయవాడ (గాంధీనగర్): ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) జాతీయ ప్రథమ మహాసభలను ఈ నెల 22, 23 తేదీల్లో విజయవాడలో నిర్వహిస్తున్నట్లు జాతీయ కన్వీనర్ ఎం.రామకృష్ణ తెలిపారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో మహాసభల గోడపత్రికను ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఈ మహాసభల్లో దేశంలో విద్యారంగం ఎదుర్కొంటున్న సమస్యలు, విద్యార్థుల హక్కులపై ఉద్యమ కార్యాచరణను ప్రకటిస్తామని చెప్పారు. అదేవిధంగా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన జాతీయ విద్యా విధానం- 2020 విద్యను వ్యాపార సరకుగా మార్చివేసి వ్యాపారీకరణ, కార్పొరేటీకరణను పెంచే విధంగా ఉందని, దేశంలోని ప్రభుత్వ యూనివర్సిటీల్లో కులం, మతం పేరుతో విద్యార్థుల మధ్య వివక్షను పెంచి పోషించే విధంగా విధానాలను ప్రకటిస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు యు.గనిరాజు, విజయ్‌కన్నా, వెంకటరెడ్డి, ఎస్.కిరణ్‌కుమార్, సిద్ధు తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ విలువకు నాలుగురెట్ల పరిహారం ఇవ్వాలి

జుజ్జూరు(వీరులపాడు), న్యూస్‌టుడే: బాహ్యవలయ రహదారి(ఓఆర్ఆర్) కింద భూములు కోల్పోయే రైతులకు బహిరంగ మార్కెట్ విలువ ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని, రోడ్డు వెడల్పు తగ్గించాలని ఓఆర్ఆర్ రైతులు డిమాండ్ చేశారు. మండల పరిధి జుజ్జూరు గ్రామ శివారులో వీరులపాడు, కంచికచర్ల మండలాలకు చెందిన 30 మంది రైతులు గురువారం సమావేశమయ్యారు. [illegible] భవిష్యత్తు కార్యాచరణపై చర్చించారు. అనంతరం రైతులు మాట్లాడుతూ ఓఆర్ఆర్‌ను మొదట 140 మీటర్లుగా ప్రభుత్వం ప్రతిపాదించిందని, ఆ తర్వాత జనవరి 5న జారీ చేసిన నోటిఫికేషన్‌లో 250 మీటర్లకు పెంచారన్నారు. బఫర్ జోన్ పరిధి మరో 500 మీటర్లు ఉంటుందనే ప్రచారం జరుగుతోందని రైతులు వాపోయారు. 250 మీటర్ల భూసేకరణ అవసరం లేదని, [illegible] 70 మీటర్లకు కుదించాలని వారు కోరారు. సెక్షన్ 26(1) భూసేకరణ ప్రకారం.. రైతులకు నాలుగు రెట్లు అధికంగా పరిహారం చెల్లించాలని, గ్రామీణ ప్రాంతాల్లో రిజిస్ట్రేషన్ విలువకు, మార్కెట్ విలువకు ఎంతో వ్యత్యాసం ఉంటుందని, రైతులకు మార్కెట్ విలువ పరిగణనలోకి తీసుకుని నాలుగు రెట్లు అధికంగా పరిహారం ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు [illegible] తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న వీరులపాడు, కంచికచర్ల మండలాల రైతులు

పాల సొసైటీ నిబంధనలపై అవగాహన తప్పనిసరి



మాట్లాడుతున్న కృష్ణా మిల్క్ యూనియన్ ఛైర్మన్ ఆంజనేయులు

చిట్టినగర్, న్యూస్‌టుడే: విజయ డెయిరీ పాల సొసైటీ అధ్యక్షులు సొసైటీ నిబంధనలపై పూర్తి అవగాహన పెంచుకోవాలని కృష్ణా మిల్క్ యూనియన్ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు సూచించారు. పాల ఫ్యాక్టరీ ఆవరణలోని 'బి' కన్వెన్షన్‌లో సొసైటీ (బైలా) నిబంధనలపై గన్నవరం క్లస్టర్ పరిధిలోని పాల సొసైటీ అధ్యక్షులకు అవగాహన సదస్సు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ.. నిబంధనల ప్రకారం పాలకవర్గం బాధ్యతలు, పాల సంఘాల ఆడిట్ నిర్వహణ, సొసైటీ ఎన్నికల నిర్వహణ, వార్షిక సర్వసభ్య సమావేశాల నిర్వహణ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. శాస్త్రీయ పద్ధతిలో పశుపోషణ చేపట్టడం వల్ల ఖర్చులు తగ్గుతాయని చెప్పారు. [illegible] పశుగ్రాసాల పెంపకం, దాణా వినియోగించడం వల్ల పాల ఉత్పత్తి పెరగడంతో పాటుగా పశువుల పునరుత్పత్తి సామర్థ్యం కూడా మెరుగు పడుతుందని అన్నారు. ఇటీవల ప్రారంభించిన రెజీ వెట్‌కేర్ యాప్ ద్వారా పశువుల ఆరోగ్యంపై పూర్తిస్థాయి నిఘా, చూడు నిలవని గేదెలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని సకాలంలో చూడు కట్టించే విధానం, పశు ఆరోగ్య పరిరక్షణ కోసం కృష్ణా మిల్క్ యూనియన్ తీసుకుంటున్న చర్యలపై సంఘ అధ్యక్షులకు వివరించారు. సదస్సులో విజయ డెయిరీ ఎం.డి. కొల్లి ఈశ్వరబాబు, గన్నవరం క్లస్టర్ సమితి బోర్డు, ట్రస్టు బోర్డు డైరెక్టర్స్, ఫీడ్ కమిటీ సభ్యులు, సంఘ అధ్యక్షులు, అధికారులు పాల్గొన్నట్లు వివరించారు.

అర్జున స్తంభ శాసనానికి ప్రతి లిపి

విద్యాధరపురం, న్యూస్‌టుడే: భారత్ శ్రీ ప్రాజెక్టు కింద ఇంద్రకీలాద్రి దిగువన ఉన్న అక్కన్న మాదన్న గుహల్లో ఉన్న అర్జున స్తంభ శాసనానికి పురావస్తు శాఖ అధికారులు ప్రతి లిపి కార్యక్రమాన్ని గురువారం చేపట్టారు. కిరాతార్జున స్తంభంగా ప్రసిద్ధి చెందిన స్తంభంపై 9వ, 10వ శతాబ్దాలకు చెందిన పురాతన తెలుగు అక్షర శైలిలో శాసనం రాసి ఉంది. పెద వాడ(బెజవాడ) నివాసి అయిన కలియ బోయ కుమారుడు త్రికోటి బోయ ఈ స్తంభాన్ని స్థాపించినట్లు చరిత్రలో ఉందన్నారు. ఈ శాసనాన్ని చెక్కిన శిల్పి పేరు విజయాచార్యులుగా పురావస్తు శాఖ అధికారులు నిర్ధారణ చేశారు.



ప్రతి లిపి చేస్తున్న పురావస్తు శాఖ అధికారులు

'సౌర విద్యుత్తు మిగులు చెల్లింపుల నిలిపివేత అన్యాయం'

సూర్యారావుపేట, న్యూస్‌టుడే: వినియోగదారులు సౌర విద్యుత్తు మిగులును పంపిణీ సంస్థలకు అందిస్తున్నా వారికి నెల నెలా బిల్లులు చెల్లించకపోవడం అన్యాయమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఉదయం విద్యుత్తు నియంత్రణ మండలి ఆన్‌లైన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. [illegible] లక్షలు ఇస్తుండగా బడా కంపెనీలకు అధిక రేట్లు చెల్లించాల్సిన అవసరం ఏముందన్నారు. సౌర విద్యుత్తు వినియోగదారులను ప్రోత్సహించాల్సింది పోయి వారికి ప్రతినెలా ఇవ్వాల్సిన మిగులు డబ్బులు ఇవ్వటం లేదన్నారు. నియంత్రణ మండలి జోక్యం చేసుకుని ప్రతి నెలా చెల్లించేలా ఏర్పాట్లు చేయాలని బాబూరావు డిమాండ్ చేశారు.

బాలుడే.. కానీ ముదిరిపోయాడు!

15 ఏళ్లకే చోరీల బాట

మధురానగర్, న్యూస్‌టుడే: చిన్న వయసులోనే చదువు మానేసాడు. 15 ఏళ్లకే దొంగతనాలు ప్రారంభించాడు. తాళం విరిచి ద్విచక్ర వాహనాలు మాయం చేసేవాడు. తాళం వేసి ఉన్న ఇళ్లను ఎంపిక చేసుకుని బద్దలు కొట్టి చోరీలకు పాల్పడేవాడు. ఇలా వరుస నేరాలతో పోలీసులను పరుగులు పెట్టిస్తున్న చిట్టినగర్‌కు చెందిన ఒక బాలుడు ఎట్టకేలకు అజిత్‌సింగ్‌నగర్ పోలీసులకు దొరికిపోయాడు. ద్విచక్ర వాహనాలు, వెండి పూజా సామాగ్రి చోరీ కేసులో ఇతడిని అరెస్టు చేసి 3 ద్విచక్ర వాహనాలు, అరకిలో వెండి వస్తువులు స్వాధీనం చేసుకున్నారు.



స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలతో సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై బి.వి.రామారావు, సిబ్బంది

విజయవాడ చిట్టినగర్‌కు చెందిన బాలుడు చిన్నపుడే చదువు మానేసి దొంగతనాలకు అలవాటు పడ్డాడు. తాళం వేసి ఉన్న ద్విచక్ర వాహనాలను లక్ష్యంగా చేసుకుంటాడు. వాటిని దొంగిలించి ఏదో ఒక ధరకు అమ్మేస్తాడు. గంజాయి, మద్యం తాగి జల్సాలు చేస్తాడు. డబ్బులు అయిపోగానే మళ్లీ నేరాలకు పాల్పడతాడు. గత ఏడాది హైదరాబాద్‌లో ఒక చరవాణిని లాక్కుని పారిపోయిన కేసులో అక్కడి పోలీసులు అరెస్టు చేసి జువైనల్ హోంకు తరలించారు. ఆ కేసులో ఏడాదిగా హోంలోనే ఉన్నాడు. గతేడాది డిసెంబరులో జైలు నుంచి విడుదలై విజయవాడకు చేరుకున్నాడు.

నగరంలో 4 కేసులు..

సత్యనారాయణపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో 2 ద్విచక్ర వాహనాల చోరీ కేసులు ఉన్నాయి. అజిత్‌సింగ్‌నగర్‌లో ఈ నెలలో ఒక ద్విచక్రవాహనం, కేదారేశ్వరపేటలోని ఒక ఇంటి తాళం పగలకొట్టి వెండి పూజా సామాగ్రి చోరీ చేశాడు. దీనిపై అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. రెండు చోరీ కేసుల్లో కీలకమైన ఆధారాలు లభించడంతో సీఐ వెంకటేశ్వర్లు, క్రైం ఎస్సై బి.వి.రామారావు నేతృత్వంలో ప్రత్యేక బృందాలు గాలింపు చేపట్టాయి. ఈ క్రమంలో పామర్రులో ఉంటున్నాడని తెలుసుకుని అక్కడకు చేరుకున్నారు. అక్కడ అతడిని పట్టుకుని విజయవాడకు తరలించారు. ఇతని వద్ద నుంచి అజిత్‌సింగ్‌నగర్‌లో చోరీ చేసిన 2 ద్విచక్ర వాహనాలు, ఇబ్రహీంపట్నంలో చోరీ చేసిన 1 వాహనం, కేదారేశ్వరపేటలో చోరీ చేసిన వెండి పూజా సామాగ్రి స్వాధీనం చేసుకున్నారు.

ఇబ్రహీంపట్నంకు నేడు జగన్

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: మాజీ మంత్రి జోగి రమేష్ ఇంటిపై జరిగిన దాడి నేపథ్యంలో ఆయనను, కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు వైకాపా అధ్యక్షుడు జగన్ శుక్రవారం ఇబ్రహీంపట్నం రానున్నట్లు వైకాపా వర్గాలు తెలిపాయి. అందులో భాగంగా వివిధ నియోజకవర్గాలకు చెందిన సమన్వయకర్తలు ఆ పార్టీ కార్యకర్తలను పెద్ద సంఖ్యలో సమీకరణ చేస్తున్నారు. పోలీసులు అన్ని చోట్లా బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు ట్రాఫిక్‌ను మళ్లించే ఏర్పాట్లు పూర్తి చేశారు.

కేంద్ర బడ్జెట్.. ప్రజా పక్షం

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే: కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజా బడ్జెట్ అని రాష్ట్ర ప్రభుత్వ 20 సూత్రాల అమలు కార్యక్రమం ఛైర్మన్ లంక దినకర్ పేర్కొన్నారు. గురువారం ఉదయం గవర్నర్‌పేట ఆలీబేగ్ వీధిలోని సీఏ భవన్‌లో 'కేంద్ర బడ్జెట్ 2026-27'పై జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ సంక్షేమం, అభివృద్ధి కలగలిపి ముందుచూపుతో యువత ఆకాంక్షలకు అద్దం పట్టేలా బడ్జెట్ ప్రవేశపెట్టారని కొనియాడారు. చివరి లబ్ధిదారుడి వరకు సంక్షేమ పథకాలు అందించాలన్నదే ప్రధాని మోదీ లక్ష్యమని, ఈ విషయాన్ని ప్రజలకు తెలియచెబుతున్నామన్నారు. రాష్ట్రంలో చంద్రబాబు నేతృత్వంలో సమర్థ నాయకత్వం ఉందని, ప్రధాని ఆశీస్సులు ఏపీకి ఎపుడూ ఉంటాయని తెలిపారు. మోదీ పాలనలో దేశం ప్రపంచంలోనే నాలుగో అతిపెద్ద ఆర్థిక శక్తిగా ఎదిగిందని కొనియాడారు. వచ్చే ఏడాది మూడో స్థానానికి చేరుకుంటామని వివరించారు. పీఎం ఆవాస్ యోజన కింద 4కోట్ల గృహాలను నిర్మించామని, అమృత్ పథకం కింద గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో స్వచ్ఛమైన తాగునీటిని అందిస్తున్నామని తెలిపారు. 70ఏళ్లు పైబడిన వారిలో 90 శాతం మందికి ఆయుష్మాన్ భారత్ కార్డులను ఏపీలో ఇచ్చామన్నారు. దేశంలో 7 హైస్పీడ్ రైల్వే కారిడార్లు ఏర్పాటు చేశామని, వాటిలో మూడు ఏపీతో అనుసంధానమై ఉన్నాయని వివరించారు. సీఏలు దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఆలిండియా ట్యాక్స్ పేయర్స్ అసోసియేషన్ రీజనల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ సీఏ అభిషేక్ మురళీ బడ్జెట్‌లోని ముఖ్యాంశాలను వివరించారు. కార్యక్రమంలో సీఏ అసోసియేషన్ ఛైర్మన్ నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



లంక దినకర్‌ను సన్మానిస్తున్న అభిషేక్ మురళి, నారాయణరెడ్డి తదితరులు

నవీన్‌కృష్ణకు ముగిసిన మధ్యంతర బెయిల్ గడువు

ఈనాడు - అమరావతి: మద్యం కుంభకోణం కేసులో మధ్యంతర బెయిల్‌పై ఉన్న నవీన్ కృష్ణ గడువు గురువారంతో ముగిసింది. దీంతో నిందితుడు విజయవాడలోని ఏసీబీ కోర్టులో లొంగిపోయాడు. అతడిని పోలీసులు గుంటూరులోని జిల్లా జైలుకు తరలించారు.

ముస్లింల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం

కానూరు, న్యూస్‌టుడే : ముస్లింల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందని విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పేర్కొన్నారు. తాడిగడపలో ఈద్గాకు ప్రభుత్వం కేటాయించిన 2 ఎకరాల్లో గోడ నిర్మాణానికి గురువారం పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్‌తో కలిసి శంకుస్థాపన చేశారు.

జోగి సోదరుల బెయిల్ రద్దు పిటిషన్‌పై విచారణ నేటికి వాయిదా

నకిలీ మద్యం కేసులో నిందితులకు రిమాండ్ పొడిగింపు

ఈనాడు - అమరావతి: నకిలీ మద్యం కేసులో జోగి సోదరుల బెయిల్ రద్దు పిటిషన్‌పై విచారణ... నోటీసుల నిమిత్తం శుక్రవారానికి వాయిదా పడింది. సిట్ అధికారులు దాఖలు చేసిన ఈ పిటిషన్ గురువారం విజయవాడలోని ఎనిమిదో ఏడీజే కోర్టులో విచారణకు వచ్చింది. ప్రతివాదులకు నోటీసుల నిమిత్తం న్యాయాధికారి వాయిదా వేశారు.

☛ ఈ కేసులో నిందితుల రిమాండ్ గురువారంతో ముగియనుండడంతో.. వారిని విజయవాడలోని ఎక్సైజ్ కోర్టులో న్యాయాధికారి లెనిన్ బాబు ఎదుట హాజరుపర్చారు. నిందితులు జనేష్, శిబు, ప్రసాద్, రమేష్, అల్లాబక్ష్‌లు హాజరయ్యారు. మిగిలిన వారు మదనపల్లి, నెల్లూరు జైళ్ల నుంచి వీసీ ద్వారా కోర్టులో హాజరుపరిచారు. బెయిల్‌పై విడుదలైన వారు కూడా హాజరయ్యారు. జోగి రమేష్, జోగి రాము కోర్టుకు రాలేదు. వీరి తరఫున న్యాయవాది గైర్హాజరు పిటిషన్ దాఖలు చేశారు. నిందితులకు ఈనెల 19 వరకు న్యాయాధికారి రిమాండ్ పొడిగించారు.

☛ మధ్యంతర బెయిల్‌పై ఉన్న సుదర్శన్.. గడువు పూర్తి కావడంతో గురువారం ఎక్సైజ్ కోర్టులో లొంగిపోయాడు. నిందితుడిని పోలీసులు నెల్లూరు కేంద్ర కారాగారానికి తరలించారు.

బ్రాయిలర్ ధరలు (కిలో ₹ రూ.లలో)



వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -133 రిటైల్ ధర 160 చికెన్ విత్ స్కిన్ - 232 చికెన్ స్కిన్‌లెస్ - 264.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 150, 159, 170 చికెన్ విత్ స్కిన్ - 290 చికెన్ స్కిన్‌లెస్ - 300.

హజ్ యాత్రికులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు

లబ్బీపేట(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే : హజ్ యాత్రకు వెళ్లే యాత్రికులకు ఇబ్బందులు తలెత్తకుండా... వసతి, భద్రత తదితర ఏర్పాట్లు చేస్తామని రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. హజ్ యాత్ర-2026 ఏర్పాట్లపై ప్రత్యేక సమావేశాన్ని విజయవాడ లబ్బీపేటలోని పద్మశాలీయ కల్యాణ మండపంలో గురువారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి మాట్లాడుతూ.. జిల్లాల వారీగా హజ్ సొసైటీలు తమ పరిధిలో యాత్రికులకు వ్యాక్సినేషన్, యాత్రలో పాటించాల్సిన అంశాల గురించి తెలియజేసేందుకు ప్రత్యేక సమావేశాలు నిర్వహించాలని సూచించారు. విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్ నుంచి పవిత్రమైన హజ్ యాత్రకు వెళ్లే ప్రయాణికులకు సీఎం చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం రూ.లక్ష ఆర్థిక చేయూత అందిస్తోందని, దానిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రాష్ట్ర ఉర్దూ అకాడమీ ఛైర్మన్ ఫరూక్‌షిబ్లీ మాట్లాడుతూ... చంద్రబాబులాంటి ముఖ్యమంత్రి ఉండడం రాష్ట్ర ముస్లింలకు అదృష్టమని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర హజ్ కమిటీ ఛైర్మన్ షేక్ హసన్ బాషా, హజ్ కమిటీ సీఈవో గౌస్ పీర్ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం హజ్ యాత్రకు సంబంధించిన జేబు కాలమానిని ఆవిష్కరించారు.



జేబు కాలమానిని ఆవిష్కరిస్తున్న మంత్రి ఫరూక్, షిబ్లీ, హసన్ బాషా తదితరులు

వక్ఫ్ బోర్డు సమావేశం వాయిదా

విద్యాధరపురం, న్యూస్‌టుడే: పాతబస్తీలోని రాష్ట్ర వక్ఫ్ బోర్డు కార్యాలయంలో గురువారం నిర్వహించాల్సిన బోర్డు సభ్యుల సమావేశం కోరం లేక వాయిదా పడినట్లు తెలిసింది. ఎజెండాలో చర్చించిన అంశాలను కనీసం పది రోజుల ముందు సభ్యులకు కాపీలను ఇవ్వాల్సి ఉండగా ఒక రోజు ముందు అంశాలను వాట్సాప్‌లో పంపారు. ఈ విషయాన్ని వక్ఫ్‌బోర్డు అధికారులు, ఛైర్మన్‌కు చెప్పినా కూడా స్పందన కరవైందని సభ్యులు మనస్తాపానికి గురైనట్లు సమాచారం. 11 మంది బోర్డు సభ్యులకు వక్ఫ్ బోర్డు ఛైర్మన్ అజీజ్, మరో సభ్యుడు మాత్రమే హాజరయ్యారు. దీంతో సమావేశాన్ని వాయిదా వేసినట్లు సమాచారం.

విద్యుత్తు మీటర్ రీడర్ల సమ్మె విరమణ

గాంధీనగర్, న్యూస్‌టుడే: స్మార్ట్ మీటర్లు వస్తున్న నేపథ్యంలో విద్యుత్తు సంస్థలలో పనిచేస్తున్న విద్యుత్తు మీటర్ రీడర్ల ఉపాధి ప్రమాదంలో పడిందని, సంస్థలోనే ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలని కోరుతూ జనవరి 29 నుంచి ధర్నాచౌక్‌లో ఆందోళన చేస్తున్నారు. వీరి న్యాయమైన సమస్యను పరిష్కరిస్తామని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి హామీ ఇవ్వడంతో సమ్మె విరమించారు. ఈ మేరకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్ గురువారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కలిశారు. ఈ నెల 9న మూడు డిస్కమ్‌ల సీఎండీలు, మీటర్ రీడర్ యూనియన్ నాయకులతో చర్చించి మీటర్ రీడర్ లందరికీ విద్యుత్ సంస్థలోనే ప్రత్యామ్నాయ ఉపాధి కల్పిస్తామని, ఔట్‌సోర్సింగ్ పద్ధతుల్లో అందరికీ ఉద్యోగ భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చారు. దీంతో వారం రోజులకు పైగా ఆందోళన చేస్తున్న విద్యుత్తు మీటర్ రీడర్లు సమ్మె విరమించారు. సానుకూలంగా స్పందించి సమస్య పరిష్కారానికి కృషి చేసిన సీఎస్‌కి, రాష్ట్ర ప్రభుత్వానికి ఏపీ విద్యుత్ మీటర్స్ యూనియన్ కృతజ్ఞతలు తెలిపింది. యూనియన్ గౌరవాధ్యక్షుడు బాలకాశి ప్రభుత్వ నిర్ణయంపై హర్షం వ్యక్తం చేశారు.



చీఫ్ సెక్రటరీకి సమ్మె విరమిస్తున్నట్లు వినతి పత్రం ఇస్తున్న ఈశ్వరయ్య, రవీంద్రనాథ్

తిరువూరు

• తిరువూరు • మైలవరం

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705

స్పందనలు: తిరువూరు: తిరువూరులో రోడ్లపై దుకాణాల ముందు పెరుగుతున్న ఆక్రమణలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఈ నెల 1వ తేదీన ఈనాడులో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. పోలీసులు, మున్సిపల్ ప్లానింగ్ అధికారులు సంయుక్తంగా ప్రధాన రహదారి బోసుబొమ్మ సెంటర్ నుంచి చీరాల సెంటర్ వరకు రోడ్లపై ఉన్న ఆక్రమణలను తొలగింపజేశారు. తిరువూరు సెక్టార్ 1 ఎస్సై శాతకర్ణి పర్యవేక్షించారు. ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

కొండపల్లి: పెట్రోల్ బంకులు, ప్రమాద కూడళ్లలో ట్రాఫిక్ పోలీసులు హెచ్చరిక సూచికలను ఏర్పాటు చేశారు. చూసుకోరు.. అడిగేవారులేరు అనే ఈనాడు కథనానికి ట్రాఫిక్ పోలీసులు స్పందించారు. కొండపల్లి పురపాలికతో పాటు, ఇబ్రహీంపట్నం పీఎస్ పరిధిలో ఉన్న అన్ని బంకులు, యూటర్న్‌ల వద్ద ప్రమాద సూచికలు, మెడికల్ ఎమర్జెన్సీకి సంబంధించిన సూచికలను జాతీయ రహదార్ల వెంట ట్రాఫిక్ ఎస్సైలు కృష్ణ, లక్ష్మణరావులు సిబ్బందితో ఏర్పాటు చేయించారు.

హుండీ ఆదాయం రూ.3.05 లక్షలు

మైలవరం, న్యూస్‌టుడే: మండలంలోని బొర్రగూడెంలో గల ప్రసిద్ధ తిరుపతమ్మ, గోపయ్యస్వామి ఆలయంలో హుండీలో కానుకల లెక్కింపును ఆలయ ధర్మకర్త సీహెచ్ సత్యవరప్రసాద్ ఆధ్వర్యంలో దేవాదాయ శాఖ అధికారులు గురువారం నిర్వహించారు. 5 నెలల 15 రోజులకు సంబంధించిన కానుకలను లెక్కించగా.. రూ.3,05,864లు ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో మోహనరావు తెలిపారు. దేవస్థాన సత్రం, బొమ్మల దుకాణం, పార్కింగ్, పాలు, బియ్యం, తలనీలాలు పోగుచేసుకునే లైసెన్సుల నిమిత్తం టెండరు నిర్వహించగా, రూ.2,62,200లు వచ్చినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధికారులు, భక్తులు, అర్చకులు పాల్గొన్నారు.

విలువలపై మాట్లాడే హక్కు వైకాపాకు లేదు


మాట్లాడుతున్న దేవినేని

గొల్లపూడి, న్యూస్‌టుడే: ప్రజాస్వామ్యం, హక్కులు, విలువలపై మాట్లాడే అర్హత వైకాపా నాయకులకు లేదని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. గొల్లపూడిలోని కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కల్తీ నెయ్యి కేసులో బాబాయ్‌కు క్లీన్ చిట్ ఇచ్చారంటూ వైకాపా నాయకులు చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. వైవీ సుబ్బారెడ్డికి తెలియకుండా చిన్నప్పుకు వందల కోట్ల రూపాయలు జరిపారా అని ప్రశ్నించారు. ఈ మొత్తం వ్యవహారంపై వైకాపా నేతలు ప్రజలకు స్పష్టమైన సమాధానం చెప్పాలన్నారు. అమరావతిలో మహిళలను ఇబ్బందులకు గురిచేసిన చరిత్ర వైకాపా నాయకులదని విమర్శించారు.

పల్లెసీమల అభివృద్ధికి కృషి

విస్సన్నపేట, న్యూస్‌టుడే: పల్లెసీమల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని విస్సన్నపేట తెదేపా మండల పార్టీ అధ్యక్షుడు రాయల సుబ్బారావు అన్నారు. మండలంలోని తెల్లదేవరపల్లిలో రూ.21,00,000 నరేగా నిధులతో చేపట్టే సీసీ రోడ్ల నిర్మాణానికి డీఈ లక్ష్మణరావు, ఏపీవో రామారావులతో కలిసి గురువారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో గంపలగూడెం ఏఎంసీ ఛైర్మన్ రేగళ్ల లక్ష్మి అనిత, పార్టీ నాయకులు పాల్గొన్నారు.


సీసీ రోడ్డు శంకుస్థాపనలో కూటమి నేతలు

రైతన్నా.. రిజిస్ట్రీ చేయించు..

ఇబ్రహీంపట్నం గ్రామీణం, గుంటుపల్లి, న్యూస్‌టుడే

ప్రభుత్వం అందించే పథకాల ద్వారా లబ్ధిపొందేందుకు రైతులు "ఫార్మర్ రిజిస్ట్రీ"నమోదు చేయించుకోవాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. అసైన్‌మెంట్ పొలాలు మినహా సాగు భూమి ఉన్న ప్రతి రైతు వివరాలను నమోదు చేసి 11 అంకెల ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్యను జారీ చేస్తారు. పీఎం కిసాన్‌తో పాటు భవిష్యత్తులో వివిధ పథకాలలో లబ్ధి పొందాలంటే ఈ సంఖ్య తప్పనిసరి కానుంది.

ప్రయోజనాలు ఇలా: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, పెట్టుబడి సహాయం, ఎరువుల రాయితీ, పంటల బీమా, పంట దిగుబడుల విక్రయాలతోటు బ్యాంకుల నుంచి వ్యవసాయ రుణాలు పొందడానికి ఫార్మర్ రిజిస్ట్రీ విశిష్ట సంఖ్య తప్పనిసరి కానుంది. ఈ నేపథ్యంలో అర్హత ఉన్న రైతులందరూ నమోదు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.


కాచవరంలో వివరాలు నమోదు చేస్తున్న గ్రామ వ్యవసాయ సహాయకులు రవీంద్రకుమార్

ఏం చేయాలంటే..: గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో ఫార్మర్ రిజిస్ట్రేషన్ నమోదు కార్యక్రమాన్ని గ్రామ వ్యవసాయ సహాయకులు చేస్తున్నారు. ఇబ్రహీంపట్నం మండలంలో 2,187 మంది రైతులకు గాను 1,502 మంది రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారు. ఆధార్‌కార్డు నంబర్, భూమి పట్టాదారు పాస్‌పుస్తకం వివరాలు, ఆధార్‌తో అనుసంధానించిన చరవాణి వివరాలు వ్యవసాయ సహాయకులకు అందిస్తే నమోదు చేస్తారు. అనంతరం ఆధార్‌తో అనుసంధానించి రైతు చరవాణికి 11 అంకెల ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య వస్తుంది. ఈ సంఖ్యతో మీ సేవా కేంద్రాలలో స్మార్టు కార్డును డౌన్‌లోడు చేయించుకోవచ్చు.

ప్రభుత్వ పథకాలకు ఫార్మర్ రిజిస్ట్రీ తప్పనిసరి

త్వరపడండి: రజనీ, ఇబ్రహీంపట్నం మండల వ్యవసాయాధికారి: ప్రభుత్వ పథకాలు వర్తింపజేసేందుకు ఫార్మర్ రిజిస్ట్రీ తప్పనిసరి. భవిష్యత్తులో దీనినే ప్రామాణికంగా తీసుకునే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో రైతులందరూ సకాలంలో నమోదు చేసుకోవడం ద్వారా పీఎం కిసాన్ నిధులు సైతం రైతుల ఖాతాలలో జమవుతాయి.

పాఠశాలకు కంప్యూటర్ వితరణ


పాఠశాల నిర్వాహకులకు కంప్యూటర్ అందిస్తున్న దాతలు

గొల్లపూడి, న్యూస్‌టుడే: గొల్లపూడిలోని బి.ఆర్.అంబేడ్కర్ విద్యా అకాడమీ పాఠశాల పూర్వవిద్యార్థులైన సోదరులు మిరియాల విజయ్, నరేంద్ర, రాకేష్‌లు తండ్రి చిన వెంకయ్య జ్ఞాపకార్థం పాఠశాలకు కంప్యూటర్‌ను వితరణగా గురువారం అందించారు. కార్యక్రమంలో అంబేడ్కర్ యువజన సంఘం సభ్యులు ఆర్.సత్యనారాయణ, ఆర్.గోపాలం, డి.నాగేశ్వరరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తరుణ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

'తెదేపాకు అండగా బీసీలు'


బీసీల ఆత్మగౌరవ సభలో మాట్లాడుతున్న ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణ


కార్యక్రమానికి హాజరైన ప్రజలు

కొండపల్లి, న్యూస్‌టుడే: బీసీలందరూ తెదేపాకే అండగా ఉన్నారన్న సంగతి వైకాపా నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారని మైలవరం నియోజకవర్గ బీసీ నాయకులు పేర్కొన్నారు. నియోజకవర్గ బీసీల ఆత్మగౌరవ సభను కొండపల్లిలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు బీసీ నాయకులు మాట్లాడుతూ సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌లపై ఇష్టానుసారంగా మాట్లాడితే సహించేది లేదన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణతో పాటు వివిధ కార్పొరేషన్ల ఛైర్మన్లు, డైరెక్టర్లు, ఇబ్రహీంపట్నం, జి.కొండూరు, మైలవరం, రెడ్డిగూడెం మండలాలతో పాటు గొల్లపూడి విజయవాడ రూరల్ ప్రాంతాలకు చెందిన బీసీ నాయకులు పాల్గొన్నారు.

జి.కొండూరు, న్యూస్‌టుడే: కొండపల్లిలో నిర్వహించిన బీసీల ఆత్మగౌరవ సభకు చెవుటూరు గ్రామం నుంచి గురువారం తెలుగు తమ్ముళ్లు తరలి వెళ్లారు. గొల్లపూడి వెంకటనారాయణ, ప్రత్తిపాటి ఆదాం, రామిశెట్టి స్వామి, యర్రంశెట్టి పుల్లారావు, చట్టు రవి, లింగాల రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

గొల్లపూడి, న్యూస్‌టుడే: కొండపల్లిలో జరిగిన బీసీల ఆత్మగౌరవ సభ కార్యక్రమానికి కొత్తూరు తాడేపల్లి గ్రామం నుంచి తెదేపా నాయకులు గురువారం బయలుదేరి వెళ్లారు. ఎస్సీ సెల్ నియోజకవర్గ కార్యదర్శి జమలయ్య, మార్కెట్‌యార్డు డైరెక్టర్ రామకృష్ణ, నాయకులు సింహాద్రి, రామోజీ తదితరులు పాల్గొన్నారు.


చెవుటూరులో... సభకు వెళ్తున్న శ్రేణులు


కొత్తూరుతాడేపల్లి నుంచి బయలుదేరిన తెదేపా నాయకులు

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన సాగు నీటి సంఘాల సమావేశానికి రెడ్డిగూడెం మండలం నుంచి సాగునీటి సంఘాల అధ్యక్షులు గురువారం బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా తెదేపా నాయకుడు ఎం.నాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ.. రైతుల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో తెదేపా మండల పార్టీ అధ్యక్షుడు జె.వేణుగోపాలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


రెడ్డిగూడెం నుంచి బయలు దేరిన నీటి సంఘాల అధ్యక్షులు



గంపలగూడెం మండలం నుంచి..

గంపలగూడెం, ఎ.కొండూరు, : అమరావతిలో గురువారం నిర్వహించిన 'నీటి సంరక్షణ-నీటి సంఘాల బాధ్యత' సమావేశానికి గంపలగూడెం, ఎ.కొండూరు మండలాలకు చెందిన సాగు నీటి సంఘాల అధ్యక్షులు, సభ్యులు తరలివెళ్లారు. సాగర్ కాల్వలు, చెరువులు, ఎత్తిపోతల పథకాలకు చెందిన సంఘాల నుంచి పెద్ద సంఖ్యలో వెళ్లగా వారు ఏర్పాటు చేసుకున్న వాహనాలకు తెదేపా నాయకులు జెండాలు ఊపి ప్రారంభించారు. సదస్సులో సీఎం చంద్రబాబు తమకు స్ఫూర్తిదాయకమైన సందేశమిచ్చారని, నీటి సంరక్షణలో తమ బాధ్యతలను వివరించారని సభ్యులు తెలిపారు.


సీఎం చంద్రబాబుతో కలిసి ప్రాజెక్టులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

గంపలగూడెం, న్యూస్‌టుడే: రాష్ట్ర రాజధాని అమరావతి పరేడ్ గ్రౌండ్‌లో గురువారం సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో తిరువూరు శాసనసభ్యులు కొలికపూడి శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎంతో కలిసి ప్రదర్శనలో ఏర్పాటు చేసిన పలు సాగునీటి ప్రాజెక్టులను ఆయన పరిశీలించారు

అల్లుకున్నాయ్.. అల్లాడిస్తున్నాయ్



మండల కేంద్రం విస్సన్నపేట గ్రంథాలయం ఏరియాలో విద్యుత్తు స్తంభాలకు పిచ్చి మొక్కల తీగలు అల్లుకుపోయాయి. దీంతో విద్యుత్తు సరఫరాలో తరుచూ హెచ్చుతగ్గులు వస్తుండడంతో గృహోపకరణాలు కాలిపోతున్నాయని నివాసితులు వాపోతున్నారు. సంబంధిత విద్యుత్తు శాఖాధికారులు గాని పంచాయతీ అధికారులు గాని సమస్యను చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ఎన్నిసార్లు చెప్పినా తమ మొర ఆలకించడం లేదని నివాసితులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా అల్లుకుపోయిన పిచ్చి మొక్కల తీగలను తొలగించాలని కోరుతున్నారు. -న్యూస్‌టుడే, విస్సన్నపేట

ఇటుకలతో పూడుస్తూ.. అవస్థల్లో వదిలేస్తూ..

విజయవాడ-విస్సన్నపేట ప్రధాన ఆర్‌అండ్‌బీ రహదారి వెల్లటూరు గ్రామంలో తీవ్ర దుస్థితికి చేరి రాకపోకలకు ప్రజలు అవస్థలు పడుతున్నారు. గత ఐదేళ్ల వైకాపా ప్రభుత్వం నిర్లక్ష్యమే ప్రస్తుత స్థితికి కారణమని స్థానికులు మండిపడుతున్నారు. నిత్యం వందల సంఖ్యలో వాహనాలు తిరిగే రహదారి తారు మొత్తం పోయి గుంతలు ఏర్పడడంతో వాహనదారులు పడుతూ లేస్తూ ప్రయాణిస్తున్నారు. అధికారులు తాత్కాలికంగా విరిగిన ఇటుకలు పోసి సర్దుబాటు చేస్తున్నారు తప్ప పూర్తి స్థాయిలో రహదారి అభివృద్ధి చేపట్టక పోవడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



- న్యూస్‌టుడే, జి.కొండూరు

స్పందించారు.. ఫాగింగ్ చేయించారు



కుంటముక్కల డా.బీఆర్.అంబేడ్కర్ గురుకులంలో విద్యార్థినులు దోమలతో అవస్థలు పడుతున్నామని ఇటీవల స్థానిక ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ గురుకులం సందర్శించిన సమయంలో తెలియజేయగా ఆయన స్పందించారు. స్థానిక ప్రజాప్రతినిధులను పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని ఆదేశించారు. దీంతో కుంటముక్కల పీఏసీఎస్ అధ్యక్షుడు సుఖవాసి శ్రీహరి సహకారంతో గురుకులం పరిసర ప్రాంతమంతా గురువారం సాయంత్రం ఫాగింగ్ చర్యలు చేపట్టారు. సమస్య పరిష్కారం కావడంతో విద్యార్థినులు హర్షం వ్యక్తం చేశారు. - న్యూస్‌టుడే, జి.కొండూరు

ఖోఖోలో ద్వితీయ స్థానం

మైలవరం: జేఎన్‌టీయూ కాకినాడ పరిధిలోని అంతర కళాశాలల సెంట్రల్ ఖోఖో పోటీల్లో స్థానిక లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటి, ద్వితీయ స్థానం సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ కె.అప్పారావు తెలిపారు. గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన పోటీల్లో ప్రతిభ చాటిన జట్టులోని ఎస్.హనుమానాయక్ (సివిల్), పి.భారవతేజ (మెకానికల్)లు విశ్వవిద్యాలయ జట్టుకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. విద్యార్థులను, పీడీలు రాజ్‌కుమార్, దుర్గారెడ్డి, ఎం.బేబీరాణిలను అధ్యక్షుడు జి.శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపల్, ఉప ప్రిన్సిపల్ రమేష్‌రెడ్డి, అధ్యాపకులు అభినందించారు.


విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ అప్పారావు

కార్మిక సమస్యల పరిష్కారానికి కృషి


సురేష్‌ను సత్కరిస్తున్న సంఘ నాయకులు

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం గ్రామీణం): కార్మిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ డిప్యూటీ డివిజనల్ సెక్రటరీ, గుంటుపల్లి వ్యాగన్ వర్క్‌షాపు శాఖ కార్యదర్శి గద్దా సురేష్ హామీ ఇచ్చారు. సౌత్ సెంట్రల్ రైల్వే జోనల్ స్థాయిలో సీఎస్‌బీఎఫ్ సభ్యులుగా ఎంపికైన ఆయనను గుంటుపల్లి రైల్వే వర్క్ షాపు కార్యాలయంలో బ్రాంచి అధ్యక్షుడు గూడవల్లి సుధాకర్ అధ్యక్షతన గురువారం జరిగిన కార్యక్రమంలో ఘనంగా సత్కరించారు. కార్యనిర్వాహక అధ్యక్షులు దాసరి డేవిడ్ రాజు, కోశాధికారి విమల్ సాయి, నాయకులు శివనాగేశ్వరరావు, మద్దయ్య, సుబ్రహ్మణ్యం బ్రాంచి కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మె విజయవంతానికి పిలుపు


సమ్మె గోడపత్రిక ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

మైలవరం, న్యూస్‌టుడే: ఈ నెల 12న నిర్వహిస్తున్న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పీవీ ఆంజనేయులు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు సీహెచ్ సుధాకర్ కోరారు. కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రికలను గురువారం స్థానిక సంఘ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, ఒప్పంద, పొరుగు సేవల ఉద్యోగులను పర్మినెంట్ చేయాలన్నారు. ఇతర సమస్యల పరిష్కారానికి సమ్మె చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు వజ్రాల వెంకటరెడ్డి, తిరుపతిరావు, చంటి, సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: లేబర్ కోడ్స్ రద్దుతో పాటు కార్మిక హక్కుల పరిరక్షణ కోసం సీఐటీయూ చేయనున్న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేద్దామని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ అన్నారు. ఫిబ్రవరి 12న నిర్వహించే దేశ వ్యాప్త సమ్మె పిలుపులో భాగంగా గోడ పత్రిక ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఇబ్రహీంపట్నంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కార్మికులను కట్టుబానిసలుగా మార్చే లేబర్ కోడ్స్‌ను రద్దు చేయడంతో పాటు కార్మిక హక్కుల పరిరక్షణ, కనీస వేతనం, పని భద్రత వంటి చట్టాలు పగడ్బందీగా నిర్వహించాలనే అంశాలపై సీఐటీయూ సమ్మెను నిర్వహిస్తుందన్నారు. పాత కార్మిక చట్టాలు తిరిగి అమల్లోకి వచ్చే వరకు పోరాటాలు సాగించాలని పేర్కొన్నారు. వాసుదేవన్, మహేష్, విఠలరావు, కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

విస్సన్నపేట, న్యూస్‌టుడే : కార్మికుల హక్కులను కాలరాస్తూ కేంద్ర ప్రభుత్వం తెచ్చిన చట్టాలను వ్యతిరేకిస్తూ, సమస్యల సాధనకై ఈ నెల 12న దేశవ్యాప్తంగా సీఐటీయూ ఆధ్వర్యంలో జరిగే సమ్మెకు మద్దతుగా కరపత్రాలను, పుస్తకాలను ప్రజలకు పంచుతూ గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో విస్సన్నపేటలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. సీఐటీయూ మండల కన్వీనర్ ఆకుల శ్రీనివాసరావు, నాయకులు పాల్గొన్నారు.

తిరువూరు న్యూస్‌టుడే: కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన లేబర్‌కోడ్స్‌ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం కార్యాలయంలో గురువారం గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ నెల 12న జరగనున్న దేశవ్యాప్త సమ్మెకు కార్మికులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

సమన్వయంతో తిరునాళ్ల నిర్వహిద్దాం


సూచనలిస్తున్న సీఐ గిరిబాబు, అధికారులు

విస్సన్నపేట, న్యూస్‌టుడే : సమన్వయంతో కొండపర్వ గట్టు తిరునాళ్లను నిర్వహిద్దామని తహసీల్దార్ కె లక్ష్మీ కల్యాణి, ఎంపీడీవో చేకు చినరాట్నాలు, తిరువూరు సీఐ గిరిబాబు, మండల మెడికల్ ఆఫీసర్ శ్రీనివాసరావు అన్నారు. ఈ నెల 15, 16, 17 తేదీల్లో జరగనున్న కొండపర్వ శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామి వారి కల్యాణ మహోత్సవ తిరునాళ్ల ఏర్పాట్లు గురించి గురువారం క్షేత్రస్థాయిలో పర్యటించి పలు శాఖల అధికారులు, గ్రామ పెద్దలతో జరిగిన సమన్వయ కమిటీ సమావేశంలో వారు పాల్గొన్నారు. మూడురోజులు పలు జిల్లాల నుంచి లక్ష మందికి పైగా భక్తులు పాల్గొనే తిరునాళ్లను సమన్వయంతో ప్రశాంతంగా నిర్వహించాలని తీర్మానించారు. కార్యక్రమంలో విస్సన్నపేట ఎస్సై అర్జున్‌రాజు, సామాజిక కార్యకర్త బొట్ల శివ సత్యనారాయణ, సర్పంచి జి.రమేష్, వైస్ ఎంపీపీ గాజుల శ్రీనివాసరావు, నాయకులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మీ విజయం స్ఫూర్తిగా నిలవాలి

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: మీ విజయం నేటి యువతకు స్ఫూర్తిగా నిలవాలని కొండపల్లి ఏబీఎం పేట పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్.సారథి డిప్యూటీ కలెక్టర్‌గా ఎంపికైన బి.నిఖిలశ్రీతో అన్నారు. ఇటీవల విడుదల చేసిన గ్రూప్స్ ఫలితాల్లో డిప్యూటీ కలెక్టర్‌గా ఎంపికైన బి.నిఖిలశ్రీని ఇబ్రహీంపట్నంలో గురువారం ఆయన మర్యాదపూర్వకంగా కలిసి అభినందించి సత్కరించారు. రానున్న రోజుల్లో డిప్యూటీ కలెక్టర్‌గా ప్రజలకు ఉత్తమ సేవలు అందించాలని కోరారు.

ప్రతి రైతు భూసార పరీక్షలు చేయించాలి


మాట్లాడుతున్న విజయబాబు, ఏవో శ్రీనివాసరావు, నరేంద్రకుమార్ తదితరులు

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: ప్రతి రైతు తమ పంట భూముల్లో మట్టి నమూనాలు సేకరించి భూసార పరీక్షలు చేయించాలని రెడ్డిగూడెం మండల వ్యవసాయ అధికారి డి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. గురువారం నాగులూరులో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో భూవాతావరణ స్థితిస్థాపకతపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పలు సూచనలు చేశారు. ఉద్యాన అధికారి నరేంద్ర కుమార్ మాట్లాడుతూ పురుగు మందులు అవసరం మేరకే వాడాలని తెలియజేశారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించి భూసారాన్ని పెంచాలని వివరించారు. తెదేపా నాయకుడు కె.విజయబాబు వ్యవసాయశాఖ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

రెడ్డిగూడెం: భూముల రీసర్వే జరిగిన కుదప, రుద్రవరం, పాత నాగులూరు గ్రామాల్లో రైతుల భూమి రికార్డుల ఆధారంగా పరిశీలించి నూతన పాస్‌పుస్తకాలు మంజూరు కోసం పరిశీలన నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ జె.సుశీలాదేవి తెలిపారు. గురువారం కుదప గ్రామ సచివాలయ వద్ద జరిగిన కార్యక్రమంలో తమ భూముల వివరాలు పరిశీలించుకున్నారు. ఫొటోలు లేనివారి ఫొటోలు, ఆధార్ ఈకేవైసీ చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ.జి.పుల్లయ్య, వీఆర్వో జ్యోతి, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

పాత చట్టం కొనసాగించాలని ధర్నా


తహసీల్దార్ అరవింద్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

ఎ.కొండూరు, న్యూస్‌టుడే: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కొనసాగించాలని కోరుతూ సీపీఎం నాయకులు పి.ఆనందరావు జె.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో గురువారం స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఉపాధి కూలీలకు ఏటా 200 రోజులు పని కల్పించాలని, రోజుకు రూ.600 వేతనం చెల్లించాలని కోరారు. తమ డిమాండ్ల వినతిపత్రాన్ని తహసీల్దార్ అరవింద్‌కు అందజేశారు.

విద్యుదాఘాతంతో కార్మికుడి మృతి

గొల్లపూడి, న్యూస్‌టుడే: విద్యుదాఘాతంతో కార్మికుడు చనిపోయినట్లు భవానీపురం పోలీసులు తెలిపారు. వారి వివరాల మేరకు.. గొల్లపూడి వస్త్రలతకాలనీ వద్ద విద్యుత్తు లైన్ల పనులను గురువారం సాయంత్రం పశ్చిమ బెంగాల్‌కు చెందిన నరేన్‌కుమార్(21), సుమన్‌కుమార్ తదితరులు చేస్తున్నారు. ఈ క్రమంలో ఒక్కసారిగా విద్యుత్తు సరఫరా అవడంతో నరేన్‌కుమార్, సుమన్‌కుమార్‌లు విద్యుదాఘాతానికి గురయ్యారు. వెంటనే స్థానికులు స్పందించి వారిద్దరినీ సమీపంలోని ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. ఈ క్రమంలో గాయాలు ఎక్కువగా అయిన నరేన్‌కుమార్ చికిత్స పొందుతూ చనిపోయాడు. సుమన్‌కుమార్‌కు స్వల్ప గాయాలు కావడంతో చికిత్స చేస్తున్నారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

భవానీపురం, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడినట్లు భవానీపురం పోలీసులు తెలిపారు. గొల్లపూడి శ్రీనివాసనగర్‌లో జి.సూరిరెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉంటున్నారు. ఈనెల 3న అతడి మావయ్య నాగరాజును రైల్వేస్టేషన్‌లో దింపేందుకు ద్విచక్రవాహనంపై బయలుదేరాడు. గొల్లపూడి వైజంక్షన్ వద్దకు వచ్చే సరికి వెనుక నుంచి వచ్చిన కారు ఢీకొనడంతో వారిద్దరూ కిందపడి గాయపడ్డారు. స్థానికులు వారిని సమీపంలోని ఆసుపత్రికి తీసుకువెళ్లగా వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పక్షం రోజులు యోగా తరగతులు

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: ఇబ్రహీంపట్నం ఎస్‌వీసీటీ కల్యాణ మండపంలో పక్షం రోజులు యోగా తరగతులు నిర్వహించనున్నట్లు శాంతివన్ ఫౌండేషన్ అధ్యక్షుడు ఎల్.జనార్దన్ తెలిపారు. ఉదయం, సాయంత్రం నిర్వహించే ఈ శిక్షణ తరగతుల్లో ఆసక్తి కలిగిన వారందరూ పాల్గొనవచ్చునని చెప్పారు.

ప్రవాసదారుల సాయం

శివరాత్రికి చకచకా ఏర్పాట్లు

మైలవరం, న్యూస్‌టుడే

ఆ గ్రామంలో.. సొంతూరికి కొంత మేలన్న నానుడి పనిచేయదు. ఎందుకంటే ప్రవాసుల సాయం అంతకుమించి ఉంటుంది. ఇప్పటి వరకు బడులు, గుడులు, అంతర్గత రహదారులకు రూ.కోట్లు వెచ్చించగా, తాజాగా మహాశివరాత్రి సంబరాలకు రవాణా సౌకర్యం మెరుగుదలకు మరింత సాయమందించడమే అందుకు నిదర్శనం.

సుమారు లక్ష మంది రాక.. : మినీ అమెరికాగా పిలుచుకునే మండలంలోని వెల్వడంలో మహాశివరాత్రి వేడుకలను అక్కడి బాలకోటేశ్వరస్వామి ఆలయంలో మూడ్రోజుల పాటు వైభవంగా నిర్వహిస్తారు. దాదాపు లక్ష మందికి పైగా భక్తులు అక్కడకు వచ్చి, వివిధ కార్యక్రమాలు, పూజల్లో పాల్గొంటారు. దాదాపు నాలుగు దశాబ్దాల కిందట నుంచే వేడుకలు నిర్వహిస్తుండగా, ప్రతి ఏటా ఊరి చివరన గల శివాలయానికి వెళ్లేందుకు కలిగే రవాణా ఆటంకాలపై అక్కడి ప్రవాస భారతీయులు దృష్టి సారించారు. అందులో భాగంగా రద్దీని అధిగమించి, ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి సరికొత్త దారులను ఆధునికీకరించారు.


చెరువు కట్టపై వేసిన తారు రోడ్డు

రూ.కోటికి పైగా ఖర్చు

వెల్వడం ప్రధాన కూడలి మీదుగానే శివాలయానికి రాకపోకలు సాగిస్తుంటే, వేలాదిగా వచ్చే వాహనాలు ట్రాఫిక్‌లో ఇరుక్కోవడం, సరిదిద్దడానికి పోలీసులకు తలకు మించిన భారంగా మారుతోంది. దాంతో వరవకట్టను ఆధునికీకరిస్తే వన్‌వేగా రాకపోకలకు వీలుంటుందన్న సూచనలతో విద్యాదాతగా పేరొందిన డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి చెరువు కట్ట నుంచి దాదాపు 800 మీటర్ల వరకు సీసీ రహదారిని తాజాగా అభివృద్ధి చేశారు. పక్కా డ్రెయినులు నిర్మిస్తుంటే, సుమారు రూ.1 కోటి వరకు వ్యయమవుతోందని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల గణతంత్ర వేడుకల్లో ఉత్తమ మార్గదర్శిగా ఆయనకు ప్రభుత్వం అవార్డు అందజేసింది. మరో ప్రవాస భారతీయుడు లకిరెడ్డి పుల్లారెడ్డి పెద్ద మొత్తంలో నిధులు వెచ్చించి, సీసీ రహదారి వరకు అనుసంధానంగా కట్టపై తారు రోడ్డును అభివృద్ధి చేశారు. దాంతో ప్రత్యామ్నాయ రహదారి సౌకర్యవంతంగా మారటంతో, శివరాత్రి ఉత్సవాల ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం దొరికినట్లేనని పోలీసులు భావిస్తున్నారు.



సీఎం క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు. చిత్రంలో పయ్యావుల కేశవ్, పల్లా శ్రీనివాసరావు, పీవీఎన్ మాధవ్, పవన్ కల్యాణ్, లోకేశ్, సత్యకుమార్, ఆనం రామనారాయణరెడ్డి, కొలుసు పార్థసారథి

నెయ్యి కల్తీ.. పక్కా ఆన్ రికార్డ్

- గొడ్డు, పందికొవ్వు ఉందని ఎన్‌డీడీబీ నివేదికలో ఉంది
- మరి వైకాపా నేతలకు క్లీన్‌చిట్ ఇచ్చిందెక్కడ?
- ఈ కుంభకోణంతో ప్రమేయమున్న ఎవరినీ వదిలిపెట్టం
- సున్నితమైన అంశమని తెలిసినా, ప్రజల ముందుకు తెచ్చాం
- ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్



'పాలు వాడకుండా తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీకి ఆవునెయ్యి అంటూ 59.70 లక్షల కిలోలు సరఫరా చేశారు. దీని తయారీకి 58 లక్షల కిలోల పామోలిన్, పామ్‌కెర్నల్ ఆయిల్స్, సుమారు 1.70 లక్షల కిలోల రసాయనాలు వాడారు. ఇవన్నీ ఆన్‌రికార్డ్. సిట్ ఆధారాలు కూడా సేకరించింది. మరి కల్తీయే లేదని క్లీన్‌చిట్ ఇచ్చిందెక్కడ?'

– ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

ఈనాడు, అమరావతి: తిరుమలలో శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీకి కల్తీ నెయ్యి సరఫరాలో ప్రమేయమున్న ఎవరినీ వదిలిపెట్టబోమని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హెచ్చరించారు. వారంతా స్వామివారి ముందు మోకరిల్లి తమ తప్పులకు క్షమాపణ కోరేవరకు యుద్ధం కొనసాగుతుందని స్పష్టంచేశారు. ఏడుకొండల వాడికి రెండు కొండలు చాలనే ఆలోచనా ధోరణి నుంచి వైకాపా నాయకులు పుట్టారని, వారు ఏ స్థాయికైనా దిగజారతారని దుయ్యబట్టారు. ఉండవల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో పవన్ కల్యాణ్ మాట్లాడారు. 'సీబీఐ ఛార్జ్‌షీట్ రావడానికి సమయం పట్టవచ్చు. దోషులను వదలిపెట్టం. తప్పులు చేసి ఏమీ జరగలేదని బుకాయిస్తున్నారు. హిందువుల విశ్వాసాల్ని దెబ్బతీసేలా వ్యవహరిస్తున్నారు' అని పవన్ పేర్కొన్నారు.

అన్నీ ఆలోచించాకే మాట్లాడాం

'మతం, విశ్వాసం, ధర్మం చాలా లోతైనవి. వాటి విషయంలో స్పందిస్తే పర్యవసానాలు ఎలా ఉంటాయో ఆలోచించాకే మాట్లాడాలి. శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీకి కల్తీ నెయ్యి సరఫరా చేశారని తెలిశాక, దాన్ని ప్రజలకు చెప్పకపోతే తప్పే అవుతుంది. ఇటీవల ఎన్డీయే ఎమ్మెల్యేల సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్‌డీడీబీ నివేదిక చదివి విన్పించారు. నెయ్యి నమూనాల్లో వెజిటబుల్ ఆయిల్స్, ఫిష్ ఆయిల్‌తో పాటు గొడ్డు, పందికొవ్వు కలిసినట్లు నివేదికలో ఉంది. ఇది సున్నితమైన అంశం కావడంతో బయటకు చెప్పాలా, వద్దా అని ఆలోచించాం. కల్తీ నెయ్యిపై కళ్లముందు నివేదికలున్నా మేం మాట్లాడకపోతే.. అందరికీ తెలిసీ ఎందుకు చెప్పలేదనే ప్రశ్నలు ఎదుర్కోవాలి. కొందరు దీన్ని కూడా అనుకూలంగా మలచుకునేందుకు, రాజకీయ లబ్ధికి ప్రయత్నిస్తారని తెలుసు. అన్నీ ఆలోచించాకే కల్తీ వ్యవహారాన్ని బయటపెట్టామ'ని పవన్ వివరించారు. 'ఎన్నికలకు ముందు ఆరు నెలలంటే రాజకీయ లబ్ధికి అనుకోవచ్చు. ఐదేళ్లూ మేమే అధికారంలో ఉంటాం. ఇప్పుడు దీనివల్ల రాజకీయంగా వచ్చేది ఏముంటుంది' అని ప్రశ్నించారు.

నెయ్యే లేదని సీబీఐ స్పష్టంగా చెప్పింది

సరఫరా చేసిన పదార్థంలో నెయ్యి అనేదే లేదని, దానితోనే లడ్డూలు తయారు చేశారని సిట్ స్పష్టంగా చెప్పిందని పవన్‌కల్యాణ్ గుర్తుచేశారు. అయినా నెయ్యిలో కల్తీయే లేదని క్లీన్‌చిట్ ఇచ్చిందంటూ వైకాపా నేతలు ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. నెయ్యి నమూనాల్లో పంది, గొడ్డు కొవ్వు, ఫిష్ ఆయిల్ ఉండే అవకాశాలున్నాయని ఎన్‌డీడీబీ సీఏఎల్ఎఫ్ ల్యాబ్ స్పష్టంగా చెప్పిందని గుర్తుచేశారు. 'అసలు దీన్ని నెయ్యి అనకూడదు. పామోలిన్ అనాలి. దానితోనే కోట్ల కొద్దీ లడ్డూలు చేశారు. తెలిసీ తప్పు చేసి, తిరిగి మాపైనే ఎదురుదాడి చేస్తున్నారు. మమ్మల్నే క్షమాపణ చెప్పాలనడమేంట'ని పవన్ ఆగ్రహించారు. 2022లోనే నెయ్యి కల్తీపై నివేదిక వచ్చిందని, నాటి ఛైర్మన్, అధికారులు దాన్ని ఎందుకు తొక్కిపెట్టారో చెప్పాలని డిమాండ్‌చేశారు. కల్తీ నెయ్యి అని తెలిసీ ఆ లడ్డూలు అయోధ్యకు పంపారని చెప్పారు.

వైకాపా వారసత్వమేంటో చూడండి

వైకాపా వారసత్వం ఎలాంటిదో ప్రజలు తెలుసుకోవాలని పవన్‌కల్యాణ్ కోరారు. 'రామతీర్థంలో శ్రీరాముడి విగ్రహ శిరచ్ఛేదం చేసినా, అంతర్వేదిలో రథం కాలినా ఆకతాయి చేష్టగా కొట్టిపారేశారు. దుర్గగుడిలో వెండి విగ్రహాలు చోరీ అయితే.. వాటితో మేడలు, మిద్దెలు కడతామా అన్నారు. వైకాపా పాలనలో రాష్ట్రవ్యాప్తంగా 219 చోట్ల ఇలాంటి ఘటనలు జరిగాయి' అని గుర్తుచేశారు. '2019లో బహిరంగ మార్కెట్లో నెయ్యి ధర కిలో రూ.420 ఉండేది. 2020 నాటికి రూ.500కు పెరిగింది. అలాంటిది రూ.319, రూ.329కి కిలో చొప్పున ఎలా సరఫరా చేశారు? ఇంట్లోని మహిళల్ని అడిగినా ఇది కల్తీ నెయ్యి అనే చెబుతారు. బుకాయించినంత మాత్రాన తప్పులు దాచలేరు' అని పవన్ ఆగ్రహించారు. కల్తీ నెయ్యి పంపిన భోలేబాబా, ఇతర డెయిరీలు హిందువులకే చెందినవని, ఇది మతాల వ్యవహారం కాదని వ్యాఖ్యానించారు. ఇందులో ఇస్లాం, క్రిస్టియన్ ఇతర మతాలకు సంబంధం లేదని, వారి విశ్వాసాల్ని కించపరచడం లేదని పవన్ వివరించారు.

జంతుకొవ్వుతోనే ఎసిటిక్ యాసిడ్, ఈస్టర్స్, మోనోగ్లిజరైడ్స్ ఉత్పత్తి

- కొరియా నుంచి ఆయా రసాయనాల దిగుమతి
- మంత్రి పయ్యావుల



ఈనాడు, అమరావతి: వైకాపా హయాంలో తితిదేకి సరఫరా చేసిన కల్తీ నెయ్యి తయారీ కోసం వినియోగించిన ఎసిటిక్ ఆమ్లం, ఈస్టర్స్, మోనోగ్లిజరైడ్స్‌ను ఉత్పత్తి చేసేందుకు ఆయిల్ లేదా జంతుకొవ్వు వినియోగిస్తారని నిపుణులు చెబుతున్నారని, వాటిని కొరియా నుంచి కొనుగోలు చేస్తారని ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. ఆయిల్‌తో పోలిస్తే మార్కెట్లో జంతుకొవ్వుతో తయారైన వాటి ధర తక్కువగా ఉంటుందని స్పష్టం చేశారు. సీబీఐ బృందంలోని సిట్ ఈ కోణంలో అసలు విచారణ చేయలేదని.. లేదా.. అదేది తెలియాల్సి ఉందన్నారు. కల్తీ నెయ్యి వ్యవహారంపై సీఎం క్యాంపు కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'నెయ్యి పేరుకోవడం లేదని, నూనెలా జారిపోతోందని.. అందులో నెయ్యి లక్షణాలే లేవని 2023లోనే అప్పటి ఈవో ధర్మారెడ్డికి పోటు కార్మికులు ఫిర్యాదు చేశారు. అది ఆర్గానిక్ నెయ్యి అని.. అలాగే ఉంటుందని ఆయన చెప్పారని గతంలో పత్రికల్లో వచ్చింది' అని గుర్తుచేశారు. 'నెయ్యి కల్తీ జరిగిందని 2022 ఆగస్టులో సీఎఫ్‌టీఆర్ఐ రిపోర్టు వెల్లడించింది. అందులో బీటాసిటోస్టెరాల్ పాజిటివ్ అని వచ్చింది. ఈ విషయాన్ని అప్పటి పాలకమండలి ఛైర్మన్ సుబ్బారెడ్డి దృష్టికి తీసుకెళ్లినా.. చర్యలు తీసుకోలేదని, సిట్ నమోదు చేసిన కేసులో నిందితుడైన ఒకరు చెప్పారు. ఛైర్మన్ అప్పుడే చర్యలు తీసుకుంటే నెయ్యి కల్తీకి అడ్డుకట్ట పడేది. కానీ తొక్కిపెట్టారు. 2024 వరకు కల్తీ నెయ్యి సరఫరా కొనసాగిందనేందుకు ఎన్‌డీడీబీ సీఏఎల్ఎఫ్ ల్యాబ్ రిపోర్టు నిదర్శనం' అని వెల్లడించారు.

తమకు పరీక్షించే సామర్థ్యం లేదన్న ఎన్‌డీఆర్ఐ..

'నెయ్యి నమూనాల పరీక్షలకు సంబంధించి ఐసీఏఆర్ ఎన్‌డీఆర్ఐ ల్యాబ్ ఇచ్చిన కవరింగ్ లెటర్‌లో 'మా సొంత మెథడాలజీతో మేము దీన్ని పరీక్షించాం. ఇది సాధారణంగా ప్రోటోకాల్ ఉండే విధానం కాదు. మూడో పార్టీ వ్యాలిడేషన్ జరిగే వరకు జరగలేదు. పెండింగ్‌లో ఉంది. వాణిజ్యరంగా ఎక్కడా పరీక్షలు చేయడం లేదు' అని పేర్కొంది. 'జంతుకొవ్వు, ఫిష్ ఆయిల్‌ను పరీక్షించే సామర్థ్యం మాకు లేదు' అని స్పష్టంగా చెప్పింది. అయినా వైకాపా నాయకులు ఎన్‌డీఆర్ఐ క్లీన్‌చిట్ ఇచ్చిందని ప్రచారం చేసుకుంటున్నారు. ఎన్‌డీడీబీ సీఏఎల్ఎఫ్ ల్యాబ్ ఇచ్చిన నివేదికలో జంతుకొవ్వు కలిసే అవకాశం ఉందని స్పష్టంగా ఉంది. నెయ్యి కల్తీ జరిగిందని 2022లోనే సీఎఫ్‌టీఆర్ఐ నివేదిక వచ్చినా.. దాన్ని తొక్కిపెట్టారు. తమకు పరీక్షలు చేసే సామర్థ్యం లేదన్న ఎన్‌డీఆర్ఐ నివేదికనే పట్టుకుని జగన్ మాట్లాడుతున్నారు' అని కేశవ్ మండిపడ్డారు. 'ఎన్‌డీఆర్ఐ (నేషనల్ డెయిరీ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్) నివేదికను వైకాపా నాయకులు ప్రస్తావిస్తున్నారు. తితిదే నియమించిన ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీలోని జయరాజారావు, సురేంద్రనాథ్ అనే ఇద్దరూ ఎస్వీఆర్‌లో పనిచేసేవారే. వారే ఇప్పుడు కల్తీ నెయ్యి కేసులో నిందితులుగా ఉన్నారు. వారే డెయిరీ ప్లాంట్లు అద్భుతంగా పని చేస్తున్నాయని ధ్రువీకరించారు' అని వివరించారు.

వారంతా కుట్రలో భాగస్వాములే..

'విచారణలో భాగంగా వైవీ సుబ్బారెడ్డి పీఏ చిన్నప్పన్న పేరు వచ్చింది. భోలేబాబా డెయిరీ నుంచి ఆయన కిలోకు రూ.25 చొప్పున డిమాండు చేశారు. వాళ్లు తిరస్కరించడంతో పోటీ సంస్థ నుంచి సరఫరా జరిగేలా చూశారు. తమ దారిలోకి వచ్చాక సంప్రదింపులు చేశారు. భోలేబాబా ఒక్క సంస్థ ఆధ్వర్యంలో పాల్గొనకుండా కాబట్టే.. ప్రత్యామ్నాయంగా వీరే ఏఆర్ డెయిరీ, వైష్ణవి డెయిరీ అనే సంస్థల్ని తీసుకొచ్చారు. వారికి దారి కూడా సూచించారు. నిబంధనలు సరళతరం చేశారు. నిర్వహణ అనుభవాన్ని మూడేళ్ల నుంచి ఏడాదికి, టర్నోవర్‌ను రూ.150 కోట్లకు తగ్గించడంతో పాటు పాల సేకరణ నిబంధన తొలగించారు. ఇందులో ఈవో, జేఈవో, ఛైర్మన్, వారికి సహకరించిన కొనుగోలు కమిటీ సభ్యులు కావచ్చు. అందరూ కుట్రలో భాగస్వాములు' అని మంత్రి కేశవ్ స్పష్టం చేశారు. 'భోలేబాబా డెయిరీ నుంచి కిలో రూ.355 చొప్పున ఏఆర్ డెయిరీ నెయ్యి కొనుగోలు చేసింది. తితిదేకు కిలో రూ.319 చొప్పున అంటే రూ.36 నష్టానికి సరఫరా చేసింది' అని వివరించారు.

పాలే సేకరించని డెయిరీ నుంచి లక్షల లీటర్ల నెయ్యి ఎలా?

- వైకాపా హయాంలో సింథటిక్ నెయ్యితో శ్రీవారి లడ్డూ
- భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్



ఈనాడు, అమరావతి: పాల సేకరణే చేయని డెయిరీ లక్షల లీటర్ల నెయ్యి ఎలా సరఫరా చేస్తుందని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ప్రశ్నించారు. తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీకి కల్తీ నెయ్యి సరఫరా వ్యవహారంలో.. వైకాపా నేతలు తమకు తామే క్లీన్‌చిట్ ఇచ్చుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సింథటిక్ నెయ్యితో లడ్డూలు తయారు చేసి ప్రజారోగ్యంతో ఆడుకున్నారని దుయ్యబట్టారు. ఉండవల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రవ్యాప్తంగా 200 పైగా దేవాలయాలపై దాడులు జరిగాయి. అప్పటి డీజీపీ కూడా వైకాపా కండువా వేసుకుని.. అవన్నీ తెదేపా, భాజపా, ఆరెస్సెస్‌పైకి నెట్టేశారు. గత పాలకులు దేవాలయాల్లో అన్యమతస్థుల ప్రాబల్యం పెంచి, దాన్ని ఓటు బ్యాంకుగా మార్చుకోవాలనే ఆలోచన చేశారు. ఆగమాలు, సేవలకు భగ్నం కలిగించేలా నిబంధనలు కాలరాశారు. పవిత్రమైన శ్రీవారి లడ్డూ ప్రసాదాన్నీ వదల్లేదు. కేజీ రూ.319 చొప్పున నెయ్యి వచ్చే అవకాశం ఎక్కడైనా ఉందా.. దాన్ని నెయ్యి అంటారా?

మీ పత్రిక చెప్పే అబద్ధాలకు క్షమాపణ చెప్పాలా?

బేషరతుగా క్షమాపణ చెప్పాలని జగన్ అడుగుతున్నారు ఎందుకు? ల్యాబ్ నివేదిక పక్కన పెట్టి మీ పత్రిక చెప్పిన అబద్ధాల నివేదికలకా? నాణ్యమైన నెయ్యికి బదులు సింథటిక్ నెయ్యి వాడినందుకా? రూ.250 కోట్లకు పైగా చేతులు మారినందుకా? నిబంధనలు పక్కన పెట్టి 58 లక్షల కిలోల నెయ్యే కాని నెయ్యిని అక్రమ మార్గంలో తెచ్చినందుకా? అన్యమతస్థుల్ని ఛైర్మన్, ఉద్యోగులుగా పెట్టినందుకా?' అని ప్రశ్నలు గుప్పించారు.

తితిదే డెయిరీ ఏర్పాటుకు ఆదేశించండి

సీజేఐని కోరిన యుగ తులసి ఫౌండేషన్ ఛైర్మన్ శివకుమార్

హైదరాబాద్, న్యూస్‌టుడే: తిరుమల లడ్డూ ప్రసాదం వివాద పరిష్కారానికి, ఆగమ శాస్త్రం ప్రకారం పవిత్రత కాపాడేందుకు తితిదే ఆధ్వర్యంలో మెగా డెయిరీ ఏర్పాటుకు ఆదేశించాలని, ఈ అంశాన్ని సుమోటోగా విచారించాలని యుగ తులసి ఫౌండేషన్ ఛైర్మన్, తితిదే బోర్డు మాజీ సభ్యుడు కె.శివకుమార్.. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ)కి లేఖ రాశారు. ఆ వివరాలను గురువారం ఆయన రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం జాఫర్‌గూడలోని యుగ తులసి గోశాలలో వెల్లడించారు. "సిట్ నివేదికపై ఏపీలోని అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య కీచులాటను ప్రస్తావిస్తూ.. శాశ్వత పరిష్కారానికి సుప్రీంకోర్టు విచారించి చర్యలు చేపట్టాలని కోరా. భక్తులు విరాళంగా ఇచ్చిన గోవులతో తితిదే ఆధ్వర్యంలో మెగా డెయిరీ ఏర్పాటు చేస్తే ప్రసాదం తయారీకి అవసరమైన స్వచ్ఛమైన నెయ్యి కోసం ఇతరులపై ఆధారపడే పరిస్థితి ఉండదని లేఖలో తెలిపా'' అని వివరించారు.

వెంకన్నకు మకిలి అంటించే మహాకుట్ర

(మొదటి పేజీ తరువాయి)

అడ్డగోలుగా మార్చేశారని, కొనుగోళ్ల కమిటీలో వాళ్ల మనుషుల్ని పెట్టుకుని అరాచకాలకు పాల్పడ్డారని ధ్వజమెత్తారు. కల్తీ నెయ్యి సరఫరా చేసిన డెయిరీలు అప్పటి ఛైర్మన్ పీఏకి రూ.4.68 కోట్లు కమీషన్ ముట్టజెప్పాయని సిట్ తేల్చిందన్నారు. కల్తీ నెయ్యి సరఫరాకు సంబంధించిన అన్ని పత్రాలు, ఆధారాలు, సిట్ ఛార్జిషీట్ ప్రజల ముందు పెడతామని, వారు దానిపై చర్చించాలన్నారు. గురువారం ఉండవల్లిలోని నివాసంలో ఎన్డీయే మిత్రపక్షాల నేతలతో సమావేశం అనంతరం చంద్రబాబు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, మంత్రులు లోకేశ్, పయ్యావుల కేశవ్, ఆనం రామనారాయణరెడ్డి, పార్థసారథి, సత్యకుమార్ యాదవ్, తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావులతో కలిసి విలేకర్లతో మాట్లాడారు. 'వైకాపా నాయకులకు దేవుడిపై నమ్మకం లేకపోతే ఆ జోలికి రాకూడదు. అంతే తప్ప భక్తుల మనోభావాల్ని, దేవుడి పవిత్రతను దెబ్బతీయాలనుకోవడం దుర్మార్గం. దేవదేవుడైన వెంకన్న సన్నిధిలో వైకాపా నాయకులు ఘోరమైన అపచారాలు చేశారు. పరకామణిలో దొంగతనం జరిగితే దొంగను శిక్షించకుండా సెటిల్మెంట్ చేశారు. చేసిన దుర్మార్గాలన్నీ బయటపడేసరికి వాటిని అడ్డగోలుగా సమర్థించుకోవడమే కాకుండా, బూతులతో ఎదురుదాడి చేస్తున్నారు. ఇంత మహాపాపానికి ఒడిగట్టినవారికి ఎలాంటి శిక్ష వేయాలో దేవుడే నిర్ణయిస్తాడు' అని పేర్కొన్నారు.

జంతుకొవ్వు కలిసే అవకాశాలు ఉన్నాయని ఎన్‌డీడీబీ చెప్పింది

తితిదేకి సరఫరా చేసిన నెయ్యిలో జంతువుల కొవ్వు కలవలేదని సిట్ తేల్చేసిందని జగన్ అంటున్నారు కదా? అన్న ప్రశ్నకు 'జంతువుల కొవ్వు లేదని ఎక్కడుంది? ఆయనకెవరైనా రహస్యంగా చెప్పారా? రాత్రి ఏమైనా కలొచ్చిందా' అని సీఎం మండిపడ్డారు. నెయ్యిలో కల్తీ జరగలేదని సిట్ రిపోర్టులో ఎక్కడా చెప్పలేదన్నారు. జంతువుల కొవ్వు కలిసేందుకు అవకాశముందని ఎన్‌డీడీబీ నివేదిక చాలా స్పష్టంగా పేర్కొందని తెలిపారు. కర్నాల్‌లోని ఎన్‌డీఆర్ఐ ల్యాబ్ కూడా ఆ నెయ్యిలో జంతు కొవ్వులు కలిసేందుకు ఉన్న అవకాశాన్ని తోసిపుచ్చలేమని, ఆ పరీక్షలు చేసే టెక్నాలజీ తమ దగ్గర లేదని చెప్పిందని గుర్తుచేశారు. వైకాపా హయాంలో శ్రీశైలంలో కూడా ప్రసాదాలకు కల్తీ నెయ్యి వాడారని వార్తలొస్తున్నాయి కదా అని విలేకర్లు ప్రశ్నించగా.. వైకాపా హయాంలో 10 దేవాలయాల్లో ఇలా అపవిత్రం చేశారన్నారు. కరడుగట్టిన నేరస్థుల మాదిరిగా జగన్ అబద్ధాలతో నమ్మించే ప్రయత్నం చేస్తున్నారని చంద్రబాబు మండిపడ్డారు. రసాయనాలతోనే నెయ్యి తయారుచేశారని, అందులో నెయ్యే లేదని సిట్ తేల్చింది కదా, ఈ మహాపాపానికి మీరు లెంపలేసుకుని దేవుడికి క్షమాపణ చెప్పక్కర్లేదా అని ప్రశ్నించారు.

నివేదికను ఎందుకు తొక్కిపెట్టారు?

'నెయ్యిలో కల్తీ జరిగిందని 2022లో వైకాపా ప్రభుత్వ హయాంలోనే మైసూరులోని సీఎఫ్‌టీఆర్ఐ ల్యాబ్ నిర్ధారించింది. ఆ రోజే కల్తీ నివారణకు చర్యలు తీసుకుని ఉండొచ్చు. కానీ వారు కల్తీ నెయ్యితో ప్రసాదాలు తయారు చేయాలనుకున్నారు కాబట్టే ఆ నివేదికను తొక్కిపెట్టారు. రాబోయే రోజుల్లో సిట్ రిపోర్టుల్లో మరిన్ని విషయాలు బయటకు వస్తాయి' అని సీఎం పేర్కొన్నారు.

వేంకటేశ్వరస్వామే మాకీ బాధ్యత అప్పగించారు

తిరుమల పవిత్రతను కాపాడాల్సిన బాధ్యత ఆ వేంకటేశ్వరస్వామే తమకు అప్పగించారని, ఈ విషయమై ఈ రోజు తాను, పవన్ కల్యాణ్, మాధవ్ కూర్చుని భవిష్యత్ కార్యాచరణపై చర్చించామని చంద్రబాబు చెప్పారు. కల్తీ నెయ్యిపై భాజపా ఎందుకు గట్టిగా మాట్లాడటం లేదని విలేకర్ల ప్రశ్నకు మాట్లాడకపోవడం ఏమీ లేదని.. మిగతా మంత్రులతో కలిసి మంత్రి సత్యకుమార్ యాదవ్ విలేకర్ల సమావేశంలో మాట్లాడారని సీఎం తెలిపారు.

ఏకసభ్య కమిటీ సిఫార్సుల ఆధారంగా చర్యలు

'తాము దేవుడి పవిత్రతను కూడా కాపాడలేని అసమర్థులం కాదని, వైకాపా దాడి చేసినా దులిపేసుకోవడానికో, పారిపోవడానికో సిద్ధంగా లేమని చంద్రబాబు స్పష్టం చేశారు. తిరుమలలో మరోసారి అలాంటి అపచారం జరగకుండా అన్ని చర్యలూ తీసుకుంటామన్నారు. కల్తీ నెయ్యి కుంభకోణంలో దోషుల్ని శిక్షిస్తామన్నారు. 'బాధ్యులైన అధికారులపై పాలనాపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి సిట్ నివేదిక పంపింది. ఏకసభ్య కమిటీని నియమించి, ఎక్కడెక్కడ లోపాలు జరిగాయో విశ్లేషించి, చర్యలు ప్రారంభిస్తాం' అని తెలిపారు. అసలు సూత్రధారులెవరో సిట్ నిగ్గు తేల్చలేదు కదా అన్న ప్రశ్నకు.. 'దర్యాప్తు సంస్థలు కొన్ని విషయాలు బయటపెడతాయి. కోర్టులో అదనపు సమాచారం ఫైల్ చేయొచ్చు. అవసరమైన అన్ని మార్గాలూ పరిశీలిస్తాం. దోషులు తప్పించుకోకుండా చూస్తాం' అని తెలిపారు.

'కల్తీ నెయ్యి'పై సమన్వయానికి..

కూటమి పార్టీల త్రిసభ్య కమిటీ

ఈనాడు, అమరావతి: తితిదేకి కల్తీ నెయ్యి సరఫరా వ్యవహారంపై కూటమి పార్టీల మధ్య సమన్వయానికి త్రిసభ్య కమిటీని నియమించాలని నిర్ణయించారు. గురువారం ఉదయం సీఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన రెండు గంటల పాటు సాగిన కూటమి నేతల భేటీలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మంత్రులు లోకేశ్, పయ్యావుల కేశవ్, ఆనం రామనారాయణరెడ్డి, సత్యకుమార్ యాదవ్, పార్థసారథి పాల్గొన్నారు. మంత్రులు కేశవ్, సత్యకుమార్, కందుల దుర్గేశ్‌లతో కమిటీ వేయాలని తొలుత నిర్ణయించారు. అయితే, ఈ నెల 11 నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం అవుతున్నందున మంత్రులు బిజీగా ఉంటారన్న ఉద్దేశంతో ఆ ప్రతిపాదన విరమించుకున్నారు. తెదేపా నుంచి ముఖ్యమంత్రి కార్యక్రమాల సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్సీ సత్యనారాయణరాజు పేరును నిర్ణయించారు. జనసేన, భాజపాల నుంచి కమిటీలోకి ఎవరిని తీసుకుంటారన్నది శుక్రవారానికి స్పష్టత వస్తుంది.

నిందితులను వదలొద్దని నిర్ణయం: కల్తీ నెయ్యి కేసులో ప్రభుత్వం చేపట్టాల్సిన చర్యలు, భవిష్యత్ కార్యాచరణపై సుదీర్ఘంగా చర్చించారు. నిందితులు తప్పించుకోకుండా ప్రభుత్వ పరంగా అన్ని చర్యలూ పక్కాగా చేపట్టాలన్న అభిప్రాయం వ్యక్తమైంది. వైకాపా నాయకుల ఎదురుదాడిని మూడు పార్టీలూ సమన్వయంతో తిప్పికొట్టాలని, వైకాపా ప్రభుత్వ హయాంలో తిరుమలలో జరిగిన మహాపచారాన్ని వివిధ వేదికలపై ఎండగట్టాలని నిర్ణయించారు.

కల్తీ నెయ్యి వ్యవహారం.. మార్కెటింగ్ శాఖ ఉద్యోగి తొలగింపునకు నోటీసులు

ఈనాడు– తిరుపతి, న్యూస్‌టుడే, తిరుపతి(నగరం): తిరుమల లడ్డూ తయారీకి కల్తీ నెయ్యి సరఫరా చేసినట్లు వచ్చిన ఆరోపణల్లో బాధ్యులైన అధికారులు, ఉద్యోగులు, సిబ్బందిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవడం ప్రారంభించింది. తిరుపతి జిల్లా తిరుచానూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో ఒప్పంద వాచ్‌మన్ అయిన టి.రాధాకృష్ణకు మార్కెటింగ్ శాఖ జేడీ రామాంజనేయులు బుధవారం నోటీసులిచ్చారు. ఇతను భోలేబాబా డెయిరీ నెయ్యి ట్యాంకర్లను తిరుమలకు సరఫరా చేసేటప్పుడు అలిపిరి వద్ద లారీని ఆపి పలుమార్లు రూ.3.80 లక్షలు లంచంగా తీసుకున్నాడు. అతనిపై చర్యలకు సిట్ సిఫార్సు చేసింది. ఈ నేపథ్యంలోనే ఉద్యోగం నుంచి ఎందుకు తొలగించకూడదో వారం రోజుల్లో వివరణ ఇవ్వాలని రాధాకృష్ణను మార్కెటింగ్ శాఖ జేడీ ఆదేశించారు. పెళ్లకూరు మండలం పునబాకలోని వైష్ణవి డెయిరీ భోలేబాబా నుంచి వచ్చిన కల్తీ నెయ్యిని తిరుమలకు పంపింది. ఈ డెయిరీ నుంచి నాయుడుపేట వ్యవసాయ మార్కెట్ కమిటీలో పనిచేసే ఈఎల్ బాషా రూ.10,100 లంచం తీసుకున్నట్లు మార్కెటింగ్ శాఖకు సిట్ లేఖ రాసింది. ఈ పేరున్న వారెవరూ తమ వద్ద లేరని అధికారులు పేర్కొన్నారు.

వివరాలు కోరిన మార్కెటింగ్ అధికారులు

వేరే రాష్ట్రాల నుంచి మన రాష్ట్రంలోకి వస్తూ అదే రాష్ట్రంలో అమ్మకపు లేదా కొనుగోలు లావాదేవీలు జరిగినట్టు రసీదులుంటే మన మార్కెట్ కమిటీలకు సెస్ చెల్లించక్కర్లేదు. దీంతో భోలేబాబా డెయిరీ సెస్ కట్టాలా.. అక్కర్లేదా అని మార్కెటింగ్ శాఖ ఆరాతీస్తోంది. సరఫరా అయిన ట్యాంకర్ల వివరాలివ్వాలని తితిదే మార్కెటింగ్ మేనేజర్.. జిల్లా మార్కెటింగ్ అధికారులను అడిగారు.

ఉద్యోగులు, పాలకుల మధ్య సమన్వయం అవసరం

- జీతాలు కూడా ఇవ్వలేని స్థితికి గత పాలకులు తెచ్చారు
- ఉద్యోగులు దాచుకున్న డబ్బులనూ పక్కదారి పట్టించారు
- ఏపీ జేఏసీ అమరావతి మహాసభలో మంత్రి పయ్యావుల



సభలో మాట్లాడుతున్న మంత్రి పయ్యావుల కేశవ్. వేదికపై మంత్రి సత్యకుమార్, ఏపీ మున్సిపల్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు నాగేశ్వరరావు, ఏపీ జేఏసీ అమరావతి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు తదితరులు

ఈనాడు, అమరావతి, విద్యాధరపురం, న్యూస్‌టుడే: రాష్ట్ర అభివృద్ధి జరగాలంటే.. ఉద్యోగులు, పాలకుల మధ్య సమన్వయం అవసరమని రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. ఏపీ జేఏసీ అమరావతి నాలుగో రాష్ట్ర మహాసభ విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో గురువారం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ విచ్చేశారు. తొలుత విజయవాడలోని లెనిన్ సెంటర్ నుంచి ఉద్యోగులంతా భారీ ర్యాలీగా మహాసభ జరిగే తుమ్మలపల్లి కళాక్షేత్రం వద్దకు చేరుకున్నారు. అనంతరం నిర్వహించిన సభలో పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ.. ఉద్యోగులు, పాలకులు వేరుకాదని, ఏ సమస్యనైనా పరస్పరం చర్చల ద్వారా పరిష్కరించుకోవచ్చన్నారు. "గత వైకాపా ప్రభుత్వం.. ఉద్యోగులు దాచుకున్న రూ.26వేల కోట్లను పక్కదారి పట్టించేసింది. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, వృద్ధులు, దివ్యాంగులకు పింఛన్లు సైతం బకాయి పెట్టి వెళ్లిపోయారు. ఉద్యోగులకు నెలవారీ జీతాలు కూడా ఇవ్వలేని స్థితికి తెచ్చి.. రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చేశారు. ప్రస్తుతం రాష్ట్ర పరిస్థితిని మెరుగుపరుస్తూ.. అభివృద్ధికి అనునిత్యం కూటమి ప్రభుత్వం సమన్వయంతో కృషి చేస్తోంది" అని తెలిపారు. దేశంలోనే తొలిసారిగా ఉద్యోగుల్లో 60శాతం ఉన్న మహిళలకు ప్రయోజనం కల్పించేలా ఛైల్డ్‌కేర్ లీవుకు వయోపరిమితి, నిబంధనలను సడలించామన్నారు. మంత్రి సత్యకుమార్‌యాదవ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలను ప్రజల వద్దకు చేర్చడంలో కీలకపాత్ర ఉద్యోగులదేనన్నారు. వారు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు.

◆ జేఏసీ అమరావతి అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. గత వైకాపా పాలనలో ఉద్యోగుల సమస్యలు ఒక్కటి కూడా పరిష్కారం కాలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరవాత ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి జరుగుతోందన్నారు. ఉద్యోగులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో భాగంగా 12వ పీఆర్సీ కమిషన్‌ను నియమించి ఐఆర్ ప్రకటించాలని కోరారు.

నూతన కమిటీ ఎన్నిక..

ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర నూతన కమిటీని 21 మందితో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర ఛైర్మన్‌గా నాలుగోసారి బొప్పరాజు వెంకటేశ్వర్లు, సెక్రటరీ జనరల్‌గా పలిశెట్టి దామోదరరావు, అసోసియేట్ ఛైర్మన్‌గా టి.వి.ఫణి పేర్రాజు, కోశాధికారిగా తిమ్మసర్తి నాగేశ్వరరావు, ప్రచార కార్యదర్శిగా ఆర్.శ్రీనివాసరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా బి.కిషోర్‌కుమార్, కార్యదర్శులుగా కె.చంద్రశేఖర్‌తో పాటు మరో నలుగురిని ఎన్నుకున్నారు.



ఏలూరు రోడ్డు మీదుగా తుమ్మలపల్లి కళాక్షేత్రం వరకు నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న ఉద్యోగ సంఘాల నాయకులు, ఉద్యోగులు

వివేకా హత్య కేసులో తదుపరి దర్యాప్తు

(మొదటి పేజీ తరువాయి)

వాటిపైనా దర్యాప్తు కొనసాగించేలా ఆదేశించాలని, దర్యాప్తు గడువును సవరించాలంటూ సునీత తాజాగా సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. జస్టిస్ ఎంఎం సుందరేష్, జస్టిస్ ఎన్‌కే సింగ్‌లతో కూడిన ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. సునీత వినతులను సమ్మతించింది. తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది.

ఆ తీర్పుపై హైకోర్టుకెళితే మరో మూడేళ్లు పడుతుంది

పిటిషనర్ కోరుతున్నట్లుగా వివేకా హత్య కేసులో తదుపరి దర్యాప్తు అవసరం ఉందా, ఆ విషయంలో తదుపరి ఉత్తర్వులు జారీ చేయాలా అన్నది చెప్పండి అంటూ గత నెల 20న ధర్మాసనం ఆదేశించింది. గురువారం విచారణలో సీబీఐ తరఫున హాజరైన ఏఎస్‌జీ దీనికి బదులిచ్చారు. దర్యాప్తు పూర్తయినప్పటికీ డిసెంబర్ 10న సీబీఐ కోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు తదుపరి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు. న్యాయమూర్తి స్పందిస్తూ 'మీరు దర్యాప్తు కొనసాగించండి. ఎవరినైనా విచారించేందుకు మీకు స్వేచ్ఛ ఉంది. ఫలానా వ్యక్తులు ఎవరైనా కావాలనుకుంటే చెప్పండి. ఆ మేరకు మేం ఉత్తర్వుల్లో మార్పులు చేస్తాం' అని పేర్కొన్నారు. సునీత తరఫు న్యాయవాది జేసల్ వాహి జోక్యం చేసుకుంటూ సీబీఐ కోర్టు ఒక కోణంలో మాత్రమే తదుపరి దర్యాప్తునకు ఆదేశించిందన్నారు. 'ఈ కేసుల్లో మినీట్రయల్ నిర్వహించుకుంటూ వెళ్లలేం. ఆ తీర్పును హైకోర్టులో సవాల్ చేసుకోవడానికి అవకాశమిస్తే అందుకు మరో రెండు మూడేళ్లు పడుతుంది' అని న్యాయమూర్తి పేర్కొన్నారు. సునీత తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా హాజరయ్యాక జస్టిస్ సుందరేష్ స్పందిస్తూ 'ఈ కేసులో సీబీఐ విచారణ కొనసాగిస్తున్నందున మేం పిటిషన్‌ను ఇక్కడ పెండింగ్‌లో ఉంచుతాం. ముమ్మందు ఏదైనా అవసరమైతే అప్పుడు మీ వాదనలు పరిశీలిస్తాం' అన్నారు. లూథ్రా స్పందిస్తూ విచారణలో భాగంగా కొత్త విషయాలేమైనా వెలుగులోకి వస్తే దానిపై దర్యాప్తు చేసే స్వేచ్ఛ ఉంటుందని ట్రయల్ కోర్టు చెప్పిందని పేర్కొన్నారు. సీబీఐ కోర్టు తదుపరి దర్యాప్తునకు నెల రోజుల గడువిచ్చిందని, అది సీబీఐపైన ఒత్తిడి పెంచే అవకాశం ఉన్నందున నెల అన్న పదాన్ని సవరించాలని కోరారు. జస్టిస్ సుందరేష్ స్పందిస్తూ.. 'కొంత సమయం ఇద్దాం. సీబీఐ ఏం చేస్తుందో చేయనివ్వండి. ట్రయల్ కోర్టు 2025 డిసెంబర్ 10న జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం సీబీఐ సాధ్యమైనంత త్వరగా విచారణ పూర్తిచేయాలి. కొత్త విషయాలేమైనా ఉంటే పిటిషనర్ సీబీఐకి సమర్పించవచ్చు' అని పేర్కొన్నారు.

వసుంధర

vasundhara@eenadu.in

సాధన చేస్తూ... సముద్రంలో మునిగిపోయా



ఆర్మీలో చేరడం ఆమె కల... భయాన్ని వదిలి.. గెలుపు దిశగా కదిలి అందుకోసమే ఆటల్నీ, సాహసాల్నీ ఇష్టపడటం ఆరంభించారు... కానీ, అన్నీ అనుకున్నట్లే జరగవు కదా! కోరుకున్న లక్ష్యాన్ని చేరుకోలేకపోయారు. అయినా నిరాశ పడలేదు. మనసుకు నచ్చినట్లుగా నడుస్తూ వైవిధ్యాన్ని చూపుతున్నారు. హైదరాబాద్‌కు చెందిన అంజనీ. అడ్వెంచర్ స్పోర్ట్స్‌లో సాధన చేసి మారథాన్లలో పోటీ పడుతున్నారు. సైక్లింగ్ రెవల్యూషన్ క్లబ్‌ని ఏర్పాటుచేసి అవగాహన కల్పిస్తున్నారు. ఇటీవల గోవాలో జరిగిన అంతర్జాతీయ ఐరన్‌మ్యాన్ 70.3 పోటీలో పాల్గొని 7.49 గంటల్లో పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఆమెను వసుంధర పలకరించింది.

నేను పంజాబ్‌లోని ఫరీద్‌కోట్‌లో పుట్టా. అలాగని నేను తెలుగమ్మాయిని కాదనుకునేరు. మా స్వస్థలం కాకినాడ. నాన్న సత్యనారాయణ ఆర్మీ అధికారి కావడంతో తరచూ బదిలీలు జరిగేవి. అలా దేశంలోని వివిధ కేంద్రియ విద్యాలయాల్లో నా చదువు సాగింది. తర్వాత హైదరాబాద్‌లోని నిజాం కాలేజీలో గ్రాడ్యుయేషన్, ఉస్మానియా యూనివర్సిటీలో పీజీ చేశా. ఆర్మీలో చేరాలనుకుని ఎస్ఎస్‌బీ ఇంటర్వ్యూ కోసం శిక్షణా తీసుకున్నా. కానీ, అది సాధ్యపడలేదు. దీంతో నా అడుగులు కార్పొరేట్ ప్రపంచం వైపు మళ్లాయి. కానీ, కొన్నాళ్లకే ఇదంతా రొటీన్‌గా మారడంతో జీవితంలో ఇంకేదైనా సాధించాలని అనుకున్నా.

రన్నింగ్ కమ్యూనిటీలో చేరాక...

కాలేజీలో ఉన్నప్పటి నుంచీ షార్ట్ స్ప్రింట్స్ చేసేదాన్ని. బాగా దూరం పరుగెత్తాలంటే మాత్రం కష్టంగా ఫీలయ్యేదాన్ని. అయితే, రన్నింగ్ కమ్యూనిటీలో చేరాక ఆ భావన మారిపోయింది. ఐదు కిలోమీటర్లు పది అయ్యాయి. తర్వాత హాఫ్ మారథాన్ చేశా. అది మొదలు ఎన్నో మారథాన్‌లు, అల్ట్రా మారథాన్‌లు పూర్తిచేశా. అయితే, సైక్లింగ్ మొదలుపెట్టింది మాత్రం కొవిడ్ సమయంలోనే 'హ్యాపీ హైదరాబాద్ అనే కమ్యూనిటీలో కోర్ మెంబర్ అయ్యాను. మొదట్లో ఓ పాత సైకిల్‌తో సరదాగా పోటీల్లో పాల్గొనేదాన్ని. తర్వాత అది అభిరుచిగా మారడంతో పలుమార్లు 100, 200, 300 కిలోమీటర్ల సైక్లింగ్ రేసుల్లో పాల్గొని లక్ష్యాన్ని చేరుకున్నా. తర్వాత కొంతమంది స్నేహితులతో కలిసి హైదరాబాద్ సైక్లింగ్ క్లబ్ ప్రారంభించా. ఇప్పుడది హైదరాబాద్ సైక్లింగ్ రెవల్యూషన్ క్లబ్‌గా మారింది. దీని ద్వారా సైక్లింగ్, వాకింగ్ చేస్తే ఎలాంటి ప్రయోజనాలు ఉన్నాయో ప్రజలకు అవగాహన కల్పిస్తుంటాం. ఈ క్లబ్‌లో 3000 మందికి పైగా సభ్యులుగా ఉన్నారు.

పర్వతాలపై భయాన్ని వదిలి...

నాకు సాహసాలంటే ఇష్టం. ముఖ్యంగా పర్వతారోహణ చేయాలనే ఆసక్తి. దాంతో ఉత్తర కాశీలో ఉన్న నెహ్రూ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మౌంటెనీరింగ్‌లో శిక్షణ తీసుకున్నా. ఎవరెస్ట్ బేస్ క్యాంపును పూర్తిచేశాను. ఆపై 2023లో ఆఫ్రికాలోని కిలిమంజారో, 2024లో యూరప్‌లోని ఎల్‌బ్రస్‌లను అధిరోహించా. ఇదంతా ఒకెత్తయితే... గోవాలో జరిగిన ఐరన్‌మ్యాన్ 70.3 పోటీలు మరో ఎత్తు. ఇందులో సైక్లింగ్, రన్నింగ్‌లతో పాటు స్విమ్మింగ్ కూడా వచ్చి ఉండాలి.



నాకేమో ఈత రాదు... దీనికోసమే శిక్షణ తీసుకున్నా. ఈ పోటీల్లో సాధన కోసం ఓ సారి చెన్నైలో సముద్రంలోకి దిగి కొంత దూరం వెళ్లాక మునిగిపోయాను. చనిపోయాననే అనుకున్నా. స్థానికులు కొందరు బయటికి తీసుకురావడంతో బతికి బయటపడ్డా. తర్వాత నేను చేస్తున్న తప్పులను సరిచేసుకుంటూ నేర్చుకున్నాను. నవంబరులో ఈ పోటీలు గోవాలో జరిగాయి. ఇందులో 1.9 కిలోమీటర్లు ఓపెన్ స్విమ్మింగ్, 90కిలోమీటర్లు సైక్లింగ్, 21.1 కిలోమీటర్లు రన్నింగ్ పూర్తి చేయాలి. ఆ పోటీని 7.49 గంటల్లో పూర్తి చేసి విజయం సాధించాను.

– చింతలపాటి రామాంజనేయులు, హైదరాబాద్

రక్తం రంగు మారింది

నాకు 30 ఏళ్లు. రెండు నెలలుగా పీరియడ్స్‌లో విపరీతమైన కడుపు, నడుము నొప్పి. అంతకు ముందు ఇవేమీ లేవు. రక్తస్రావం సరిగా అవ్వడం లేదు, రంగు కూడా మారింది. ఇలా ఎందుకవుతోంది? రెండు నెలలు కాల్షియం, యాంటీ బయాటిక్స్ మందులు వాడా. అవే కారణమా? – ఓ సోదరి

డియర్ వసుంధర



డా. చీపురుపల్లి వసుంధర
గైనకాలజిస్ట్

నెలసరిలో నొప్పికి చాలా కారణాలు ఉంటాయి. నిజానికి కారణమేదైనా ఇది ఒకరకంగా ఆరోగ్య సూచికే. సమయానికి అండం విడుదలయ్యేవారికి ఈ నొప్పి వస్తుంది. అయితే మరీ ఎక్కువగా వస్తుంటే మాత్రం సమస్యే. ఎక్కువ రక్తస్రావం, గడ్డలుగా పడటం వల్ల ఇలా అవొచ్చు. లేదంటే గర్భాశయంలో ఎడినోమయాసిస్, ఫైబ్రాయిడ్స్, ఎండోమెట్రియాసిస్ వంటి సమస్యలున్నాయేమో చెక్ చేయించుకోండి. నొప్పిని పారాసిటమాల్ మాత్రతోనే చాలావరకూ తగ్గించుకోవచ్చు. కానీ దానికి మించి డోస్ అవసరం అవుతోంది అనిపిస్తే స్కాన్ చేయించుకోవడమే మేలు. సమస్యేమీ లేదంటే కొన్నిరకాల మందులతో తగ్గించుకోవచ్చు. ఇతర సమస్యలేమైనా ఉంటే చికిత్స కావాలి. ఇక నెలసరి రక్తం రంగు మారడం అంటారా... వయసు పెరిగేకొద్దీ ఇది మామూలే. ఒక్కోసారి ముదురు ఎరుపులో ఉంటే మరోసారి సాధారణ రంగులో, జిగటగా... ఇలా చాలా రకాలుగా మారుతూ ఉంటుంది. ఒక్కోసారి అయితే నెలసరి రోజుల్లోనూ ఒక్కో రోజు ఒక్కోలా కనిపించొచ్చు. కాబట్టి, ఇన్ని రోజులకే నెలసరి రావాలి, ఈ రంగులోనే రావాలి... ఇలా అందరికీ ఒకే క్రమంలో, ఒకేలా రావాలనేం ఉండదు. వయసు, సమయం బట్టి వీటిల్లో మార్పులు సహజం. నెలసరి క్రమంగా వస్తూ... గర్భాశయ సమస్యలేమీ లేకపోతే ఇలాంటి చిన్నచిన్న వాటిని పెద్దగా పట్టించుకోవద్దు. కాల్షియం, యాంటీ బయాటిక్స్ కొన్ని రోజులే వాడారు. అయినా వీటి ప్రభావం నెలసరి రంగు మీద పడదు. ఎక్కువ విశ్రాంతి తీసుకోవడం, వేడి కాపడం, పారాసిటమాల్ వాడటం వంటివి చేయండి. చాలావరకూ తగ్గుతుంది. అయినా ఫలితం లేదనిపిస్తే వైద్యులను సంప్రదించండి.



తువ్వాలు శుభ్రమేనా?

తువ్వాళ్లను శుభ్రంగా ఉంచుకోవడమంటే ఆరోగ్యాన్ని కాపాడుకోవడమే! అందుకే వీటి విషయంలో చాలా జాగ్రత్తలు అవసరమంటారు నిపుణులు. వాళ్లు చెప్పే కొన్ని సూచనలివి...

చాలామంది తువ్వాళ్లను శుభ్రంగా ఉతకాలని ఎక్కువ డిటర్జెంట్ వాడుతుంటారు. అలాంటప్పుడు కొంత డిటర్జెంట్ దారాలకు అంటుకుని... వాటి చుట్టూ నూనెలూ, బ్యాక్టీరియా పోగవుతాయి. కాబట్టి అవసరం మేరకు డిటర్జెంట్ ఉపయోగిస్తేనే మేలు.

- నీటితోపాటు చెమట, శరీర నూనెలు, మృతకణాలు... వీటన్నింటినీ తువ్వాలు పీల్చుకుంటుంది. కాబట్టి వేడి నీళ్లలో ఉతకాలి. అయితే, ఫ్యాబ్రిక్ సాఫ్ట్‌నర్‌ని ఉపయోగిస్తే తువ్వాలులో తడిని పీల్చుకునే గుణం తగ్గిపోతుంది. దాన్ని నీళ్లలో జాడించి ఆరేయడమే మేలు.
- టవల్స్‌ని వాషింగ్ మెషీన్‌లో వేసినపుడు మిగతా బట్టలు తక్కువ వేయండి. దానివల్ల డిటర్జెంట్ టవల్‌లోని అన్నివైపులా సులభంగా వెళ్తుంది. వీలైతే వీటిని మాత్రమే వేరుగా వేయండి. ఉతికే సమయం పెంచండి.
- ఉతికిన టవల్స్‌ను ఎక్కువ ఎండలో వేయొద్దు. అలా చేస్తే వాడేటప్పుడు బిడబిడలాడుతాయి. మధ్య స్థాయి ఎండలో వేసి, ఆరిపోగానే తీసి మడత పెట్టాలి.
- రెండు మూడు నెలలకోసారి బేకింగ్ సోడా, డిటర్జెంట్‌తో కలిపి రెండు గంటలు నానబెట్టి తర్వాత బాగా ఉతికి ఆరబెట్టండి. దీనివల్ల తువ్వాలులోని దారం కొత్త దానిలా తయారవుతుంది.
- తువ్వాళ్లను మూడేళ్లకు మించి వాడకూడదన్నది నిపుణుల మాట.

ఇవి రక్షణ కాదట..!

కొత్తగా అమ్మ అయిన వాళ్లు పిల్లల పెంపకంలో ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటారు. బుజ్జాయిలు పడకూడదనీ, పడినా దెబ్బలు తగలకూడదనీ, తొందరగా నడవాలనీ ఇలా రకరకాల కారణాలతో గ్యాడ్జెట్లను ఆశ్రయిస్తుంటారు. వాటిల్లో కొన్ని మంచి చేస్తే... కొన్ని వినియోగరహితమైనవీ ఉన్నాయి. అలా పిల్లలకు ఇవ్వకూడని కొన్ని గ్యాడ్జెట్లు ఇవి.



మోకాలి రక్షణకు...

ఐదు నెలల నుంచి పాకడం నేర్చుకుంటారు పిల్లలు. నెమ్మదిగా దుప్పటి లేదా మ్యాట్ మీద పాకుతూ ఎంత సందడి చేస్తారో. రోజులు గడుస్తున్న కొద్దీ వేగం పెరుగుతుంది. టైల్స్ లేదా నునుపైన నేల అయితే పర్వాలేదు కానీ, చాలాసార్లు గరుకైన నేలపైనా పాకుతారు. దాంతో మోకాళ్లు గీసుకుంటుంటాయి. అలా జరగకూడదని 'నీ క్యాప్స్' వేస్తుంటారు. దీనివల్ల పిల్లలు స్లిప్ అయ్యే ప్రమాదాలు ఎక్కువ. పైగా పాకడం వల్ల మోకాలిలో బలం వస్తుంది, అక్కడి ఎముకలు గట్టిపడి తర్వాతి దశకు సిద్ధమయ్యే సహజ ప్రక్రియ ఇది. కానీ ఈ క్యాప్స్ వేయడం వల్ల దానికి ఆటంకం కలుగుతుందట.

తలకు గాయం కాకుండా...

నడిచేటప్పుడు, నడవడానికి ప్రయత్నిస్తున్నప్పుడు పిల్లలు కింద పడటం సహజమే. అలా పడుతూ లేస్తూనే నడవడం నేర్చుకుంటారు. కానీ దీనివల్ల తలకు దెబ్బలు తగులుతుంటాయి. అలా జరగకూడదని తలకు హెల్మెట్‌లు పెడుతుంటారు చాలామంది తల్లులు. వీటివల్ల అప్పటికి దెబ్బలైతే తగలవు కానీ... బ్యాలెన్సింగ్ నైపుణ్యం పిల్లలకు దూరం చేసినట్లు అవుతుంది అంటున్నారు నిపుణులు. పడేటప్పుడు దెబ్బ తగలడం వల్ల శిశువు మెదడు అపాయాల్ని గమనించుకుంటూ... మళ్లీ ప్రయత్నించమనే సంకేతాల్ని ఇస్తుందట. ఇదే భవిష్యత్తులోనూ వాళ్లని బలంగా తీర్చిదిద్దేది. కానీ గ్యాడ్జెట్ ఉపయోగం పిల్లల్ని ఈ నైపుణ్యానికి దూరం చేస్తుంది అంటున్నారు.





తొందరగా నడవాలని...

పిల్లలు తొందరగా నడక నేర్చుకోవాలని చాలామంది తల్లిదండ్రులు వాకర్లను ఆశ్రయిస్తుంటారు. కానీ 'ఇప్పుడు వచ్చే వాకర్లన్నీ పిల్లల్లో నడక సామర్థ్యాన్ని దెబ్బతీసేవే. వాటికి వీలైనంత దూరంగా పిల్లల్ని పెంచడమే మేల'ంటారు నిపుణులు. లేదూ, ఇవ్వాల్సి వస్తే పుషర్స్ లాంటి మూడు చక్రాల వాకర్లని ఇవ్వమని చెబుతున్నారు. గమనించుకుంటారుగా మరి!

శోధిత

రొమ్ము క్యాన్సర్ నివారణకై...

క్యాన్సర్ ఎంత భయంకరమైనదో తెలియంది కాదు. దాని గురించి ఎంత అవగాహన ఉన్నా తరచూ పరీక్షలు చేయించుకుంటున్నా ప్రారంభమైన వెంటనే వ్యాధి ముదిరిపోయి చికిత్సకు లొంగని కేసుల్నీ చూస్తుంటాం. ఆ కోవకే చెందుతుంది ఈ ట్రిపుల్-నెగెటివ్ బ్రెస్ట్ క్యాన్సర్(టీఎన్‌బీసీ). ఇది తీవ్రమైనది. ప్రాథమిక దశలోనే వేగంగా వ్యాపిస్తుంది. బయటపడ్డాక కొందరు చికిత్సకు మొదట్లో స్పందించినట్లు కనిపిస్తారు. కానీ మళ్లీ తిరగబెట్టడంతో రోగనిరోధక శక్తి బాగా తగ్గిపోతుంది. అందుకే దీని నివారణకై అనేక పరిశోధనలు చేస్తున్నారు. అయితే మెడికల్ యూనివర్సిటీ ఆఫ్ సౌత్ కరోలినా పరిశోధకులు ఓ కొత్త పరిష్కారాన్ని కనుగొన్నారు. కణితి పెరుగుదలకు కారణమైన ప్రొటీన్‌ను లక్ష్యంగా చేసుకుని యాంటీబాడీని అభివృద్ధి చేశారు. ఇది ఆ ప్రొటీన్‌ను పనిచేయనివ్వకుండా చేయడమే కాదు, రోగనిరోధక శక్తిని తిరిగి కోలుకునేలా చేస్తుందనీ తద్వారా కణితి పెరుగుదలను అడ్డుకుంటుందనీ చెబుతున్నారు. అంతే కాదు, కీమోథెరపీకి స్పందించని క్యాన్సర్ కణాలనూ నాశనం చేసిందట. ఊపిరితిత్తుల్లోనూ క్యాన్సర్ కణ విభజననీ అడ్డుకుందట. త్వరలోనే ఈ ప్రయోగాలన్నీ ఓ కొలిక్కి వస్తే టీఎన్‌బీసీనే కాదు, ఇతర క్యాన్సర్ల నివారణలోనూ ఈ చికిత్సను అభివృద్ధి చేయవచ్చని పరిశోధకులు భావిస్తున్నారు. అయితే వ్యాధి ఎంత తీవ్రమైనదైనా దాన్ని ఎదుర్కోగలమనే ధైర్యమే నివారణలో అన్నింటికన్నా ముఖ్యం అని పరిశోధకులూ చెబుతున్నారు!



నగలతో జాగ్రత్త..!

బంధువుల ఇంటికొచ్చి వెళ్తోందామె. ఆటోకోసం ఎదురుచూస్తోంది. ఇంతలో రయ్యిమంటూ ఆమె దగ్గరికి దూసుకొచ్చిందో బైకు. ఏమవుతోందో అర్థం చేసుకునేలోపు మెడలో గొలుసు మాయం.

ఆఫీసునుంచి ఇంటికెళ్తోందో మహిళ. ఎప్పుడూ వెళ్లే రోడ్డే. చుట్టూ జనాలూ ఉన్నారు. అయినా ఏమాత్రం భయం లేకుండా మెడలో గొలుసు లాగేశారు. వెంటనే తేరుకున్న ఆమె దాన్ని బలంగా పట్టుకుంది. సగం చెయిన్ చేతిలో మిగిలింది కానీ... పెనుగులాటలో కింద పడటంతో ఒళ్లంతా గాయాలు. ఒకటా రెండా... ఈమధ్య ఇలాంటి ఎన్నెన్ని సంఘటనలు? అసలే బంగారం ధర కొండెక్కి మనల్ని బాధపెడుతోంది. ఇది చాలదన్నట్టు ఈ భయం. బాధితుల జాబితాలో మీరూ ఉండొద్దంటే...

- వీలైనంతవరకూ బయటికి వెళ్లేటప్పుడు నగల్ని తీసేయండి. 'మంగళసూత్రం సెంటిమెంటు, వేడుకకి వేసుకోవడం తప్పనిసరి...' అంటారా! అయితే కొంగును చుట్టుకోవడమో స్కార్ఫ్, చున్నీలతో కప్పేయడమో చేయండి. కనిపించేలా కాకుండా సన్నని నగలకి మారినా మంచిదే.
- రోడ్డు మీద వెళ్లేటప్పుడు మెసేజ్ చేస్తూ, కాల్స్ మాట్లాడుతూ వెళ్లొద్దు. ఎంత దగ్గరి దారైనా సరే! చీకటిగా, జనాలు



ఎక్కువగా లేని మార్గాల్లో వెళ్లొద్దు. ముఖ్యంగా రాత్రుళ్లు మరింత జాగ్రత్తగా ఉండాలి. తెల్లవారుజామున ముగ్గేయడం మనవాళ్లకి అలవాటు. అలాంటివాళ్లూ నగలు లేకుండా చూసుకోవడం మేలు. ఇంట్లో ఒంటరిగా ఉండే మహిళల్ని టార్గెట్ చేసుకుంటున్న వాళ్లూ ఎక్కువే. చిరునామా అడగడానికీ, బిల్లుల పేరుతోనూ వస్తున్నారు. గేటు బయటే ఉంచి మాట్లాడండి. తలుపు తెరవకుండానే కిటికీలోంచి మాట్లాడైనా పంపండి. అవసరమైతే సేఫ్టీ లాక్‌ని ఏర్పాటుచేసుకోండి.

- మనకి సిక్స్త్ సెన్స్ ఎక్కువ. ప్రమాదమనిపిస్తే మనసు హెచ్చరిస్తూనే ఉంటుంది. అలా ఏదైనా అనుమానంగా అనిపిస్తే దారి మార్చుకుని వెళ్లండి. దగ్గర్లో జనాలు ఉన్న ప్రాంతానికో, షాపుల్లోకో వెళ్లిపోండి. తరవాత సురక్షిత మార్గాలను ఎంచుకుని ఇంటికి చేరుకోండి.
- నడిచేటప్పుడు, ప్రయాణాల్లో చుట్టూ ఏం జరుగుతోందో గమనించుకోండి. బండి లేదా వ్యక్తులు సమీపంలోకి వస్తున్నట్లు అనిపిస్తోంటే తక్షణం స్పందించి, జాగ్రత్తపడండి. పెప్పర్ స్ప్రే, విజిల్, కర్ర వంటివి వెంట తీసుకెళ్తే మరీ మంచిది. ఆపద వేళ ఇవి మిమ్మల్ని కాపాడతాయి.
- బయటి నుంచి ఇంటికెళ్తున్నారా? వెనక ఎవరైనా వస్తున్నారేమో గమనించుకోండి. బ్యాగులోంచి తాళాలు తీసి, తలుపు తెరిచేలోపూ జరుగుతున్న దాడులకు కొదవలేదు. కాబట్టి, చుట్టూ చూసుకోండి. గుమ్మం దగ్గరికి చేరేముందే తాళాలు తీసిపెట్టుకోండి. రాత్రుళ్లు ఒంటరిగా ఉంటే గుమ్మం ముందు లైటు వేసి ఉంచడం వంటివీ చేయండి.

ప్రాణం ముఖ్యం!

బంగారం కొట్టేస్తున్నారని చాలామంది గిల్టువి వేసుకుంటున్నారు. కానీ దోచుకోవాలని వచ్చేవాళ్లు దాన్ని అంచనా వేయలేరు కదా! లాగే క్రమంలో అదీ గాయానికి కారణం కావొచ్చు. వీలైనంతవరకూ వేసుకోకండి. లేదా తగిన జాగ్రత్తలైనా తీసుకోండి. పొరపాటున దాడే చేశారనుకోండి. గింజుకోవద్దు... వదిలేయండి. లేదంటే ఈడ్చుకెళ్లే క్రమంలోనో, పెనుగులాటలోనో మీ ప్రాణాలకు ముప్పు ఏర్పడవచ్చు. బదులుగా దాడి చేసినవాళ్ల ఆనవాళ్లు, బండి నంబరు, రంగు వంటివి గుర్తుంచుకోవడానికి ప్రయత్నించండి. వెంటనే పోలీసులకు ఫోన్ చేస్తే... వాళ్లని పట్టుకునే అవకాశం ఎక్కువ. ఇక్కడ సమయం కూడా ప్రధానమే.

ఏమరుపాటు, అజాగ్రత్త... ఇవే గొలుసు చోరీకి చేటు చేసే ప్రధాన కారణాలు. కాబట్టి, అలర్ట్‌గా ఉండండి. తగిన జాగ్రత్తలు తీసుకోండి... సురక్షితంగా ఉండొచ్చు.

ఫ్యాషన్ ఫ్యాషన్



పైజామా కాదు... మన స్టైల్!



ఇంటి నుంచి పనిచేసే వాళ్ల పెద్ద సమస్య ఏంటని అడగండి. కచ్చితంగా వచ్చే సమాధానం డ్రెస్సులే! ఇంట్లోనే ఉంటారుగా... ఇప్పుడీ డ్రెస్సే ట్రెండ్, ఫలానా మోడల్‌కే డిమాండ్ వంటివి వాళ్లకు పట్టవు. చక్కగా సౌకర్యంగా మెచ్చిన పైజామాలు ఉంటే చాలు. అందుకే వాళ్ల వార్డ్‌రోబ్ కూడా వాటితోనే నిండిపోతుంది. అయితే చిక్కు ఎప్పుడొస్తుందో తెలుసా? ఒక్కసారిగా ఆఫీసుకి రమ్మన్నప్పుడు. వీడియో మీటింగ్‌లప్పుడు. బీరువాలో ఉన్నవి ఎప్పుడు బిగుతయ్యాయో గమనించుకోరు. కొత్తగా కొనుక్కున్న జాబితాలో పండక్కో, వేడుకకో తీసుకున్నవి కనిపిస్తాయి. వాటిలో మీటింగ్‌కి ఏం కూర్చుంటారు? నైట్ డ్రెస్ మీదే ఏ ఓవర్ కోటో, స్వెటరో వేసి మమ అనిపించేస్తారు. కానీ అదిచ్చే ఒత్తిడి మాత్రం తక్కువేం కాదు. మామూలు వాళ్ల తిప్పలు మాత్రం తక్కువా! బయటికి వెళ్లి, ఇంట్లోకి అడుగు పెట్టగానే మనసు ముందు ఎప్పుడెప్పుడు నైట్ డ్రెస్‌లోకి దూరదామా అనే ఆలోచిస్తుంటుంది. అది మారిస్తే కానీ... ఏదో భారమంతా పక్కన పెట్టేసినట్లు అనిపించదు. ఇక్కడా నైటీలతో తిప్పలే. బయట అడుగు పెట్టలేరు. అందుకని నైట్ డ్రెస్‌లే ఇప్పటి అమ్మాయిల ఎంపిక. వాటితోనైనా వాకింగ్ వరకూ ఓకే కానీ... ఎవరింటికైనా వెళ్లాలన్నా, షాపింగులు చేయాలన్నా ఇబ్బంది. దాన్ని దూరం చేస్తూ వస్తున్నవే ఈ 'మల్టీ పర్పస్ వేర్'. స్లీప్ వేర్ సౌకర్యానికే అన్నది పాత మాట. ఇది కూడా వ్యక్తిగత ఫ్యాషన్‌గా మారిపోతున్న రోజులివి. కాబట్టే, సౌకర్యానికి స్టైల్‌ని జోడిస్తూ ఇలా ఎన్నో రకాలు మార్కెట్‌లోకి వచ్చేశాయి. కాప్రి, కాఫ్తాన్, ఫ్లోవర్, స్క్రంచ్, షర్ట్... ఎన్నో మోడళ్లలో పైజామాలు దొరికేస్తున్నాయి. వేసుకున్నవారికి సౌకర్యాన్ని ఇస్తూనే గ్లామరస్ లుక్‌ని ఇవ్వడం వీటి ప్రత్యేకత. డైలీ ఫ్యాషన్‌కీ నప్పేస్తున్నాయి. ఇంకేం, ఏ సమయానికైనా సిద్ధంగా ఉండాలనుకునే అమ్మాయిలని మరింత మెప్పిస్తున్నాయి. మీరూ ఇలాంటి వాటికోసమే వెతుకుతున్నారా? అయితే తెచ్చేసుకోండి. ఇంతకీ ఏ స్టైల్‌కి మీ ఓటు మరి?





ఒత్తిడి పెంచుకుంటున్నారు!

ఇంట్లో పనంతా పూర్తయ్యింది లేదా పాఠాలతో కుస్తీ పూర్తయ్యింది. దొరికిన కాస్త సమయంలో మనకంటూ కొద్దిసేపు కేటాయించుకోవాలి అనిపిస్తుంది కదా! అప్పుడు మనకు కనిపించేదేంటి? తడుముకోకుండా ఫోన్ అన్న సమాధానం వస్తుంది కదూ! ఇంకేం సోషల్‌మీడియాలో పోస్టులు చూస్తూనో రీల్స్‌తోనో గడిపేస్తాం. కానీ అదేం విశ్రాంతిని ఇవ్వదు. పైగా అలసటను మోసుకొస్తుందని తెలుసా?



కాసేపలా నచ్చింది చూస్తే బుర్ర శాంతిస్తుంది అనేదే చాలామంది అభిప్రాయం. కానీ ఇలా స్క్రోల్ చేసుకుంటూ వెళ్లడం వల్ల మెదడు మరింత చురుకు అవుతుంది. వీడియోలు, పోస్టుల్లోని కొత్త సమాచారం, భావోద్వేగాలు, అభిప్రాయాలు, పోలికలు... వంటివి మెదడుని ఉక్కిరిబిక్కిరి చేస్తుంటాయి. ఇక ఒత్తిడి దూరమయ్యే అవకాశమేది? దీంతో ఉత్సాహంగా మారకపోగా అలసట దరిచేరుతుంది. దీనికితోడు నిద్రవేళలూ తగ్గితే ఏకాగ్రత లేమి, భావోద్వేగాలపై పట్టుకోల్పోవడం వంటి అదనపు సమస్యలు వచ్చి చేరతాయి. సోషల్‌మీడియా, రీల్స్ వంటివి తక్షణ ఆనందాన్ని ఇస్తాయన్న మాట వాస్తవమే. కాబట్టే, ఓ పట్టాన వదలాలనిపించవు. అలాగే కొనసాగిస్తూ వెళితే ఇదిగో ఇలా అలసిపోవాల్సి వస్తుంది. కాబట్టి, పూర్తిగా దూరంగా ఉంచక్కర్లేదు కానీ ఉపయోగించే విధానం సరిచూసుకోండి. పని పూర్తయ్యాక కాసేపు స్క్రీన్ నుంచి విరామం తీసుకోండి. ఆ తరవాతే సోషల్‌మీడియాలోకి వెళ్లండి. నిద్రపోవడానికి కనీసం అరగంట ముందే ఫోన్ పక్కన పెట్టండి. ఇలాంటి చిన్న అలవాట్లు మెదడుకీ విశ్రాంతినిస్తాయి. డిజిటల్ బర్న్‌అవుట్ నుంచీ కాపాడతాయి. ఓసారి ప్రయత్నించి చూడండి మరి!



లంచం ఇచ్చేందుకు డబ్బుల్లేవని..
ముల్లంగి తీసుకొచ్చిన రైతు

కర్ణాటకలోని తుమకూరు జిల్లాలో తన పొలానికి దారి ఇవ్వాలని రెవెన్యూ అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగిన ప్రసన్నకుమార్ అనే రైతు వినూత్న నిరసన తెలిపాడు. "లంచం ఇవ్వడానికి నా దగ్గర డబ్బులు లేవు. కావాలంటే నేను కష్టపడి పండించిన ముల్లంగిని లంచంగా తీసుకొని పని చేయండి" అంటూ మధుగిరి తహసీల్దారు కార్యాలయం ముందు చేతి మైకుతో అరవడం మొదలుపెట్టాడు. మంగళవారం జరిగిన ఈ ఘటన చర్చనీయాంశమైంది. ప్రసన్నకుమార్ మధుగిరి తాలూకాలోని జక్కైనహళ్లి గ్రామానికి చెందిన సామాన్య రైతు. సర్వే నంబరు 8/1లో ఆయన పొలం ఉంది. ప్రభుత్వ రికార్డుల ప్రకారం ఆ పొలానికి దారి



ఉంది. కొందరు ఆక్రమించుకోవడంతో రైతు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాడు. పలుమార్లు ఫిర్యాదు చేసినా.. లోకాయుక్త చెప్పినా ఎవరూ పట్టించుకోలేదు. వాయిదాలతో కాలం వెళ్లదీస్తున్నారు. లంచం ఇవ్వనందునే అధికారులు తన పని చేయడం లేదని భావించిన ప్రసన్నకుమార్ ఈ విధమైన నిరసనకు దిగాడు.

అయ్యా!
నేను బతికే ఉన్నా..

ప్రభుత్వ కార్యాలయాల వ్యవస్థలో వేళ్లూనుకున్న నిర్లక్ష్య ధోరణికి ఈ ఉదంతం పరాకాష్ఠ. మధ్యప్రదేశ్‌లోని సింగరౌలీ జిల్లా జీర్ గ్రామానికి చెందిన చంద్రబలీ పటేల్ అనే మధ్య వయస్కుడు తాను బతికే ఉన్నానని నిరూపించుకునేందుకు గత పదేళ్లుగా అన్ని కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నాడు. 2014లో ఈయన మరణించినట్లుగా అధికారులు ధ్రువపత్రం జారీ చేశారు. దాని ఆధారంగా చంద్రబలీ భార్య పదేళ్లుగా వితంతు పెన్షను పొందుతున్నారు. పంచాయతీ అధికారులు తన భార్యతో కుమ్మక్కై ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేస్తున్నారని చంద్రబలీ పలు ఫిర్యాదులు చేస్తూ వచ్చినా ఎవరూ పట్టించుకోలేదు. విసిగి వేసారిన బాధితుడు బుధ



వారం 'అయ్యా! నేను బతికే ఉన్నా..' అంటూ ఓ పోస్టరుతో సింగరౌలీ కలెక్టరేట్ ఎదుట ప్రదర్శనకు దిగాడు. సింగరౌలీ జిల్లా కలెక్టర్ గౌరవ్ బినాల్ దీనిపై స్పందిస్తూ.. "ఈ విషయం ఇప్పుడే నా దృష్టికి వచ్చింది. నిష్పాక్షిక దర్యాప్తు జరిపి కఠినచర్యలు తీసుకోవాల్సిందిగా జిల్లా పంచాయతీ సీఈవోకు ఆదేశాలు జారీ చేశాను" అని తెలిపారు.

మేఘాలయ బొగ్గు గనిలో పేలుడు..
18 మంది మృతి


షిల్లాంగ్: మేఘాలయలోని ఓ బొగ్గుగనిలో గురువారం పేలుడు సంభవించడంతో 18 మంది కూలీలు ప్రాణాలు కోల్పోయారు. తూర్పు జయంతియా హిల్స్ జిల్లాలోని థంగ్స్కు ప్రాంతంలో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. శిథిలాల కింద మరికొందరు కూలీలు చిక్కుకుపోయినట్లుగా తెలుస్తోంది. దీంతో మృతుల సంఖ్య పెరగొచ్చని అధికారులు భావిస్తున్నారు. మృతుల్లో ఎక్కువ మంది అస్సాంకు చెందినవారిగా తెలుస్తోంది. ప్రస్తుతం సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఈ గనిని అక్రమంగా నిర్వహిస్తున్నట్లు సమాచారం. ఈ ఘటనపై ప్రధాని మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ.2 లక్షలు, క్షతగాత్రులకు రూ.50 వేల చొప్పున పరిహారం ప్రకటించారు.


పేలుడు జరిగిన గని

కరవు భత్యం ఉద్యోగుల హక్కు

- 2008-2019 కాలానికి డీఏ చెల్లించండి
- పశ్చిమ బెంగాల్ ప్రభుత్వానికి సుప్రీంకోర్టు ఆదేశం

దిల్లీ: లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులకు సుప్రీంకోర్టులో గురువారం భారీ ఉపశమనం లభించింది. కరవు భత్యం (డీఏ) పొందడం ఉద్యోగుల చట్టబద్ధమైన హక్కు అని న్యాయస్థానం స్పష్టం చేసింది. 2008-2019 కాలానికి సంబంధించి డీఏను ఉద్యోగులకు చెల్లించాలని పశ్చిమ బెంగాల్ ప్రభుత్వాన్ని ఆదేశించింది. బకాయిపడిన మొత్తంలో 25శాతాన్ని మార్చి 6వ తేదీకల్లా ఉద్యోగులకు అందజేయాలని జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా ధర్మాసనం తెలిపింది.



అఖిల భారత వినియోగ ధరల సూచీ (ఏఐసీపీఐ) ప్రకారం నిర్ణయించిన డీఏ లెక్కింపు విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆఫీస్ మెమోరాండం ద్వారా సవరించడానికి వీల్లేదని పేర్కొంది. 'డీఏ అదనపు ప్రయోజనం కాదు. కనీస జీవన ప్రమాణాల నిర్వహణకు ఇది సాధనం. పౌరుల సామాజిక, ఆర్థిక సంరక్షణ బాధ్యత సంక్షేమ రాజ్య ప్రభుత్వాలదే'నని ధర్మాసనం తెలిపింది. తీర్పు అమలు ఆర్థికంతో ముడిపడి ఉన్నందున మొత్తం డీఏ చెల్లింపు నిర్ధారణ, చెల్లింపుల షెడ్యూల్, విడతల వారీగా నిధుల విడుదల పర్యవేక్షణకు ఓ కమిటీని నియమిస్తున్నట్లు వెల్లడించింది. పదవీ విరమణ చేసిన ఉద్యోగులూ అప్పటి బకాయిలకు అర్హులేనని తెలిపింది. ఏప్రిల్ 15వ తేదీకల్లా స్థాయీ నివేదిక సమర్పించాలని రాష్ట్రప్రభుత్వాన్ని ఆదేశించింది. మొత్తం డీఏ బకాయిలు రూ.41 వేల కోట్లు ఉంటాయని అంచనా.

ఎన్నికల్లో 'ఉచిత' హామీలపై పిటిషన్

- విచారణకు అంగీకరించిన సుప్రీం

దిల్లీ: ఎన్నికల్లో ఓటర్లను ఆకర్షించి విజయం సాధించాలనే లక్ష్యంతో ఆచరణ సాధ్యం కాని 'ఉచిత' హామీలను కుమ్మరించే రాజకీయ పార్టీల రిజిస్ట్రేషన్లను రద్దు చేయాలని కోరుతూ సుప్రీంకోర్టులో గురువారం ప్రజాప్రయోజన వ్యాజ్యం(పిల్) దాఖలైంది. అలవికాని హామీలతో ప్రభుత్వ ఖజానాను దెబ్బతీయాలని చూసే పార్టీల ఎన్నికల గుర్తులను జప్తుచేయాలని కూడా పిటిషనర్ అశ్వినీ ఉపాధ్యాయ విజ్ఞప్తి చేశారు. తన పిటిషన్‌పై 2022లోనే కేంద్రం, ఎన్నికల సంఘానికి నోటీసులు జారీ అయ్యాయని ప్రధాన్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చీ ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. ఉచిత హామీలను తీవ్రమైన సమస్యగా పేర్కొంటూ..మార్చి చివరిలో విచారణ జరిపేందుకు ధర్మాసనం అంగీకరించింది.


దుబాయ్ యువరాజు షేక్ హమ్దాన్ బిన్ మొహమ్మద్ నుంచి పురస్కారం స్వీకరిస్తున్న రూబల్

భారతీయ ఉపాధ్యాయురాలికి 'గ్లోబల్ టీచర్ ప్రైజ్'

పురస్కారంతోపాటు రూ.9 కోట్ల నగదు

దుబాయ్: విద్య అంటే కేవలం తరగతి గది గోడల మధ్య బోధించేది కాదు, బడి ముఖం చూడని పిల్లలకూ ఆ ఫలాలు అందాల్సిందే అని విశ్వసించి, ఆ దిశగా కృషి చేసిన భారతీయ ఉపాధ్యాయురాలు రూబల్ నాగికి ప్రపంచస్థాయి గౌరవం దక్కింది. దుబాయ్‌లో గురువారం జరిగిన వరల్డ్ గవర్నమెంట్స్ సమిట్‌లో ఆమె ప్రతిష్ఠాత్మక గ్లోబల్ టీచర్ ప్రైజ్-2025ను అందుకున్నారు. ఈ పురస్కారం కింద రూబల్ నాగికి వర్కీ ఫౌండేషన్ 10 లక్షల డాలర్ల(సుమారు రూ.9కోట్లు) నగదు బహుమతిని అందించింది. రూబల్ నాగి ఆర్ట్ ఫౌండేషన్ ద్వారా ఆమె దేశవ్యాప్తంగా వెనుకబడిన వర్గాల పిల్లల కోసం సుమారు 800 అభ్యసన కేంద్రాలు ఏర్పాటు చేయడంతోపాటు, వివిధ సబ్జెక్టులకు సంబంధించిన కుడ్య చిత్రాలతో మురికివాడల గోడలను తరగతి గదుల్లా మార్చేశారు. తనకు లభించిన నగదు బహుమతితో విద్యార్థులకు ఉచితంగా వృత్తి శిక్షణ అందించేందుకు సిద్ధమవుతున్నారు.

40 ఏళ్ల తర్వాత న్యాయం.. వందేళ్ల వృద్ధుడికి విముక్తి

- నిర్దోషిగా హైకోర్టు తీర్పు

ప్రయాగ్‌రాజ్: దశాబ్దాల నిరీక్షణ తర్వాత వందేళ్ల వృద్ధుడికి న్యాయం దక్కింది. 40 ఏళ్ల కిందటి హత్యకేసులో ఆయనను నిర్దోషిగా తేలుస్తూ అలహాబాద్ హైకోర్టు తాజాగా తీర్పునిచ్చింది. 1982లో ఓ భూవివాదం ఒకరి హత్యకు దారితీసింది. ఉత్తర్‌ప్రదేశ్‌లో జరిగిన ఈ ఘటనలో మైకు ప్రధాన నిందితుడు కాగా.. ధనీరామ్, సత్తిదిన్ హత్యకు ప్రేరేపించారని అభియోగాలు నమోదయ్యాయి. హమీర్‌పుర్ సెషన్స్ కోర్టు 1984లో ధనీరామ్, సత్తిదిన్‌లకు జీవితఖైదు విధించింది. మైకు మాత్రం అరెస్టు కాలేదు. సెషన్స్ కోర్టు తీర్పును సవాలు చేస్తూ.. ఆ ఇద్దరూ 40 ఏళ్ల క్రితం అలహాబాద్ హైకోర్టును ఆశ్రయించారు. అప్పటినుంచీ ఈ పిటిషను పెండింగులోనే ఉండిపోయింది. విచారణ దశలో నిందితులకు బెయిలు మంజూరైంది. కేసు ఎటూ తేలకుండానే కొన్నేళ్ల క్రితం సత్తిదిన్ మృతిచెందగా.. తాజాగా హైకోర్టులో విచారణ జరిగింది. ప్రధాన నిందితుడు మైకును అరెస్టు చేయకపోవడాన్ని కోర్టు ప్రస్తావించింది. ధనీరామ్ అప్పీలుపై నిర్ణయంలో అసాధారణ జాప్యం, ప్రాసిక్యూషనులో లోపాలను ఎత్తిచూపిన న్యాయస్థానం అతడి వయసును కూడా పరిగణనలోకి తీసుకొని నిర్దోషిగా తీర్పు చెప్పింది. దీర్ఘకాలంగా కేసు విచారణలో ఉన్నందున నిందితుడు ఇప్పటి వరకు సమాజంలో ఎదుర్కొన్న ఇబ్బందులనూ పరిగణనలోకి తీసుకోవాలని తెలిపింది.

వాకింగ్‌కు తీసుకెళ్లి.. ప్రియుడి సాయంతో భర్త హత్య

- రాజస్థాన్‌లో దారుణ ఘటన

జైపుర్: పెళ్లయిన మూడు నెలలకే ప్రియుడితో కలసి భర్తను హత్య చేయించిందో యువతి. పక్కా ప్రణాళిక ప్రకారం వాకింగ్‌కు తీసుకెళ్లి.. ప్రియుడు, అతడి స్నేహితులతో దాడి చేయించింది. ఆపై రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించే యత్నం చేసింది. మేఘాలయ 'హనీమూన్ హత్య'ను గుర్తుచేస్తున్న ఈ దారుణ ఘటన రాజస్థాన్‌లో చోటుచేసుకుంది. శ్రీగంగానగర్‌కు చెందిన ఆశిష్‌కు మూడు నెలల కిందట అదే ప్రాంతానికి చెందిన అంజూతో వివాహమైంది. జనవరి 30న రాత్రి 9 గంటల సమయంలో ఆశిష్, అంజూ రోడ్డుపై అపస్మారక స్థితిలో పడి ఉన్నట్లు కనిపించడంతో అటుగా వెళ్తున్న కొందరు ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఆశిష్ ప్రాణాలు కోల్పోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ సమాచారం అందుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

నగలు లాక్కెళ్లినట్టు నాటకమాడి..

గుర్తుతెలియని వాహనం తమను ఢీకొట్టిందని, ఆ తర్వాత అందులోని వ్యక్తులు తన నగలు లాక్కెళ్లినట్లు అంజూ విచారణలో పేర్కొంది. అయితే ఆమె చెప్పిన వివరాలకు, ఘటనా స్థలంలోని పరిస్థితులకు పొంతన లేకపోవడం, ఆశిష్ ఒంటిపై తీవ్ర గాయాలు ఉండగా, అంజూకు మాత్రం ఎలాంటి గాయాలు కాకపోవడంతో పోలీసులు అనుమానంతో ఆమెను గట్టిగా ప్రశ్నించారు. దీంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. అంజూ పెళ్లికి ముందు తన ఇంటి సమీపంలో నివసించే సంజూ అనే వ్యక్తిని ప్రేమించినట్లు పోలీసులు వెల్లడించారు. "వివాహం తర్వాత కూడా సంజూతో ఆమె ఫోన్‌లో మాట్లాడుతుండేది. పుట్టింటికి వెళ్లిన సమయంలో బాయ్‌ఫ్రెండ్‌ను కలిసిన ఆమె.. భర్త హత్యకు కుట్ర పన్నింది. ఘటన జరిగిన రాత్రి ఆశిష్‌ను తీసుకుని అంజూ నిర్మానుష్య రహదారిపై వాకింగ్‌కు వెళ్లింది. అప్పటికే అక్కడ సంజూ తన ఇద్దరు స్నేహితులతో కలిసి మాటు వేశాడు. వారంతా ఆశిష్‌పై దాడి చేసి చంపారు. నగల కోసమే దాడి జరిగినట్లు నమ్మించడానికి అంజూ తన చెవి కమ్మలు, ఫోన్ సంజూకు ఇచ్చి పంపింది. ఆ తర్వాత స్పృహ తప్పి రోడ్డుపై పడిపోయినట్లు నటించింద"ని పోలీసులు తెలిపారు. ఈ ఘటనలో నిందితులను అరెస్టు చేశారు.


ఆశిష్, అంజూ


సంజూ



సరైన జీవనశైలితో ఉత్సాహం ఉరకలు

కొన్నిసార్లు మీరు నిద్ర లేవగానే అలసటగా ఉండటానికి కారణం మీ జీవనశైలి. ముఖ్యంగా ఉదయాన్నే సూర్యరశ్మి తగలకపోవడం. శరీరానికి అవసరమైన ఖనిజ లవణాలు అందకపోవడం. అతిగా శుద్ధి చేసిన ఆహారాన్ని తీసుకోవడం. రాత్రంతా ఫోన్ లేదా టీవీ స్క్రీన్లు చూడటం వంటివి. అందుకే సమయానికి నిద్రపోవడంతో పాటు సరైన జీవనశైలిని అనుసరిస్తే మీలో ఉత్సాహం తొణికిసలాడుతుంది.

– గ్యారీ బ్రెకా, జీవశాస్త్రవేత్త

ఆర్ఏసీలో బెర్త్ దొరక్కపోతే.. ఛార్జీలో కొంత తిరిగివ్వాలి

- పార్లమెంటరీ కమిటీ సూచన

దిల్లీ: రైలు ప్రయాణంలో ఆర్ఏసీ కేటగిరి కింద బుక్ చేసుకున్న టికెట్లకు పూర్తి ఛార్జీ వసూలు చేయడం సమర్థనీయం కాదని పార్లమెంటరీ కమిటీ పేర్కొంది. ఆర్ఏసీలోనే ఉండి బోర్డింగ్ సమయంలో బెర్త్ లభించని ప్రయాణికులకు ఛార్జీలో కొంత మేర తిరిగివ్వాలని సూచించింది. ఇందుకోసం ప్రత్యేక వ్యవస్థను రూపొందించాల్సిన అవసరం ఉందని తెలిపింది. 'పంక్చువాలిటీ అండ్ ట్రావెల్ టైమ్ ఇన్ ట్రైన్ ఆపరేషన్స్ ఇన్ ఇండియన్ రైల్వేస్' పేరుతో పార్లమెంట్‌కు సమర్పించిన నివేదికలో ప్రజాపద్దుల కమిటీ ఈ మేరకు పేర్కొంది. ప్రస్తుతం ఆర్ఏసీ కింద బెర్త్ బుక్ చేసుకునే ప్రయాణికుల నుంచి పూర్తి మొత్తంలో ఛార్జీ వసూలు చేస్తున్నారు. ఇదే కేటగిరి కింద ఉండే మరో ప్రయాణికుడితో బెర్త్ పంచుకోవాల్సి ఉంటుంది. ఈ క్రమంలో ఇద్దరు ప్యాసింజర్లు పూర్తి మొత్తాన్ని చెల్లిస్తున్నారు. ఇలాంటి ప్రయాణికులకు టికెట్‌లో కొంత మొత్తాన్ని తిరిగి చెల్లించాలని, దీనికి సంబంధించి తీసుకున్న చర్యలను తెలియజేయాలని పార్లమెంటరీ కమిటీ ఆదేశించింది.

బెంగాల్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఒంటరి పోరు

దిల్లీ: పశ్చిమ బెంగాల్‌లో రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఒంటరిగానే బరిలోకి దిగనుంది. రాష్ట్రంలోని మొత్తం 294 స్థానాల్లో తన అభ్యర్థులను నిలబెట్టనుంది. దిల్లీలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నివాసంలో గురువారం జరిగిన సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. పార్టీ అగ్రనేతలు రాహుల్ గాంధీ, కేసీ వేణుగోపాల్ తదితరులు ఇందులో పాల్గొన్నారు.

ముద్దులమావయ్య



ఇంటర్నెట్ డెస్క్: ఉత్తర్‌ప్రదేశ్‌లోని అలీగఢ్‌లో ఓ మేనమామ తన మేనల్లుడి మొదటి పుట్టినరోజుకు అదిరిపోయే కానుకలు ఇచ్చాడు. అఖిలేశ్ చౌహాన్ అనే వ్యక్తి మేనల్లుడు శివాయ్ తొలి జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఆ చిన్నారి కోసం అఖిలేశ్ ఖరీదైన ప్లాటు, రూ.11 లక్షల నగదు, 20 గ్రాముల బంగారు గొలుసు, అర కిలో వెండి వస్తువులు, పలురకాల దుస్తులు, బొమ్మలు ఇచ్చారు. అంతేకాకుండా బాలుడి తల్లికి 35 గ్రాముల బంగారుహారం, మరిన్ని బంగారు ఆభరణాలతోపాటు వెండి వస్తువులను బహుమతిగా ఇచ్చారు. వేడుకకు వచ్చిన బంధువులకూ కానుకలు అందజేశారు. ఇంట్లో ఓవైపు గుట్టలా అమర్చిన ఈ కానుకల చిట్టాను ఓ వ్యక్తి చదువుతుండగా.. అందరూ విస్తుపోయి చూశారు. 'ప్రియమైన శివాయ్‌కు ప్రేమతో.. మామ కానుకలు' అనే వ్యాఖ్య జోడించి ఇన్‌స్టాలో ఈ వీడియోను అఖిలేశ్ పోస్టు చేయగా.. పలువురు నెటిజన్లు స్పందించి అభినందనలు తెలిపారు.

ఒమన్‌లో నేడే అమెరికా-ఇరాన్ అణు చర్చలు

దుబాయ్: ఒమన్ వేదికగా అమెరికా, ఇరాన్ శుక్రవారం అణు చర్చలు జరపనున్నాయి. ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చీ ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించారు. తొలుత తుర్కియేలో ఈ చర్చలు జరపాలని భావించినా.. తర్వాత వేదికను ఒమన్‌కు మార్చారు. ఇందులో కేవలం అణు అంశాలపైనే కాకుండా, ఇతర విషయాలపైనా సమాలోచనలు జరపాలని టెహ్రాన్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. మరోవైపు- ఇరాన్‌తో చర్చలకు సమయం దగ్గరపడ్డ వేళ ఆ దేశ సుప్రీం నేత అయతుల్లా అలీ ఖమేనీకి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి గట్టి హెచ్చరిక జారీ చేశారు. ఓ వార్తాసంస్థతో ముఖాముఖిలో ఆయన మాట్లాడుతూ.. "ఖమేనీ చాలా కలత చెందక తప్పదు" అని పేర్కొన్నారు.

■ మరోవైపు- ఇంధన అక్రమ రవాణాకు పాల్పడుతున్నాయంటూ పర్షియన్ గల్ఫ్‌లో రెండు విదేశీ చమురు ట్యాంకర్లను ఇరాన్ గురువారం స్వాధీనం చేసుకుంది. అవి ఏ దేశానికి చెందినవన్నది ప్రస్తుతానికి తెలియరాలేదు.

కంచె నిర్మాణానికి భూమి కేటాయిస్తాం: మమత

కోల్‌కతా: బంగ్లాదేశ్‌తో సరిహద్దు వెంబడి పశ్చిమబెంగాల్‌లో కంచె నిర్మాణం కోసం కేంద్రానికి భూమి ఇచ్చేందుకు తమకు అభ్యంతరం లేదని సీఎం మమతా బెనర్జీ గురువారం సుముఖత వ్యక్తం చేశారు. అయితే.. రాష్ట్రంలో బీఎస్ఎఫ్ అధికార పరిధిని 15 నుంచి 50 కి.మీ.లకు పెంచుతూ గతంలో ఏకపక్షంగా తీసుకున్న నిర్ణయాన్ని కేంద్రం ముందుగా వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ సమావేశంలో గవర్నర్ ప్రసంగంపై చర్చ సందర్భంగా దీదీ ఈ మేరకు మాట్లాడారు.

ఎన్నికల వేళ బడ్జెట్‌లో తాయిలాలు

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో గురువారం బెంగాల్ అసెంబ్లీలో ప్రవేశపెట్టిన రూ.4.06 లక్షల కోట్ల ఓటాన్ అకౌంట్ బడ్జెటును ప్రచారపత్రంలా మార్చి పలు సంక్షేమ పథకాలకు పెద్దపీట వేశారు. సర్కారు అమలుచేస్తున్న 'లక్ష్మీర్ భండార్' పథకం కింద ప్రతి నెలా మహిళలకు ఇస్తున్న సాయాన్ని రూ.500 మేర పెంచారు. ఇకపై జనరల్ కేటగిరీ మహిళలకు రూ.1,500, ఎస్సీ-ఎస్టీలకు రూ.1,700 ఇస్తారు.

33 గంటల తర్వాత..
ముంబయి-పుణె ఎక్స్‌ప్రెస్‌వేపై మొదలైన రాకపోకలు

ముంబయి: మహారాష్ట్రలోని రాయ్‌గఢ్ జిల్లాలో ముంబయి-పుణె ఎక్స్‌ప్రెస్‌వేపై గ్యాస్ ట్యాంకర్ బోల్తా పడటంతో కిలోమీటర్ల మేర నిలిచిపోయిన వాహనాల రాకపోకలు పునః ప్రారంభమయ్యాయి. ప్రమాదం జరిగిన దాదాపు 33 గంటల తర్వాత ఖండాలా ఘాట్‌పై బోల్తా పడిన గ్యాస్ ట్యాంకర్‌ను అధికారులు తొలగించారు. మంగళవారం సాయంత్రం దాదాపు 5గంటల సమయంలో ఖండాలా ఘాట్‌పై గ్యాస్ ట్యాంకర్ బోల్తా పడిన విషయం తెలిసిందే. దీంతో దాదాపు 20 కి.మీ.వరకు ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ట్రాఫిక్‌లో చిక్కుకుపోయిన మహిళలు, చిన్నారులు సహా ప్రయాణికులు ఆహారం, నీరు, టాయిలెట్ సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గురువారం తెల్లవారుజామున 1.46 గంటలకు గ్యాస్ ట్యాంకర్‌ను తొలగించి మరో ప్రాంతానికి తరలించడంతో వాహనాల రాకపోకలు తిరిగి ప్రారంభమయ్యాయి.

చివరికి హెలికాప్టర్‌లో పయనం..

ముంబయి- పుణె ఎక్స్‌ప్రెస్‌వేపై గ్యాస్ ట్యాంకర్ బోల్తా పడటంతో 8 గంటల పాటు ట్రాఫిక్‌లో చిక్కుకుపోయిన పారిశ్రామికవేత్త, ఎకా మొబిలిటీ సంస్థ ఛైర్మన్ సుధీర్ మెహతా తర్వాత హెలికాప్టర్‌ను ఏర్పాటు చేయించుకుని అక్కడి నుంచి బయటపడ్డారు. ఈ విషయాన్ని స్వయంగా ఆయనే సామాజిక మాధ్యమంలో పంచుకున్నారు. "ఒకే ఒక్క గ్యాస్ ట్యాంకర్ కారణంగా అనేకమంది ప్రజలు గంటల తరబడి రోడ్డు పైనే ఉండిపోయారు. ఎక్స్‌ప్రెస్‌వేపై ఇలాంటి అత్యవసర పరిస్థితుల సమయంలో వాహనాలు వెనక్కి తిరిగివెళ్లేలా. ఎగ్జిట్ పాయింట్లు ఉండాలి. హెలిప్యాడ్‌ల నిర్మాణానికి రూ.10 లక్షల కంటే తక్కువ ఖర్చవుతుంది. ఎక్స్‌ప్రెస్ మార్గాల వద్ద వీటిని తప్పనిసరిగా ఏర్పాటుచేయాలి" అని మెహతా ఎక్స్‌లో రాసుకొచ్చారు.

అమెరికా-రష్యా మధ్య ముగిసిన న్యూ స్టార్ట్ ఒప్పంద గడువు

మాస్కో: అణ్వాయుధ వ్యాప్తి నియంత్రణకు అమెరికా-రష్యా మధ్య మిగిలి ఉన్న ఏకైక ఒప్పందం 'న్యూ స్టార్ట్' గడువు గురువారంతో ముగిసింది. గత అర్ధ శతాబ్ద కాలంలో ఈ రెండు దేశాల మధ్య అణ్వస్త్ర వ్యాప్తి నిరోధక ఒప్పందమేమీ లేకపోవడం ఇదే తొలిసారి. తాజా పరిణామంతో అణ్వాయుధ బలం పెంపు ప్రయత్నాలను ఇరు దేశాలు ముమ్మరం చేసే అవకాశాలున్నాయి. 'న్యూ స్టార్ట్' గడువు ముగియడంపై రష్యా విచారం వ్యక్తం చేసింది. మరోవైపు.. న్యూ స్టార్ట్ గడువును పొడిగించుకోవడానికి బదులు మరింత బలమైన కొత్త ఒప్పందం కుదుర్చుకోవడం మేలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ట్రూత్ సోషల్‌లో పేర్కొన్నారు.

శశిథరూర్ కుమారుడి ఉద్యోగం పోయింది..

ఈటీవీ భారత్: ప్రపంచంలోని ప్రముఖ మీడియా సంస్థల్లో ఒకటైన 'ది వాషింగ్టన్ పోస్ట్' విస్తృత స్థాయిలో ఉద్యోగులను కుదించింది. ఆ జాబితాలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ ఎంపీ శశిథరూర్ కుమారుడు ఇషాన్ థరూర్ కూడా ఉన్నారు. 'ఇది చాలా చెడ్డరోజు' అంటూ ఇషాన్ ఈ విషయాన్ని 'ఎక్స్' వేదికగా స్వయంగా వెల్లడించారు. "దాదాపు 12 ఏళ్లుగా కలిసి పని చేసిన అద్భుతమైన జర్నలిస్టుల కోసం నా గుండె బాధపడుతోంది. వారితో కలిసి పనిచేయడం నా జీవితంలో గొప్ప గౌరవం" అని రాసుకొచ్చారు. 2017లో తాను ప్రారంభించిన 'వరల్డ్ వ్యూ' కాలమ్ గురించి మరో పోస్టులో వివరిస్తూ అనుసరించిన లక్షలాది పాఠకులకు




ధన్యవాదాలు తెలిపారు. వ్యయభారాన్ని తగ్గించుకునేందుకు చేపట్టిన పునర్వ్యవస్థీకరణ చర్యల్లో భాగంగా.. మొత్తం ఉద్యోగుల్లో మూడోవంతు సిబ్బందికి 'వాషింగ్టన్ పోస్ట్' కోత పెట్టింది. ఈ వార్తాపత్రికను 1877లో స్టిల్సన్ హచిన్స్ స్థాపించారు. 2013లో 'అమెజాన్' వ్యవస్థాపకుడు జెఫ్ బెజోస్ దీనిని సొంతం చేసుకున్నారు.

పశ్చాత్తాపపడుతున్నా

- ఎప్‌స్టీన్ కుంభకోణంపై బిల్ గేట్స్ వ్యాఖ్య

ఇంటర్నెట్ డెస్క్: సెక్స్ కుంభకోణంలో దోషిగా తేలి శిక్ష అనుభవిస్తూ మరణించిన ఎప్‌స్టీన్‌తో అప్పట్లో తాను ఉన్న ప్రతి క్షణానికీ చింతిస్తున్నానని మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్ పేర్కొన్నారు. 'ఎప్‌స్టీన్ కోసం కేటాయించిన ప్రతి క్షణానికీ ఇప్పుడు నేను చింతిస్తున్నా. క్షమాపణలు కోరుతున్నా. ఆ ఈమెయిల్‌లో ఉన్నది నిజం కాదు. అప్పుడు అతడి ఆలోచన ఏంటో నాకు తెలియదు. ఏదో ఒక రూపంలో అతడు నన్ను లక్ష్యంగా చేయాలని ప్రయత్నించాడు' అని వ్యాఖ్యానించారు.




■ ఎప్‌స్టీన్ కుంభకోణంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న బ్రిటన్ మాజీ యువరాజు ఆండ్రూ మౌంట్‌బాటెన్- విండ్సర్.. రాజు ఛార్లెస్‌కు చెందిన శాండింగం ఎస్టేట్‌కు మారారు. తూర్పు లండన్‌లో ఉన్న ఈ ఇంట్లో ఆయన ఉండనున్నారు.

ఎప్‌స్టీన్‌తో సంబంధాల్లేవు: సిన్హా

దిల్లీ: సెక్స్ కుంభకోణంలో నిందితుడైన ఎప్‌స్టీన్‌తో తనకు ఎలాంటి సంబంధాల్లేవని బ్రిటన్‌లో భారత మాజీ హైకమిషనర్ యశ్వర్ధన్ కుమార్ సిన్హా స్పష్టం చేశారు. తనకు ఎప్‌స్టీన్‌తో సంబంధాలున్నాయని సోషల్ మీడియాలో వార్తలొచ్చిన నేపథ్యంలో ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 'నేను 2016, 2018 మధ్య బ్రిటన్‌లో భారత హైకమిషనర్‌గా పని చేశా. ఎప్‌స్టీన్‌తో వైకే సిన్హాకు సంబంధాలున్నాయని ఓ వ్యక్తి ట్వీట్ చేశారు. ఆ సిన్హా నేను కాదు' అని ఆయన వివరించారు.

ఎప్‌స్టీన్ బాధితులను క్షమాపణ కోరిన బ్రిటన్ ప్రధాని



లండన్: ఎప్‌స్టీన్ బాధితులను బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ క్షమాపణ కోరారు. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న పీటర్ మాండెల్సన్‌ను అమెరికాలో బ్రిటన్ రాయబారిగా నియమించినందుకు ఈ క్షమాపణ కోరారు. మాండెల్సన్ అబద్ధాలు చెప్పారని, ఎప్‌స్టీన్ తనకు పెద్దగా తెలియదని పేర్కొన్నారని వివరించారు. 'మీకు జరిగిన దానికి క్షమాపణ కోరుతున్నా. మాండెల్సన్ చెప్పిన అబద్ధాలను నమ్మినందుకు మన్నించండి' అని బాధితులను ఉద్దేశించి స్టార్మర్ వ్యాఖ్యానించారు.

■ సీనియర్ రాజకీయ నేత అయిన మాండెల్సన్‌ను 2024లో అమెరికా రాయబారిగా స్టార్మర్ నియమించారు. ఎప్‌స్టీన్ ఫైళ్లలో మాండెల్సన్ పేరు బయటకు రావడంతో గత ఏడాది సెప్టెంబరులో ఆయనను తొలగించారు.

అంతా బహిరంగమే

- బాధితుల నగ్న చిత్రాలు, పేర్లు, ముఖాలు కనిపించాయ్
- ఎప్‌స్టీన్ ఫైళ్ల ద్వారా బహిర్గతం

న్యూయార్క్: ఎప్‌స్టీన్ సెక్స్ కుంభకోణం కేసులో బాధితుల నగ్న చిత్రాలు, పేర్లు, ముఖాలు, వారి బ్యాంకు ఖాతాలు, సోషల్ సెక్యూరిటీ నంబర్లు.. అన్నీ బహిరంగమయ్యాయి. అమెరికా న్యాయశాఖ విడుదల చేసిన 30 లక్షల పత్రాల్లో ఈ వివరాలన్నీ ఉన్నాయి. అవన్నీ అందరికీ అందుబాటులోకి వచ్చాయి. ఎప్‌స్టీన్ బాధితుల ప్రైవసీని కాపాడటానికి చట్టం ఉంది. వారి పేర్లు, ఫొటోలు, శరీరాలు కనిపించకుండా బ్లర్ చేయాలి. కానీ అవేమీ చేయలేదు. మీడియా సంస్థల పరిశీలనలో న్యాయశాఖ అటువంటి జాగ్రత్తలు తీసుకోలేదని తేలింది. వెబ్‌సైట్‌ను నిలిపేసి సవరణలు చేయాలని కొంత మంది నిందితులు.. అమెరికా న్యాయశాఖను కోరారు.

పర్యావరణ ఉల్లంఘన ప్రాజెక్టులకు పూర్వానుమతులపై ధర్మాసనం ఏర్పాటుకు వినతి

పరిశీలిస్తామన్న సీజేఐ

దిల్లీ: పర్యావరణ నిబంధనలను ఉల్లంఘిస్తూ నిర్మాణాలు ప్రారంభించిన ప్రాజెక్టులకు పూర్వానుమతుల జారీపై విచారణకు సుప్రీంకోర్టు ధర్మాసనం ఏర్పాటు చేయాలన్న విజ్ఞప్తిని పరిశీలిస్తామని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ తెలిపారు. గత ఏడాది నవంబరు 18న అప్పటి సీజేఐ జస్టిస్ బి.ఆర్.గవాయ్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం పర్యావరణ నిబంధనలు ఉల్లంఘించిన ప్రాజెక్టులకు భారీ జరిమానాలు విధించి పూర్వానుమతులు ఇవ్వవచ్చంటూ 2:1 మెజారిటీ తీర్పును వెలువరించింది. అనుమతులివ్వకుంటే రూ.వేల కోట్ల ప్రజాధనం వృధా అవుతుందని పేర్కొంది. అయితే, ఈ తీర్పుకన్నా ముందు..అదే ఏడాది మే 16న జస్టిస్ ఎ.ఎస్.ఓకా, జస్టిస్ ఉజ్జల్ భుయాన్ ధర్మాసనం అటువంటి ప్రాజెక్టులకు పూర్వానుమతులను ఇవ్వరాదంటూ కేంద్ర పర్యావరణ, అటవీ, పర్యావరణ మార్పుల శాఖను ఆదేశించింది. ఈ తీర్పును జస్టిస్ గవాయ్ ధర్మాసనం పక్కనపెట్టింది.

ఇరాన్‌లో పరిస్థితిని నిశితంగా గమనిస్తున్నాం: కేంద్రం

దిల్లీ: ఇరాన్‌లో పరిస్థితిని నిశితంగా గమనిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం తెలిపింది. ఇటీవల ఆ దేశంలో చెలరేగిన హింసలో భారతీయులెవరూ మరణించలేదని స్పష్టం చేసింది. విదేశీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి కీర్తివర్ధన్ సింగ్ రాజ్యసభలో ఓ ప్రశ్నకు గురువారం ఈ మేరకు రాతపూర్వకంగా సమాధానమిచ్చారు. ఇరాన్‌లో దాదాపు 9-10 వేల మంది భారతీయులు నివసిస్తున్నట్లు తెలిపారు.

అబుధాబీలో రెండో రోజూ
కొనసాగిన రష్యా-ఉక్రెయిన్ చర్చలు

కీవ్: దాదాపు నాలుగేళ్లుగా సాగుతున్న యుద్ధానికి తెరదించే ప్రయత్నాల్లో భాగంగా.. యూఏఈ రాజధాని అబుధాబీ వేదికగా రష్యా, ఉక్రెయిన్ రెండో రోజైన గురువారం కూడా చర్చలు కొనసాగించాయి. అమెరికా మధ్యవర్తిత్వంతో జరుగుతున్న ఈ రెండో రౌండ్ చర్చల్లో ఇప్పటివరకూ ఏయే అంశాలపై ఏకాభిప్రాయం కుదిరిందన్నది అధికారికంగా వెల్లడికాలేదు. అమెరికా ప్రత్యేక రాయబారి స్టీవ్ విట్కాఫ్, ఆ దేశాధ్యక్షుడు ట్రంప్ అల్లుడు జేర్డ్ కుష్నర్, ఐరోపాలో నాటో సుప్రీం అలైడ్ కమాండర్ జనరల్ అలెక్సస్ గ్రింకెవిచ్ తదితరులు తాజా చర్చల్లో పాల్గొన్నారు. అబుధాబీలోనే గత నెల్లో జరిగిన తొలి రౌండ్ సమాలోచనల్లోనూ విట్కాఫ్, కుష్నర్ పాల్గొన్న సంగతి గమనార్హం. మరోవైపు- రష్యాతో జరుగుతున్న యుద్ధంలో ఇప్పటివరకూ తమ సైనికులు 55 వేల మంది అమరులయ్యారని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తెలిపారు. ఇంకా చాలామంది సైనికుల జాడ తెలియరావడం లేదని కూడా పేర్కొన్నారు.


రష్యా దాడితో ఉక్రెయిన్ రాజధాని కీవ్‌లో ధ్వంసమైన అపార్ట్‌మెంట్

రష్యా-అమెరికా మధ్య కీలక అంగీకారం

తమ రెండు దేశాల మధ్య ఉన్నత స్థాయి మిలిటరీ-మిలిటరీ కమ్యూనికేషన్‌ను పునరుద్ధరించుకోవాలని రష్యా, అమెరికా తాజాగా నిర్ణయించుకున్నాయి. అబుధాబీలో రష్యా, అమెరికా, ఉక్రెయిన్ సైనిక ఉన్నతాధికారుల మధ్య జరిగిన చర్చల్లో ఈ కీలక అంగీకారం కుదిరింది. అమెరికా ఐరోపా కమాండ్ గురువారం ఈ మేరకు ప్రకటన విడుదల చేసింది. దీర్ఘకాలిక శాంతి కోసం పనిచేసేందుకు ఇది దోహదపడుతుందని తెలిపింది. ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం ప్రారంభానికి ముందు 2021లో రష్యా, అమెరికా తమ మధ్య ఉన్నత స్థాయి మిలిటరీ-మిలిటరీ కమ్యూనికేషన్‌ను సస్పెండ్ చేసుకున్న సంగతి గమనార్హం.




రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై గురువారం రాజ్యసభలో ప్రసంగిస్తున్న ప్రధాని మోదీ ★ సభలో కేంద్రమంత్రులు నిర్మలాసీతారామన్, అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, ఇతర సభ్యులు

రాష్ట్రపతికి అవమానం

(మొదటి పేజీ తరువాయి)

మన ప్రజల ఉద్యోగాలను, గిరిజనుల భూములను లాక్కునే చొరబాటుదారుల మమత రక్షణ కల్పిస్తున్నారని విమర్శించారు. రాష్ట్రపతి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై గురువారం రాజ్యసభలో ప్రధాని సుదీర్ఘంగా ప్రసంగించారు. ప్రతిపక్ష నేతకు మాట్లాడే అవకాశం ఇవ్వాలంటూ విపక్షాలు సభలో నినాదాలు చేశాయి. ఆ తర్వాత వాకౌట్ చేశాయి. మరోవైపు లోక్‌సభలో ప్రధాని ప్రసంగం లేకుండానే రాష్ట్రపతికి ధన్యవాదాలు తెలిపే తీర్మానం ఆమోదం పొందింది. బుధవారం ప్రతిపక్షాలకు చెందిన మహిళా ఎంపీలు ప్రధానిని చుట్టుముట్టిన నేపథ్యంలో ఆయనను తానే రావొద్దన్నానని స్పీకర్ ఓం బిర్లా గురువారం వెల్లడించారు. రాజ్యసభలో దాదాపు 100 నిమిషాలు ప్రసంగించిన ప్రధాని మోదీ పలు అంశాలను ప్రస్తావించారు.

ప్రేమ దుకాణం అంటూ సమాధి వ్యాఖ్యలా..

'ప్రేమ దుకాణం గురించి మాట్లాడేవారు మోదీకి సమాధి తవ్వుతామని అంటున్నారు. ఎందుకంటే మా ప్రభుత్వం ఆర్టికల్ 370ని రద్దు చేసింది. ఈశాన్యంలో తీవ్రవాదాన్ని, దేశంలో నక్సలిజాన్ని అంతం చేసింది. ఆపరేషన్ సిందూర్ ద్వారా పాకిస్థాన్‌లోని ఉగ్ర శిబిరాలను ధ్వంసం చేసింది. ఇలా ఎన్నో విజయాలను సాధించిన నా చావును కాంగ్రెస్ కోరుకుంటోంది. ఎన్నికల్లో ఓటములతో వచ్చిన అసహనమే ఇది. వారు ఎప్పటికీ నా సమాధిని తవ్వలేరు. నాలాంటి పేద వ్యక్తి అత్యున్నత స్థానానికి చేరుకుని, కొనసాగడాన్ని వారు జీర్ణించుకోలేకపోతున్నారు. దేశంలోని కోట్ల మంది తల్లులు, సోదరీమణులు, పేదల ఆశీస్సులు ఉన్నంత కాలం వారు నన్నేమీ చేయలేరు' అని ప్రధాని పేర్కొన్నారు.

◆ 'తృణమూల్ పార్టీ సహచరులు చాలా మాట్లాడారు. వారు ఆత్మ పరిశీలన చేసుకోవాలి. జాలి లేని తృణమూల్ ప్రభుత్వం దిగజారుడులో సరికొత్త రికార్డులను సృష్టిస్తోంది. వారు ఇక్కడ ప్రసంగాలు చేసినా.. కానీ అక్కడ ప్రభుత్వం.. ప్రజలను బెదిరించి నడుస్తోంది. సంపన్న దేశాలు అక్రమ వలసదారులను వెనక్కి పంపుతున్నాయి. కానీ ఇక్కడ వారి కోసం కోర్టులపైనా ఒత్తిడి తెస్తున్నారు' అని మోదీ ధ్వజమెత్తారు.

◆ 'బుధవారం లోక్‌సభలో జరిగిన ఘటనలు రాష్ట్రపతికి జరిగిన అవమానంగా భావిస్తున్నా' అని మోదీ పేర్కొన్నారు.

◆ 'రాజకీయ కక్షల కారణంగా కాశ్మీ కోల్పోయిన సదానందన్ మాస్టర్ ఎప్పుడూ తప్పుడు భాష వాడలేదని, ఆయనను విపక్షాలు అవమానించాయని ప్రధాని తెలిపారు.

9 వాణిజ్య ఒప్పందాలు

11 ఏళ్లలో తమ ప్రభుత్వం సాధించిన విజయాలను ప్రధాని వివరించారు. అధిక వృద్ధి, అత్యల్ప ద్రవ్యోల్బణం దేశ ఆర్థిక వ్యవస్థ బలాన్ని నిరూపిస్తున్నాయని పేర్కొన్నారు. 'ప్రపంచమంతా ఇప్పుడు భారత్ వైపు చూస్తోంది. దక్షిణార్ధ గోళ దేశాల గొంతుకగా మన దేశం మారింది. జీవితంలో రోజుల్లో పలు దేశాలతో 9 వాణిజ్య ఒప్పందాలను కుదుర్చుకున్నాం. ఐరోపా కూటమి, అమెరికాతో వాణిజ్య ఒప్పందాలతో మరింత సుస్థిరంగా మారబోతున్న ప్రపంచం బావిస్తోంది. అమెరికా ఒప్పందాన్ని ప్రపంచం మొత్తం ప్రశంసిస్తోంది' అని ప్రధాని పేర్కొన్నారు.

నినాదాల మధ్యే..

లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి మాట్లాడే అవకాశం ఇవ్వాలని ప్రతిపక్ష పార్టీలు రాజ్యసభలో ఆందోళన దిగాయి. వారి నినాదాల మధ్యే ప్రధాని ప్రసంగాన్ని ప్రారంభించారు. ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే.. నిల్చుని నినాదాలు చేస్తుండటంతో.. కూర్చుని చేయవచ్చని ప్రధాని చురక అంటించారు. ఆ తర్వాత ప్రతిపక్ష ఎంపీలు వాకౌట్ చేశారు.

◆ అంతకుముందు రాజ్యసభలో గందరగోళం నెలకొంది. లోక్‌సభలో రాహుల్ గాంధీ మాట్లాడేందుకు అవకాశం ఇవ్వకపోవడాన్ని ఖర్గే ప్రస్తావించారు. అయితే లోక్‌సభ అంశాలను రాజ్యసభలో చర్చించడం తగదని రాజ్యసభాపక్ష నేత జేపీ నడ్డా సూచించారు.

ప్రతిపక్షాల తీరు చూసి నేనే ప్రధానిని రావొద్దన్నా: ఓం బిర్లా

లోక్‌సభలో ప్రధాని కూర్చున్న చోటకు వచ్చి కాంగ్రెస్ ఎంపీలు అనూహ్య చర్యకు పాల్పడతారనే కచ్చితమైన సమాచారం ఉందని, అందుకే గురువారం ఆయనను సభకు రావొద్దని తానే సూచించానని స్పీకర్ ఓం బిర్లా తెలిపారు. ఒకవేళ అలాంటి ఘటన జరిగితే దేశ ప్రజాస్వామ్య సంప్రదాయానికి తీవ్ర విఘాతం కలిగేదని స్పష్టం చేశారు. ప్రధాని ప్రసంగం లేకుండానే రాష్ట్రపతికి ధన్యవాదాలు తెలిపే తీర్మానం లోక్‌సభలో ఆమోదం పొందింది. ఈ నేపథ్యంలో గురువారం సాయంత్రం 3 గంటల సమయంలో స్పీకర్ వివరణ ఇచ్చారు. 'బుధవారం సభలో కొందరు సభ్యుల ప్రవర్తన సరిగా లేదు. ఇలాంటి దుస్థితిని గతంలో ఎన్నడూ చూడలేదు. ఇది ఎంతో బాధాకరం. మాయని మచ్చ' అని ఓం బిర్లా వ్యాఖ్యానించారు. తన సూచనను గౌరవించి ప్రధాని సభకు రాకుండా ఉన్నందుకు కృతజ్ఞతలు తెలిపారు.

◆ స్పీకర్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ స్పందించారు. స్పీకర్ వెనుక ప్రధాని దాక్కుంటున్నారని విమర్శించారు. సభలో మోదీని ఇబ్బంది పెట్టేందుకు ప్రతిపక్షాలు సిద్ధమయ్యాయని స్పీకర్ పేర్కొనడం అబద్ధమని స్పష్టం చేశారు.

లోక్‌సభలో..

గురువారం లోక్‌సభ ప్రారంభం నుంచే గందరగోళం నెలకొంది. కాంగ్రెస్ ఎంపీలు వెల్‌లోకి దూసుకెళ్లారు. ప్రధాని మోదీ ఫొటోతో ఉన్న పోస్టర్లను ప్రదర్శించారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ.. మాజీ ఆర్మీ చీఫ్ ఎం.ఎం.నరవణె రాసిన పుస్తకం గురించి ప్రస్తావించారు.

ఏపీ దళిత బిడ్డను కాంగ్రెస్ అవమానించింది

- రాజ్యసభలో ప్రధాని మోదీ ఆక్షేపణ

ఈనాడు, దిల్లీ: రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై లోక్‌సభలో చర్చ జరుగుతున్నప్పుడు స్పీకర్ స్థానంలో ఉన్న ఆంధ్రప్రదేశ్‌కు చెందిన దళిత బిడ్డ (తెదేపా ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్)ను కాంగ్రెస్ అవమానించిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆరోపించారు. గురువారం ఆయన రాజ్యసభలో మాట్లాడుతూ.. కృష్ణప్రసాద్ సీట్లో ఉన్నప్పుడు కాంగ్రెస్ సభ్యులు కాగితాలు చించి విసిరేసి అవమానించారని ఆక్షేపించారు. అదే విధంగా అస్సాంకు చెందిన ఎంపీ (భాజపా ఎంపీ దిలీప్ సైకియా) సభాధ్యక్ష స్థానంలో ఉన్నప్పుడూ కాంగ్రెస్ అదే విధంగా వ్యవహరించిందని, ఒకవైపు ఆంధ్రప్రదేశ్‌ను, మరోవైపు ఈశాన్య భారతాన్ని చెందిన అస్సాంను ఆ పార్టీ అవమానించిందని ధ్వజమెత్తారు. వారికి అందరూ కలిసి సభా నిర్వహణ బాధ్యతలు అప్పగించారని, కానీ వారు దళిత సమాజం నుంచి వచ్చారన్న కారణంతో కాంగ్రెస్ అవమానించిందని మోదీ దుయ్యబట్టారు.

1/3 కాఫీ ఇవ్వలేదని హోటల్‌పై అధికారి ప్రతాపం!



పొక్లెయిన్ ఎదుట పడుకొని నిరసన తెలుపుతున్న హోటల్ యజమాని

ప్రొద్దుటూరు పట్టణం, న్యూస్‌టుడే: 1/3 కాఫీ ఇవ్వలేదని ఓ అధికారి హోటల్ ర్యాంప్ తొలగించేందుకు యత్నించాడు. ఈ ఘటన వైఎస్సార్ కడప జిల్లా ప్రొద్దుటూరులో చోటుచేసుకుంది. పట్టణంలోని ప్రధాన కూడలి వద్ద ఉన్న హోటల్ వద్దకు స్థానిక పురపాలిక అధికారి వెళ్లి ఒక కాఫీని మూడు భాగాలు చేసివ్వమని అడిగారు. ఆ విధానం తన హోటల్‌లో లేదని యజమాని సమాధానమిచ్చారు. ఆగ్రహించిన అధికారి 15 నిమిషాల్లో పొక్లెయిన్ తెప్పించారు. హోటల్ ఎదుట అక్రమంగా ర్యాంపు ఏర్పాటు చేశారని.. దాన్ని తొలగించేందుకు యత్నించారు. పట్టణంలో కాలువలున్న చోటల్లా ర్యాంప్‌లున్నాయని, వాటినీ తొలగించాలని యజమాని డిమాండ్ చేశారు. దీంతో ఇద్దరి మధ్య వాగ్వాదం పెరిగింది. ఒక దశలో యజమాని రోడ్డుపై పడుకొని పొక్లెయిన్‌ను అడ్డుకున్నాడు. తనపైనుంచి పోనిచ్చి, ర్యాంప్‌ను తొలగించాలని నిరసన వ్యక్తం చేశారు. చివరికి అధికారులు దిగివచ్చి తొలగింపు ప్రక్రియను విరమించారు. బుధవారం జరిగిన ఈ ఘటన గురువారం సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

వచ్చే ఏడాది ఫిబ్రవరి 9 నుంచి జనగణన

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్


ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో వచ్చే ఏడాది ఫిబ్రవరి 9 నుంచి 28 వరకు జనగణన నిర్వహించనున్నట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ తెలిపారు. జనగణన-2027పై గురువారం సచివాలయంలో రాష్ట్ర స్థాయి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "జనగణనపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకోవాలి. ఎన్నికల సమయంలోలా నిర్దిష్ట కాలపరిమితిలో చేయాల్సిన పనులపై ప్రత్యేకంగా బుక్‌లెట్‌ను ప్రచురించి, జిల్లాలకు పంపాలి" అని సూచించారు. రాష్ట్ర జనగణన డైరెక్టర్ జె.నివాస్ తాము తీసుకుంటున్న చర్యలను పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు.

చిన్నప్పన్నకు షరతులతో బెయిల్

ఈనాడు, అమరావతి: తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీకి కల్తీ నెయ్యి సరఫరా చేసిన కేసులో నిందితుడు (ఎ24), వైకాపా రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి పూర్వ పీఏ చిన్నప్పన్నకు హైకోర్టు షరతులతో బెయిలు మంజూరు చేసింది. దర్యాప్తు కీలక దశలో ఉందన్న కారణంతో గతంలో ఓసారి బెయిల్ పిటిషన్ను కొట్టేశామని, ప్రస్తుతం దర్యాప్తు పూర్తి చేసి అభియోగ పత్రం దాఖలు చేశారని గుర్తుచేసింది. ఇప్పటికే పలువురు సాక్షులను విచారించారని, పిటిషనర్‌ను మరింత కాలం జ్యుడీషియల్ కస్టడీలో ఉంచి విచారించాల్సిన అవసరం లేదని అభిప్రాయపడింది. పిటిషనర్‌పై ఆరోపణల తీవ్రత, బెయిలిస్తే సాక్షులను ప్రభావితం చేస్తారన్న సిట్ ఆందోళనను పరిగణనలోకి తీసుకొని కఠిన షరతులు విధిస్తున్నామని తెలిపింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి గురువారం ఈ మేరకు తీర్పు చెప్పారు. రూ.లక్షతో రెండు పూచీకత్తులు సమర్పించాలని, దిగువ కోర్టులో పాస్‌పోర్టులు అప్పగించాలని, కోర్టు అనుమతి లేకుండా దేశం విడిచి వెళ్లరాదని, దర్యాప్తు అధికారికి సమాచారం ఇవ్వకుండా రాష్ట్రం దాటి వెళ్లొద్దని చిన్నప్పన్నను కోర్టు ఆదేశించింది. సాక్షులను కలవడం, వారిని ప్రభావితం చేయడం, సాక్ష్యాధారాలను తారుమారు చేయడం నిషిద్ధమని స్పష్టం చేసింది. దర్యాప్తునకు సహకరించాలని, ప్రతి శనివారం ఐవో ముందు హాజరుకావాలని ఆదేశించింది. ఆయన ఈ షరతులను ఉల్లంఘిస్తే బెయిల్ రద్దు కోసం కోర్టును ఆశ్రయించవచ్చని సిట్‌కు సూచించింది.

పంచాయతీరాజ్‌శాఖలో అవినీతి అనకొండ

- ఏసీబీ వలలో విశ్రాంత అధికారి కల్లేపల్లి శ్రీనివాసరావు
- కేజీల కొద్దీ బంగారం, వెండి వెలుగులోకి!



శ్రీనివాసరావు

ఈనాడు–విశాఖపట్నం, సాలూరు–న్యూస్‌టుడే: అవినీతి నిరోధక శాఖ అధికారుల సోదాల్లో పంచాయతీరాజ్‌శాఖ విశ్రాంత ఎస్ఈ కల్లేపల్లి శ్రీనివాసరావు చిక్కారు. ఏకకాలంలో ఐదుచోట్ల తనిఖీలు నిర్వహించగా కేజీల కొద్దీ బంగారం, వెండి, నోట్లకట్టలు వెలుగుచూశాయి. పక్కా సమాచారంతో విశాఖ ఏసీబీ అధికారులు గురువారం విశాఖ మధురవాడ ఎంవీవీ సిటీలోని నివాసంతోపాటు, పార్వతీపురం మన్యం (సాలూరు), హైదరాబాద్ (శేరిలింగంపల్లి)లో ఐదుచోట్ల సోదాలు చేశారు. వివిధ డాక్యుమెంట్లు, నగదు, వెండి, బంగారం స్వాధీనం చేసుకున్నారు. కల్లేపల్లి శ్రీనివాసరావుపై కేసు నమోదుచేసి అరెస్టు చేశారు.




స్వాధీనం చేసుకున్న బంగారం, వెండి వస్తువులు ★ నోట్లకట్టలు, డాక్యుమెంట్లు

అక్రమాస్తుల చిట్టా ఇలా..

★ 2.5 కేజీల బంగారం (సుమారు రూ.4కోట్లు)

★ 20.3 కేజీల వెండి (సుమారు రూ.50లక్షలు)

★ నగదు: రూ.61.87 లక్షలు

★ శివాజీపాలెం, మధురవాడల్లో ఇళ్ల స్థలాలు: విలువ రూ.2 కోట్లు

★ ఫ్లాట్లు: మధురవాడ ఎంవీవీ సిటీలో ఒకటి, జీవీలో మరొకటి (విలువ రూ.2కోట్లు)

★ వ్యవసాయ భూమి: 18.57 సెంట్లు

★ హ్యుందయ్ కారు, మోటార్ సైకిల్, విలువైన గృహోపకరణాలు

మరో 5 బ్యాంకులాకర్ల గుర్తింపు

ఏసీబీ అధికారుల సోదాల్లో 5 బ్యాంకులాకర్ల తాళాలు దొరికాయి. వీటిని శుక్రవారం చూడనున్నారు. పంచాయతీరాజ్ ఏఈగా విధుల్లో చేరిన శ్రీనివాసరావు ఎక్కువ కాలం పాడేరు, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖలో జిల్లాల్లో పనిచేశారు. గతేడాది డిసెంబరు 31న ఎస్ఈగా పదవీవిరమణ పొందారు.

నెయ్యిలో వేరే పదార్థాల కల్తీ జరిగింది.. జంతు కొవ్వు కలవలేదని సిట్ చెప్పింది

- వైకాపా ఎంపీ వైవీ సుబ్బారెడ్డి



ఈనాడు, దిల్లీ: తిరుమలకు సరఫరా అయిన నెయ్యిలో వేరే పదార్థాల కల్తీ జరిగింది, కానీ జంతు కొవ్వు మాత్రం కలవలేదని సిట్ ఛార్జిషీట్‌లో చెప్పిందని తితిదే మాజీ ఛైర్మన్, రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం రకరకాలుగా మాట్లాడుతోందన్నారు. ఈ విషయంలో భక్తుల మనోభావాలు కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని సుప్రీంకోర్టు చెప్పినా, సిట్ ఛార్జిషీట్‌లో జంతు కొవ్వు లేదని చెప్పినా కూడా కూటమి ప్రభుత్వ పెద్దలు భక్తుల మనోభావాలు దెబ్బతినేలా పదిరోజులుగా దుష్ప్రచారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. గురువారమిక్కడ ఆయన పార్టీ సహచర ఎంపీలతో కలిసి తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. జంతు కొవ్వు కలిసిన నెయ్యితో ఇన్ని కోట్ల లడ్డూలు తయారుచేశారని రాష్ట్రంలో ఫ్లెక్సీలు కూడా ఏర్పాటుచేశారన్నారు. ఎన్‌డీడీబీ నివేదికలో ఉన్న వివరాల ప్రకారమే చంద్రబాబు నాడు జంతు కొవ్వు ఉన్నట్లు మాట్లాడారని మంత్రులు చెబుతున్నారని, కానీ ఎన్‌డీడీబీ తన నివేదికలో కేవలం అనుమానం మాత్రమే వ్యక్తం చేసిందని వైవీ సుబ్బారెడ్డి పేర్కొన్నారు. అది నిరూపణ కాకుండా భక్తుల మనోభావాలు దెబ్బతినేలా మీడియా ముందు ఎలా మాట్లాడతారని ప్రశ్నించారు. ఒక మంత్రి మాట్లాడుతూ సీఎఫ్‌టీఆర్ఐ నివేదికలోకూడా జంతు కొవ్వు ఉందని చెప్పారంటున్నారని, కానీ ఆ నివేదికలో జంతు కొవ్వు ఉందని చెప్పలేదని, కల్తీ జరుగుతోందని మాత్రమే నివేదిక ఇచ్చిందన్నారు. ఎంపీ మిథున్‌రెడ్డి మాట్లాడుతూ.. హామీలు నెరవేర్చలేక ప్రజల దృష్టిని మరల్చడానికే ముఖ్యమంత్రి చంద్రబాబు తిరుమల లడ్డూ ప్రసాదంలో జంతు కొవ్వు కలిసిందని ఆరోపించారన్నారు. సమావేశంలో తిరుపతి ఎంపీ గురుమూర్తి, రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

రాయలసీమ లిఫ్ట్ పూర్తి చేయాల్సిందే

- లేకపోతే నికర జలాల్లో చుక్క నీరూ అందదు
- వైకాపా నేత సజ్జల రామకృష్ణారెడ్డి



ప్రసంగిస్తున్న మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, వేదికపై సజ్జల, బుగ్గన తదితర నేతలు

ఈనాడు, కర్నూలు, నందికొట్కూరు, న్యూస్‌టుడే: నంద్యాల జిల్లా పోతిరెడ్డిపాడు ప్రాంతంలో జగన్ హయాంలో మొదలుపెట్టిన రాయలసీమ లిఫ్ట్ ప్రాజెక్టును ముఖ్యమంత్రి చంద్రబాబు పూర్తిచేయాల్సిందేనని వైకాపా రాష్ట్ర సమన్వయకర్త సజ్జల రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. గురువారం 'చలో పోతిరెడ్డిపాడు' పేరిట నిర్వహించిన సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ ప్రాజెక్టు పూర్తిచేయకుంటే ఏపీకి కేటాయించిన నికర జలాల్లో చుక్క నీరు కూడా అందదని చెప్పారు. తెలంగాణలాగే మనం కూడా తక్కువ నీటిమట్టం నుంచి నీటిని తీసుకోవాలన్న ఉద్దేశంతోనే జగన్‌మోహన్‌రెడ్డి ఈ ప్రాజెక్టును చేపట్టారన్నారు. శ్రీశైలం నీటిమట్టం 777 అడుగుల నుంచి 800 అడుగుల మధ్య భాగం నుంచి రోజుకు 8 టీఎంసీల నీటిని తెలంగాణ ప్రభుత్వం తరలిస్తోందన్నారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉండగా పాలమూరు-రంగారెడ్డి, డిండి ప్రాజెక్టులు చేపట్టినప్పుడూ నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు ఏమీ మాట్లాడలేదని గుర్తుచేశారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు ఎత్తును పెంచి వైఎస్ రాజశేఖరరెడ్డి కేంద్రం నుంచి అనుమతులు తీసుకుని పనులు మొదలుపెడితే... చంద్రబాబు ఆ ప్రాజెక్టు ఎత్తు తగ్గించారన్నారు. మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ జగన్‌ను మళ్లీ అధికారంలోకి తెచ్చుకుంటే తప్ప భవిష్యత్తు ఉండదని పేర్కొన్నారు. 'నీకు రూ.15 వేలు.. నీకు రూ.18 వేలు..' అనే హామీలకు ఆకర్షితులైతే ప్రజలు తమ హక్కులు కోల్పోవాల్సి వస్తుందన్నారు. రాయలసీమ లిఫ్ట్ సాధించుకుంటామంటూ మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. శ్రీశైలానికి కృష్ణాజలాలు రాకముందే తెలంగాణ వారు రోజూ 8టీఎంసీలు తరలిస్తున్నారంటూ శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అభ్యంతరకర పదాలు ఉపయోగించారు.

వైకాపాలో కాపు నాయకులపై కుట్ర

- అంబటి రాంబాబును బలిపశువును చేశారు
- మాజీ ఎమ్మెల్యే, జనసేన నేత కిలారి వెంకట రోశయ్య

గుంటూరు నగరం, న్యూస్‌టుడే: వైకాపాలోని ప్రధాన వ్యక్తులు కాపు నాయకులపై కుట్ర చేస్తున్నారని, రాజకీయాల కోసం ఆ పార్టీ నేత అంబటి రాంబాబును బలిపశువును చేశారని మాజీ ఎమ్మెల్యే, జనసేన నేత కిలారి వెంకటరోశయ్య విమర్శించారు. వైకాపా అధిష్ఠానం చెప్పినట్లుగా ప్రత్యర్థులను తిడితేనే మార్కులుంటాయని, తాము తిట్టలేదు కాబట్టి అప్పట్లో మార్కులు పడలేదని వ్యాఖ్యానించారు. వైకాపా లోక్‌సభ అభ్యర్థిగా పోటీ చేసిన తనపైనే పార్టీ నేతలు పత్రికల్లో రాయించి, అనేక కుట్రలు పన్నారని చెప్పారు. మీరు మాట్లాడండి.. నేనొచ్చి పరామర్శిస్తా అన్నట్లుగా వైకాపా అధినేత పరిస్థితి ఉందని ఎద్దేవా చేశారు. మురికి మాటల వల్లే గత ఎన్నికల్లో వైకాపా ఓడిపోయిందని వ్యాఖ్యానించారు. రోశయ్య గుంటూరులో గురువారం విలేకర్లతో మాట్లాడారు. 'రాంబాబు కాపు టైగర్ అని పైకి చెబుతున్నా.. సత్తెనపల్లిలో ఆయన్ను ఎలా ఇబ్బంది పెట్టారో అందరికీ తెలుసు. ఇప్పుడూ పేరుకే ఆయన పార్టీ జిల్లా అధ్యక్షుడు. పెత్తనం వేరే వాళ్లది. నన్నూ పొగబెట్టి పొన్నూరు నుంచి పంపించారు. అంబటి ఇంటి వద్ద దాడిని అడ్డుకునేందుకు వైకాపా నేతలు ఎందుకు ప్రయత్నించలేదు? కులం కార్డు ఉపయోగించే కుళ్లు రాజకీయాలను ఆ పార్టీ ఇకనైనా మానుకోవాలి' అని చెప్పారు.

బైపాస్ మీదుగా జోగి ఇంటికి వెళ్లండి

జగన్‌కు నోటీసు జారీ చేసిన విజయవాడ సీపీ

ఈనాడు, అమరావతి: మాజీ మంత్రి జోగి రమేష్‌ను పరామర్శించడానికి ఇబ్రహీంపట్నంలోని ఆయన ఇంటికి వైకాపా అధినేత జగన్ శుక్రవారం వెళ్లనున్నారు. ఇప్పటికే జగన్ అంబటి రాంబాబు కుటుంబాన్ని పరామర్శించడానికి భారీ వాహనశ్రేణితో గుంటూరు వెళ్లడంతో కిలోమీటర్ల కొద్దీ ట్రాఫిక్ నిలిచిపోయి ప్రజలు నరకం చవిచూశారు. ఈ దృష్ట్యా విజయవాడ పోలీసులు అప్రమత్తమయ్యారు. నగరం గుండా కాకుండా బైపాస్ నుంచి వెళ్లాలని జగన్‌కు విజయవాడ పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖర్‌బాబు నోటీసు జారీ చేశారు. ప్రకాశం బ్యారేజీ మీదుగా నగరంలోకి ప్రవేశించి, జోగి రమేష్ ఇంటికి వెళ్లేలా.. మార్గాన్ని వైకాపా ఖరారు చేసింది. ఈ మార్గంలోకి భారీ కాన్వాయ్‌తో వస్తే ట్రాఫిక్ నిలిచిపోయి.. ప్రజలకు తీవ్ర ఇబ్బంది కలుగుతుందని, ప్రత్యామ్నాయంగా బైపాస్ నుంచి గొల్లపూడి, నల్లకుంట మీదుగా ఇబ్రహీంపట్నం వెళ్లాలని నోటీసులో సీపీ సూచించారు.

ఏపీఈఏపీ సెట్ దరఖాస్తులకు గడువు మార్చి 7

ఈసెట్, ఐసెట్‌లకు తుది గడువు మార్చి 2

ఈనాడు, అమరావతి: ఇంజినీరింగ్, వ్యవసాయ, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే ఏపీఈఏపీసెట్ దరఖాస్తుల సమర్పణకు చివరి గడువు మార్చి ఏడో తేదీగా నిర్ణయించారు. జేఎన్‌టీయూ-కాకినాడ ఈ ఏడాది ఈఏపీసెట్ నిర్వహిస్తోంది. అపరాధ రుసుము రూ.వెయ్యితో మార్చి 12, రూ.2వేలతో మార్చి 17, రూ.4వేలతో మార్చి 21, రూ.10వేలతో మార్చి 26వరకు అవకాశం కల్పించారు. దరఖాస్తుల తప్పుల సవరణ మార్చి 26-28, ఏప్రిల్ 28న హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్షలు మే 12 నుంచి 15 వరకు, 18న నిర్వహిస్తారు. వ్యవసాయ, ఫార్మసీ పరీక్షలు మే 19, 20 తేదీల్లో ఉంటాయి. ప్రాథమిక 'కీ' మే 23న విడుదల చేసి, 25 వరకు అభ్యంతరాలను స్వీకరిస్తారు. ఫలితాలు జూన్ 1న ప్రకటిస్తారు.

★ ఇంజినీరింగ్ రెండో ఏడాదిలో ప్రవేశానికి నిర్వహించే ఈసెట్ దరఖాస్తుల సమర్పణకు చివరి గడువు మార్చి2 కాగా.. అపరాధ రుసుముతో మార్చి 18వరకు అవకాశం కల్పించారు. ఏప్రిల్ 9 నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఏప్రిల్ 23న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారు. ప్రాథమిక 'కీ'ని ఏప్రిల్ 27న విడుదల చేస్తారు. అభ్యంతరాల స్వీకరణ అనంతరం మే 7న ఫలితాలు ప్రకటిస్తారు. ★ ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే ఐసెట్‌కు దరఖాస్తుల స్వీకరణకు మార్చి రెండో తేదీ తుది గడువుగా నిర్ణయించారు. అపరాధ రుసుముతో మార్చి 21 వరకు దరఖాస్తులు సమర్పించవచ్చు. మే 2న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారు. 5న ప్రాథమిక 'కీ' విడుదల చేస్తారు. అభ్యంతరాల స్వీకరణ అనంతరం మే 16న ఫలితాలు వెల్లడిస్తారు.

చదివింది న్యాయ విద్య.. చేసేది ల్యాప్‌టాప్‌ల చోరీ



స్వాధీనం చేసుకున్న ల్యాప్‌టాప్‌లు పరిశీలిస్తున్న పోలీసు అధికారులు

మంగళగిరి, మంగళగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: న్యాయ విద్యను అభ్యసించి.. విశ్వవిద్యాలయాల్లో విద్యార్థుల ల్యాప్‌టాప్‌లు చోరీ చేస్తున్న అంతర్రాష్ట్ర నిందితుడిని గుంటూరు జిల్లా మంగళగిరి పోలీసులు అరెస్టు చేశారు. 11 రాష్ట్రాల్లో 61 ల్యాప్‌టాప్‌లు చోరీ చేశాడని పోలీసులు తెలిపారు. డీఎస్పీ మురళీకృష్ణ, సీఐ బ్రహ్మం గురువారం వివరాలు వెల్లడించారు. తమిళనాడు తిరువారూర్ జిల్లాకు చెందిన పతమిళ్ సెల్వన్ వర్సిటీల్లో ప్రవేశాల కోసం వచ్చినట్లు నటించి, రెక్కీ చేస్తాడు. ఆ తర్వాత అనుకూలంగా ఉన్న వసతిగృహాన్ని అడ్డాగా చేసుకొని, ల్యాప్‌టాప్‌లను చోరీ చేస్తాడు. ఈ క్రమంలో రాజధాని ప్రాంతంలోని కురగల్లు, నీరుకొండలోని అమృత విద్యాపీఠం, ఎస్ఆర్ఎం వర్సిటీల్లో డిసెంబరు 31న ల్యాప్‌టాప్‌లు చోరీ చేశాడు. వార్డెన్లు ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేసి, సీసీ కెమెరాల ఫుటేజీ పరిశీలించి నిందితుడి ఆనవాళ్లు గుర్తించారు. సాంకేతికతతో ఆచూకీ కనుగొని, మంగళగిరి మండలం ఎర్రబాలెం డాన్‌బాస్కో వద్ద ఈనెల 2న అరెస్టు చేశారు. అతని నుంచి రూ.12 లక్షల విలువైన 15 ల్యాప్‌టాప్‌లను స్వాధీనం చేసుకున్నారు. చెన్నై, గోవాల్లోని విద్యాసంస్థల్లోనూ చోరీలకు పాల్పడ్డట్లు గుర్తించారు. కేసు దర్యాప్తులో భాగస్వాములైన అధికారులు, సిబ్బందిని డీఎస్పీ మురళీకృష్ణ అభినందించారు.

అధికారం పోయాక జగన్‌కు రాయలసీమ ఎత్తిపోతల గుర్తొచ్చింది: మంత్రి జనార్దన్‌రెడ్డి

ఈనాడు, అమరావతి: అధికారం పోయాక వైకాపా అధినేత జగన్‌కు రాయలసీమ ఎత్తిపోతల పథకం గుర్తొచ్చిందని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ధ్వజమెత్తారు. జగన్ సీఎంగా ఉన్నప్పుడే ఆ పథకాన్ని ఎన్జీటీ నిలిపేసిందని, అప్పుడు కనీసం ఆయన రాష్ట్ర ప్రభుత్వం తరఫున కౌంటర్ కూడా వేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నేడు దీక్షల పేరుతో నాటకాలాడితే ప్రజలు నమ్మరని ఎద్దేవా చేశారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో గురువారం మంత్రి విలేకరులతో మాట్లాడారు.

ఐదేళ్లూ సీమను పట్టించుకోకుండా.. ఇప్పుడు కపటప్రేమ కురిపిస్తారా?

జగన్‌పై కాంగ్రెస్ నేత తులసిరెడ్డి మండిపాటు



వేంపల్లె, న్యూస్‌టుడే: రాయలసీమపై మాజీ సీఎం జగన్ చూపిస్తున్నది కపటప్రేమ అని, సీమ ఎత్తిపోతల పథకం పూర్తి చేయాలంటూ వైకాపా నాయకులు పోతిరెడ్డిపాడు వద్ద నిరసన తెలపడం విడ్డూరంగా ఉందని ఏపీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి విమర్శించారు. 'రాయలసీమ ఎత్తిపోతల ప్రాజెక్టుకు అనుమతులు లేవంటూ ఎన్జీటీ 2021లో స్టే ఉత్తర్వులు ఇచ్చినప్పుడు సీఎంగా ఉన్నది జగనే. తర్వాత మూడేళ్ల అధికారంలో ఉన్నా స్టేను ఎత్తివేయించలేదు. అనుమతులు సాధించలేదు. వైఎస్సార్ సీఎంగా ఉన్నప్పుడు రాయలసీమ సమగ్రాభివృద్ధికి దోహదపడేలా 2008-09 రైల్వే బడ్జెట్‌లో కడప-రాయచోటి- మదనపల్లె- బెంగళూరు నూతన బ్రాడ్‌గేజ్ రైల్వే మార్గాన్ని మంజూరు చేయించారు. ఈ ప్రాజెక్టుకు జగన్ తన ఐదేళ్ల కాలంలో మ్యాచింగ్ గ్రాంట్ ఇవ్వకపోగా, ఈ పనులు అవసరం లేదని రైల్వేశాఖకు లేఖ రాశారు. 2021లో అన్నమయ్య ప్రాజెక్ట్ కొట్టుకుపోతే బాధితులను గాలికొదిలేశారు. విభజన చట్టం ప్రకారం కడప జిల్లాకు రావాల్సిన స్టీలు ప్లాంట్ కోసం పట్టించుకోలేదు. సీమకు ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీ ఇవ్వకపోయినా కేంద్రాన్ని ప్రశ్నించలేదు. ఇన్ని మోసాలకు పాల్పడ్డ జగన్.. నేడు సీమ కోసం మొసలి కన్నీరు కార్చుతున్నార'ని తులసిరెడ్డి మండిపడ్డారు.

125 రోజుల పని కల్పన ఓ బూటకం

పీసీసీ అధ్యక్షురాలు షర్మిల



మాట్లాడుతున్న షర్మిల. చిత్రంలో రఘువీరారెడ్డి తదితరులు

పుంగనూరు, న్యూస్‌టుడే: వైఎస్ రాజశేఖరరెడ్డి సీఎంగా ఉన్నప్పుడు సమర్థంగా అమలు చేసిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నేడు కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తున్నా ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, వైకాపా అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి నోరు మెదపడం లేదని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల విమర్శించారు. అన్నమయ్య జిల్లా పుంగనూరు చేరుకున్న ఉపాధి హామీ పథక పరిరక్షణ యాత్రలో గురువారం షర్మిల మాట్లాడారు. మోదీ తీసుకొచ్చిన 'వీబీ జీ రామ్ జీ' పథకానికి చంద్రబాబు మద్దతు ఇవ్వడం దుర్మార్గమన్నారు. మార్చిన పథకంతో రాష్ట్రాలపై భారం పడటమే కాకుండా, 125 రోజుల పని కల్పన బూటకం అన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి రఘువీరారెడ్డి, కాంగ్రెస్ నాయకులు జి.భాస్కర్, మస్తాన్‌వలీ తదితరులు పాల్గొన్నారు.

అపోలో టైర్స్ రూ.1,100 కోట్లతో విస్తరణ

ఒప్పందం మేరకు ప్రభుత్వ ప్రోత్సాహకాలు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో అపోలో టైర్స్ పరిశ్రమ రెండో దశ విస్తరణలో భాగంగా రూ.1,100 కోట్ల పెట్టుబడితో నూతన ప్రాజెక్టు చేపట్టనుంది. మొదటి దశలో రూ.3,800 కోట్లతో తిరుపతి జిల్లా శ్రీసిటీ సమీపంలోని చినపాండూరు వద్ద 256 ఎకరాల్లో తయారీ యూనిట్‌ను ఇప్పటికే ఏర్పాటు చేసింది. ఈ సంస్థ మూడు దశల్లో కలిపి రూ.5,810 కోట్ల పెట్టుబడి పెట్టనుంది. గతేడాది సెప్టెంబరులో ప్రాజెక్టు విస్తరణకు ప్రభుత్వం సింగిల్ విండో విధానంలో అనుమతులిచ్చింది. పదేళ్ల పాటు జీఎస్టీ మినహాయింపుతో పాటు కంపెనీకి అవసరమైన విద్యుత్, నీరు అందించేందుకు అంగీకరించింది. ప్రాజెక్టు విస్తరణతో సుమారు 1,800 మందికి ఉపాధి కల్పించనున్నట్లు సంస్థ డీపీఆర్‌లో పేర్కొంది.

ఛాంపియన్


వోల్ 79

ఐపీఎల్ టైటిల్ గెలవడానికి రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు పురుషుల జట్టుకు 18 ఏళ్లు పట్టింది. కానీ ఆర్సీబీ మహిళల జట్టు రెండేళ్ల వ్యవధిలో రెండు కప్పులు కొట్టేసింది. మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) మొదలైనప్పటి నుంచి పట్టువదలకుండా ఫైనల్ చేరుతున్న దిల్లీ క్యాపిటల్స్‌కు మరోసారి నిరాశనే మిగులుస్తూ ట్రోఫీ పట్టుకుపోయింది.

కెప్టెన్ స్మృతి మంధాన, జార్జియా వోల్ మామూలుగా విరుచుకుపడలేదు. ఈ జంట ఎడాపెడా బౌండరీల మోతతో విధ్వంసం సృష్టించడంతో కొండంత లక్ష్యాన్ని ఛేదించేసింది ఆర్సీబీ. దిల్లీ ఆఖర్లో బంతితో పుంజుకోవడంతో ఆట ఉత్కంఠభరితంగా మారినా చివరికి ఆర్సీబీదే పైచేయి అయింది. బెంగళూరు ఇంతకుముందు 2024లో విజేతగా నిలిచింది. పాపం దిల్లీ.. వరుసగా నాలుగు ఫైనల్లు ఓడడాన్ని జీర్ణించుకోవడం ఆ జట్టుకు కష్టమే.



204 డబ్ల్యూపీఎల్‌లో ఇదే అతిపెద్ద ఛేదన. గత రికార్డు కూడా ఆర్సీబీ (గుజరాత్‌పై 202)దే.

ఆర్సీబీ అద్వితీయం

దిల్లీకి మళ్లీ నిరాశే

● స్మృతి, వోల్ వీర విధ్వంసం

వడోదర


స్మృతి 87

భారీ స్కోర్ల మ్యాచ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుదే పైచేయి. స్మృతి మంధాన (87; 41 బంతుల్లో 12×4, 3×6), జార్జియా వోల్ (79; 54 బంతుల్లో 14×4) వీరవిహారం చేయడంతో గురువారం డబ్ల్యూపీఎల్-4 ఫైనల్లో ఆర్సీబీ 6 వికెట్ల తేడాతో దిల్లీ క్యాపిటల్స్‌పై విజయం సాధించింది. జెమీమా (57; 37 బంతుల్లో 8×4), లారా వోల్వార్ట్ (44; 25 బంతుల్లో 3×4, 2×6) మెరవడంతో మొదట దిల్లీ 4 వికెట్లకు 203 పరుగులు చేసింది. లిజెలి (37; 30 బంతుల్లో 3×4, 3×6) షినెలి (35 నాటౌట్; 15 బంతుల్లో 4×4, 2×6) కూడా మెరిశారు. స్మృతి, వోల్ జంట రెండో వికెట్‌కు 92 బంతుల్లో 165 పరుగులు జోడించడంతో లక్ష్యాన్ని బెంగళూరు 19.4 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి ఛేదించింది.

ఆ ఇద్దరి విధ్వంసం: టీ20ల్లో రెండొందలపై లక్ష్యాన్ని ఛేదించడం ఎప్పుడైనా.. ఎక్కడైనా ఎంతో కష్టమే. ఫైనల్ అయితే ఇంకా ఒత్తిడి ఉంటుంది. కానీ కెప్టెన్ స్మృతి మంధాన, జార్జియా వోల్ నిర్లక్ష్య విధ్వంసంతో 204 పరుగుల లక్ష్యాన్ని బెంగళూరు ఛేదించేసింది. నిజానికి రెండో ఓవర్లోనే ప్రమాదకర గ్రేస్ హారిస్ (9)ను ఔట్ చేయడం ద్వారా ఆర్సీబీని ఒత్తిడిలోకి నెట్టేట్లే కనిపించింది దిల్లీ. కానీ ఆ ఆనందం ఎంతో సేపు నిలవలేదు. మరో ఓపెనర్ స్మృతి, జార్జియా వోల్ ఆకాశమే హద్దుగా చెలరేగిపోయారు. దిల్లీ బౌలింగ్‌ను తుత్తునియలు చేస్తూ స్కోరు బోర్డును పరుగులు పెట్టించారు. ఏ బౌలర్‌నూ వదల్లేదు. షినెలి, కాప్ ఓవర్లలో వోల్ రెండేసి ఫోర్లు బాదేస్తే.. నందని బౌలింగ్‌లో స్మృతి వరుసగా 4, 6 కొట్టింది. వోల్ 37 బంతుల్లో, స్మృతి 23 బంతుల్లో అర్ధశతకాలు పూర్తి చేశారు. వీరి జోరుతో 12 ఓవర్లలో 124/1తో నిలిచింది ఆర్సీబీ. ఆ తర్వాత కూడా ఇద్దరి జోరు కొనసాగింది. ముఖ్యంగా స్మృతి ఎడాపెడా ఫోర్లు కొట్టేసింది. 16 ఓవర్లలో 169/1తో విజయం వైపు పరుగులు పెట్టింది ఆర్సీబీ. ఈ జట్టు గెలుపు ఇక తేలికే అనిపించింది. కానీ దిల్లీ పుంజుకోవడంతో ఆఖర్లో డ్రామా తప్పలేదు.

ఆఖర్లో ఇలా..: సాఫీగా లక్ష్యం దిశగా సాగుతున్న ఆర్సీబీ.. ఆఖర్లో ఒత్తిడికి గురైంది. 17వ ఓవర్లో వోల్‌ను ఔట్ చేయడం ద్వారా మ్యాచ్‌ను కాస్త ఉత్కంఠభరితంగా మార్చింది మిన్ను మణి. ఆ తర్వాత పరిణామాలతో క్లైమాక్స్.. అనూహ్యంగా రసవత్తరంగా మారింది. ఆఖరి మూడు ఓవర్లలో ఆర్సీబీకి 27 పరుగులు అవసరం కాగా.. 18వ ఓవర్లో 9 పరుగులే ఇచ్చిన నందని, రిచా (6)ను ఔట్ చేసింది. తర్వాతి ఓవర్లో షినెలి.. 8 పరుగులే ఇచ్చి ప్రమాదకర స్మృతిని వెనక్కి పంపింది. చివరి ఓవర్లో ఆర్సీబీకి 10 పరుగులు అవసరం కావడంతో ఉత్కంఠ తీవ్రమైంది. శ్రీచరణి బౌలింగ్‌లో తొలి రెండు బంతుల్లో 2 పరుగులు వచ్చాయి. కానీ ఆ తర్వాత కవర్ మీదుగా వరుసగా రెండు బౌండరీలు బాదిన రాధ యాదవ్ (12 నాటౌట్) ఆర్సీబీని సంబరాల్లో ముంచెత్తింది. 19వ ఓవర్లో, స్మృతి ఔటైన వెంటనే, రాధ ఇచ్చిన ఓ తేలికైన క్యాచ్‌ను మిన్ను మణి జారవిడిచి ఉండకపోతే మ్యాచ్ ఫలితం భిన్నంగా ఉండేదేమో! ఆ తప్పిదానికి రెండు పరుగులు కూడా వచ్చాయి.

జెమీమా ధనాధన్: దిల్లీ అంతకుముందు అదరగొట్టింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఆ జట్టుకు తొలి మూడు ఓవర్లలో 9 పరుగులే రాగా.. ఆ తర్వాత ఓపెనర్లు లిజెలి లీ, షెఫాలి వర్మ బ్యాట్లు ఝళిపించారు. ఆరో ఓవర్లో షెఫాలి వెనుదిరిగేటప్పటికి స్కోరు 49. లిజెలి వరుసగా 4, 4, 6.. వోల్వార్ట్ ఓ ఫోర్ బాదడంతో ఏడో ఓవర్లో శ్రేయాంక 19 పరుగులు సమర్పించుకుంది. జోరుమీదున్న లిజెలిని నడైన్ ఔట్ చేసినా.. ఆర్సీబీకి సంతోషించడానికేమీ లేకపోయింది. ఆమె స్థానంలో వచ్చిన జెమీమా చెలరేగిపోయింది. మరోవైపు వోల్వార్ట్ నిలవగా.. చకచకా బౌండరీలు బాదేస్తూ స్కోరు బోర్డును పరుగులు పెట్టించింది. 16వ ఓవర్లో జెమీమా నిష్క్రమణ తర్వాత స్కోరు వేగం పెరిగిందే తప్ప తగ్గలేదు. వోల్వార్ట్, షినెలి హెన్రీ విరుచుకుపడడంతో ఆఖరి మూడు ఓవర్లలో దిల్లీ 49 పరుగులు రాబట్టింది.

దిల్లీ ఇన్నింగ్స్: లిజెలి లీ (సి) గ్రేస్ హారిస్ (బి) నడైన్ డిక్లెర్క్ 37; షెఫాలి వర్మ (సి) రిచా (బి) అరుంధతి రెడ్డి 20; లారా వోల్వార్ట్ రనౌట్ 44; జెమీమా (సి) నడైన్ డిక్లెర్క్ (బి) సయాలి 57; షినెలి హెన్రీ నాటౌట్ 35; ఎక్స్‌ట్రాలు 10 **మొత్తం:** (20 ఓవర్లలో 4 వికెట్లకు) **203; వికెట్ల పతనం:** 1-49, 2-72, 3-148, 4-203; **బౌలింగ్:** లారెన్ బెల్ 4-0-19-0; సయాలి 4-0-46-1; అరుంధతి రెడ్డి 4-0-40-1; శ్రేయాంక పాటిల్ 2-0-32-0; నడైన్ డిక్లెర్క్ 4-0-48-1; రాధ యాదవ్ 2-0-18-0

బెంగళూరు ఇన్నింగ్స్: గ్రేస్ హారిస్ (బి) హెన్రీ 9; స్మృతి మంధాన (బి) హెన్రీ 87; జార్జియా వోల్ (సి) షెఫాలి వర్మ (బి) మిన్ను మణి 79; రిచా ఘోష్ (సి) మిన్ను మణి (బి) నందని శర్మ 6; డిక్లెర్క్ నాటౌట్ 7; రాధ నాటౌట్ 12; ఎక్స్‌ట్రాలు 4 **మొత్తం:** (19.4 ఓవర్లలో 4 వికెట్లకు) **204; వికెట్ల పతనం:** 1-9, 2-174, 3-181, 4-191; **బౌలింగ్:** మరిజేన్ కాప్ 4-0-38-0; షినెలి హెన్రీ 4-0-34-2; నందని శర్మ 4-0-41-1; శ్రీచరణి 3.4-0-46-0; షెఫాలి వర్మ 1-0-9-0; మిన్ను మణి 2-0-19-1; స్నేహ్ రాణా 1-0-15-0

ఈనాడు క్రీడావిభాగం

మహిళల ప్రీమియర్ లీగ్‌లో రెండు సార్లు విజేతగా నిలిచిన ముంబయి ఈసారి గ్రూప్ దశ దాటలేదు. యూపీ చాలా ముందుగానే రేసు నుంచి తప్పుకొంది. దిల్లీ, గుజరాత్ ప్లేఆఫ్స్ చేరాయి కానీ.. లీగ్ దశలో తమ చివరి మ్యాచ్‌ల వరకు వాటికి ఉత్కంఠ తప్పలేదు. ఇలా ఈ సీజన్లో మిగతా జట్లన్నీ ఒక వైపు నిలిచాయి. కానీ బెంగళూరు వేరే స్థాయి ఆటతో ఇంకోవైపు నిలిచింది. వరుసగా అయిదు మ్యాచ్‌ల్లో గెలిచి చాలా ముందుగానే ప్లేఆఫ్స్ బెర్తును ఖాయం చేసుకోవడమే కాదు.. అత్యధిక విజయాలతో అగ్రస్థానంలో నిలిచి ఫైనల్‌కు దూసుకెళ్లింది. ఇక తుది పోరులో 200 పైచిలుకు లక్ష్యాన్ని ఛేదించేయడం ద్వారా తమది అసలైన ఛాంపియన్ జట్టని చాటింది ఆర్సీబీ.



ఇది కదా ఛాంపియన్ ఆటంటే..

ఈ సీజన్లో ఆర్సీబీ ఆట మామూలుగా సాగలేదు. లీగ్ చరిత్రలోనే ఇలాంటి ఆధిపత్యం నభూతో. మొత్తంగా 9 మ్యాచ్‌ల్లో ఏడు నెగ్గింది ఆర్సీబీ. ఆ విజయాల్లో చాలా వరకు సాధికారికంగా సాధించినవే. లీగ్‌లో అత్యధిక పరుగులు సాధించింది ఆ జట్టు కెప్టెన్ స్మృతి మంధానే. బౌలింగ్ టాప్-10లో నలుగురు ఆ జట్టు అమ్మాయిలే ఉండడం ఆ జట్టు ఆధిపత్యానికి నిదర్శనం.

దిల్లీ అంటే చాలు..: డబ్ల్యూపీఎల్ ఆరంభం నుంచి ఆర్సీబీకి కెప్టెన్ స్మృతి మంధానే అతి పెద్ద బలం. 2024లో జట్టుకు తొలి కప్పును అందించిన స్మృతి.. ఈసారి ఇంకా గొప్ప ప్రదర్శనతో జట్టు ఖాతాలో రెండో టైటిల్ చేర్చింది. ఆమె 9 మ్యాచ్‌ల్లో 53.85 సగటుతో 377 పరుగులు చేసింది. అందులో 3 అర్ధశతకాలు ఉన్నాయి. ముఖ్యంగా దిల్లీ అనగానే స్మృతి చెలరేగిపోతుంది. లీగ్ దశలో డీసీపై 96, 38 పరుగులు చేసిన ఈ ఓపెనర్.. ఆ జట్టుతో ఫైనల్లో 87 పరుగులతో టాప్‌స్కోరర్‌గా నిలిచింది. తుది పోరులో 200 పైచిలుకు లక్ష్యం అంటే ఏ జట్టయినా జావగారిపోతుంది. కానీ స్మృతి జట్టును ముందుండి నడిపించింది. గ్రేస్ హారిస్ (237), రిచా ఘోష్ (189) లీగ్ దశలో నిలకడగా రాణించి జట్టు ఫైనల్ చేరడంలో కీలక పాత్ర పోషించారు.

తేడా ఆ ఇద్దరే..: గత సీజన్లో ఆర్సీబీ గ్రూప్ దశ కూడా దాటలేదు. ఈసారి తిరుగులేని ఆధిపత్యంతో కప్పు గెలిచింది. ఇక్కడ ప్రధాన తేడా ఇద్దరు బౌలర్లే. వారే లారెన్ బెల్, నడైన్ డిక్లెర్క్. ఇప్పటిదాకా డబ్ల్యూపీఎల్‌లో ఆడని ఇంగ్లిష్ బౌలర్ బెల్.. ఈసారి ఆర్సీబీ తరఫున అవకాశం దక్కించుకుని అద్భుత ప్రదర్శన చేసింది. ఆమె 9 మ్యాచ్‌ల్లో 16.58 సగటుతో 12 వికెట్లు తీసింది. ఆమె మొత్తంగా 212 బంతులు వేస్తే.. అందులో 128 డాట్‌బాల్స్ కావడం విశేషం. మరోవైపు డిక్లెర్క్ ప్రతి మ్యాచ్‌లోనూ నిలకడగా రాణిస్తూ 16 వికెట్లతో టాప్-3 బౌలర్‌గా నిలిచింది. డిక్లెర్క్ బ్యాటింగ్‌లోనూ రాణించింది. శ్రేయాంక (11 వికెట్లు), సయాలీ సత్ఘారే (9) కూడా తమ వంతు పాత్ర పోషించారు.

ఆఖరి మెరుపు: జార్జియా వోల్.. ఈ సీజన్లో పెద్దగా వినిపించని పేరు. కానీ ఫైనల్లో మాత్రం ఆమె పేరు మార్మోగింది. 204 పరుగుల ఛేదనలో ఆరంభంలోనే ప్రమాదకర గ్రేస్ హారిస్ వికెట్‌ను కోల్పోవడంతో ఆర్సీబీకి కష్టమే అనుకున్నారంతా. కానీ వోల్.. హారిస్‌ను మరిపించే విధ్వంసక బ్యాటింగ్‌తో మ్యాచ్ గమనాన్ని మార్చేసింది. ఆమె



కుర్రాళ్లూ..

ఇంకొక్క అడుగే!

● అండర్-19 వన్డే ప్రపంచకప్ ఫైనల్ నేడే
● ఇంగ్లాండ్‌తో యువ భారత్ ఢీ

మధ్యాహ్నం 1 నుంచి

● అండర్-19 ప్రపంచకప్‌లో భారత్‌కిది పదో ఫైనల్. ఇప్పటిదాకా అయిదుసార్లు విజేతగా నిలిచింది.

హరారే: అంచనాలకు తగ్గట్లే రాణిస్తూ, అజేయంగా అండర్-19 ప్రపంచప్ ఫైనల్ చేరిన యువ భారత్.. ఇదే ఊపును ఇంకొక్క మ్యాచ్‌లో కొనసాగిస్తే ఛాంపియన్ అవుతుంది. ఆయుష్ మాత్రే సేన శుక్రవారం తుది పోరులో.. ఇంగ్లాండ్‌ను ఢీకొనబోతోంది. చివరగా భారత జట్టు 2022లో అండర్-19 ప్రపంచకప్ గెలిచింది. అప్పుడు ప్రత్యర్థి ఇంగ్లాండే కావడం విశేషం. టోర్నీలో సమష్టిగా, సాధికారికంగా ఆడక పోయినా.. కొన్ని మ్యాచ్‌ల్లో తడబడినా.. ఒక్క మ్యాచ్‌లోనూ ఓడిపోలేదు భారత్. సెమీఫైనల్లో సైతం మొదట బౌలర్లు విఫలమవడంతో అఫ్గానిస్థాన్ 311 పరుగుల భారీ లక్ష్యాన్ని నిర్దేశించగలిగింది. ప్రత్యర్థి బౌలింగ్‌లో పస లేకపోవడం, బ్యాటర్లు రెచ్చిపోవడంతో సునాయాసంగా ఆ మ్యాచ్ గెలిచేసింది ఆయుష్ బృందం. కానీ భారత్ లాగే అజేయంగా ఫైనల్ చేరడమే కాక, సెమీస్‌లో బలమైన ఆస్ట్రేలియాను ఓడించిన ఇంగ్లాండ్‌తో అంత తేలిగ్గా ఉండకపోవచ్చు. కెప్టెన్ థామస్ ర్యూ ఆ జట్టును ముందుండి నడిపిస్తున్నాడు. సెమీఫైనల్లో అతను అద్భుత శతకం సాధించాడు. బెన్ మేయర్స్ భీకర ఫామ్‌లో ఉన్నాడు. టోర్నీలో అతను 399 పరుగులతో టాప్‌స్కోరర్లలో రెండో స్థానంలో కొనసాగుతున్నాడు. ఫాల్కనర్ కూడా నిలకడగా ఆడుతున్నాడు. బౌలర్లలో మ్యానీలమ్స్‌డెన్ టోర్నీలో అత్యధిక వికెట్ల (15) వీరుడిగా కొనసాగుతున్నాడు. సెబాస్టియన్ మోర్గాన్, రాల్ఫీ ఆల్బర్ట్ జోరుమీదున్నారు. భారత్‌కు బ్యాటింగే ప్రధాన బలం. ఫామ్‌తో తంటాలు పడుతున్న ఓపెనర్ ఆరోన్ జార్జ్ సెమీఫైనల్లో సెంచరీ సాధించడం జట్టుకు కలిసొచ్చే అంశం. కేరళకు చెందిన ఆరోన్.. హైదరాబాద్‌లో స్థిరపడ్డాడు. హైదరాబాద్ అండర్-19 జట్టుకు కెప్టెన్ కూడా. ఫైనల్లోనూ ఆరోన్ రాణించాలని జట్టు కోరుకుంటోంది. మరో ఓపెనర్ సూర్యవంశీ పది ఓవర్లు నిలిచాడంటే మ్యాచ్ భారత్ వైపు తిరిగినట్లే. టోర్నీలో భారీ ఇన్నింగ్స్ ఆడకపోయినా.. సెమీస్ సహా కొన్ని మ్యాచ్‌ల్లో విలువైన పరుగులే చేశాడు. మాత్రే కూడా మంచి లయలోనే ఉన్నాడు. బౌలర్లలో అంబ్రిష్, కనిష్క్ కీలకం.


టీ20 ప్రపంచకప్ రేపటి నుంచే

చాలా ఏళ్ల నుంచి ఏ ఐసీసీ టోర్నీ మొదలవుతున్నా టీమ్‌ఇండియాపై భారీ అంచనాలే ఉంటున్నాయి. దశాబ్ద కాలం పాటు ఆ అంచనాలను అందుకోవడంలో భారత జట్టు విఫలమైంది. కానీ గత రెండేళ్లలో టీ20 ప్రపంచకప్, ఛాంపియన్స్ ట్రోఫీలు నెగ్గి సత్తా చాటింది టీమ్‌ఇండియా. ఇప్పుడు సొంతగడ్డపై జరగబోతున్న పొట్టి ప్రపంచకప్‌లో సూర్యకుమార్ సేన టైటిల్ ఫేవరెట్లలో ఒకటనడంలో సందేహం లేదు. కానీ కప్పు-భారత్ మధ్య కొన్ని బలమైన అడ్డంకులే ఉన్నాయి.



అదిగో కప్పు.. ఇవిగో అడ్డంకులు

ఈనాడు క్రీడావిభాగం


సూర్యకుమార్

ప్రపంచకప్ ముంగిట పాకిస్థాన్‌తో తన చివరి టీ20 సిరీస్ ఆడింది ఆస్ట్రేలియా. అందులో ఆ జట్టు 0-3తో వైట్‌వాష్‌కు గురైంది. ఆ ఫలితాన్ని బట్టి ఆస్ట్రేలియాను అంచనా వేస్తే పొరపాటే. పాకిస్థాన్‌కు వెళ్లడానికి ఇష్టం లేక ప్రధాన ఆటగాళ్లు కొందరు ఆ సిరీస్‌కు దూరంగా ఉన్నారు. దీంతో సిరీస్ ఓడిపోయింది ఆసీస్. కానీ ప్రపంచకప్‌లో ఆ జట్టు ఆట పూర్తి భిన్నంగా ఉంటే ఆశ్చర్యమేమీ లేదు. ఆ జట్టు టైటిల్ ఫేవరెట్లలో ఒకటనడంలో సందేహం లేదు. ప్రపంచంలోనే అత్యంత విధ్వంసక బ్యాటర్లలో ఒకడైన ట్రావిస్ హెడ్, కెప్టెన్ మిచెల్ మార్ష్‌లతో కూడిన ఓపెనింగ్ ద్వయం ఆ జట్టుకు అతి పెద్ద బలం. ఇంకా జోష్ ఇంగ్లిస్, టిమ్ డేవిడ్ లాంటి దూకుడైన బ్యాటర్లు.. మ్యాక్స్‌వెల్, స్టాయినిస్, కూపర్ కనోలీ, కామెరూన్ గ్రీన్ లాంటి మేటి ఆల్‌రౌండర్లు ఆ జట్టు సొంతం. బౌలింగ్‌లో కమిన్స్ దూరం కావడం పెద్ద ఎదురు దెబ్బే. ఆస్ట్రేలియా ఒకే ఒక్కసారి 2021లో టీ20 ప్రపంచకప్ గెలిచింది.

ఆనుపానులు తెలుసుకుని..: 2021లో ఆస్ట్రేలియా చేతిలో ఓడి రన్నరప్‌గా నిలిచిన కివీస్.. గత టోర్నీలో సెమీస్ చేరకుండానే నిష్క్రమించింది. ఈసారి ఆ జట్టు ఆల్‌రౌండ్ నైపుణ్యంతో కప్పుపై కన్నేసింది. టోర్నీ ముంగిట భారత్‌లో అయిదు మ్యాచ్‌ల టీ20ల సిరీస్ ఆడడం ఆ జట్టుకు కలిసొచ్చే విషయం. ఈ సిరీస్‌లో 1-4తో ఓడినా సరే.. భారత్‌కు గట్టి పోటీనే ఇచ్చింది. ఇక్కడి పిచ్‌లు, పరిస్థితులపై అవగాహన పెంచుకోవడం, భారత ఆటగాళ్ల మీదా ఒక అంచనాకు రావడం ఆ జట్టుకు ఎంతో ఉపకరించేదే. భారత్‌తో చివరి టీ20లో చెలరేగి ఆడిన ఫిన్ అలెన్‌కు తోడు కాన్వే, సీఫర్ట్, మిచెల్, ఫిలిప్స్, రచిన్ రవీంద్రలతో ఆ జట్టు బ్యాటింగ్ బలంగా కనిపిస్తోంది. కెప్టెన్ శాంట్నర్‌తో పాటు బ్రాస్‌వెల్, ఇష్ సోధిల స్పిన్ ఆ జట్టుకు ఎంతో కీలకం.

అన్ని విధాలా..: ప్రపంచకప్ దగ్గర పడుతుండగా భారత్‌లో పర్యటించే అవకాశం దక్కించుకున్న మరో జట్టు దక్షిణాఫ్రికా. డిసెంబరులో జరిగిన ఆ సిరీస్‌లో 1-3తో ఓడినప్పటికీ ఆతిథ్య జట్టుకు దీటుగానే నిలిచింది సఫారీ జట్టు. ఓపెనింగ్ చేసే కెప్టెన్ మార్‌క్రమ్, స్పిన్నర్‌గానూ జట్టుకు ఉపయోగపడతాడు. అతను సూపర్ ఫామ్‌లో ఉన్నాడు. తన ఓపెనింగ్ భాగస్వామి డికాక్ ఎంతటి ప్రమాదకర బ్యాటరో తెలిసిందే. ఇక ప్రస్తుతం ప్రపంచ మేటి టీ20 బ్యాటర్లలో ఒకడిగా పేరు తెచ్చుకున్న బ్రెవిస్‌తో పాటు రికిల్‌టన్, స్టబ్స్‌లతో సఫారీ జట్టుకు మెరుగైన బ్యాటింగ్ విభాగం ఉంది. ఆల్‌రౌండర్లు మార్కో యాన్సెన్, కార్బిన్ బోష్ బ్యాటుతో, బంతితో సత్తా చాటగలరు. భారత్‌తో సిరీస్‌లో ఆడలేకపోయిన రబాడ ప్రపంచకప్ కోసం సిద్ధంగా ఉన్నాడు. అతడితో పాటు ఎంగిడి, మఫాకాలతో పేస్ విభాగమూ బాగుంది. కానీ స్పిన్‌కు అనుకూలించే అవకాశమున్న పిచ్‌లను ఆ జట్టు ఎంతమేర సద్వినియోగం చేసుకోగలదన్నదే ప్రశ్న.

సురుచి-సామ్రాట్ జోడీకి రజతం


సురుచి, సామ్రాట్

దిల్లీ: ఆసియా షూటింగ్ ఛాంపియన్‌షిప్ 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ విభాగంలో సురుచి సింగ్-సామ్రాట్ రాణా జోడీ రజతంతో మెరిసింది. గురువారం తుది పోరులో సురుచి-సామ్రాట్ ద్వయం 479.6 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచింది. నిగ్‌లినా-కమలోవ్ (ఉజ్బెకిస్థాన్) జంట 481.3 పాయింట్లతో ప్రపంచ రికార్డు సృష్టిస్తూ స్వర్ణాన్ని ఎగరేసుకుపోయింది. చెంగ్-చెన్ (చైనీస్ తైపీ, 412.2) కాంస్యం సొంతం చేసుకుంది.

క్వార్టర్స్‌లో భారత్

కింగ్‌డావో (చైనా): ఆసియా టీమ్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో ఇప్పటికే క్వార్టర్‌ఫైనల్ బెర్తును ఖరారు చేసుకున్న భారత పురుషులు, మహిళల జట్లు చివరి లీగ్ మ్యాచ్‌ల్లో ఓడాయి. గురువారం గ్రూపు-వై చివరి పోరులో భారత్ 2-3తో థాయ్‌లాండ్ చేతిలో ఓడింది. తొలి మ్యాచ్‌లో తన్వి శర్మ 21-14, 17-21, 21-18తో బుసానన్‌పై నెగ్గగా.. గాయత్రి-ట్రీసా జాలీ జోడీ 21-14, 20-22, 21-11తో తిదప్రాన్- నటామోన్ జంటపై గెలిచింది 2-0తో భారత్‌కు ఆధిక్యాన్ని అందించింది. అయితే రక్షిత శ్రీ 19-21, 17-21తో పిచామోన్ చేతిలో, తనీషా క్రాస్టో- శ్రుతి మిశ్రా 21-19, 14-21, 15-21తో మిజాద్- నపాపకార్న్ చేతిలో ఓడటంతో 2-2తో స్కోరు సమమైంది. నిర్ణయాత్మక అయిదో మ్యాచ్‌లో మాళవిక 18-21, 14-21తో పోర్న్‌పిచా చేతిలో పరాజయం చవిచూడటంతో థాయ్‌లాండ్ 3-2తో భారత్‌పై పైచేయి సాధించింది. అయితే ఈ మ్యాచ్‌లో ఓడినా.. తొలి పోరులో మయన్మార్‌ను చిత్తుచేసిన భారత్.. గ్రూపులో రెండో స్థానంలో నిలిచి క్వార్టర్స్ బెర్తు దక్కించుకుంది. పురుషుల విభాగం గ్రూప్-సి ఆఖరి మ్యాచ్‌లో భారత్ 2-3తో జపాన్ చేతిలో ఓడింది. తొలి సింగిల్స్‌లో ఆయుష్ 21-18, 15-21, 21-11తో నిషిమోటోపై నెగ్గగా.. తర్వాత డబుల్స్‌లో సాత్విక్-చిరాగ్ జంట 21-18, 15-21, 21-12తో యుగో-హోకి జోడీని ఓడించింది. అయితే ప్రణయ్, తరుణ్ సింగిల్స్ మ్యాచ్‌లతో పాటు హరిహరన్-పృథ్వీ డబుల్స్ మ్యాచ్‌ను కోల్పోయిన భారత్ ఓటమి చవిచూసింది. తొలి మ్యాచ్‌లో సింగపూర్‌ను ఓడించడంతో రెండో స్థానంలో నిలిచిన భారత్ ముందంజ వేసింది.

సత్తా చాటిన పృథ్వీ, గురు

జాతీయ వెయిట్ లిఫ్టింగ్

మోదీనగర్: జాతీయ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో ఆంధ్రప్రదేశ్ లిఫ్టర్లు అప్పనేని పృథ్వీ, గురు నాయుడు సత్తా చాటారు. గురువారం పురుషుల 56 కేజీల విభాగంలో పృథ్వీ 215 కేజీలు ఎత్తి రజతం గెలుచుకున్నాడు. ధర్మ జ్యోతి (230 కేజీలు, సర్వీసెస్) స్వర్ణం సాధించగా.. అర్షలాన్ (ఉత్తరాఖండ్, 212 కేజీలు) కాంస్యం నెగ్గాడు. 60 కేజీల విభాగంలో గురు నాయుడు కాంస్యాన్ని సొంతం చేసుకున్నాడు. సర్వీసెస్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న అతడు 265 కేజీలతో మూడో స్థానంలో నిలిచాడు. ఈ విభాగంలో రెండుసార్లు కామన్వెల్త్ పతక విజేత గురురాజా పూజారి 269 కేజీల బరువు లిఫ్ట్ చేసి పసిడి కైవసం చేసుకున్నాడు. రిషికాంత సింగ్ (266 కేజీలు) రజతం సాధించాడు.

అనురాగ్‌కు సుప్రీంకోర్టులో ఊరట

దిల్లీ: బీసీసీఐ పూర్వ అధ్యక్షుడు, కేంద్ర మాజీ మంత్రి అనురాగ్ ఠాకూర్‌కు సర్వోన్నత న్యాయస్థానంలో ఊరట లభించింది. బోర్డు కార్యకలాపాల్లో పాల్గొనకుండా 2017లో అనురాగ్‌పై విధించిన నిషేధాన్ని సవరిస్తూ సుప్రీంకోర్టు గురువారం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. బీసీసీఐ నిబంధనల ప్రకారం బోర్డు వ్యవహారాల్లో పాల్గొనేందుకు అనుమతిచ్చింది. 2017 జనవరి 2న అప్పటి బీసీసీఐ అధ్యక్షుడిగా ఉన్న అనురాగ్‌ను బోర్డు కార్యకలాపాలకు తక్షణమే దూరంగా ఉండాలంటూ సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ ఉత్తర్వులను సవరించాలంటూ అనురాగ్ దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్య కాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీలతో కూడిన ధర్మాసనం 'సమానత్వ సిద్ధాంతం' ఆధారంగా ఈ నిర్ణయం తీసుకుంది. గత తొమ్మిదేళ్లుగా బీసీసీఐ కార్యకలాపాలకు అనురాగ్ దూరంగా ఉన్నారని న్యాయస్థానం గుర్తుచేసింది. గతంలో ఆయన కోరిన బేషరతు క్షమాపణను కూడా కోర్టు పరిగణనలోకి తీసుకుంది. 2016లో బీసీసీఐ స్వయంప్రతిపత్తి విషయంలో అప్పటి ఐసీసీ ఛైర్మన్ శశాంక్ మనోహర్‌కు లేఖ రాసిన ఉదంతంలో తప్పుడు అఫిడవిట్ సమర్పించినందుకు అనురాగ్‌పై 2017లో కోర్టు ధిక్కరణ, తప్పుడు సాక్ష్యం కింద చర్యలు ప్రారంభమయ్యాయి. అప్పట్లో కోర్టు ఉత్తర్వులు అమలు చేయకుండా తప్పించుకునేందుకే ఆయన ఐసీసీ లేఖను ఆశ్రయించారని సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. అయితే 2017 జులై 14న అనురాగ్ స్వయంగా హాజరై క్షమాపణలు కోరడంతో న్యాయస్థానం ఆ చర్యలను విరమించుకుంది.

భారత శిక్షణ వ్యవస్థకు గోపీచంద్ దిశానిర్దేశం


మన్‌సుఖ్ మాండవీయ

దిల్లీ: భారత క్రీడారంగంలో శిక్షణ ప్రమాణాలను అంతర్జాతీయ స్థాయికి పెంచేందుకు పుల్లెల గోపీచంద్ నేతృత్వంలోని టాస్క్‌ఫోర్స్ అందించిన విప్లవాత్మక సిఫార్సులను దశలవారీగా అమలు చేయనున్నట్లు కేంద్ర క్రీడాశాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ వెల్లడించారు. "టాస్క్‌ఫోర్స్ సిఫార్సుల అమలు దశలవారీగా జరుగుతుంది. ఎన్‌సీఏబీ ఏర్పాటు, ఏకీకృత పాఠ్య ప్రణాళికను ఖరారు చేయడం వంటి చర్యల్ని స్వల్పకాలంలో చేపట్టాలని నిర్ణయించాం" అని మాండవీయ పేర్కొన్నారు. శిక్షణలో విప్లవాత్మక మార్పులు అవసరమని గోపీచంద్ నేతృత్వంలోని 9 మంది సభ్యుల టాస్క్‌ఫోర్స్ 43 పేజీల నివేదికలో పేర్కొంది. కోచ్‌లకు టాప్స్ పథకాన్ని ప్రవేశపెట్టడం.. ఎన్‌సీఏబీ ఏర్పాటు.. నాలుగు స్థాయిల శిక్షణ వ్యవస్థ.. మాజీ క్రీడాకారులకు ప్రాధాన్యత వంటి సంస్కరణల్ని టాస్క్‌ఫోర్స్ సూచించింది.

అథ్లెట్ పూజపై వేటు

దిల్లీ: భారత లాంగ్ డిస్టెన్స్ రన్నర్ పూజపై అథ్లెటిక్స్ ఇంటిగ్రిటీ యూనిట్ (ఏఐయూ) వేటు వేసింది. డోప్ పరీక్ష నుంచి తప్పించుకున్నందుకు పూజను తాత్కాలికంగా సస్పెండ్ చేసింది. 2024 ఇండియా గ్రాండ్ ప్రిలో రాజస్థాన్ తరఫున 5000 మీ, 10000 మీ పరుగులో పాల్గొన్న పూజ మూడో స్థానంలో నిలిచింది. 30 ఏళ్ల పూజ కెరీర్‌లో ఇదే అత్యుత్తమ ప్రదర్శన. నిరుడు లఖ్‌నవూలో జరిగిన జాతీయ క్రాస్ కంట్రీ ఛాంపియన్‌షిప్‌లో 25వ స్థానం సాధించింది. "ఒక అథ్లెట్‌గా నమూనాల సేకరణ నుంచి తప్పించుకోవడం, తిరస్కరించడం లేదా సమర్పించడంలో విఫలమైనందున పూజ ఆత్మారాం (భారత్)ను ఏఐయూ తాత్కాలికంగా సస్పెండ్ చేసింది. ఆరోపణలకు సంబంధించి నోటీసు జారీ చేసింది" అని ఏఐయూ పేర్కొంది.

కల్తీ నెయ్యి తయారీలో లబ్సా

- పాలు, నెయ్యి సహా ఇతర ఆహార ఉత్పత్తుల్లో దీని వాడకం నిషేధం
- దిల్లీలోని అరిస్టో కెమికల్స్ నుంచి 'లబ్సా'ను కొన్న భోలేబాబా డైరెక్టర్లు
- పామాయిల్, పామ్‌కెర్నెల్ ఆయిల్లలో 'లబ్సా, లాక్టిక్ యాసిడ్' కలిపితే అచ్చం నెయ్యి లాంటి పదార్థమే
- రసాయనాల మిశ్రమాన్నే నెయ్యిలా తితిదేకు సరఫరా
- సిట్ అభియోగపత్రంలో వెల్లడి

వాషింగ్ లిక్విడ్, ఫ్లోర్ క్లీనర్ల తయారీలో వాడే ప్రమాదకర రసాయనమది

ఈనాడు, అమరావతి: వైకాపా హయాంలో తిరుమలకు కల్తీ నెయ్యి సరఫరా చేసిన కేసులో తవ్వే కొద్దీ సంచలన విషయాలు వెలుగుచూస్తున్నాయి. లబ్సా (లీనియర్ ఆల్కైల్ బెంజీన్ సల్ఫోనిక్ యాసిడ్) అనే రసాయనాన్ని ఈ ముఠా.. కల్తీ నెయ్యి తయారీలో వినియోగించినట్లు స్పష్టమవుతోంది. లబ్సాను వాషింగ్ పౌడర్లు, వాషింగ్ లిక్విడ్లు, డిష్‌వాష్ లిక్విడ్లు, ఫ్లోర్‌క్లీనర్లు, టాయిలెట్ క్లీనర్ల తయారీతో పాటు పారిశ్రామిక రంగంలో క్లీనింగ్ ఏజెంట్‌గా, ఆయిల్, గ్రీజు మరకలు తొలగించేందుకు ఉపయోగిస్తారు. పురుగుమందులు, క్రిమిసంహార రకాల్లోని రసాయనాలు నీటిలో సమానంగా కలిసేలా చేయడంలో ఎమల్సిఫయర్‌గా దీన్ని వాడతారు. ఇది అత్యంత ప్రమాదకరమైన రసాయనం. తిరుమలకు సరఫరా కోసం లక్షల కిలోల కల్తీ నెయ్యి తయారుచేసిన భోలేబాబా డెయిరీ డైరెక్టర్లు... అందుకోసం వివిధ రసాయనాలు కొన్నట్లు సిట్ దర్యాప్తులో తేల్చింది. అందులోభాగంగా దిల్లీలోని అరిస్టో కెమికల్స్ నుంచి 8,900 కిలోల లాక్టిక్ యాసిడ్, లబ్సా/యాసిడ్ స్లర్రీ కొన్నారని అభియోగపత్రంలో పేర్కొంది. సాధారణంగా కల్తీ నెయ్యి తయారీదారులు పామాయిల్, పామ్‌కెర్నెల్ ఆయిల్ లాంటి చౌకరకం నూనెలు.. నెయ్యిలా కనిపించేలా చేసేందుకు, అచ్చం నెయ్యిని పోలేలా రంగు, రుచి, వాసన, క్రీమీనెస్ వచ్చేలా చేసేందుకు లబ్సా, లాక్టిక్ యాసిడ్ కలుపుతారు.



కల్తీ నెయ్యి తయారీలో వాడేందుకు భోలేబాబా డైరెక్టర్లు పొమిల్ జైన్, విపిన్ జైన్ ఎక్కడెక్కడి నుంచి ఏయే రసాయనాలు కొన్నారో అభియోగపత్రంలో సిట్ వెల్లడించింది. దీన్నిబట్టి కల్తీనెయ్యి తయారీలో వాడేందుకే భోలేబాబా లబ్సాను కొన్నట్లు స్పష్టమవుతోంది.

నెయ్యి కాని దాన్ని నెయ్యి అని తలపించేలా చేసేందుకు...

కల్తీ నెయ్యి తయారీకి 57.56 లక్షల కిలోల పామాయిల్, పామ్‌కెర్నెల్ ఆయిల్‌తో పాటు 8.90 లక్షల కిలోల ఎసిటిక్ యాసిడ్ ఈస్టర్, లాక్టిక్ యాసిడ్ ఫుడ్‌గ్రేడ్, మోనోగ్లిజరైడ్స్, లబ్సా సహా వివిధ రసాయనాలను భోలేబాబా డెయిరీ కొన్నట్లు సిట్ గుర్తించింది. పామాయిల్, పామ్‌కెర్నెల్ ఆయిళ్లతో బీటా-కెరోటిన్, ఎసిటిక్ యాసిడ్ ఫుడ్‌గ్రేడ్, మోనోగ్లిజరైడ్స్ సహా పలు రసాయనాలు కలిపి కల్తీ నెయ్యి తయారుచేసినట్లు తేల్చింది. ల్యాబ్‌ల్లో పరీక్షించేటప్పుడు అది నెయ్యేనని తప్పుడు ఫలితాలు వచ్చేలా చేసేందుకు, నెయ్యి వాసన వచ్చేలా చేసేందుకు ఈ రసాయనాలను కలిపినట్లు అభియోగపత్రంలో వెల్లడించింది. ఈ రసాయనాల సరఫరాదారుల్ని కూడా ఈ కేసులో నిందితులుగా చేర్చింది. దీన్నిబట్టి లబ్సానూ కల్తీనెయ్యి తయారీలో వినియోగించినట్లు స్పష్టమవుతోంది. కల్తీ నెయ్యి కోసం కాకపోతే ఒక సాధారణ డెయిరీకి వేల కిలోల లబ్సా అవసరం ఏముంటుంది? భోలేబాబా డెయిరీ లబ్సా కొన్నట్లు గుర్తించిన సిట్.. దానిపై మరింత లోతుగా దర్యాప్తు చేయకుండా వదిలేసింది.

జీర్ణాశయ సమస్యలు, కాలేయ వ్యాధులు, పేగులకు గాయాలయ్యే ముప్పు

■ ఆయిల్ అండ్ పెట్రోకెమికల్స్ రంగంలో చమురు బావులను శుభ్రం చేయడానికి, డ్రిల్లింగ్ ఫ్లూయిడ్స్‌లో లబ్సాను వాడుతారు. వస్త్ర పరిశ్రమలో క్లీనింగ్, వెట్టింగ్ ఏజెంట్‌గా, ఫ్యాబ్రిక్ ప్రాసెసింగ్‌లో వినియోగిస్తారు. ఇది అత్యంత ప్రమాదకరమైన రసాయనం. ఆహారభద్రత, ప్రమాణాల చట్టం-2006 ప్రకారం.. ఇలాంటి హానికర రసాయనాలను ఆహార ఉత్పత్తుల్లో వాడటం నిషేధం.

■ నెయ్యి, పాలు సహా ఏ ఆహార ఉత్పత్తుల తయారీలోనూ లబ్సాను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపయోగించకూడదు. ఇది ఆరోగ్యానికి చాలా హానికరం. లబ్సా కలిసిన నెయ్యిని వినియోగిస్తే జీర్ణాశయ సమస్యలు, కాలేయ వ్యాధులు, పేగులకు గాయాలయ్యే ముప్పుంది. దీర్ఘకాలంలో క్యాన్సర్ లాంటి రోగాలు వచ్చే ప్రమాదముంది.

■ మానవ ఆరోగ్యానికి అత్యంత ప్రమాదకరమైన, ఆహార ఉత్పత్తుల తయారీలో నిషేధించిన ఇంతటి ప్రమాదకర రసాయనాన్ని కల్తీ నెయ్యి తయారీలో భోలేబాబా డెయిరీ వినియోగించినట్లు స్పష్టమవుతుండటం ఆందోళన కలిగిస్తోంది.

మచిలీపట్నం పోర్టు అనుసంధాన హైవేకి రూ.573 కోట్లు

ఆరు వరుసలతో 8 కి.మీ. నిర్మాణానికి నిధులు మంజూరు | **పనులు చేపట్టనున్న మోర్త్**

సరకు రవాణాకు సమయం తగ్గేలా

– నితిన్ గడ్కరీ



ఎన్‌హెచ్‌-65, 216 జంక్షన్ నుంచి మచిలీపట్నం పోర్టుకు కనెక్టివిటీ రోడ్డు నిర్మాణానికి రూ.573.77 కోట్లు మంజూరుచేసినట్లు కేంద్ర రోడ్డు రవాణా, హైవేల మంత్రి నితిన్ గడ్కరీ గురువారం తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు. దీనివల్ల పోర్టుకు సరకు రవాణా చేసే సమయం గణనీయంగా తగ్గుతుందని, లాజిస్టిక్ సామర్థ్యం పెరుగుతుందని పేర్కొన్నారు. ఆరు వరుసల ప్రధాన హైవేతోపాటు, సర్వీస్ రోడ్లు, మూడు చోట్ల ఫ్లైఓవర్లు, ఓ రైల్వే వంతెన నిర్మించనున్నట్లు తెలిపారు.

ఈనాడు, అమరావతి: విజయవాడ వైపు నుంచి వెళ్లే వాహనాలు.. నేరుగా మచిలీపట్నం పోర్టుకు రాకపోకలు సాగించేందుకు వీలుగా.. అనుసంధాన హైవే నిర్మాణానికి రూ.573.77 కోట్ల మేర నిధులు మంజూరయ్యాయి. దీంతో 8 కి.మీ. మేర ఆరు వరుసలతో దీనిని నిర్మించనున్నారు. ఈ మేరకు కేంద్ర రోడ్డు రవాణా, హైవేల మంత్రిత్వశాఖ (మోర్త్) ఉన్నతాధికారుల నుంచి ఇక్కడి అధికారులకు ఆదేశాలొచ్చాయి. ఇప్పటికే మచిలీపట్నం పోర్టు పనులు వేగంగా సాగుతుండగా.. అది అందుబాటులోకి వచ్చేలోపు అనుసంధాన హైవేను కూడా పూర్తి చేసేందుకు అవకాశం ఏర్పడింది.

■ ప్రస్తుతం విజయవాడ నుంచి మచిలీపట్నం వరకు 64 కి.మీ. మేర ఇప్పుడున్న హైవే-65ని నాలుగు వరుసల నుంచి ఆరు వరుసలుగా విస్తరించేందుకు డీపీఆర్ సిద్ధం చేస్తున్నారు. ఇందుకు రూ.1,100 కోట్లు వ్యయమవుతుందని అంచనా వేస్తున్నారు.

■ ఈ హైవే మచిలీపట్నం శివారులోని సుల్తాన్ నగర్ వద్ద కత్తిపూడి-ఒంగోలు హైవే-216ని క్రాస్ చేస్తుంది. సరిగ్గా అక్కడి నుంచే మచిలీపట్నం పోర్టుకు అనుసంధానం చేసే హైవే పనులు మొదలవుతాయి.

■ సుల్తాన్‌నగర్ కూడలి వద్ద వద్ద ప్రస్తుతం రెండు వరుసల ఫ్లైఓవర్ ఉంది. దానిని ఆరు వరుసల ఫ్లైఓవర్‌గా విస్తరిస్తారు.

■ అక్కడి నుంచి హైవే-216పై పెడనవైపు హర్ష కాలేజీ సమీపం వరకు దాదాపు 4 కి.మీ. మేర ఆరు వరుసలుగా విస్తరిస్తారు.

■ హర్ష కాలేజీ సమీపం నుంచి కుడివైపునకు పోర్టుకు వెళ్లేందుకు ఆరు వరుసలతో నాలుగు కి.మీ. మేర కొత్తగా గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మించనున్నారు.

■ అంటే మొత్తం 8 కి.మీ.లలో నాలుగు కి.మీ. ప్రస్తుత హైవే విస్తరణ, మిగిలిన నాలుగు కి.మీ. కొత్త హైవే నిర్మాణం చేయనున్నారు.

● అభ్యర్థనలను మన్నించి మచిలీపట్నం పోర్టు అనుసంధాన హైవేకి రూ.573 కోట్ల నిధులు మంజూరు చేసినందుకు కేంద్ర రహదారి రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి మచిలీపట్నం జనసేన ఎంపీ వి.బాలశౌరి కృతజ్ఞతలు తెలిపారు.

క్లోవర్‌లీఫ్ ఇంటర్‌ఛేంజ్ లేకపోతే ఎలా?

మచిలీపట్నం శివారు సుల్తాన్‌నగర్ వద్ద విజయవాడ హైవే, కత్తిపూడి-ఒంగోలు హైవేలో కలిసే చోట క్లోవర్‌లీఫ్ ఇంటర్‌ఛేంజ్ వంతెన నిర్మించేలా తొలుత ప్రతిపాదించారు. అయితే ఇందుకు ఆ కూడలికి నాలుగు వైపులా పెద్దఎత్తున భూములు అవసరం ఉంటుంది. దీంతో స్థానికంగా రైతులు అభ్యంతరాలు వ్యక్తంచేశారు. ఈ నేపథ్యంలో క్లోవర్‌లీఫ్ వంతెన ప్రతిపాదన పక్కనపెట్టారు. దీనికి బదులు డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్ నిర్మించనున్నారు. అంటే పోర్టువైపు నుంచి వచ్చే వాహనాలు.. విజయవాడవైపు వెళ్లే హైవే-65లో నేరుగా కలిసేలా సుల్తాన్‌నగర్ వద్ద ఇప్పుడున్న ఫ్లైఓవర్‌పై మరో ఫ్లైఓవర్ నిర్మించనున్నారు. అయితే ఆ కూడలిలో ఇంటర్‌ఛేంజ్ నిర్మించకపోతే భవిష్యత్‌లో అనేక ఇబ్బందులు తలెత్తనున్నాయి.

అప్పట్లోనే జగన్ దృష్టికి కల్తీ నెయ్యి

- రాజేశ్ కార్పొరేషన్ ఉల్లంఘనలెన్నో!
- శ్రీశైలం వ్యవహారంలో నాటి సీఎంకు కూడా ఫిర్యాదు

ఈనాడు, కర్నూలు: శ్రీశైలం దేవస్థానానికి నెయ్యి సరఫరా చేసిన రాజేశ్ కార్పొరేషన్ ఉల్లంఘనలు ఒక్కొక్కటీ వెలుగులోకి వస్తున్నాయి. ఆ సంస్థ సరఫరా చేసిన నెయ్యితో తయారైన లడ్డూలు నాణ్యంగా లేవని అప్పట్లోనే పలు విమర్శలొచ్చాయి. దీంతోపాటు నెయ్యిని తక్కువ సరఫరా చేసి ఎక్కువ సరఫరా చేసినట్లుగా బిల్లు చేసుకుంటున్నారని కూడా నాటి ఆలయ ఛైర్మన్, వైకాపా నేత రెడ్డివారి చక్రపాణిరెడ్డికి ఫిర్యాదులు అందాయి. దీంతో ఆ సంస్థ సరఫరా చేసిన నెయ్యిని పరిశీలించడానికి ఆయన వెళ్లారు. ఆ పరిశీలనలో డబ్బాల్లో ఉండాల్సిన పరిమాణం కన్నా తక్కువ పరిమాణంలో నెయ్యి ఉందని నిర్ధారణ అయ్యింది. దీంతో ప్రతి నెయ్యి డబ్బాలో ఉన్న నెయ్యి పరిమాణాన్ని లెక్కించి ఎంత తక్కువగా ఉంటే ఆ నెయ్యి విలువకు సరిపడా చెల్లింపును తగ్గించాలని చక్రపాణిరెడ్డి ఆలయ ఉద్యోగులను ఆదేశించారు. ఆ సంస్థ పాల్పడిన ఉల్లంఘనలు నమోదు చేయాలని కూడా ఆయన సూచించారు. ఆయన సూచన ప్రకారం నాటి ఆలయ సూపరింటెండెంట్ స్థాయి అధికారి రంగస్వామి ఆయా వివరాలన్నీ నమోదు చేశారు.

అప్పటి ఓ మంత్రి నుంచి తీవ్రమైన ఒత్తిళ్లు

రాజేశ్ కార్పొరేషన్ సంస్థ అక్రమాల వివరాలను రికార్డు చేయవద్దని సూచించినా ఛైర్మన్ ఆదేశాల మేరకు వివరాలను నమోదు చేయడం ఓ మంత్రికి ఆగ్రహం తెప్పించింది. దీంతో సూపరింటెండెంట్‌ను కాణిపాకం బదిలీ చేశారు. అక్కడితో ఆగకుండా కాణిపాకం ఈవోకు ఫోన్ చేసి ఆయన్ను విధుల్లో చేర్చుకోవద్దంటూ అనధికారిక ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఆ సూపరింటెండెంట్ తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది.

దిగొచ్చిన సంస్థ ప్రతినిధులు

ఆలయానికి తక్కువ పరిమాణంలో నెయ్యి సరఫరా చేసిన రాజేశ్ కార్పొరేషన్ సంస్థ చివరకు తప్పిదాన్ని సవరించుకోవడానికి ముందుకు వచ్చింది. నిర్ణీత పరిమాణం కన్నా తక్కువున్న నెయ్యి డబ్బాలను వెనక్కి తీసుకుని మళ్లీ డబ్బాలను సరఫరా చేయడంతో వివాదం ముగిసింది. నెయ్యి నాణ్యతను తనిఖీ చేసే వ్యవస్థలు ఆలయంలో లేకపోవడంతో ఆ అంశంపై అప్పట్లో దృష్టి పెట్టలేకపోయారు.

అప్పటి ఈవో అండతోనే

రాజేశ్ కార్పొరేషన్‌పై విమర్శలు వస్తుండటం, ఆలయాన్ని మోసం చేయడానికి ప్రయత్నించడంతో ఆ సంస్థను తప్పించాలని చక్రపాణిరెడ్డి బోర్డు మీటింగ్‌లో పట్టుబట్టారు. దీంతోపాటు ఆ సంస్థ ప్రతినిధులు ఆలయానికి ఇస్తున్న సరకుల ధరలు కూడా బయటి మార్కెట్ కన్నా ఎక్కువకు విక్రయించారని ఛైర్మన్ అభ్యంతరం వ్యక్తం చేశారు. అయినప్పటికీ ఆ సంస్థకు అప్పటి ఈవో లవన్న అండగా ఉన్నారన్న విమర్శలున్నాయి. ఆ సంస్థ నెయ్యిని తక్కువ ధరకు సరఫరా చేసిన కారణంగా ఆలయానికి సుమారు రూ.80 లక్షల లాభం కలిగినట్లు లవన్న ప్రకటించారు. ఈవోనే ఆ సంస్థను వెనకేసుకురావడంతో ఎవరూ మాట్లాడలేకపోయారు. టెండరు నిబంధనలు కూడా రాజేశ్ కార్పొరేషన్‌కు అనుకూలంగా ఉండేలా రూపొందించారన్న విమర్శలున్నాయి.

నాటి ముఖ్యమంత్రి దగ్గర పంచాయితీ

చివరకు రాజేశ్ కార్పొరేషన్ వ్యవహారంపై నేరుగా అప్పటి ముఖ్యమంత్రి జగన్‌కు చక్రపాణిరెడ్డి ఫిర్యాదు చేశారు. ఆ సంస్థ పాల్పడుతున్న అక్రమాలను కూడా అందులో ప్రస్తావించారు. వివాదం నానాటికీ తీవ్రమవుతుండడంతో ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి ఏమి ఆదేశాలొచ్చాయోగానీ ఆఖరికి రాజేశ్ కార్పొరేషన్‌ను పక్కకు తప్పించారు.

పట్టణ మహిళల ఉపాధికి ఎగ్‌మార్ట్‌లు

జిల్లాకు 10 చొప్పున త్వరలో ప్రారంభం



ఈనాడు–అమరావతి: పట్టణ పేద మహిళల ఉపాధికి కొత్తగా ఎగ్ మార్ట్‌లు త్వరలో ప్రారంభం కానున్నాయి. జిల్లాకు పది చొప్పున మొత్తం 260 మార్ట్‌లు ఏర్పాటు చేయనున్నారు. నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ (ఎన్‌ఈసీసీ) ఆధ్వర్యంలో ఒక్కో మార్ట్ ఏర్పాటుకు రూ.50 వేలు చొప్పున నిధులు సమకూర్చనున్నారు. రూ.35 వేలతో కార్ట్ (బండి), ఇతర సామగ్రి అందిస్తారు. మరో రూ.15 వేల విలువైన గుడ్లు సరఫరా చేస్తారు. గుడ్లతో పాటు వివిధ రకాల ఆహార పదార్థాలను తయారు చేసి విక్రయించేలా ఏర్పాట్లు చేయనున్నారు.

■ పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలోని స్వయం సహాయక సంఘాల సభ్యుల్లో ఇప్పటివరకు ఎలాంటి ఉపాధికి నోచుకోని వారికి, ఒంటరి మహిళలకు ఎగ్ మార్ట్‌ల ఏర్పాటులో ప్రాధాన్యమివ్వనున్నారు. అర్హులైన మహిళలను ఎంపిక చేసేలా మెప్మా ఆదేశాలు జారీ చేసింది. ఈ నెలాఖరులోగా ప్రక్రియ పూర్తి చేసి వచ్చే నెలలో ప్రారంభించాలని ప్రభుత్వం యోచిస్తోంది.

■ పట్టణ స్వయం సహాయక సంఘాల సభ్యులతో రూపాయి పెట్టుబడి లేకుండా ఉపాధి యూనిట్లు ఏర్పాటు చేయడం ఇదే మొదటిసారి. ఇప్పటివరకు ఇటువంటి యూనిట్ల ఏర్పాటుకు మహిళలు చేసిన పొదుపు మొత్తాల నుంచి బ్యాంకులు రుణాలిచ్చేవి. ఇప్పుడు ఎన్‌ఈసీసీయే మొత్తం పెట్టుబడి పెడుతోంది. మహిళల ఉపాధికి అరుదైన అవకాశమని మెప్మా అధికారులు చెబుతున్నారు.

ఆంత్రోపిక్‌తో భయం లేదు: నాస్‌కామ్

దిల్లీ: అధునాతన కృత్రిమ మేధ (ఏఐ) కారణంగా భారత టెక్ సేవల రంగం ఇబ్బందుల్లో పడుతుందన్న ఆందోళనలను పరిశ్రమ సంఘం నాస్‌కామ్ కొట్టివేసింది. ఏఐ టూల్స్ వల్ల, వివిధ రంగాల్లో ఐటీ పాత్ర మరింతగా పెరుగుతుందని, పునర్ నిర్వచనానికి మాత్రమే ఇది లోనవుతుందని పేర్కొంది. తాము విడుదల చేసిన క్లాడ్ కోవర్క్ క్లిష్టమైన ఆఫీసు పనులను స్వతంత్రంగా పూర్తి చేస్తుందని ఆంత్రోపిక్ అనే అమెరికా అంకుర సంస్థ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇందువల్ల భారత ఐటీ కంపెనీలకు ఇబ్బందులు తలెత్తుతాయన్న భయాలు ఏర్పడ్డ నేపథ్యంలో, నాస్‌కామ్ ఈ వివరణ ఇచ్చింది. ఏఐ నుంచి నిజమైన వ్యాపార విలువ సృష్టించాలంటే.. అందుకు మానవ వనరులతో సమన్వయం అత్యంత అవసరమని స్పష్టం చేసింది. పెద్ద కంపెనీలకు ఏఐ ఒక 'అసాధారణ పరిష్కారం'గా మారబోదనీ పేర్కొంది.

భారత్-అమెరికా ఒప్పందంతో ఆర్థిక అంశాల అంచనాలు కొలిక్కి

భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందంతో, పెట్టుబడుల వంటి స్థూల ఆర్థిక అంశాలపై అంచనాలు ఒక కొలిక్కి వచ్చినట్లయిందని నాస్‌కామ్ అభిప్రాయపడింది. అంతర్జాతీయ పోటీతత్వం వల్ల, టెక్నాలజీ, నైపుణ్యం, నమ్మకం.. ఇవన్నీ డోలాయమానంలో పడ్డాయని, ఇప్పుడు స్పష్టత వస్తోందని నాస్‌కామ్ ప్రెసిడెంట్ రాజేశ్ నంబియార్ పేర్కొన్నారు. అమెరికా జీడీపీకి భారత ఐటీ కంపెనీలు 103 బిలియన్ డాలర్ల (సుమారు రూ.9.27లక్షల కోట్ల) మేర అందిస్తున్నాయని, 5 లక్షల ఉద్యోగాలూ ఆ దేశంలో కల్పించినట్లు నంబియార్ గుర్తు చేశారు. ఈనెల 4-5 తేదీల్లో జరిగిన నాస్‌కామ్ యూఎస్ సీఈఓ ఫోరమ్‌లో నంబియార్ ఈ వివరాలు తెలిపారు. అమెరికా అధికారులు, చట్టసభ్యులతో నాస్‌కామ్ ప్రతినిధులు విస్తృత చర్చలు నిర్వహించారు. భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం కుదురుతోందన్న ప్రకటన వెలువడ్డాక జరిగిన తొలి ప్రధాన పరిశ్రమ కార్యక్రమం ఇదే. ఇరు దేశాల భాగస్వామ్యం వల్ల , ఏఐ వ్యవస్థలో పెరిగే అవకాశాలపై చర్చించారు.

భవన, ఇతర నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాల పునరుద్ధరణ

- ప్రసూతికి రూ.20వేలు, పిల్లల పెళ్లికి రూ.40వేల సాయం
- సహజ మరణానికి రూ.60వేలు, అంత్యక్రియలకు రూ.20వేల అందజేత
- కార్మికులకు ఆరోగ్య పరీక్షలు, నైపుణ్య శిక్షణ
- కార్మికశాఖ సమీక్షలో సీఎం ఆదేశాలు



కార్మిక శాఖపై సమీక్షిస్తున్న సీఎం చంద్రబాబు. చిత్రంలో మంత్రి వాసంశెట్టి సుభాష్, అధికారులు

ఈనాడు, అమరావతి: భవన, ఇతర నిర్మాణ కార్మికులకు గతంలో అందించిన సంక్షేమ పథకాలను పునరుద్ధరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. ప్రసూతికి రూ.20వేలు, వివాహానికి రూ.40వేలు, సహజ మరణానికి రూ.60వేలు, అంత్యక్రియలకు రూ.20వేలు ఆర్థిక సాయం అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. క్యాంపు కార్యాలయంలో గురువారం నిర్వహించిన కార్మికశాఖ సమీక్షలో ఆయన మాట్లాడుతూ.. "నిర్మాణ రంగంలో ఉన్న ప్రముఖ కంపెనీలు ఎల్‌అండ్‌టీ, ఎన్‌సీసీ, మిత్తల్‌తో పాటు ఇతర సంస్థల సహకారంతో నైపుణ్య శిక్షణ ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలి. నైపుణ్య శిక్షణతో ఏపీలోని కార్మికులు దేశ విదేశాల్లో ఉపాధి అవకాశాలు పొంది, అధిక ఆదాయాన్ని ఆర్జించేలా చూడాలి. జిల్లాల వారీగా, రంగాల వారీగా కార్మికుల డేటాబేస్‌ను రూపొందించి, వారి నైపుణ్య స్థాయిని అంచనా వేయాలి. నైపుణ్యం పోర్టల్‌తో ఈ డేటాబేస్‌ను అనుసంధానించి.. కార్మికులు వివిధ కోర్సులు అభ్యసించి, ఉన్నత విద్యార్హత సాధించేలా చూడాలి. గిగ్‌వర్కర్లు, నిర్మాణ కార్మికుల ఆదాయాలు పెరిగేందుకు చర్యలు చేపట్టాలి. వివిధ రంగాలకు అవసరమైన ఆధునిక పరికరాలను కార్మికులకు అందించేందుకు కార్యాచరణ సిద్ధం చేయాలి" అని సూచించారు.

20లక్షల మందికి నైపుణ్యాలు అందించాలి


"రాష్ట్రంలోని 20లక్షల మంది కార్మికుల నైపుణ్యాలు పెంచేందుకు కార్యాచరణ చేపట్టాలి. కార్మికుల్లో సాంకేతిక నైపుణ్యాలు పెరిగితే అధిక ఆదాయాన్ని పొందేందుకు అవకాశం ఉంటుంది. రాష్ట్రంలో ఏర్పాటుకానున్న వివిధ భారీ పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు మన యువతకు అందించాలి. కార్మికులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, తీవ్ర అనారోగ్య సమస్యలు ఉన్నవారిని గుర్తించాలి. యూనివర్సల్ హెల్త్‌పాలసీతో పాటు కార్మికశాఖ ద్వారా రూ.2.5లక్షల వరకూ ఉచిత వైద్యచికిత్సలు, ఆపై ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్టు ద్వారా భరించేలా చూడాలి. గతంలో కార్మికుల సంక్షేమం కోసం భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ నిధిని తెదేపా హయాంలోనే ఏర్పాటుచేశాం. కార్మికుల రిజిస్ట్రేషన్ వేగవంతం చేయాలి" అని ఆదేశించారు.

గుండెపోటు మరణాలకు నాణ్యతలేని నూనెలే కారణం

- రెండు, మూడు రకాలు కలిపి వాడుకోవడం మేలు
- డబ్ల్యూహెచ్‌వో, ఎన్‌ఐఎన్ నిపుణుల సూచన

ఈనాడు, హైదరాబాద్: దేశంలో పెరుగుతున్న గుండెపోటు మరణాలకు నాణ్యతలేని వంట నూనెల వినియోగమే కారణమని ప్రముఖ ఆరోగ్య నిపుణులు పేర్కొన్నారు. గురువారం న్యూట్రిషన్ లిటరసీ అండ్ ఇంప్రూవ్‌మెంట్ ఆఫ్ ఫుడ్ ఎన్విరాన్‌మెంట్స్(ఎన్‌యూఎల్‌ఐఎఫ్‌ఈ), ఆహార భద్రత, ప్రమాణాల సంస్థ(ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ) సంయుక్తంగా నిర్వహించిన జూమ్ మీటింగ్‌లో జాతీయ పోషకాహార సంస్థ(ఎన్‌ఐఎన్), డబ్ల్యూహెచ్‌వో, సీఎఫ్‌టీఆర్‌ఐకి చెందిన శాస్త్రవేత్తలు పాల్గొన్నారు. ఎంత నూనె వాడుతున్నాం అనే దాని కంటే, ఎలాంటిది వాడుతున్నామనేదే ప్రధానమని ఎన్‌ఐఎన్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ భానుప్రకాశ్‌రెడ్డి అన్నారు. 'ఏ ఒక్క నూనె అన్ని రకాల పోషకాలను అందించలేదు. ఒక్కో నెల ఒక్కో రకం వాడుకోవడం లేదంటే రెండు, మూడు రకాల నూనెలు కలిపి వాడుకోవడం మేలు. చాలా నూనెల్లో ఒమేగా-6 ఎక్కువగా ఉంటుంది. దానికి తగినట్లుగా ఒమేగా-3 లభించే ఆహారాలు, నూనెలను చేర్చుకోకపోతే గుండె జబ్బుల ముప్పు పెరుగుతుంది' అని హెచ్చరించారు. చిరు వ్యాపారులకు తక్కువ ధరలో ఆరోగ్యకరమైన నూనెలు అందించడంపై ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని డబ్ల్యూహెచ్‌వో ఆగ్నేయాసియా ప్రాంతీయ కార్యాలయ సలహాదారు డాక్టర్ ఏంజెలా డిసిల్వా సూచించారు. వైద్యులు రోగులకు మందులతోపాటు ఎలాంటి వంట నూనెలు వాడాలో సూచించాలని చండీగఢ్‌లోని పీజీఐఎంఈఆర్ ఆచార్యులు, వరల్డ్ ఎన్‌సీడీ ఫెడరేషన్ అధ్యక్షుడు జేఎస్ ఠాకూర్ పేర్కొన్నారు. రైస్‌బ్రాన్ ఆయిల్‌లో ఉండే 'ఒరిజనోల్' వంటి పోషకాలు కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో దోహదపడతాయని ఐసీటీ విశ్రాంత శాస్త్రవేత్త డాక్టర్ ఆర్.బి.ఎన్.ప్రసాద్ తెలిపారు. డాక్టర్ సుబ్బారావు సమన్వయకర్తగా వ్యవహరించిన సమావేశంలో సెంట్రల్ ఫుడ్ టెక్నలాజికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ శాస్త్రవేత్త డాక్టర్ ఉషారాణి, ఎన్‌ఐఎన్ శాస్త్రవేత్త డాక్టర్ అబ్రహం ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక యువకుడికి రూ.49 కోట్ల లాటరీ



శంతను శెట్టిగార్

ఉడుపి, న్యూస్‌టుడే: అబుదాబిలో నిర్వహించే 'బిగ్ టికెట్ లాటరీ'లో కర్ణాటకలోని ఉడుపి జిల్లాకు చెందిన శంతను శెట్టిగార్ (33)కు బంపర్ ఆఫర్ తగిలింది. లక్కీ డ్రాలో 20 మిలియన్ల దిర్హామ్‌ల (సుమారు రూ.49 కోట్లు)ను ఆయన గెలుచుకున్నారు. ఉడుపి జిల్లా ఉద్యావరకు చెందిన శంతను శెట్టిగార్ ప్రవాస భారతీయుడు. ఒమన్‌లోని రిటైల్ రంగంలో పని చేస్తున్న ఆయన.. స్నేహితుడితో కలిసి లాటరీ టికెట్ కొన్నారు. దానికి తాజాగా ఈ భారీ మొత్తం తగిలింది. 'లాటరీలో గెలుపు చాలా సంతోషాన్ని కలిగించింది. ఈ బహుమతి నగదుతో ఏం చేయాలో ఇంకా నిర్ణయించుకోలేదు. టికెట్‌ను నా స్నేహితుడితో కలిసి కొన్నా. అతనితో బహుమతిలోనూ వాటాను పంచుకుంటా' అని ఈ సందర్భంగా శంతను తెలిపారు.

సౌర పరిశ్రమ యాజమాన్యానికి బెదిరింపులు

కేంద్ర మంత్రి దృష్టికెళ్లడంతో కేసు నమోదు ● పరిహారం చెల్లింపు, ఉద్యోగుల తొలగింపుపై విమర్శలు

నంద్యాల, న్యూస్‌టుడే: నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ నియోజకవర్గం ఉయ్యాలవాడ మండలంలోని గోవిందపల్లెలో ఏర్పాటవుతున్న ఎస్‌ఏఈఎల్ సౌర పరిశ్రమ యాజమాన్యానికి అధికార పార్టీ నేతల నుంచి బెదిరింపులు రావడం చర్చనీయాంశమైంది. పరిశ్రమ ఏర్పాటుకు భూములిచ్చిన రైతులకు నష్టపరిహారం, కౌలు చెల్లింపు, రహదారి విస్తరణ, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు తదితర విషయాల్లో బాధితులు ఇటీవల ఆందోళన చేశారు. తాజాగా ఉయ్యాలవాడకు చెందిన బోరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, చింతకుంటకు చెందిన హర్షవర్ధన్‌రెడ్డి, ఆళ్లగడ్డ వాసి హుస్సేన్‌రెడ్డి, ప్రకాశ్‌లు బుధవారం రాత్రి ఎస్‌ఏఈఎల్ పరిశ్రమ వద్దకు వెళ్లి, రోడ్డు నిర్మాణాన్ని అడ్డుకున్నారు. ఆ పనులు తామే చేసుకుంటామని, వెంటనే ఆపాలని బెదిరించారు. ఈ ఘటనపై సంస్థ యాజమాన్యం తమకు దిల్లీ స్థాయిలో ఉన్న పరిచయాలతో నేరుగా కేంద్రంలోని ఓ కీలక మంత్రికి ఫిర్యాదు చేసింది. వెంటనే కేంద్ర మంత్రి ఆగ్రహం వ్యక్తంచేస్తూ సంస్థ యాజమాన్యాన్ని బెదిరించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీంతో విజయవాడలోని ఉన్నతాధికారులు రంగంలోకి దిగారు. ఈ ఘటనపై సత్వరమే స్పందించి, ఎంతటి వారైనా వదిలిపెట్టకూడదని జిల్లా పోలీసులకు ఆదేశాలిచ్చినట్లు సమాచారం. స్థానిక పోలీసులు నలుగురిని అదుపులోకి తీసుకుని నంద్యాలలోని ముఖ్య పోలీసు అధికారి కార్యాలయానికి తరలించి, కౌన్సెలింగ్ ఇచ్చినట్లు సమాచారం. యాజమాన్యం ఫిర్యాదు మేరకు ఉయ్యాలవాడ పోలీసులు కేసు నమోదు చేశారు.

అడుగడుగునా ఆటంకాలే..

ఎస్‌ఏఈఎల్ సౌర పరిశ్రమ ఏర్పాటుకు రెండేళ్ల నాడు అడుగులు పడ్డాయి. సుమారు 400 ఎకరాల విస్తీర్ణంలో వంద మెగావాట్ల సామర్థ్యంతో సుమారు రూ.400 కోట్ల వ్యయంతో గుజరాత్‌కు చెందిన సంస్థ ఈ పరిశ్రమను నిర్మిస్తోంది. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డ తొలినాళ్లలో స్థానిక ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ దీనికి భూమిపూజ చేశారు. అనంతరం రైతులకు పరిహారం పంపిణీ, ఉద్యోగాల కల్పన విషయంలో అధికార పార్టీ నేతల నుంచి యాజమాన్యంపై ఒత్తిడి వచ్చినట్లు సమాచారం. చెక్కుల పంపిణీని కూడా ఆర్భాటం చేయడంతో చివరకు యాజమాన్యమే రైతులకు నేరుగా అందించింది. పొలాల్లో భూగర్భ తీగలు వేయడాన్ని రైతులు వ్యతిరేకించారు. భూములు కోల్పోయిన కుటుంబాలకు ఉద్యోగాలు ఇచ్చినట్లే ఇచ్చి, మూణ్నెల్ల తర్వాత తొలగించారన్న ఫిర్యాదులు వచ్చాయి.

పీజీ వైద్యవిద్యార్థిని అనుమానాస్పద మృతి

- విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో ఘటన
- ఆపరేషన్ థియేటర్‌లో కుప్పకూలిన వైద్యురాలు
- చేతిపై ఇంజక్షన్ గుర్తులున్నందున అనుమానాలు


డాక్టర్ దీపిక

ఈనాడు–అమరావతి, న్యూస్‌టుడే–విజయవాడ వైద్యం: విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో ఎనస్థీషియా పీజీ విద్యార్థిని డాక్టర్ బత్తుల దీపిక బుధవారం అర్ధరాత్రి తర్వాత అనుమానాస్పద స్థితిలో మృతిచెందారు. రాత్రి 1.10 వరకూ బాగానే ఉన్న దీపిక.. అరగంటలోనే ఆపరేషన్ థియేటర్‌లో కుప్పకూలిపోయారు. రాత్రి 1.40 సమయంలో తోటి పీజీ విద్యార్థులు ఆమెను గుర్తించి అత్యవసర వైద్యం అందించేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. ఆ అరగంటలో ఏం జరిగిందనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. దీపిక చేతిపై నాలుగు ఇంజక్షన్ గుర్తులుండడంతో.. అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అనంతపురం కోవూరునగర్‌కు చెందిన కోదండరామిరెడ్డి, భారతి దంపతుల చిన్న కుమార్తె దీపిక. తండ్రి కోదండరామిరెడ్డి ఉరవకొండలో సబ్‌యూనిట్ మలేరియా అధికారిగా, తల్లి భారతి అనంతపురం కురుగుంట పీహెచ్‌సీలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నారు. దీపిక తిరుపతి వేంకటేశ్వర వైద్యకళాశాలలో ఎంబీబీఎస్ పూర్తిచేశారు. ప్రస్తుతం విజయవాడ సిద్ధార్థ వైద్య కళాశాలలో పీజీ ఎనస్థీషియా చివరి ఏడాది చదువుతున్నారు. మరో నాలుగు నెలల్లో పీజీ అవుతుందనగా.. విషాదం చోటుచేసుకుంది.

అర్ధరాత్రి వరకు విధులు

విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో వైద్యురాలిగా దీపిక పనిచేస్తున్నారు. బుధవారం రాత్రి ఆమె, మరో ఎనస్థీషియా పీజీ విద్యార్థిని కలిసి విధులు నిర్వహించారు. రాత్రి రెండు శస్త్రచికిత్సలు జరగ్గా. . రోగులకు మత్తుమందు ఇచ్చారు. రాత్రి 11.30కు బయటనుంచి ఆహారం తెప్పించుకుని ఇద్దరూ తిన్నారు. తనకు వాంతులు వచ్చేలా ఉందని దీపిక చెప్పడంతో ఆమె సహచర వైద్యురాలు ఇంజక్షన్ ఇచ్చి, వార్డుకు వెళ్లారు. రాత్రి 12.30కు మరో శస్త్రచికిత్స ఉండడంతో దీపిక ఓటీ వద్దే ఉన్నారు. ఆమె రాత్రి 1.10 వరకు ఆపరేషన్ థియేటర్ లోపలికి, బయటికి తిరుగుతున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. తర్వాత లోపలి నుంచి బయటకు రాలేదు. ఆపరేషన్ బల్లపై అచేతనంగా పడి ఉండడం చూసిన సహచర వైద్యులు సీపీఆర్ చేసి, వెంటిలేటర్ పెట్టినా.. ఫలితం లేకపోయింది.

ఆపరేషన్ థియేటర్‌లో గతంలో సీసీ కెమెరా ఉండేది. వైద్యులు దుస్తులు మార్చుకునేందుకు ఇబ్బందిగా ఉందని తొలగించారు. తోటి పీజీ విద్యార్థిని ఇంజెక్షన్ చేయడానికి కాన్యులా పెట్టే క్రమంలో రెండు సూది ఆనవాళ్లు పడ్డాయి. మిగతా రెండు సూది గుర్తులు ఎందుకున్నాయో తెలియాల్సి ఉంది.

పెళ్లి కుమార్తెలా చూడాలనుకుంటే..

దీపిక మృతదేహాన్ని మార్చురీకి తీసుకెళ్తుండగా ఆమె తల్లి గుండెలు పగిలేలా రోదించారు. పెళ్లికుమార్తెలా చూడాలనుకున్న బిడ్డను ఇలా చూడాల్సి వస్తుందనుకోలేదని భోరున విలపించారు. తన చెల్లిలి మృతికి కారణాలను కనిపెట్టి తమకు న్యాయం చేయాలని దీపిక సోదరి డాక్టర్ మౌనిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ విజయవాడ సీపీ రాజశేఖరబాబు, ఆసుపత్రి సూపరింటెండెంట్‌తో మాట్లాడారు. సమగ్ర విచారణ చేయాలని ఆదేశించారు.


కుమార్తె మృతదేహంపై పడి రోదిస్తున్న తల్లి, అక్క

పోస్టుమార్టం నివేదిక వచ్చాకే స్పష్టత

'కడుపులో ఇబ్బందిగా ఉందని, ఇంజక్షన్ చేయాలని దీపిక కోరడం వల్లే.. తోటి పీజీ వైద్యురాలు చేశారు. దర్యాప్తు కోసం కమిటీ వేశాం. వేధింపుల కోణంలోనూ విచారణ చేస్తున్నాం. పోస్టుమార్టం నివేదిక వచ్చాకే మృతిపై స్పష్టత వస్తుంది.'

– ఏడుకొండలరావు, ఆసుపత్రి ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్, సిద్ధార్థ కళాశాల ప్రిన్సిపల్

నాపై కేసు.. రిమాండ్ ఉత్తర్వులు కొట్టేయండి

- హైకోర్టును ఆశ్రయించిన అంబటి రాంబాబు
- ఫిర్యాదుదారుకు నోటీసులు జారీ

ఈనాడు, అమరావతి: సీఎం చంద్రబాబుపై అసభ్యకర వ్యాఖ్యలు చేసిన వ్యవహారంలో నమోదైన కేసులో తనను రిమాండ్‌కు పంపుతూ గుంటూరు కోర్టు ఇచ్చిన ఉత్తర్వులతోపాటు నల్లపాడు పోలీసులు నమోదుచేసిన కేసును కొట్టేయాలంటూ వైకాపా నేత, మాజీమంత్రి అంబటి రాంబాబు అత్యవసరంగా దాఖలు చేసిన వ్యాజ్యంపై గురువారం హైకోర్టు విచారణ జరిపింది. ఫిర్యాదుదారు తెదేపా నేత పిల్లి మాణిక్యరావుకు నోటీసులు జారీచేసింది. పూర్తి వివరాలు సమర్పించాలని నల్లపాడు పోలీసులను ఆదేశించింది. తదుపరి విచారణను ఈనెల 11కి వాయిదా వేసింది. న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి గురువారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చారు.

జైల్లో ఉండటం సురక్షితమని రిమాండ్ విధించారు: పొన్నవోలు

గురువారం జరిగిన విచారణలో అంబటి తరఫున సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్ రెడ్డి వాదనలు వినిపించారు. ప్రాణహాని ఉందన్న కారణంతో బయట ఉండటం కన్నా లోపల (జైల్లో) ఉండటం సురక్షితమనే కారణంతో అంబటి రాంబాబుకు గుంటూరు కోర్టు రిమాండ్ విధించిందన్నారు. పోలీసులు నమోదుచేసిన సెక్షన్లన్నీ ఏడేళ్లలోపు జైలుశిక్షకు వీలున్నవేనని, అయినా అక్రమంగా అరెస్టు చేసి జైల్లో ఉంచారని చెప్పారు. రిమాండ్ ఉత్తర్వులను సస్పెండ్ చేయాలని కోరారు. పోలీసుల తరఫున పీపీ మెండ లక్ష్మీనారాయణ వాదనలు వినిపిస్తూ.. 'పిటిషనర్ దిగువ కోర్టులో బెయిలు పిటిషన్ వేశారు. ఆయనను పోలీసు కస్టడీకి అప్పగించాలని పోలీసులు అదే కోర్టులో పిటిషన్ వేశారు. వాటిపై విచారణ పెండింగ్‌లో ఉండగా.. రిమాండ్ ఉత్తర్వులను సవాలుచేస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయడానికి వీల్లేదు. ఫిర్యాదుదారు మాణిక్యరావుకు నోటీసు ఇవ్వకుండా ఈ వ్యాజ్యంలో ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులివ్వొద్దు' అని కోరారు.

నోటీసు ఇచ్చి వివరణ తీసుకోండి

ఇదే కేసులో నిందితులుగా ఉన్న వైకాపా కార్యకర్తలు కల్లం హరికృష్ణారెడ్డి, మరికొందరు దాఖలు చేసిన వ్యాజ్యంపై హైకోర్టు విచారణ జరిపింది. పిటిషనర్లకు నోటీసు ఇచ్చి వివరణ తీసుకోవాలని నల్లపాడు పోలీసులను ఆదేశించింది.

పెళ్లి వేడుకలోనూ జగన్ మార్క్ బలప్రదర్శన

- శాసనమండలి ఛైర్మన్ మోషేనురాజు కుమారుడి వివాహానికి హాజరు
- ఫ్లెక్సీలు, నినాదాలతో వైకాపా కార్యకర్తల హంగామా

ఈనాడు డిజిటల్, భీమవరం, పట్టణం, పాలకోడేరు: సందర్భమేదైనా బలప్రదర్శనే ముఖ్యమన్నట్లు తయారైంది వైకాపా అధినేత జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనల తీరు. గురువారం ఆయన పశ్చిమ గోదావరి జిల్లా కాళ్ల మండలం పెదఅమిరంలో శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేనురాజు కుమారుడి వివాహానికి హాజరయ్యారు. ఉదయం హెలిప్యాడ్ వద్ద జగన్ దిగిన వెంటనే 'సీఎం.. సీఎం' అంటూ పలువురు యువకులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. 'ఆ కుర్చీ పుట్టిందే.. ఆ కుటుంబం కోసం రా', 'మీరు సృష్టించే విధ్వంసం కోసం ఎదురుచూస్తున్నాము' అని రాసిన ఫ్లెక్సీలను ప్రదర్శించారు. రహదారికి ఇరువైపులా భారీగా ఫ్లెక్సీలు కట్టారు. జగన్ హెలిప్యాడ్ నుంచి కల్యాణ మండపానికి కారులో వెళ్లగా, కొందరు కార్యకర్తలు జెండాలు ప్రదర్శిస్తూ ద్విచక్ర వాహనాలపై అనుసరించారు. మండపం ప్రవేశ ద్వారం వద్ద అమర్చిన కొన్ని బారికేడ్లు యువత తోపులాటలో కిందపడ్డాయి. జగన్ హాలులోకి ప్రవేశించి, వేదికపైకి వెళ్తున్న సమయంలో అభిమానులు 'జై జగన్, సీఎం సీఎం' అంటూ నినాదాలు చేశారు. వధూవరులు చిట్టిరాజు, తేజరిషితలను ఆశీర్వదించి, కిందకు దిగుతున్న సమయంలోనూ అభిమానులు వేదిక వద్ద హంగామా సృష్టించారు. దీంతో స్టేజీ అలంకరణ చెదిరిపోయింది. బారికేడ్లను తోసిపడేశారు. పరిస్థితి చెయ్యి దాటిపోకుండా మోషేనురాజు.. అల్లరి చేయొద్దంటూ మైకులో కార్యకర్తలకు విన్నవించారు. కల్యాణ మండపం లోపల, బయట అభిమానులను అదుపు చేసేందుకు పోలీసులు లాఠీలకు పని చెప్పారు.




'ఆ కుర్చీ పుట్టిందే ఆ కుటుంబం కోసం రా', 'మీరు సృష్టించే విధ్వంసం కోసం ఎదురు చూస్తున్నాము' అని జగన్ కోసం ఫ్లెక్సీలతో హంగామా

పరామర్శల పేరిట జగన్ విధ్వంసం

- 25 కి.మీ. దూరానికి హైవేపై ఆరేడు గంటల ప్రయాణమా?
- హోంమంత్రి అనిత మండిపాటు

నక్కపల్లి, న్యూస్‌టుడే: పరామర్శల పేరిట రాష్ట్రంలో విధ్వంసం సృష్టించాలని వైకాపా అధినేత జగన్ చూస్తున్నారని హోంమంత్రి వంగలపూడి అనిత దుయ్యబట్టారు. ప్రజాస్వామ్యంలో అధికార, ప్రతిపక్ష నాయకులు ప్రజల్లోకి రావడం తప్పుకాదని.. మూర్ఖపు, క్రిమినల్ ఆలోచనలతో ఉన్న జగన్ పరామర్శలు చేస్తున్నారో, ప్రదర్శనలు చేస్తున్నారో తెలియడం లేదన్నారు. వారానికోసారి బెంగళూరు నుంచి రాష్ట్రానికి వచ్చి విధ్వంసం చేసి వెళ్లాలనేదే ఆయన ఆలోచనగా ఉందని ఆరోపించారు. అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం సారిపల్లిపాలెంలోని తన క్యాంపు కార్యాలయంలో గురువారం ఆమె విలేకరులతో మాట్లాడారు. 'గతంలో మామిడి, మిర్చి రైతుల వద్దకు వెళ్లి, ఆ పార్టీ నాయకులతోనే పంటలను ధ్వంసం చేయించారు. అనంతపురంలో హెలిప్యాడ్ వద్ద పదుల సంఖ్యలో గుమికూడి ప్రమాదకరంగా వ్యవహరించారు. పరామర్శ పేరుతో ఆ పార్టీ నాయకుడు సింగయ్య మృతికి జగనే కారణమయ్యారు. రౌడీ షీటర్లు, గంజాయి నిందితులను పరామర్శించడానికి వెళ్తూ హడావిడి చేశార'ని అనిత గుర్తుచేశారు. 'తాజాగా జగన్.. అంబటి రాంబాబు ఇంటికెళ్లి ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. ఆయనేమైనా స్వాతంత్ర్య సమరయోధుడా? జగన్ పెంచి పోషించిన అంబటికి బూతులు మాట్లాడటం కొత్తేమీ కాదు. అసెంబ్లీలో చంద్రబాబును ఎలా దూషించారో జనమంతా చూశారు. బుధవారం అంబటి రాంబాబును పరామర్శించే నెపంతో 25 కి.మీ. దూరానికి కావాలనే ఆరేడు గంటల పాటు ప్రయాణం చేసి, హైవేను స్తంభింపజేసి ప్రజలను ఇబ్బంది పెట్టారు. తిరుగు ప్రయాణంలో మాత్రం అరగంటలో వెళ్లిపోయారు' అంటూ సంబంధిత డ్రోన్ చిత్రాలను ఆమె సెల్‌ఫోన్‌లో ప్రదర్శించారు. తాజాగా జోగి రమేష్ ఇంటికి వెళ్తానని అంటున్నారని, దీనికి తామేమి అడ్డుచెప్పబోమన్నారు. అయితే, తగిన ఏర్పాట్ల కోసం ఎంతమంది వస్తారని అడిగితే సమాధానం లేదని మండిపడ్డారు. వారు తప్పుచేసి దాన్ని పోలీసులపై నెడుతున్నారని, సొంత మీడియాలో తప్పుడు ప్రచారం చేయిస్తుంటారని అనిత విమర్శించారు. ఇలాంటి పర్యటనల్లో ఎలాంటి చర్యలు తీసుకోవాలో న్యాయ నిపుణులతో చర్చించనున్నట్లు చెప్పారు. ఫ్యాక్షనిజం, మత కలహాలను నియంత్రించిన సీఎం చంద్రబాబుకు.. జగన్ అరాచకాలను ఎలా కట్టడి చేయాలో తెలుసని మంత్రి అనిత పేర్కొన్నారు.


జగన్ పర్యటనలో స్తంభించిన ట్రాఫిక్ ఫొటోలు చూపుతున్న హోం మంత్రి అనిత

EENADU Vol: 52, Issue: 177 | Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. | Founder Ramoji Rao

ఈనాడు సినిమా


ప్రతినాయిక ఛాయలున్న పాత్రలో?


రష్మిక

అల్లు అర్జున్ - రష్మికలది వెండితెరపై హిట్ జోడీ. ఈ ఇద్దరూ విజయవంతమైన 'పుష్ప' సిరీస్ సినిమాలతో అందర్నీ మెప్పించారు. వీళ్లిద్దరూ ఇప్పుడు మరోసారి కలిసి తెర పంచుకుంటున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం అల్లు అర్జున్ హీరోగా అట్లీ దర్శకత్వంలో ఓ బహుభాషా చిత్రం సిద్ధమవుతున్న సంగతి తెలిసిందే. సన్‌పిక్చర్స్ పతాకంపై కళానిధి మారన్ నిర్మిస్తున్నారు. చిత్రీకరణ దశలో ఉన్న ఈ సినిమాలో రష్మిక ఓ కీలక పాత్ర పోషించనున్నట్లు కొన్నాళ్లుగా వార్తలు వినిపిస్తున్నాయి. ఇప్పుడా పాత్ర చిత్రీకరణ కోసం ఆమె సెట్స్‌లోకి అడుగు పెట్టిందని బాలీవుడ్ వర్గాల సమాచారం. ఇందులో రష్మికది ప్రతినాయిక ఛాయలున్న పాత్రగా ఉంటుందని తెలుస్తోంది. ప్రస్తుతం ముంబయిలో జరుగుతున్న కొత్త షెడ్యూల్‌లో ఆమెతో పాటు ప్రధాన తారాగణంపై కీలక సన్నివేశాలు తెరకెక్కిస్తున్నట్లు వార్తలొస్తున్నాయి. ఇది సైన్స్ ఫిక్షన్ అంశాలతో నిండిన ఆసక్తికర కథతో రూపొందుతున్న సినిమా. అల్లు అర్జున్ ఇందులో రెండు భిన్నమైన పాత్రల్లో కనువిందు చేయనున్నట్లు తెలిసింది. దీపికా పదుకొణె కథానాయిక. మృణాల్ ఠాకూర్, జాన్వీకపూర్ ముఖ్య పాత్రలు పోషిస్తున్నట్లు ప్రచారం వినిపిస్తున్నా.. ఇంకా అధికారిక ప్రకటన వెలువడలేదు.

జపాన్ మ్యాగజైన్‌పై ప్రభాస్

ప్రఖ్యాత జపాన్ మ్యాగజైన్ అనన్ బ్యాక్ కవర్‌పై కనిపించనున్న తొలి భారతీయ సోలో కథానాయకుడిగా ప్రభాస్ చరిత్ర సృష్టించనున్నారు. ఈ నెల 10న విడుదల కానున్న ఆ మ్యాగజైన్‌పై ప్రభాస్‌కి ప్రేక్షకుల్లో ఉన్న ఆకర్షణ కీర్తిస్తూ ఆయన చిత్రాన్ని ప్రచురించనుంది. 'ఆర్.ఆర్.ఆర్' విడుదల తర్వాత రామ్‌చరణ్, ఎన్టీఆర్ కలిసి ఆ మ్యాగజైన్‌పై కనిపించారు. ఆ తర్వాత ప్రభాస్‌కి ఆ గౌరవం దక్కనుంది. అందుకు సంబంధించిన కవర్‌పేజీ ఇప్పటికే సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. 'బాహుబలి' సినిమాలతో ప్రభాస్‌కి జపాన్‌లో విశేషమైన అభిమాన గణం ఏర్పడింది. అప్పట్నుంచి ఆయన సినిమాలు జపాన్‌లోనూ విడుదలవుతున్నాయి. 'కల్కి 2898 ఎ.డి' చిత్రం కూడా అక్కడ విడుదలై విజయవంతంగా ప్రదర్శితమైంది. అప్పుడే ప్రభాస్ త్వరలోనే జపాన్ వస్తానని అభిమానులకు చెప్పారు. ఆ మాట మేరకే గత డిసెంబరులో ప్రభాస్ టోక్యో వెళ్లారు. ఆ సందర్భంగానే కవర్‌ఫొటో షూట్ జరిగింది. ప్రభాస్ ప్రస్తుతం 'ఫౌజీ', 'స్పిరిట్' సినిమాలతో బిజీగా ఉన్నారు. త్వరలోనే 'కల్కి 2' కూడా పట్టాలెక్కనుంది.





నాగచైతన్య వరుణ్ తేజ్ రామ్

కొత్త కథలతో... కోటి ఆశలతో!

యువ కథానాయకుల్లో చాలా మంది వరుస పరాజయాలతో సతమతమవుతున్నారు. ఒకప్పుడు కథల ఎంపికలో ఉత్తమ అభిరుచి ప్రదర్శించిన ఆ కథానాయకులే ఊహించని విధంగా ఎదురు దెబ్బలు తిన్నారు. వాళ్లంతా ఇప్పుడు విజయమే లక్ష్యంగా కొత్త కథలపై దృష్టి పెట్టారు. ఆ జాబితాలోనే ఉన్న శర్వానంద్ ఈమధ్యే 'నారీ నారీ నడుమ మురారి'తో విజయాన్ని అందుకున్నారు. ఇప్పుడు మిగిలిన కథానాయకులు కూడా ఆచితూచి అడుగులేస్తూ, విజయంపైనే గురిపెట్టి కథల్ని ఎంపిక చేసుకొంటున్నారు. ఈ క్రమంలోనే పలు కొత్త కలయికలు వెలుగులోకి వస్తున్నాయి. మంచి కథతోనే 'ఆంధ్ర కింగ్ తాలూకా' చేసిన రామ్ పోతినేనికి ఆ సినిమాతో ఆశించిన ఫలితం మాత్రం దక్కలేదు. దాంతో ఆయన కథలపై మరిన్ని జాగ్రత్తలు తీసుకొంటున్నట్టు తెలుస్తోంది. ప్రస్తుతం రామ్ రెండు స్టోరీలపై దృష్టిపెట్టినట్టు తెలుస్తోంది. మిస్టిక్ థ్రిల్లర్ జానర్‌లో ఓ సినిమా చేయబోతున్నారని ఎప్పట్నుంచో ప్రచారం సాగుతోంది. తాజాగా మరో కొత్త దర్శకుడు చెప్పిన కథకీ పచ్చజెండా ఊపినట్టు సమాచారం. మరి ఆయన రెండు కథల్నీ ఒకేసారి పట్టాలెక్కిస్తారా లేక, ఒక సినిమా తర్వాత మరొకటి చేస్తారా అన్నది చూడాలి. మరో యువ కథానాయకుడు వరుణ్‌తేజ్ విజయాన్ని చూసి చాలా రోజులైంది. ఆయన ప్రస్తుతం 'కొరియన్ కనకరాజు' అనే సినిమా చేస్తున్నారు. ఆ తర్వాత చేయనున్న సినిమా కోసం పలువురు దర్శకులు వరుణ్‌కి కథలు వినిపించారు. గత కొన్ని రోజులుగా 'కమిటీ కుర్రోళ్ళు' ఫేం యదువంశీ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. వరుణ్ కోసం ఆయన ఓ కథని సిద్ధం చేశారని, అది నచ్చి నిహారిక సొంత నిర్మాణ సంస్థలోనే తన అన్నతో సినిమా చేయడానికి రంగం సిద్ధం చేశారని సమాచారం. ప్రేమకథలకి పెట్టింది పేరైన నాగచైతన్య గతేడాది 'తండేల్'తో విజయాన్ని అందుకున్నారు. ప్రస్తుతం 'వృషకర్మ' సినిమా చేస్తున్నారు. అది పూర్తయ్యాక ఆయన మళ్లీ ఓ ప్రేమకథ కోసం రంగంలోకి దిగనున్నట్టు సమాచారం. 'బెదురులంక' ఫేం క్లాక్స్ చెప్పిన ప్రేమకథకి నాగచైతన్య పచ్చజెండా ఊపారని సమాచారం. ఆయా ప్రాజెక్టులపై త్వరలోనే అధికారికంగా స్పష్టత వచ్చే అవకాశాలున్నాయి.

ఈ ఘటనను మరో వార్తగా చూసి మర్చిపోవద్దు


–సోనూసూద్



ఉత్తర్‌ప్రదేశ్‌లోని గాజియాబాద్‌లో ఇటీవలే ఆన్‌లైన్ గేమింగ్ కారణంగా ముగ్గురు అక్కాచెల్లెళ్లు ఆత్మహత్య చేసుకున్న సంగతి తెలిసిందే. దీనిపై స్పందించిన నటుడు సోనూసూద్.. బాల్యానికి మార్గదర్శకత్వం, ప్రేమ అవసరం.. కానీ అల్గారిథమ్స్.. స్క్రీన్లు కాదంటూ వ్యాఖ్యలు చేశారు. 16ఏళ్ల లోపు పిల్లలకు ఆన్‌లైన్ గేమింగ్‌పై ఆంక్షలు విధించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేస్తూ.. సామాజిక మాధ్యమాల వేదికగా ఓ వీడియోను పంచుకున్నారు. "గాజియాబాద్‌లో ముగ్గురు పిల్లలు ప్రాణాలు కోల్పోయారు. వారు హింస, పేదరికం వల్ల చనిపోలేదు. ఆన్‌లైన్ గేమింగ్, డిజిటల్ వ్యసనం కారణంగా కనిపించని ఒత్తిడితో మరణించారు. గతంలో దీనిపై పోరాటం చేశాను. ఇప్పుడు మళ్లీ చెబుతున్నాను. చదువు కోసం తప్ప మిగతా అన్ని విషయాల్లో 16ఏళ్ల లోపు పిల్లలకు సోషల్ మీడియా, ఆన్‌లైన్ గేమింగ్‌లను నిషేధించాలి. ఇది ఎవరినో నిందించడం కోసం కాదు.. మన పిల్లలను కాపాడుకోవడం కోసం చేస్తున్న విజ్ఞప్తి. దయచేసి పిల్లలను సోషల్ మీడియాకు దూరంగా ఉంచండి. ఈ ఘటనను మరో వార్తగా చూసి మర్చిపోవద్దు. ఇది స్పందించాల్సిన సమయం" అని ఆ వీడియోలో చెప్పుకొచ్చారు సోనూసూద్.

ఈ నెలలోనే 'మృత్యుంజయ్'

శ్రీవిష్ణు కథానాయకుడిగా నటించిన 'మృత్యుంజయ్' ఈ నెల 27న ప్రేక్షకుల ముందుకు రానుంది. శ్రీ హుసేన్ షా కిరణ్ దర్శకత్వంలో రూపొందిన చిత్రమిది. లైట్‌బాక్స్ మీడియా, పిక్చర్ పర్‌ఫెక్ట్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థలపై సందీప్ గుణ్ణం, వినయ్ చిలకపాటి సంయుక్తంగా నిర్మించారు. ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ కథతో రూపొందిన ఈ చిత్రం విడుదల తేదీని ప్రకటిస్తూ గురువారం చిత్రబృందం ప్రత్యేకమైన పోస్టర్‌ని విడుదల చేసింది. విజయవంతమైన 'సింగిల్' తర్వాత శ్రీవిష్ణు కథానాయకుడిగా ప్రేక్షకుల ముందుకొస్తున్న చిత్రమిదే. ఆయన సరసన రెబా మోనికా జాన్ కథానాయికగా నటించారు. 'సామజవరగమన' తర్వాత ఆ ఇద్దరూ కలిసి నటించిన చిత్రమిది. ఉత్కంఠ రేకెత్తించే కథ, కథనాలతో రూపొందిన ఈ చిత్రం ప్రేక్షకులకు థ్రిల్‌ని పంచుతుందని సినీ వర్గాలు చెప్పాయి. ఈ చిత్రానికి కూర్పు: శ్రీకర్‌ప్రసాద్, ఛాయాగ్రహణం: విద్యాసాగర్, సంగీతం: కాలభైరవ, ప్రొడక్షన్ డిజైన్: మనీషా ఎ.దత్.


శ్రీవిష్ణు

ప్రస్తుత పరిస్థితులకు అద్దంపట్టే యుఫోరియా

"ప్రేక్షక దేవుళ్లని నేనెంతగానో నమ్ముతాను. వాళ్ల సమయానికీ, డబ్బుకీ, విజ్ఞతకీ ఎంతో విలువ ఇస్తాను. అవన్నీ దృష్టిలో పెట్టుకునే 'యుఫోరియా' చిత్రాన్ని తెరకెక్కించా" అన్నారు ప్రముఖ దర్శకుడు గుణశేఖర్. ఆయన తెరకెక్కించిన 'యుఫోరియా' శుక్రవారం ప్రేక్షకుల ముందుకొస్తోంది. భూమిక, సారా అర్జున్, రోహిత్, విఘ్నేశ్ గవిరెడ్డి కీలక పాత్రలు పోషించిన చిత్రమిది. నీలిమ గుణ, యుక్తా గుణ నిర్మించారు. రాగిణి గుణ సమర్పకులు. చిత్రం విడుదలను పురస్కరించుకుని గురువారం హైదరాబాద్‌లో విడుదలకు ముందస్తు వేడుకని నిర్వహించారు. గుణశేఖర్ మాట్లాడుతూ "1992లో 'లాఠీ' సినిమాతో చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టా. ఇన్నేళ్ల కెరీర్‌లో నా 14వ సినిమా ఇది. ఇప్పుడు కూడా తొలి సినిమా చేస్తున్న అనుభూతిలోనే ఉన్నా. ఓ మంచి కథని, కొత్త కథని మరింత కొత్తగా చెప్పే ప్రయత్నం ఈ సినిమాలో కనిపిస్తుంది. ఇప్పటికే సినిమాని చూసినవాళ్లంతా 'ఇలాంటి కథని కొత్తవాళ్లతో, ఇంత భారీ బడ్జెట్‌తో తీయడం మామూలు విషయం కాదు. ప్రస్తుత పరిస్థితులకు అద్దం పట్టేలా ఉంది' అన్నారు. ఈ కథకు సారా అర్జున్ ఆత్మ. ఆమె ఒప్పుకుంటేనే సినిమా చేయాలనుకున్నా. భూమిక వెన్నెముక. ఆమె చాలా బలమైన వ్యక్తి. ఈ వేదికపై భావోద్వేగానికి గురైంది. వింధ్య వేములపల్లి పాత్రలో జీవించారు. విఘ్నేశ్, పృథ్వీ, లిఖిత తదితరులూ పాత్రల్లో ఒదిగిపోయారు. సమాజాన్ని చూస్తున్న ఓ సాధారణ వ్యక్తిగా ఈ సినిమాని తీశా. తెలుగు పేరు పెట్టనందుకు నన్నందరూ క్షమించాలి. ప్రవీణ్ విజువల్స్, కాలభైరవ సంగీతంతోపాటు, ఇతర సాంకేతిక బృందమంతా అత్యుత్తమ పనితీరుని కనబరిచింది" అన్నారు. భూమిక మాట్లాడుతూ "ఇలాంటి చిత్రాల్ని చేయాలంటే చాలా ధైర్యం కావాలి. ఈ సినిమాని చూసిన తర్వాత రాత్రి సరిగ్గా నిద్రపోలేదు. అంతగా వెంటాడింది. పృథ్వీ, లిఖిత, విఘ్నేశ్ అందరూ అద్భుతంగా నటించారు. ఇన్నేళ్ల కెరీర్ అయినా కూడా ఇంకా నేర్చుకోవల్సింది ఎంతో ఉందని నమ్ముతాను" అంటూ వేదికపై భావోద్వేగానికి గురయ్యారు. నిర్మాత నీలిమ గుణ మాట్లాడుతూ "ఇది సందేశాత్మక చిత్రమేమో అనుకుంటున్నారంతా. కమర్షియల్ అంశాల్ని జోడించిన ఓ కొత్త కథ ఇది. చూసినవాళ్లంతా అదే అన్నారు. భూమిక కెరీర్‌లోనే అత్యుత్తమమైన చిత్రంగా 'యుఫోరియా' నిలుస్తుంది. ఈ చిత్రం అందరి మనసుల్నీ తాకుతుంది" అన్నారు. ఈ కార్యక్రమంలో చిత్రబృందం పాల్గొంది.


విఘ్నేశ్, గుణశేఖర్, భూమిక, రాగిణి గుణ

వారం ఆలస్యం... 'సైక్'


మురళీ, శ్రుతి

మురళీ కృష్ణంరాజు, శ్రుతి శెట్టి, ఆనంద్ భారతి ప్రధాన పాత్రధారులుగా పృథ్వీ పెరిచెర్ల తెరకెక్కించిన సినిమా 'సైక్'. వేలార్ ఎంటర్‌టైన్‌మెంట్ స్టూడియోస్ సంస్థ నిర్మించింది. ఈ రోజు థియేటర్లలోకి రావాల్సిన ఈ సినిమాని అనివార్య కారణాల వల్ల వాయిదా వేసినట్లు చిత్ర బృందం తెలిపింది. ఈ మేరకు దీన్ని ఈ నెల 13న థియేటర్లలోకి తీసుకు రానున్నట్లు కొత్త విడుదల తేదీని ప్రకటించింది. అందరి మనసుల్ని హత్తుకునే కథతో ఇది ముస్తాబైనట్లు చిత్ర వర్గాలు తెలిపాయి. ఈ సినిమాకి సంగీతం: శివప్రసాద్, ఛాయాగ్రహణం: రసూల్ ఎల్లోర్.

ఆసక్తికరం... అస్సీ

ఇన్వెస్టిగేటివ్ కోర్టు రూమ్ డ్రామా నేపథ్యంలో తాప్సి ప్రధాన పాత్రలో రూపొందిన చిత్రం 'అస్సీ'. అనుభవ్ సిన్హా దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రాన్ని ఆయన.. భూషణ్ కుమార్, క్రిషన్ కుమార్‌లతో కలిసి నిర్మిస్తున్నారు. ఈ సినిమా ఈ నెల 20న రానుంది. ప్రచార పర్వంలో భాగంగా చిత్ర బృందం ఇటీవల ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేసింది. 'ఈ సంఘటన జరిగిన ఒక రోజులోనే దేశంలో 80 అత్యాచారాలు నమోదయ్యాయి.. 76 కేసులైతే కనీసం విచారణకు నోచుకోలేదు.. అత్యాచారం నుంచి బయట పడిన వారు నిందితులను గుర్తించలేకపోతున్నారు.. నిన్న నాకు ఎనిమిదేళ్ల చిన్నారి కేసు వచ్చింది. ఆ కేసును కూడా మనం ఇలానే మూసి వేయగలమా?' లాంటి ప్రశ్నలతో న్యాయవాదిగా ట్రైలర్‌లో తాప్సి పలికిన సంభాషణలు, ఆమె కనిపించిన తీరు ఉత్కంఠతని రేకెత్తించాయి. కని కుస్రుతి, రేవతి, మనోజ్ పహ్వా తదితరులు ఈ సినిమాలో కీలకపాత్రలు పోషిస్తున్నారు.


తాప్సి

'రాకాస' విడుదల ఖరారు


సంగీత్ శోభన్

సంగీత్ శోభన్ కథానాయకుడిగా నటిస్తున్న 'రాకాస' ఏప్రిల్ 3న ప్రేక్షకుల ముందుకు రానుంది. విడుదల తేదీ పోస్టర్‌ని గురువారం చిత్రబృందం పంచుకుంది. మానసశర్మ దర్శకత్వం వహిస్తున్న చిత్రమిది. జీ స్టూడియోస్ సమర్పణలో, పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ పతాకంపై ఉమేశ్ కుమార్ బన్సాల్‌తో కలిసి నిహారిక నిర్మిస్తున్నారు. 'మ్యాడ్', 'మ్యాడ్ స్క్వేర్' చిత్రాలతో మెప్పించిన సంగీత్ శోభన్ తొలిసారి సోలో హీరోగా నటిస్తున్న చిత్రమిది. నయన్ సారిక కథానాయిక. శరవేగంగా చిత్రీకరణ చేసుకొంటున్న ఈ సినిమాని వేసవి సందర్భంగా ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. వెన్నెల కిశోర్, బ్రహ్మాజీ, తనికెళ్ల భరణి, ఆశిష్ విద్యార్థి తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: అనుదీప్ దేవ్, ఛాయాగ్రహణం: రాజు ఎదురోలు.

అందర్నీ అలరించే కథ


శైలి, అమర్‌దీప్

"సుమతీ శతకం'లో ప్రతి పాత్ర హీరోనే. కథలో ఎంతో ప్రాధాన్యత ఉంటుంది. కచ్చితంగా ఇది అందరికీ నచ్చే సినిమా అవుతుంది" అన్నారు హీరో అమర్‌దీప్ చౌదరి. ఆయన.. శైలి చౌదరి జంటగా నటించిన ఈ సినిమాని ఎం.ఎం నాయుడు తెరకెక్కించారు. సాయి సుధాకర్ కొమ్మాలపాటి నిర్మించారు. ఈ చిత్రం ఈరోజు థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే ఇటీవల హైదరాబాద్‌లో ప్రీరిలీజ్ ప్రెస్‌మీట్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అమర్‌దీప్ మాట్లాడుతూ.. "అందర్నీ అలరించే వినోదం నిండిన కుటుంబ కథా చిత్రమిది. ఎక్కడా బోర్ కొట్టని రీతిలో ఉంటుంది" అన్నారు. "ఈ సినిమాపై మేము చాలా నమ్మకంగా ఉన్నాం. దీని టికెట్ ధరలు అందరికీ అందుబాటు ధరల్లోనే ఉంటాయి. సింగిల్ థియేటర్లో రూ.100, మల్టీప్లెక్స్‌లో రూ.150 టికెట్ ధరలుగా ఉంటాయి" అన్నారు నిర్మాత కొమ్మాలపాటి సాయి సుధాకర్. ఈ కార్యక్రమంలో శైలజ, సుభాష్ ఆనంద్, జేడీవీ ప్రసాద్, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఒకరినొకరు అర్థం చేసుకుంటే...!

'శ్రీ చిదంబరం గారు' అందరి హృదయాల్ని హత్తుకునే సినిమాగా ఉంటుందన్నారు హీరో వంశీ తుమ్మల. ఇది ఒకరినొకరు అర్థం చేసుకునే అందమైన ప్రేమకథలా సాగుతుందని తెలిపారు. ఆయన.. సంధ్యా వశిష్ఠ జంటగా నటించిన ఈ చిత్రాన్ని వినయ్ రత్నం తెరకెక్కించారు. చింతా వినీషా రెడ్డి, చింతా గోపాల కృష్ణా రెడ్డి నిర్మించారు. ఈ సినిమా ఈరోజు ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే ఇటీవల హైదరాబాద్‌లో ప్రీరిలీజ్ వేడుకను నిర్వహించారు. సంగీత దర్శకుడు ఎం.ఎం కీరవాణి, హీరో ఆనంద్ దేవరకొండ అతిథులుగా విచ్చేశారు. కీరవాణి మాట్లాడుతూ.. "కొత్త వాళ్లంతా కలిసి ఎంతో ఉత్సాహంగా చేసిన చిత్రమిది. ఈ సినిమాలో నేను పాడిన పాటను మా చెల్లెలు సుప్రభాతంలా వింటుండేది. అందుకే నేను దర్శకుడికి ఫోన్ చేయించి, అభినందనలు చెప్పించా" అన్నారు. ఈ కార్యక్రమంలో వినయ్ రత్నం, గోపాల కృష్ణారెడ్డి, నిహారిక కొణిదెల తదితరులు పాల్గొన్నారు.


నిహారిక, గోపాల కృష్ణా రెడ్డి, కీరవాణి, ఆనంద్ దేవరకొండ, వినయ్

'ధురంధర్ 2'లో యామి?


యామీ గౌతమ్

ఈ మధ్య కాలంలో అదిరిపోయే యాక్షన్ కథలు, శక్తిమంతమైన పాత్రలతో అలరించే ప్రయత్నం చేస్తోంది బాలీవుడ్ కథానాయిక యామీ గౌతమ్. ఇందులో భాగంగానే ఇప్పుడామె మరో యాక్షన్ ప్యాక్డ్ పాత్రకు సన్నద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఇటీవలే విడుదలై కాసుల వర్షం కురిపించిన 'ధురంధర్'కు సీక్వెల్‌గా 'ధురంధర్: ది రివెంజ్' రూపొందుతున్న సంగతి తెలిసిందే. రణ్‌వీర్ సింగ్ కథానాయకుడిగా ఆదిత్య ధర్ తెరకెక్కిస్తున్నారు. తాజాగా ఈ చిత్రంలో యామి అతిథి పాత్రలో మెరవనున్నట్లు సమాచారం. ఇప్పటికే తన పాత్ర కోసం దాదాపు 5రోజులు షూటింగ్‌లో పాల్గొందని, ఆమె సినిమాలో కనిపించేది కొన్ని నిమిషాలే అయినా.. ప్రేక్షకుల్ని ఆశ్చర్యపరిచేలా యామి గెటప్ ఉంటుందని బాలీవుడ్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. జియో స్టూడియోస్ నిర్మిస్తున్న ఈ స్పై యాక్షన్ థ్రిల్లర్ చిత్రం మార్చి 19న థియేటర్లలోకి రానుంది.

మీర్జాపూర్ సినిమా సెప్టెంబరులో

క్రైమ్ యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొంది ఓటీటీ వేదికగా యువతను విశేషంగా అలరించింది 'మీర్జాపూర్' సిరీస్. ఇప్పుడీ సిరీస్‌ను 'మీర్జాపూర్: ది మూవీ' పేరుతో సినిమాగా థియేటర్లలో ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రానికి గుర్మీత్ సింగ్ దర్శకత్వం వహిస్తున్నారు. అమెజాన్ ఎంజీఎం స్టూడియోస్, ఎక్సెల్ ఎంటర్‌టైన్‌మెంట్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఇటీవలే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ సినిమా తాజాగా విడుదల తేదీని ఖరారు చేసుకుంది. సెప్టెంబరు 4న సమీప థియేటర్లలో ఈ సినిమా విడుదల కానుందని అధికారికంగా పేర్కొంటూ చిత్రబృందం పోస్టర్‌ను ఆవిష్కరించింది. ఈ సినిమాలో పంకజ్ త్రిపాఠి, అలీ ఫజల్, దివ్యేందు శర్మ, షీబా చద్దా, సోనాల్ చౌహాన్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. మూడు సీజన్ల సిరీస్‌కు ప్రీక్వెల్‌గా ఈ సినిమా ఉంటుందని గతంలోనే చిత్రబృందం తెలిపింది. దీంతో సిరీస్ అన్ని సీజన్లలో ప్రారంభం నుంచి ఉన్న నటీనటులందరూ తెరపై సందడి చేయనున్నారని సమాచారం.


పంకజ్ త్రిపాఠి

siri@eenadu.net



చాలామంది మదుపరులు తమ పెట్టుబడుల జాబితాలో నష్టపోతున్న షేర్లను వదులుకోలేక, భవిష్యత్తులో అవి ఎప్పుడో పెరుగుతాయనే ఆశతో ఏళ్ల తరబడి అలాగే అట్టిపెట్టుకుంటారు. అదే సమయంలో, మంచి లాభాల్లో ఉన్న వాటిని.. ఆ లాభం ఎక్కడ తగ్గిపోతుందోనన్న భయంతో త్వరగా అమ్మేస్తుంటారు. ఈ భయం వల్ల మదుపరులు సరైన నిర్ణయాలు తీసుకోలేకపోతున్నారు. అసలు ఈ మానసిక స్థితి ఎందుకు కలుగుతుంది? ఇది మన సంపద సృష్టిని ఎలా దెబ్బతీస్తుంది? దీనిని అధిగమించే మార్గాలేంటో వివరంగా తెలుసుకుందాం.

నష్టం వస్తే భయపడుతున్నారా?

షేర్లు, మ్యూచువల్ ఫండ్లలో మదుపు చేసినప్పుడు మన లాభనష్టాలను నిర్ణయించేది కేవలం మార్కెట్ తీరుతెన్నులే కాదు.. మన మనస్తత్వం కీలక పాత్ర పోషిస్తుంది. ప్రవర్తనా ఆర్థిక శాస్త్రం సూత్రాల ప్రకారం.. పెట్టుబడిదారుల నిర్ణయాలను ప్రభావితం చేసే ప్రధాన అంశం 'భావోద్వేగం'. సాధారణంగా మనకు ఒక నిర్ణీత మొత్తంలో లాభం వస్తే కలిగే సంతోషం కంటే, అంతే మొత్తం నష్టపోతే కలిగే బాధ తీవ్రత చాలా అధికంగా ఉంటుంది. ఉదాహరణకు మీకు మార్కెట్లో రూ.10,000 లాభం వచ్చినప్పుడు కలిగే సంతృప్తితో పోలిస్తే, రూ.10,000 పోగొట్టుకున్నప్పుడు మనసులో కలిగే ఆవేదన రెట్టింపుగా అనిపిస్తుంది..

సమాన మొత్తంలో లాభం, నష్టం ఉన్నప్పుడు.. లాభాన్ని స్వీకరించాలనే కోరికతో పోలిస్తే, నష్టాన్ని తప్పించుకోవాలనే ఆలోచనే మార్కెట్ హెచ్చుతగ్గుల సమయంలో తప్పుడు నిర్ణయాలు తీసుకునేలా ప్రేరేపిస్తుంది. ఇది వాస్తవ పరిస్థితుల కంటే, ఊహాజనిత నష్టానికే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చేలా చేస్తుంది. దీన్ని ఆర్థిక పరిభాషలో 'నష్ట విముఖత' అని పిలుస్తుంటారు.

✦ ఏదైనా షేరు లేదా ఫండ్ నష్టాల్లో ఉంటే, మదుపరులు ఆ నష్టాన్ని అంగీకరించడానికి ఇష్టపడరు. ఇప్పటికే పడింది కదా, మళ్ళీనా కొనుగోలు ధరకు రాకపోతుందా అనే ఆశతో పనికిరాని ఆస్తులను అలాగే ఉంచుకుంటారు. దీనివల్ల పెట్టుబడి అక్కడ నిలిచిపోతుంది. వేరే మంచి అవకాశాలను కోల్పోతారు.

✦ మరోవైపు, ఏదైనా పెట్టుబడి మంచి లాభాల్లో ఉంటే.. ఆ లాభం ఎక్కడ ఆవిరైపోతుందోనన్న భయం వారిని వెంటాడుతుంది. దీనివల్ల చక్రవడ్డీ ప్రయోజనం పూర్తిగా అందకముందే, లాభాలను స్వీకరించి బయటకు వచ్చేస్తారు.

✦ మార్కెట్ తాత్కాలికంగా పడినప్పుడు లేదా తీవ్ర ఒడిదొడుకుల్లో ఉన్నప్పుడు.. భవిష్యత్తులో మరింత నష్టపోతామేమోనన్న భయంతో షేర్లను అమ్మేస్తారు. ఇది తాత్కాలిక నష్టాన్ని శాశ్వత నష్టంగా మారుస్తుంది.

✦ నష్ట విముఖత, నష్ట భయం.. చాలామంది ఈ రెండింటినీ ఒకటిగానే భావిస్తారు, కానీ ఇవి వేరు. నష్ట భయం ఒక హేతుబద్ధమైన ఆలోచన. పెట్టుబడి పెట్టే ముందే రిస్క్ ఎంత ఉందో అంచనా వేసి, అనిశ్చితిని తగ్గించుకోవడానికి సురక్షితమైన మార్గాలను ఎంచుకోవడం. ఇక్కడ మదుపరులు లాభనష్టాలను బేరీజు వేసుకుని నిర్ణయం తీసుకుంటారు. నష్ట విముఖత పూర్తిగా భావోద్వేగాలకు సంబంధించినది. నష్టపోతామన్న భయం ఆధిపత్యం చెలాయిస్తుంది. మంచి రాబడి వచ్చే అవకాశం ఉన్నా సరే, చిన్నపాటి నష్టాన్నీ భరించలేక వెనకడుగు వేయడం దీని లక్షణం.

ఎలా జయించాలి

ఈ నష్ట విముఖతను జయించడం ఎలా? ఇది సహజమైన మానసిక స్పందన అయినప్పటికీ, క్రమశిక్షణతో కూడిన ఆర్థిక ప్రణాళికతో దీనిని అదుపులో ఉంచుకోవచ్చు:

1 **వైవిధ్యం:** మీ పెట్టుబడిని కేవలం ఒకే చోట కాకుండా ఈక్విటీ, రుణం (డెట్), బంగారం వంటి వివిధ సాధనాల్లో విభజించాలి. ఒకవేళ ఒక ఆస్తి నష్టాన్నిచ్చినా, మరొకటి ఆ నష్టాన్ని భర్తీ చేసి, మొత్తం పెట్టుబడిని స్థిరంగా ఉంచుతుంది.

2 **సిప్ విధానాన్ని పాటించడం:** మార్కెట్ దశలతో సంబంధం లేకుండా క్రమశిక్షణతో పెట్టుబడి పెట్టడానికి సిప్ ఉత్తమ మార్గం. మార్కెట్ పడినప్పుడు ఎక్కువ యూనిట్లు కొనుగోలు చేయడానికి, తద్వారా సగటు ధర తగ్గడానికి ఇది ఉపయోగపడుతుంది. దీనివల్ల పెట్టుబడి సమయం గురించి ఆందోళన తగ్గుతుంది.

3 **స్పష్టమైన నిబంధనలు:** పెట్టుబడి పెట్టేటప్పుడే ఎప్పుడు కొనాలి, ఎప్పుడు అమ్మాలి అనే విషయంలో స్పష్టమైన నిబంధనలు పెట్టుకోవాలి. మార్కెట్ పడినప్పుడు ఆందోళన చెందకుండా, మీ ముందస్తు ప్రణాళిక ప్రకారమే నడుచుకోవాలి.

4 **సమీక్ష:** నిర్ణీత కాలానికి ఒకసారి మీ పెట్టుబడులను సమీక్షించుకోవాలి. మీ లక్ష్యాలకు అనుగుణంగా పెట్టుబడులను సరిచూసుకోవడం ద్వారా నష్టాన్ని అదుపులో ఉంచుకోవచ్చు.

5 **దీర్ఘకాలిక లక్ష్యం:** స్వల్పకాలిక మార్కెట్ పతనాలను చూసి ఆందోళన చెందకూడదు. దీర్ఘకాలిక దృష్టితో ఉంటేనే పెట్టుబడి కోలుకుని వృద్ధి చెందడానికి సమయం దొరుకుతుంది.

పెట్టుబడి ప్రయాణంలో నష్టాలు ఒక భాగం. వాటిని చూసి భయపడకుండా, ఆ నష్టాలను పాఠాలుగా స్వీకరించాలి. పెట్టుబడి నిర్ణయాలను భావోద్వేగాలతో కాకుండా, వాస్తవాల ఆధారంగా తీసుకోవడం అలవాటు చేసుకోవాలి. స్వీయ నియంత్రణ, క్రమశిక్షణతో కూడిన ప్రణాళిక ఉంటేనే స్టాక్ మార్కెట్లో సంపద సృష్టి సాధ్యమవుతుంది.

షరియా నిబంధనలతో

షరియా నిబంధనలకు అనుగుణంగా పెట్టుబడులు పెట్టే పాసివ్ ఫండ్‌ను యూటీఐ మ్యూచువల్ ఫండ్ అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ యూటీఐ నిఫ్టీ 500 షరియా ఇండెక్స్ ఫండ్.. షరియా బోర్డు ప్రమాణాల ప్రకారం వడ్డీ వ్యాపారం, మద్యం, జూదం, పొగాకు తదితర రంగాలతో సంబంధం లేకుండా కంపెనీలను ఎంచుకొని, ఈ ఫండ్ మదుపు చేస్తుంది. నిఫ్టీ 500 షరియా ఇండెక్స్‌లోని కంపెనీలను పెట్టుబడి కోసం ఎంచుకుంటుంది. ఎన్ఎఫ్ఓ ఈ నెల 18 వరకూ అందుబాటులో ఉంటుంది. కనీస పెట్టుబడి రూ.1,000. దీర్ఘకాలంలో విభిన్న రంగాల్లో వృద్ధిని ఆశించే వారికి ఇది అనుకూలం.

నాలుగేళ్ల క్రితం ఆన్‌లైన్‌లో రూ.50లక్షలకు టర్మ్ పాలసీని తీసుకున్నాను. ఇప్పుడు ఈ పాలసీని రద్దు చేసుకొని, రూ.కోటికి తీసుకోవాలని ఆలోచన. ప్రీమియం వెనక్కి ఇచ్చే పాలసీ మంచిదేనా? ఏం చేయాలి? - రాజేష్

■ జీవిత బీమా పాలసీ తీసుకునేటప్పుడు మీ వార్షికాదాయానికి కనీసం 10-12 రెట్లు ఉండేలా చూసుకోవాలి. మంచి క్లెయిం చెల్లింపుల చరిత్ర ఉన్న సంస్థలను ఎంచుకోవాలి. మీ ప్రస్తుత పాలసీ ఉన్న కంపెనీతో ఎలాంటి ఇబ్బంది లేకుంటే, పాత పాలసీని అక్కడే కొనసాగించండి. మరో రూ.50 లక్షల పాలసీని వేరే సంస్థ నుంచి తీసుకోండి. ప్రీమియం వెనక్కి ఇచ్చే పాలసీలతో పోలిస్తే సాధారణ టర్మ్ పాలసీకి ప్రీమియం తక్కువగా ఉంటుంది. కాబట్టి, సాధారణ టర్మ్ పాలసీని ఎంచుకొని, మిగతా మొత్తాన్ని ఈక్విటీ మ్యూచువల్ ఫండ్లలో దీర్ఘకాలానికి మదుపు చేయండి.

కొత్త పాలసీ తీసుకుంటే

నా వయసు 27. నెలకు రూ.35 వేలు వస్తున్నాయి. ఇందులో నుంచి నెలకు రూ.8వేల వరకూ మదుపు చేయాలనుకుంటున్నాను. ఇందుకోసం ఎలాంటి పథకాలు ఎంచుకోవాలి? రూ.20లక్షలకు వ్యక్తిగత ప్రమాద బీమా తీసుకున్నాను. టర్మ్ ఇన్సూరెన్స్ అవసరమా? - రవి

■ వ్యక్తిగత ప్రమాద బీమా పాలసీ తీసుకున్నప్పటికీ, టర్మ్ పాలసీ ఉండాల్సిందే. మీ వ్యక్తిగత ప్రమాద పాలసీని రూ.50 లక్షలకు పెంచుకోండి. దీంతోపాటు తగిన మొత్తానికి జీవిత బీమా తీసుకోండి. ఆరోగ్య బీమా తప్పనిసరి. ఆరు నెలలకు సరిపోయే అత్యవసర నిధినీ ఉంచుకోండి. మీరు మదుపు చేయాలనుకుంటున్న రూ.8వేలను కనీసం 10 ఏళ్లపాటు క్రమానుగత పెట్టుబడి విధానంలో డైవర్సిఫైడ్ ఈక్విటీ ఫండ్లలో మదుపు చేయండి.

నా వయసు 67. బ్యాంకులో రూ.5లక్షల ఎఫ్‌డీ గడువు ముగిసింది. వీటిని అందులోనే మళ్లీ వేస్తే తక్కువ వడ్డీ వస్తోంది. కాస్త మంచి వడ్డీ కోసం మ్యూచువల్ ఫండ్లలో పెట్టుబడి పెట్టొచ్చా? - మోహన్ రావు

మార్గదర్శి

■ ప్రస్తుతం బ్యాంకు వడ్డీ రేట్లు తగ్గుతున్నాయి. ఇవి ఇంకాస్త తగ్గే అవకాశమూ ఉంది. మీ పెట్టుబడిపైన ఎలాంటి నష్టభయమూ ఉండొద్దు అనుకుంటే.. పోస్టాఫీసులో సీనియర్ సిటిజన్ సేవింగ్ పథకంలో జమ చేయండి. ఇందులో 8.2 శాతం వడ్డీ వస్తోంది. కనీసం అయిదేళ్లు కొనసాగించాలి. ఫిక్స్‌డ్ డిపాజిట్‌తో పోలిస్తే అధిక వడ్డీ లభిస్తుంది. మీ పెట్టుబడిపైన కాస్త నష్టభయాన్ని భరించగలిగితే.. మల్టీ అసెట్, బ్యాలెన్స్‌డ్ అడ్వాంటేజ్ ఫండ్లనూ పరిశీలించవచ్చు.

మరో ఎనిమిది నెలల్లో గృహరుణం తీరిపోనుంది. ఇప్పటి వరకూ నెలకు రూ.24వేల ఈఎంఐ చెల్లిస్తూ వచ్చాను. ఇప్పుడు బ్యాంకు రూ.13 లక్షల టాపప్ తీసుకోవాలని చెబుతోంది. ఇది మంచి ఆలోచనేనా? ఈ మొత్తాన్ని ఎక్కడ మదుపు చేస్తే ఎక్కువ రాబడి వస్తుంది? - మధు

■ గృహరుణంపై 7.5-8 శాతం వడ్డీ ఉంటోంది. మీకు లాభాలు రావాలంటే.. మీరు అప్పు తీసుకున్న మొత్తాన్ని మదుపు చేసినప్పుడు అంతకు మించి రాబడి రావాలి. డైవర్సిఫైడ్ ఈక్విటీ మ్యూచువల్ ఫండ్లలో అయిదేళ్లకు మించి మదుపు చేసినప్పుడు 11-12 శాతం రాబడి వచ్చే వీలుంది. ఇది నష్టభయంతో ఉంటుంది. స్వల్పకాలంలో పెట్టుబడి తగ్గిపోవచ్చు. ఇవన్నీ తట్టుకోగలను అనుకున్నప్పుడే రుణం తీసుకొని, పెట్టుబడి గురించి ఆలోచించండి. లేకపోతే, టాపప్ రుణానికి చెల్లించే ఈఎంఐనే ఫండ్లలో సిప్ చేసుకోవడం ఉత్తమం. మీ ఆదాయం పెరిగినప్పుడల్లా పెట్టుబడినీ పెంచుకోండి.

- తుమ్మ బాల్‌రాజ్, సర్టిఫైడ్ ఫైనాన్షియల్ ప్లానర్

మల్టీ అసెట్.. షేర్లు.. బంగారం ఒకే చోట

పెట్టుబడి ప్రపంచంలో అన్ని పథకాలూ ఎప్పుడూ ఒకే విధంగా ప్రవర్తించవు. ఆర్థిక వ్యవస్థ తీరుతెన్నులను బట్టి ఒక్కో సమయంలో ఒక్కో రకమైన ఆస్తి తరగతి మంచి రాబడిని అందిస్తుంది. సాధారణ మదుపరులకు మార్కెట్ గమనాన్ని ఎప్పటికప్పుడు అంచనా వేసి, తమ పెట్టుబడులను ఒక ఆస్తి నుంచి మరొక ఆస్తికి మార్చడం అంత తేలికైన విషయం కాదు. ఈ నేపథ్యంలో, నష్టభయాన్ని తగ్గిస్తూ.. మెరుగైన రాబడిని అందించేందుకు మల్టీ-అసెట్ ఫండ్స్ ఒక చక్కటి పరిష్కారంగా నిలుస్తున్నాయి.



మార్కెట్ గరిష్ఠాల వద్ద ఉన్నప్పుడు ఏం చేయాలి? వడ్డీ రేట్లు తగ్గుతున్నప్పుడు ఎందులో మదుపు చేయాలి? అనే సందేహాలు ఎప్పుడూ సహజం. సరైన సమాచారం లేకపోవడం వల్ల చాలామంది తప్పుడు సమయంలో పెట్టుబడులు పెట్టి నష్టపోతుంటారు. ఇలాంటి ఇబ్బందులను తొలగించేందుకే మల్టీ-అసెట్ ఫండ్లు పనిచేస్తుంటాయి. సెబీ నిబంధనల ప్రకారం.. కనీసం మూడు వేర్వేరు ఆస్తి తరగతుల్లో (ఉదాహరణకు ఈక్విటీ, డెట్, బంగారం), ఒక్కో దానిలో కనీసం 10 శాతం చొప్పున ఈ ఫండ్లు పెట్టుబడి పెడతాయి. ఆర్థిక వ్యవస్థ వివిధ దశల్లో ఉన్నప్పుడు, వేర్వేరు ఆస్తులు లాభాలను ఇస్తాయి. ఉదాహరణకు:

- ఆర్థిక వృద్ధి ఎక్కువగా ఉన్న కాలంలో స్టాక్ మార్కెట్లు లేదా ఈక్విటీలు అద్భుతమైన రాబడిని ఇస్తాయి.
- వడ్డీ రేట్లు తగ్గుముఖం పడుతున్నప్పుడు డెట్, బాండ్లు మెరుగైన పనితీరు చూపిస్తాయి.
- స్టాక్ మార్కెట్లు తీవ్ర ఒడిదొడుకుల్లో ఉన్నప్పుడు లేదా అనిశ్చితి నెలకొన్నప్పుడు బంగారం సురక్షితమైన పెట్టుబడి ఎంపికగా మారుతుంది.

సాధారణ మదుపరులకు ఈ ఆర్థిక చక్రాలను సమయానుకూలంగా గుర్తించడం కష్టం. కానీ మల్టీ-అసెట్ ఫండ్ మేనేజర్లు మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకుంటారు. వారికి ఏ ఆస్తిలోనైనా 10 శాతం నుంచి 80 శాతం వరకు పెట్టుబడులను పెంచే లేదా తగ్గించే వెసులుబాటు ఉంటుంది. దీనివల్ల నష్టభయం తగ్గి, మొత్తం పెట్టుబడి రాబడి మెరుగుపడుతుంది.

పెట్టుబడుల్లో వైవిధ్యీకరణ అనేది ఇక్కడ కీలక సూత్రం. ఒకే ఆస్తిలో మొత్తం డబ్బును ఉంచడం కంటే, వివిధ ఆస్తుల్లో విభజించడం ద్వారా నష్టభయాన్ని గణనీయంగా తగ్గించవచ్చు. మల్టీ-అసెట్ ఫండ్లలో ఒక ఆస్తి తరగతి (ఉదాహరణకు ఈక్విటీ) పేలవంగా పనిచేసినా, మరొక ఆస్తి (బంగారం లేదా డెట్) ఆ నష్టాన్ని భర్తీ చేస్తుంది. దీనివల్ల పెట్టుబడిదారుడికి స్థిరత్వం లభిస్తుంది.

లాభనష్టాలేమిటి?

- పూర్తిస్థాయి ఈక్విటీ ఫండ్లతో పోలిస్తే, వీటిలో హెచ్చుతగ్గులు కాస్త తక్కువగా ఉంటాయి. మార్కెట్ అనిశ్చితిని తట్టుకోవాలనుకునే వారికి అనుకూలం.
- స్టాక్ మార్కెట్ విపరీతంగా పెరుగుతున్నప్పుడు ఈ ఫండ్లు తక్కువ రాబడిని ఇచ్చే అవకాశముంది.
- ఈ ఫండ్లను నిర్వహించడం కాస్త క్లిష్టమైన పని. కాబట్టి, ఖర్చుల నిష్పత్తి కాస్త అధికంగా ఉండే వీలుంది.
- ప్రతి మల్టీ అసెట్ ఫండ్ ఒకేలా ఉండదు. కొన్ని ఈక్విటీకి, మరికొన్ని డెట్‌కు ప్రాధాన్యం ఇస్తుంటాయి. కాబట్టి, పెట్టుబడి పెట్టేముందు ఫండ్ ఎక్కడ ఎంత శాతం మదుపు చేస్తుందో తెలుసుకోవాలి.
- ఈక్విటీ వాటా 65 శాతం కంటే తక్కువగా ఉంటే, పన్ను నియమాలు మారొచ్చు. ఇది మీ పెట్టుబడిపై కాల పరిమితిపై ఆధారపడి ఉంటుంది.

ఎవరికి అనుకూలం

- మొదటిసారి మార్కెట్లోకి వస్తున్నవారు.
- నష్టభయాన్ని తగ్గించుకొని, స్థిరమైన రాబడిని కోరుకుంటే
- కనీసం 5 ఏళ్ల కాలపరిమితికి మించి మదుపు చేసే వారికిఇవి నప్పుతాయి.

సేవా రంగంలో

కోటక్ మహీంద్రా మ్యూచువల్ ఫండ్ నుంచి సేవా రంగంలోని కంపెనీల్లో మదుపు చేసే లక్ష్యంతో కోటక్ సర్వీసెస్ ఫండ్ విడుదలయ్యింది. ఐటీ, ఆర్థిక సేవలు, లాజిస్టిక్స్, ఆరోగ్య సంరక్షణ, టెలికాం వంటి రంగాలపై ప్రధానంగా దృష్టి పెడుతుంది. ఫండ్ మేనేజర్లు స్వయంగా మంచి వృద్ధి ఉన్న సేవల కంపెనీలను ఎంచుకొని, మదుపు చేస్తారు. ఎన్ఎఫ్ఓలో కనీస పెట్టుబడి రూ.1,000. ఈ నెల 18 వరకూ కొత్త ఫండ్ ఆఫర్ కొనసాగుతుంది. ఇది ఒకే రంగానికి పరిమితమైన సెక్టోరల్ ఫండ్, కాబట్టి, సేవా రంగం పనితీరు బాగున్నప్పుడు లాభాలు వస్తాయి. అయిదేళ్ల కాలపరిమితి ఉన్న వారికి అనుకూలం.

కొత్త పథకం

వినియోగం ఆధారంగా

భారతీయుల జీవన శైలి మార్పులు, కొనుగోలు శక్తి పెరగడంతో లాభపడే రంగాల్లో ఎఫ్ఎంసీజీ, వాహన, రిటెయిల్ రంగాలు ముందుండే అవకాశం ఉంది. ఈ రంగాల్లోని షేర్లలో మదుపు చేసే వ్యూహంతో హెచ్‌డీఎఫ్‌సీ నిఫ్టీ ఇండియా కన్సంప్షన్ ఇండెక్స్ ఫండ్ అందుబాటులోకి వచ్చింది. ఈ ఫండ్ ఎన్ఎఫ్ఓ ఈ నెల 13 వరకూ అందుబాటులో ఉంటుంది. కనీస పెట్టుబడి రూ.100. పాసివ్ ఫండ్ కాబట్టి, నిర్వహణ ఖర్చులు తక్కువగా ఉంటాయి. వినియోగ రంగంపై నమ్మకం ఉండి, తక్కువ ఖర్చుతో కూడిన ఇండెక్స్ ఫండ్లు కావాలనుకునే వారు పరిశీలించవచ్చు.

పెట్టుబడిలో వైవిధ్యం

వైవిధ్యమైన పెట్టుబడి పథకం కావాలనుకునే వారికోసం డీఎస్‌పీ మ్యూచువల్ ఫండ్ నుంచి కొత్త పథకం డీఎస్‌పీ మల్టీ అసెట్ ఓమ్నీ ఫండ్ ఆఫ్ ఫండ్ అందుబాటులోకి వచ్చింది. ఈక్విటీ, బంగారం, వెండి మధ్య పెట్టుబడులను మారుస్తూ లాభాలను ఆర్జించడం ఈ ఫండ్ ప్రధాన లక్ష్యం. ఇది ఫండ్ ఆఫ్ ఫండ్స్ కాబట్టి, నేరుగా షేర్లను కొనకుండా, ఇతర ఫండ్లు లేదా ఈటీఎఫ్‌లలో మదుపు చేస్తుంది. డీఎస్‌పీ నేత్ర అనే మోడల్ ద్వారా ఏ ఆస్తిలో ఎంత మదుపు చేయాలన్నది నిర్ణయిస్తుంది. ఈ నెల 19 వరకూ ఎన్ఎఫ్ఓలో మదుపు చేయొచ్చు. కనీస పెట్టుబడి రూ.100. ఒకే ఫండ్‌లో అన్ని రకాల పెట్టుబడులు కావాలనుకునే వారు దీన్ని చూడొచ్చు. దీర్ఘకాలిక పెట్టుబడి వ్యూహంతో ఉండాలి.

రక్షణ సంస్థల్లో

దేశీయ రక్షణ ఉత్పత్తుల తయారీ, ఎగుమతులపై దృష్టి సారించే కంపెనీల్లో మదుపు చేసే వ్యూహంతో వచ్చిందే మిరే అసెట్ బీఎస్ఈ ఇండియా డిఫెన్స్ ఈటీఎఫ్. బీఎస్ఈ ఇండియా డిఫెన్స్ ఇండెక్స్‌లోని షేర్లను ఇది అనుసరిస్తుంది. ఎన్ఎఫ్ఓ చివరి తేదీ ఈ నెల 10. కనీస పెట్టుబడి రూ.5,000. రక్షణ రంగం ప్రస్తుతం వేగంగా వృద్ధి సాధిస్తోంది. ప్రభుత్వ చర్యలూ ఇందుకు తోడ్పడుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇందులోని సంస్థలపై నమ్మకం ఉంటే, ఈ పథకంలో మదుపు చేయొచ్చు. ఒకే రంగానికి పరిమితం కాబట్టి, నష్టభయం ఉంటుంది. కనీసం 5-7 ఏళ్లపాటు వేచి చూడాలి.

బంగారం, వెండి ధరలు పెరగడం, అదే స్థాయిలో రాగి లాభాలను అందిస్తోందన్న వార్తలు చాలామంది మదుపరులను ఆకర్షిస్తోంది. రాగిలో ఎలా పెట్టుబడి పెట్టాలనే సందేహాలు చాలామందికి వస్తున్నాయి. నిజానికి రిటెయిల్ మదుపరులు రాగిలో మదుపు చేయడం.. బంగారం, వెండిలో పెట్టుబడి పెట్టినంత సులభం కాదు. మన దేశంలో రాగికి సంబంధించి ఎలాంటి ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్లు (ఈటీఎఫ్), మ్యూచువల్ ఫండ్ పథకాలు అందుబాటులో లేవు. మరి, ప్రత్యామ్నాయ మార్గాలేమిటి?

రాగి కొంటారా?



మైనింగ్ కంపెనీలు: ప్రత్యక్షంగా రాగిని కొనలేకపోయినా, రాగిని ఉత్పత్తి చేసే కంపెనీల షేర్లను కొనుగోలు చేయొచ్చు. ఇవి స్టాక్ ఎక్స్ఛేంజీలో నమోదయి ఉంటాయి. మీ డీమ్యాట్ ఖాతా ద్వారా వీటిలో సులభంగా మదుపు చేయొచ్చు. ఇక్కడ గమనించాల్సిన విషయం ఏమిటంటే.. ఈ షేర్ల పనితీరు కేవలం రాగి ధరలపైనే కాకుండా, ఆయా కంపెనీల నిర్వహణ సామర్థ్యం, అప్పులు, ఇతర ఆర్థిక అంశాలపైనా ఆధారపడి ఉంటుంది.

అంతర్జాతీయ ఈటీఎఫ్‌లు: భారతీయ మదుపరులు 'లిబరలైజ్డ్ రెమిటెన్స్ స్కీం (ఎల్ఆర్ఎస్)' ద్వారా విదేశీ ట్రేడింగ్ ప్లాట్‌ఫామ్‌లను ఉపయోగించి, గ్లోబల్ కాపర్ ఈటీఎఫ్‌లలో మదుపు చేయొచ్చు. గ్లోబల్ మైనింగ్ షేర్లలోనూ పెట్టుబడులు పెట్టేందుకు వీలుంటుంది. ఇందులో కరెన్సీ రిస్క్ అధికంగా ఉంటుంది. డాలర్-రూపాయి మారకం విలువలో వచ్చే మార్పులు మీ రాబడిని ప్రభావితం చేయొచ్చు. అంతర్జాతీయ లావాదేవీలకు సంబంధించిన ఇతర ఛార్జీలు, ఖర్చుల నిష్పత్తి గురించీ ముందుగానే తెలుసుకోవాలి.

కమొడిటీ ఎక్స్ఛేంజీలు: రాగిలో పెట్టుబడి పెట్టేందుకు ఉన్న మార్గమిది. మల్టీ కమొడిటీ ఎక్స్ఛేంజ్ ఫ్యూచర్స్ కాంట్రాక్టులను కొనుగోలు చేయడం. ప్రస్తుతం రాగి ఫ్యూచర్స్ కిలోకు దాదాపు రూ.1,235 దరిదాపుల్లో కొనసాగుతోంది. ఇది నేరుగా రాగి ధరల కదలికల నుంచి లాభం పొందే మార్గం. అయినప్పటికీ, ఇందులో నష్టభయం చాలా ఎక్కువ. కమొడిటీ మార్కెట్లలో ఉండే అస్థిరత, నష్టభయం కారణంగా ఎంతో అనుభవం ఉన్న ట్రేడర్లు మాత్రమే ఈ మార్గాన్ని ఎంచుకోవాలి. లేకపోతే కష్టార్జితం కరిగిపోతుంది.

అంతర్జాతీయ ఫండ్ ఆఫ్ ఫండ్స్: కొన్ని మ్యూచువల్ ఫండ్ సంస్థలు అంతర్జాతీయ ఫండ్ ఆఫ్ ఫండ్స్ (ఎఫ్ఓఎఫ్) ద్వారా అంతర్జాతీయ గనుల సంస్థల షేర్లలో మదుపు చేసే అవకాశాన్ని కల్పిస్తున్నాయి.

జాగ్రత్తగా..

మంచి రాబడి వస్తుంది కదా అనే ఆలోచనతో రాగిలాంటి లోహాల్లో మదుపు చేయాలనుకునే రిటెయిల్ మదుపరులు ఎంతో జాగ్రత్తగా వ్యవహరించాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు. బంగారం, వెండి మాదిరిగా రాగి సురక్షితమైన పథకం కాదు. ఇది పూర్తిగా పారిశ్రామిక గిరాకీ-సరఫరాపై ఆధారపడి ఉంటుంది. రాగి ధరలు ఎప్పుడు ఎలా ఉంటాయన్నది చెప్పడం అంత తేలికైన విషయం కాదు. అస్థిరత ఎక్కువ. ధరలు ఒక్కసారిగా పెరగడం, అదే విధంగా తగ్గడం సర్వసాధారణం. పెట్టుబడిలో వైవిధ్యం ఉండేలా చూసుకునేందుకు, ఏదో అవగాహన పెంచుకునేందుకు మాత్రమే ఇందులో రిటెయిల్ మదుపరులు మదుపు చేయాలి. మీ పెట్టుబడిలో చాలా కొద్ది మాత్రమే రాగికి కేటాయించాలని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు.

దేశంలో బ్యాంకింగ్ విధానం పూర్తిగా మారిపోయింది. ఒకప్పుడు చిన్న పనికోసం బ్యాంకు శాఖకు వెళ్లి, దరఖాస్తులు నింపి, గంటల తరబడి వేచి చూడాల్సి వచ్చేది. యూపీఐ రాకతో రోజువారీ చెల్లింపుల ముఖచిత్రం మారింది. ఈ మార్పు కేవలం చెల్లింపులకే పరిమితం కాలేదు. పొదుపు ఖాతాలను నిర్వహించే విధానంలోనూ ఖాతాదారులు డిజిటల్ బాట పడుతున్నారు. ఈ నేపథ్యంలో డిజిటల్ సేవింగ్స్ ఖాతాలు ఎలా పనిచేస్తాయి? వీటి వల్ల కలిగే లాభాలేంటి? భద్రత ఎంత? అనే విషయాలను పరిశీలిద్దాం.

నిమిషాల్లో డిజిటల్ పొదుపు ఖాతా

పేరులో ఉన్నట్టుగానే, ఇది పూర్తిగా ఆన్‌లైన్ పొదుపు ఖాతా. దీన్ని ప్రారంభించేందుకు, నిర్వహించేందుకు మీరు బ్యాంకు శాఖకు వెళ్లాల్సిన అవసరం లేదు. భౌతికంగా పత్రాలను నింపడం, వేచి చూడటం వంటి ఇబ్బందులు ఇందులో ఉండవు. చాలా సందర్భాల్లో, ఆధార్ ఆధారిత ధ్రువీకరణ లేదా వీడియో కేవైసీని ఉపయోగించి కేవలం కొన్ని నిమిషాల్లోనే ఈ ఖాతాను తెరవవచ్చు. ఖాతా తెరిచిన వెంటనే లావాదేవీలూ ప్రారంభించవచ్చు.

- ఆన్‌లైన్ ఖాతా అనగానే చాలామందికి భద్రతపై అనుమానాలుంటాయి. డిజిటల్ ఖాతాలూ ఆర్‌బీఐ పరిధిలోకి వచ్చే సాధారణ పొదుపు ఖాతాలే. సంప్రదాయ బ్యాంకు ఖాతాలకు ఉన్నట్లే ఈ ఖాతాల్లోని డబ్బుకూ డిపాజిట్ ఇన్సూరెన్స్ అండ్ క్రెడిట్ గ్యారెంటీ కార్పొరేషన్ నిబంధనల ప్రకారం రూ.5 లక్షల వరకు బీమా రక్షణ ఉంటుంది. కాబట్టి, గుర్తింపు పొందిన బ్యాంకులో డిజిటల్ ఖాతా తెరిస్తే, మీ డబ్బు సురక్షితంగానే ఉంటుంది.
- అవసరమైన పత్రాలు సంబంధిత బ్యాంకు యాప్‌లో అప్‌లోడ్ చేసి, వీడియో కేవైసీని పూర్తి చేస్తే చాలు.. ఖాతా సంఖ్య, ఇతర వివరాలు ఈమెయిల్ లేదా ఎస్ఎంఎస్ ద్వారా తక్షణమే అందుతాయి.
- భౌతిక డెబిట్ కార్డు కావాలంటే కొరియర్ ద్వారా ఇంటికి వస్తుంది. చాలా బ్యాంకులు ఆన్‌లైన్ షాపింగ్ కోసం వెంటనే వాడుకునేలా వర్చువల్ డెబిట్ కార్డును తక్షణమే జారీ చేస్తాయి.
- కొన్ని డిజిటల్ ఖాతాలను సంప్రదాయ బ్యాంకులు నేరుగా అందిస్తుండగా, మరికొన్ని ఫిన్‌టెక్ సంస్థల భాగస్వామ్యంతో అందుబాటులోకి తెస్తున్నాయి.
- కేవలం 10-20 నిమిషాల్లోనే ఈ ఖాతాను సులభంగా ప్రారంభించేందుకు వీలుంది. విద్యార్థులు, గిగ్ వర్కర్లు, మొదటిసారి ఉద్యోగంలో చేరే వారికి ఇవి చాలా అనుకూలం. చాలా డిజిటల్ ఖాతాలను సున్నా నిల్వతోనే ప్రారంభించేందుకు వీలుంది.
- కొన్ని డిజిటల్ ఖాతాలు.. డెబిట్ కార్డు ఫీజులు, ఇతర ఛార్జీలూ వసూలు చేయవు. యూపీఐ, బిల్లు చెల్లింపులు, కార్డుతో చేసిన ఖర్చులకు రివార్డు పాయింట్లూ ఇస్తాయి.



- రోజువారీ ఖర్చుల కోసం వాడుకునేందుకు ఈ డిజిటల్ ఖాతాలను ఉపయోగించుకోవచ్చు. దీనివల్ల మీ ప్రధాన బ్యాంకు ఖాతాలో చిన్న చిన్న చెల్లింపుల వివరాలు కనిపించకుండా ఉంటాయి.

ఇవీ చూడండి..

- సున్నా నిల్వ డిజిటల్ ఖాతాను ఎంచుకుంటే, ఉచిత ఏటీఎం ఉపసంహరణలపై పరిమితులు ఉండొచ్చు. పూర్తి కేవైసీ పూర్తి చేసే వరకూ కొన్ని సేవలపై ఆంక్షలు ఉంటాయి.
- బ్యాంకు పనులన్నీ ఫోన్ ద్వారానే నిర్వహిస్తారు. కాబట్టి, సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి. బలమైన పాస్‌వర్డ్‌లు, డివైజ్ సెక్యూరిటీలు, రెండంచెల ధ్రువీకరణ (టూ-ఫ్యాక్టర్-అథెంటికేషన్) తప్పనిసరిగా వాడాలి.



ఔషధ పరీక్షలకు ప్రత్యామ్నాయం చూడాలి

డాక్టర్ రెడ్డీస్ ఛైర్మన్ సతీష్ రెడ్డి

ఈనాడు, హైదరాబాద్: ఔషధ ఆవిష్కరణలో జంతువులపై చేసే ప్రయోగాలకు ప్రత్యామ్నాయాలను ప్రోత్సహించాలని డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ ఛైర్మన్ కె.సతీష్ రెడ్డి సూచించారు. జంతు రహిత పద్ధతులను రూపొందించడంలో ప్రపంచానికి భారత్ నాయకత్వం వహించాలని తెలిపారు. 'భారతదేశంలో ఔషధ అభివృద్ధి-జంతు పరీక్షలకు ప్రత్యామ్నాయం' అనే నివేదికను గురువారం విడుదల చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ నివేదికను హ్యూమన్ వరల్డ్ ఫర్ యానిమల్స్ ఇండియా, డీటీజీ-ఇన్‌స్టెమ్, యానిమల్ లా అండ్ పాలసీ నెట్‌వర్క్, డాక్టర్ రెడ్డీస్ సంయుక్తంగా రూపొందించాయి. ఔషధ ఆవిష్కరణ అనేది కాలానుగుణంగా వచ్చే కొత్త పద్ధతులతో, నిరంతర ప్రయాణమని సతీష్ రెడ్డి పేర్కొన్నారు. జంతు రహిత పద్ధతుల కోసం భారతీయ నియంత్రణ యంత్రాంగం సన్నద్ధం కావాలని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఇప్పటికే సీడీఎస్‌సీఓ ఈ దిశగా ప్రయాణం ప్రారంభించిందన్నారు.

ఎన్‌సీసీ టర్నోవర్ రూ.4,900 కోట్లు

ఈనాడు, హైదరాబాద్: మౌలిక సదుపాయాల సంస్థ ఎన్‌సీసీ, డిసెంబరు త్రైమాసికంలో రూ.4,900 కోట్ల టర్నోవర్‌పై రూ.122.5 కోట్ల నికరలాభాన్ని నమోదు చేసింది. 2024-25 ఇదే కాలంలో ఆదాయం రూ.5,388 కోట్లు, నికరలాభం రూ.193 కోట్లుగా ఉన్నాయి. దీంతో పోలిస్తే, ఈసారి ఆదాయం, నికరలాభం బాగా తగ్గాయి. సమీక్షా త్రైమాసికంలో రూ.1.95 ఈపీఎస్ నమోదైంది. ఈ ఆర్థిక సంవత్సరం 9 నెలల కాలానికి ఈ సంస్థ రూ.14,693 కోట్ల ఆదాయం, రూ.469 కోట్ల నికర లాభం ఆర్జించింది. ఈపీఎస్ రూ.7.47గా ఉంది. సమీక్షా త్రైమాసికంలో జతచేసిన రూ.12,430 కోట్ల ఆర్డర్లతో కలిపి, కంపెనీ చేతిలో మొత్తం రూ.79,571 కోట్ల విలువైన ఆర్డర్లు ఉన్నాయి.

నవ లాభం రూ.326 కోట్లు



ఈనాడు, హైదరాబాద్: నవ లిమిటెడ్, డిసెంబరు త్రైమాసికంలో ఏకీకృత ఖాతాల ప్రకారం రూ.1,061 కోట్ల ఆదాయంపై రూ.325.7 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. 2024-25 మూడో త్రైమాసికంలో ఆదాయం రూ.878.13 కోట్లు, నికర లాభం రూ.353.26 కోట్లుగా ఉన్నాయి. ఈ ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంతో పోలిస్తే ఆదాయం 7.3%, నికర లాభం 83.5% మెరుగయ్యాయి. ఆఫ్రికాలోని మాంబా ఎనర్జీ లిమిటెడ్(ఎంఈఎల్) పనితీరు బాగున్నందునే మెరుగైన ఫలితాలు సాధించామని నవ ఎండీ, సీఈఓ అశ్విన్ దేవినేని వివరించారు.

పిట్టీ ఆదాయం రూ.484 కోట్లు

కోడి గుడ్డు	
6న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100 గుడ్లకు రూపాయలలో)	
హైదరాబాద్	490
వరంగల్	492
విజయవాడ	505
తూ/ప గోదావరి	480
విశాఖపట్నం	490
చిత్తూరు	563

ఈనాడు, హైదరాబాద్: పిట్టీ ఇంజినీరింగ్ డిసెంబరు త్రైమాసికంలో రూ.484.30 కోట్ల ఆదాయంపై రూ.28.22 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. త్రైమాసిక ఈపీఎస్ రూ.7.59గా ఉంది. 2024-25 ఇదే కాలంలో ఆదాయం రూ.421 కోట్లు, నికర లాభం రూ.28.76 కోట్లుగా ఉన్నాయి. 9 నెలల కాలానికి ఆదాయం రూ.1,447.32 కోట్లు, నికర లాభం రూ.91.19 కోట్లుగా ఉన్నాయని సంస్థ వెల్లడించింది. అనుబంధ సంస్థలైన పిట్టీ ఇండస్ట్రీస్, దక్షిణ ఫౌండరీలను పిట్టీ ఇంజినీరింగ్‌లో విలీనం చేసేందుకు బోర్డు ఆమోదం తెలిపింది.

ఎయిర్‌టెల్‌కు వ్యయాల భారం



దిల్లీ: భారతీ ఎయిర్‌టెల్, అక్టోబరు-డిసెంబరు త్రైమాసికంలో రూ.6,630.50 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని నమోదు చేసింది. 2024-25 ఇదే కాల లాభం రూ.14,781.20 కోట్ల కంటే, ఇది 55% తక్కువ. నెట్‌వర్క్ నిర్వహణ వ్యయాలు, రుసుములు, ఉద్యోగ వ్యయాలు పెరగడం వల్లే లాభం క్షీణించిందని సంస్థ పేర్కొంది. కార్యకలాపాల ఆదాయం రూ.45,129.30 కోట్ల నుంచి 19.6% పెరిగి రూ.53,982 కోట్లకు చేరింది. భారత్‌లో కార్యకలాపాల ఆదాయం 13.2% అధికమై రూ.39,226 కోట్లుగా నమోదైంది. జులై- సెప్టెంబరుతో పోలిస్తే మాత్రం డిసెంబరు త్రైమాసికంలో నికర లాభం 3.5%, భారత ఆదాయం 1.4% పెరిగాయి. వ్యాపారాల్లో వైవిధ్యానికి ప్రాధాన్యం ఇవ్వటన్న తమ వ్యూహమే ఇందుకు కారణమని భారతీ ఎయిర్‌టెల్ ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ గోపాల్ విఠల్ తెలిపారు.

చందాదార్లు 11.8% పెరిగారు..: డిసెంబరు చివరకు భారతీ ఎయిర్‌టెల్ మొత్తం చందాదార్ల సంఖ్య 11.8% పెరిగి 57.60 కోట్లకు చేరింది. టెలికాం సేవల సంస్థల పనితీరుకు కీలకమైన వినియోగదారు ద్వారా సగటు ఆర్జన (ఆర్పు) మనదేశంలో ఏడాది వ్యవధిలో రూ.245 నుంచి 5.4% పెరిగి రూ.259కి చేరింది.

తగ్గిన బంగారం, వెండి ధరలు: అంతర్జాతీయ మార్కెట్లకు అనుగుణంగా బంగారం, వెండి ధరలు గురువారం దేశీయ విపణిలోనూ తగ్గాయి. ఔన్సు (31.10 గ్రాములు) బంగారం ధర 58 డాలర్లు తగ్గి 4866 డాలర్లకు, ఔన్సు వెండి ధర 9% క్షీణించి 77 డాలర్లకు దిగి వచ్చాయి. ఫలితంగా రాత్రి 11.55 గంటలకు హైదరాబాద్ బులియన్ విపణిలో 10 గ్రాముల మేలిమి బంగారం ధర రూ.1,56,800 వద్ద, కిలో వెండి ధర రూ.2,63,700 వద్ద స్థిరపడ్డాయి.


ఎల్ఐసీ లాభంలో 17% వృద్ధి

లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసీ), డిసెంబరు త్రైమాసికంలో రూ.12,958 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. 2024-25 ఇదే కాల లాభం రూ.11,056 కోట్ల కంటే ఇది 17% ఎక్కువ. కొత్త ప్రీమియం, పెట్టుబడుల ఆదాయం పెరగడమే ఇందుకు కారణం. నికర ప్రీమియం ఆదాయం రూ.1,06,891 కోట్ల నుంచి రూ.1,25,613 కోట్లకు పెరిగింది. మొత్తం ఆదాయం రూ.2,01,994 కోట్ల నుంచి రూ.2,33,984 కోట్లకు వృద్ధి చెందింది. పెట్టుబడులపై ఆదాయం రూ.94,336 కోట్ల నుంచి రూ.1,07,608 కోట్లకు పెరిగింది. నికర కమిషన్ కింద చెల్లించిన మొత్తము రూ.5,966 కోట్ల నుంచి రూ.6,011 కోట్లకు పెరిగింది. కొత్త ప్రీమియం రూ.7,285 కోట్ల నుంచి రూ.10,605 కోట్లకు పెరిగింది.

ఎన్ఎస్ఈలో వాటా విక్రయంపై నిర్ణయం తీసుకోలేదు: వచ్చే ఆర్థిక సంవత్సరం చివరి కల్లా (2026-27) ఎల్ఐసీలో ప్రభుత్వానికి ఉన్న వాటా 10% మేర తగ్గనుందని ఎల్ఐసీ సీఈఓ, ఎండీ ఆర్ దొరైస్వామి తెలిపారు. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ (ఎన్ఎస్ఈ) పబ్లిక్ ఇష్యూకు వస్తే, అందులో ఎంత వాటా విక్రయించాలనే విషయంపై ఎల్ఐసీ ఇంకా నిర్ణయం తీసుకోలేదని దొరైస్వామి చెప్పారు. ఎన్ఎస్ఈలో 10.72% వాటాతో, ప్రధాన వాటాదార్లలో ఒకటిగా ఎల్ఐసీ ఉంది. ఆరోగ్య బీమా వ్యాపారం ఒక్కటే నిర్వహిస్తున్న సంస్థలో వాటా తీసుకోవాలని ఎల్ఐసీ అనుకుంటోందని తెలిపారు.

మార్చిలో సంతకాలు

అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై మంత్రి పీయూష్ గోయల్



దిల్లీ: భారత్-అమెరికా ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం తొలి దశపై, మార్చి మధ్యకల్లా సంతకాలు జరగొచ్చని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రి పీయూష్ గోయల్ పేర్కొన్నారు. అయితే ఈ ఒప్పందానికి సంబంధించిన ఇరుదేశాల సంయుక్త ప్రకటన 4-5 రోజుల్లోనే వెలువడుతుందని మంత్రి వివరించారు. సంయుక్త ప్రకటనపై సంతకాలు చేసిన ఒకట్రెండు రోజుల్లో అమెరికా జారీ చేసే ఎగ్జిక్యూటివ్ ఆర్డరు ద్వారా మన ఉత్పత్తులపై 18% సుంకాలు అమల్లోకి వస్తాయి. ప్రస్తుతం 25% ప్రతీకార టారిఫ్‌కు తోడు, రష్యా చమురు కొనుగోలు చేస్తున్నందుకు అదనంగా 25% టారిఫ్ (మొత్తం 50%)ను అమెరికా వసూలు చేస్తోంది. అమెరికా వస్తువులపై భారత టారిఫ్ తగ్గింపులు మాత్రం లీగల్ ఒప్పందం జరిగాక అమల్లోకి వస్తాయని వాణిజ్య కార్యదర్శి రాజేశ్ అగర్వాల్ తెలిపారు.

పెట్టుబడులేమీ ఉండవ్: 'అధికారిక ఒప్పంద ముసాయిదా పనులు జరుగుతున్నాయి. ఇందుకు నెలకు పైగా సమయం పట్టొచ్చు. కాబట్టి వాణిజ్య ఒప్పందం మొదటిదశపై మార్చిలో సంతకాలు జరగొచ్చ'ని గోయల్ వివరించారు. ఈ ఒప్పందంలో ఎటువంటి పెట్టుబడుల అంశాలు లేదని స్పష్టం చేశారు. లీగల్ ఒప్పందం తర్వాత మన ఉత్పత్తులపై సుంకాల్లో మరిన్ని తగ్గింపులు ఉండే అవకాశం ఉందనీ అన్నారు.
✦ మనదేశంలో విమానాలకు గిరాకీ భారీగా ఉంది. బోయింగ్‌కు ఇప్పటికే మన కంపెనీలు ఆర్డర్లు ఇచ్చాయి. ఇంకా 70-80 బి. డాలర్ల ఆర్డర్లు ఇవ్వాల్సి వస్తుంది. ఇంజిన్లు, ఇతర విడిభాగాలు కలిపితే 100 బి. డాలర్ల (రూ.9 లక్షల కోట్ల) రూపేణ విమాన కొనుగోళ్లే ఉంటాయని అంచనా వేశారు.

25% దిగుమతులు అమెరికా నుంచే

ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా మన దేశం చేస్తున్న కొనుగోళ్ల విలువ 300 బి. డాలర్లు (రూ.27 లక్షల కోట్లు)గా ఉంది. వచ్చే అయిదేళ్లలో వీటి విలువ 2 లక్షల కోట్ల డాలర్ల (రూ.180 లక్షల కోట్ల)కు చేరుతుందని అంచనా. ఇతర దేశాల నుంచి కొనుగోలు చేస్తున్న చమురు, ఎల్‌పీజీ, ఎల్ఎన్‌జీ, విమానాలు, ఐసీటీ ఉత్పత్తులు, డేటా సెంటర్ సామగ్రి వంటివి అమెరికా నుంచి కొనుగోలు చేస్తాం. వీటి విలువ 500 బి. డాలర్లుగా ఉండనుంది. అంటే 25% దిగుమతులు అమెరికా నుంచే వస్తాయి.

రూ.200 కోట్ల టర్నోవరు వరకు అంకురమే

అంకుర సంస్థగా గుర్తించడానికి టర్నోవరు పరిమితిని రూ.100 కోట్ల నుంచి రూ.200 కోట్లకు ప్రభుత్వం పెంచింది. సరికొత్త, ఆవిష్కరణ సాంకేతికతలపై పనిచేసే అంకురాలకు 'డీప్ టెక్ స్టార్టప్' పేరిట కొత్త గుర్తింపునూ ప్రవేశపెట్టారు. కంపెనీని ఏర్పాటు చేసిన/రిజిస్ట్రేషన్ చేసిన తేదీ నుంచి 20 ఏళ్ల వరకు, టర్నోవరు పరిమితిని రూ.300 కోట్లుగా నిర్ణయించారు. కోఆపరేటివ్ సొసైటీస్ యాక్ట్ - 2002 కింద నమోదైన సొసైటీలు, స్టేట్ అండ్ యూనియన్ టెరిటరీ కోఆపరేటివ్ యాక్ట్స్ కింద సహకార సంఘాలకూ అంకుర గుర్తింపు అవకాశం ఉంటుంది.

28% పెరిగిన స్టాండర్డ్ ఇంజినీరింగ్ లాభం

ఈనాడు, హైదరాబాద్: స్టాండర్డ్ ఇంజినీరింగ్ టెక్నాలజీ, ఈ ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికి ఏకీకృత ఖాతాల ప్రకారం మెరుగైన ఫలితాలు ప్రకటించింది. రూ.196 కోట్ల మొత్తం ఆదాయంపై రూ.20 కోట్ల నికర లాభం నమోదయ్యింది. 2024-25 ఇదే కాలంతో పోలిస్తే, ఆదాయం 37.1%, నికరలాభం 28.3% పెరిగాయి. ఎబిటా మార్జిన్ 17.1 శాతం అని సంస్థ తెలిపింది. ఈ ఆర్థిక సంవత్సరం మొదటి 9 నెలలకు రూ.562 కోట్ల మొత్తం ఆదాయం, రూ.62 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. గ్లాస్-లైనింగ్ వ్యాపారానికే పరిమితం కాకుండా సమీకృత ఇంజినీరింగ్ సేవల సంస్థగా మారినట్లు కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ నాగేశ్వర రావు కందుల తెలిపారు. సైజెనిక్స్ ఇండియా, సీ2సీ ఇంజినీరింగ్ కంపెనీల్లో మెజారిటీ వాటా కొనుగోలు చేయడం ద్వారా బయో ప్రాసెస్ సిస్టమ్స్ విభాగంలోకి అడుగు పెట్టామని, తమ ప్రాసెస్, మెకానికల్, సివిల్, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ సామర్థ్యాలు విస్తరించినట్లు వివరించారు. దీనివల్ల ఎండ్-టు-ఎండ్ టర్న్‌కీ బయో ప్రాసెస్ సొల్యూషన్లు అందించే సత్తా లభించిందని అన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరానికి సరిపడా ఆర్డర్ బుక్ చేతిలో ఉన్నట్లు, ఆదాయాల్లో ఎగుమతుల వాటా 15 శాతానికి పైగానే ఉంటుందని తెలిపారు. జపాన్ సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన షెల్-అండ్-ట్యూబ్ గ్లాస్ లైన్డ్ హీట్ ఎక్స్ఛేంజర్స్‌కు ఎంతో ఆదరణ లభిస్తున్నట్లు వెల్లడించారు. వీటిని 100 యూనిట్లు డెలివరీ చేయగా, మరో 200 యూనిట్లకు ఆర్డర్లు ఉన్నాయని అన్నారు.

అందుబాటులోకి భారత్ ట్యాక్సీ సేవలు

● తొలుత దిల్లీ, గుజరాత్‌లలో ప్రారంభం ● మూడేళ్లలో దేశవ్యాప్తంగా విస్తరణ



ఇప్పటివరకు క్యాబ్ బుకింగ్ అంటే ఓలా, ఉబర్, ర్యాపిడో వంటి ప్రైవేట్ ప్లాట్‌ఫామ్‌లే ఉన్నాయి. దేశంలోనే తొలిసారిగా, సహకార రంగంలో క్యాబ్ సేవల ప్లాట్‌ఫామ్ 'భారత్ ట్యాక్సీ'ని కేంద్ర సహకార శాఖ మంత్రి అమిత్ షా గురువారం ప్రారంభించారు. తొలుత ఈ సేవలు దిల్లీ-ఎన్‌సీఆర్, గుజరాత్‌లలో అందుబాటులోకి రానున్నాయి. మూడేళ్లలో దేశవ్యాప్తంగా సేవలను విస్తరించాలన్నది లక్ష్యం. ఈ యాప్‌తో డ్రైవర్ల ఆదాయం గణనీయంగా పెరుగుతుందని అమిత్ షా వెల్లడించారు. భారత్ ట్యాక్సీ ప్రయోగాత్మక కార్యకలాపాలు విజయవంతం కావడంతో, పోటీ క్యాబ్ సేవల సంస్థలు తమ కమీషన్ తగ్గించుకున్నాయని, వినియోగదారులకు ఉచిత రైడ్లతో పాటు ఇతర ప్రోత్సాహకాలను అందించాయని పేర్కొన్నారు. భారత్ ట్యాక్సీ తమ డ్రైవర్లకు ఇస్తున్న యాజమాన్య హక్కును మరే సంస్థ ఇవ్వడం లేదన్నారు. దేశంలో అమూల్ సహా అగ్రగామి 8 సహకార సంస్థలు కలిసి 'భారత్ ట్యాక్సీ' ప్లాట్‌ఫామ్‌ను ఏర్పాటు చేశాయి.

ఒమేగా సెకి విద్యుత్తు స్కూటర్

● ప్రారంభ ధర రూ.99,900

● 70 కి.మీ. వేగం.. 110 కి.మీ. ప్రయాణం



ముంబయి: విద్యుత్తు వాహనాల తయారీ సంస్థ ఒమేగా సెకి, తొలిసారిగా ఇ-స్కూటర్ వెక్స్ట్రాను ఆవిష్కరించింది. దేశీయ విపణితో పాటు, విదేశాలకూ ఎగుమతి చేయనున్న ఈ స్కూటర్ ప్రారంభ ధర రూ.99,900. ఏడాదిలో దేశీయంగా 9,000, విదేశాల్లో 6,000.. మొత్తం 15,000 స్కూటర్లు విక్రయించాలన్నది లక్ష్యమని సంస్థ తెలిపింది. ఈ వాహనంలో అమర్చిన 3.45 కిలోవాట్ ఎల్ఎంఎఫ్‌పీ బ్యాటరీని ఒకసారి పూర్తిగా ఛార్జింగ్ చేసేందుకు 5 గంటలు పడుతుంది.. 110 కి.మీ.ల వరకు ప్రయాణించొచ్చని సంస్థ తెలిపింది. ఈ స్కూటర్‌పై గరిష్ఠంగా గంటకు 70 కి.మీ. వేగంతో వెళ్లొచ్చు. ఇకో, సిటీ, స్పోర్ట్స్ రైడింగ్ మోడ్‌లు ఉన్నాయి. 3.5 అంగుళాల ఎల్‌సీడీ, యూఎస్‌బీ ఛార్జింగ్, భద్రత కోసం సీబీఎస్ బ్రేకింగ్, ఏఐఎస్-156 బ్యాటరీ మేనేజ్‌మెంట్ సిస్టమ్, ఐపీ67-మోటార్ కలిగి ఉంది. ఫరీదాబాద్‌లోని తన యూనిట్లో ఈ స్కూటర్ ఉత్పత్తి చేయనున్నట్లు తెలిపింది. నైజీరియాలో మే నుంచి రూపొందిస్తామంది.

ఎఫ్ అండ్ ఓ ట్రేడింగ్ దూకుడును అధిక పన్నులు ఆటంకపరుస్తాయ్: విర్మానీ

ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ (ఎఫ్ అండ్ ఓ) ట్రేడింగ్‌పై పన్ను పెంపు వల్ల, విపరీత స్పెక్యులేషన్‌కు అడ్డుకట్ట వేయొచ్చని నీతి ఆయోగ్ సభ్యుడు అరవింద్ విర్మానీ అభిప్రాయపడ్డారు. డెరివేటివ్స్‌పై సెక్యూరిటీల లావాదేవీ పన్ను (ఎస్‌టీటీ) పెంచుతామని ఇటీవల బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించిన విషయం తెలిసిందే. 'ట్రేడింగ్‌ను నియంత్రించడం నాకు వ్యక్తిగతంగా నచ్చదు. అయితే డెరివేటివ్స్ విషయంలో సామాన్య మదుపర్ల దూకుడును తగ్గించాలి. లేకపోతే వారే అధికంగా నష్టపోతున్నారు' అని విర్మానీ అన్నారు.

టీఎంపీవీ నష్టం రూ.3,483 కోట్లు



దిల్లీ: టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికల్స్ (టీఎంపీవీ), అక్టోబరు-డిసెంబరు త్రైమాసికంలో రూ.3,483 కోట్ల ఏకీకృత నష్టాన్ని నమోదు చేసింది. 2024-25 ఇదే కాలంలో కంపెనీ రూ.5,485 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. కార్యకలాపాల ఏకీకృత మొత్తం ఆదాయం రూ.94,472 కోట్ల నుంచి రూ.70,108 కోట్లకు తగ్గింది. మొత్తం వ్యయాలూ రూ.89,698 కోట్ల నుంచి రూ.74,880 కోట్లకు పరిమితమయ్యాయి.
✦ అనుబంధ సంస్థ జాగ్వార్ ల్యాండ్ రోవర్ (జేఎల్ఆర్)పై సైబర్ దాడి (రూ.800 కోట్లు), కొత్త లేబర్ కోడ్ (రూ.400 కోట్లు), స్టాంప్ డ్యూటీ (రూ.400 కోట్లు) వ్యయాల వల్ల, కంపెనీకి రూ.1,600 కోట్ల అసాధారణ నష్టం వాటిల్లింది. సమీక్షా త్రైమాసికంలో జేఎల్ఆర్ 298 మిలియన్ పౌండ్ల (సుమారు రూ.3,650 కోట్ల) నష్టం నమోదు చేసింది. జేఎల్ఆర్ ఆదాయం 39% తగ్గి 4.5 బిలియన్ పౌండ్ల (సుమారు రూ.55,000 కోట్ల)కు పరిమితమైంది.
✦ టాటా ప్యాసింజర్ వాహనాల ఆదాయం 24% పెరిగి రూ.15,300 కోట్లకు చేరింది. మొత్తం టాటా పీవీ (ప్రయాణికుల వాహనాలు), ఈవీ (విద్యుత్ వాహనాలు) విక్రయాల పరిమాణం 22% అధికమై 1.71 లక్షలుగా నమోదైంది.

భవిష్యత్తు ఆశాజనకమే: జీఎస్‌టీ రేట్లు తగ్గడం, పండగ సీజన్, ఆకర్షణీయ ఉత్పత్తులతో సమీక్షా త్రైమాసికంలో విక్రయాలు పెరిగాయని కంపెనీ ఎండీ, సీఈఓ శైలేష్ చంద్ర తెలిపారు. 'భవిష్యత్తులో సంస్థ వృద్ధి వేగవంతం కానుంది. మంచి మోడళ్లు వరుసలో ఉన్నాయి. ఆరోగ్యకర ఇన్వెంటరీ స్థాయిలు, అన్ని విభాగాల్లో స్థిరమైన గిరాకీ ఉండటంతో మార్జిన్లు బలోపేతం అవుతాయ'ని వివరించారు.

ఐఓసీ లాభం నాలుగింతలు



దిల్లీ: ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ), డిసెంబరు త్రైమాసికంలో రూ.12,125.86 కోట్ల స్టాండలోన్ నికర లాభాన్ని నమోదు చేసింది. 2024-25 ఇదే కాల లాభం రూ.2,873.53 కోట్లతో పోలిస్తే ఇది నాలుగింతలు కావడం విశేషం. కార్యకలాపాల ఆదాయం రూ.2.16 లక్షల కోట్ల నుంచి రూ.2.31 లక్షల కోట్లకు చేరింది. అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు తక్కువగా ఉండటంతో, రిఫైనింగ్ మార్జిన్లు పెరగడం, పెట్రోల్-డీజిల్ విక్రయాలు 5% అధికమైనందునే లాభం బాగా పెరిగిందని కంపెనీ ఎక్స్ఛేంజీలకు సమాచారమిచ్చింది. ఏప్రిల్-డిసెంబరులో కంపెనీ ఒక బ్యారెల్ ముడి చమురును ఇంధనంగా మార్చడం ద్వారా 8.41 డాలర్లు ఆర్జించింది. 2024-25 ఇదే కాలంలో ఇది 3.69 డాలర్లే. త్రైమాసిక రిఫైనింగ్ మార్జిన్‌ను సంస్థ వెల్లడించలేదు. దేశీయంగా వంటగ్యాస్‌ను ప్రభుత్వ ధర ప్రకారం విక్రయించినందున, ఖజానా నుంచి రూ.2,414.34 కోట్ల సబ్సిడీ సంస్థకు అందాల్సి ఉంది.
✦ సమీక్షా త్రైమాసికంలో ఇంధన విక్రయాలు 26.015 మిలియన్ టన్నులకు చేరాయి. 2024-25 ఇదే కాలంలో ఇవి 24.78 మి.టన్నులుగా ఉన్నాయి. ఇంధన విక్రయాల ద్వారా పన్నుకు ముందు లాభం 4 రెట్లు పెరిగి రూ.16,836.08 కోట్లకు చేరింది. గ్యాస్ వ్యాపార లాభం 34% పెరిగి రూ.596.45 కోట్లకు చేరింది.
✦ ఏప్రిల్-డిసెంబరు మధ్య కంపెనీ నికర లాభం రూ.5,696.72 కోట్ల నుంచి రూ.25,424.91 కోట్లకు చేరింది. కార్యకలాపాల ఆదాయం రూ.6.27 లక్షల కోట్ల నుంచి రూ.6.53 లక్షల కోట్లకు చేరింది. దేశీయ ఇంధన విక్రయాలు 4.3% పెరిగాయి.

హైదరాబాద్‌లో యాపిల్ ఉద్యోగావకాశాలు



హైదరాబాద్: దేశీయంగా సొంతంగా రిటెయిల్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్న ఐఫోన్ల సంస్థ యాపిల్, హైదరాబాద్‌లో తదుపరి విక్రయ కేంద్రాన్ని ప్రారంభించే యోచనలో ఉంది. ఇందుకోసమే ఉద్యోగుల ఎంపిక కోసం ప్రకటనలు ఇస్తోంది. యాపిల్ తన కెరీర్ పోర్టల్‌లో అవుట్‌లెట్ మేనేజర్, సీనియర్ మేనేజర్, స్టోర్ లీడర్, రిటెయిల్ మేనేజర్, టెక్నికల్ స్పెషలిస్ట్, బిజినెస్ ఎక్స్‌పర్ట్స్, ఆపరేషన్స్ ఎక్స్‌పర్ట్స్‌తో పాటు పూర్తి కాలానికి, పార్ట్‌టైమ్, కాంట్రాక్ట్ ఎక్స్‌పర్ట్స్, మేనేజర్స్ వంటి వివిధ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. గతేడాది బెంగళూరు, పుణె, నోయిడాల్లో యాపిల్ తన స్టోర్లను ప్రారంభించింది. 2023లో ముంబయి, దిల్లీల్లో స్టోర్లకు సంస్థ శ్రీకారం చుట్టిన సంగతి విదితమే.
✦ 2023లో యాపిల్ బీకేసీ పేరుతో ముంబయిలో, తర్వాత యాపిల్ సాకేత్ పేరుతో దిల్లీలో, ఆన్‌లైన్ ప్లాట్‌ఫాంలో మొదలైంది.

హీరో మోటోకార్ప్ మధ్యంతర డివిడెండ్ రూ.110

హీరో మోటోకార్ప్, డిసెంబరు త్రైమాసికంలో రూ.1,275 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని నమోదు చేసింది. 2024-25 ఇదే కాల లాభం రూ.1,108 కోట్లతో పోలిస్తే ఇది 15% అధికం. దేశీయ విక్రయాలతో పాటు ఎగుమతులూ అధికంగా నమోదు చేయడం ఇందుకు కారణమని కంపెనీ తెలిపింది. కార్యకలాపాల ఆదాయం రూ.10,260 కోట్ల నుంచి రూ.12,487 కోట్లకు పెరిగింది.
✦ సమీక్షా త్రైమాసికంలో కంపెనీ 16.97 లక్షల మోటార్‌సైకిళ్లు, స్కూటర్లను విక్రయించింది. 2024-25 ఇదే కాలంలో విక్రయించిన 14.64 లక్షల కంటే ఇవి 16% ఎక్కువ.
✦ రూ.2 ముఖ విలువ కలిగిన ఒక్కో షేరుకు రూ.110 చొప్పున మధ్యంతర డివిడెండు చెల్లించేందుకు బోర్డు అనుమతి ఇచ్చింది. మార్చి 7లోపు డివిడెండు చెల్లించనుంది.
✦ 'సమీక్షా త్రైమాసికంలో విక్రయాల పరిమాణంలో ఆరోగ్యకర రెండంకెల వృద్ధి నమోదైంది. వినూత్న ఉత్పత్తులు ఇందుకు దోహదం చేశాయ'ని హీరో మోటోకార్ప్ సీఎఫ్ఓ వివేక్ ఆనంద్ వెల్లడించారు.

3 రోజుల వరుస లాభాలకు విరామం



సెన్సెక్స్ ▼504 83314 | నిఫ్టీ ▼133 25643

ఎఫ్ఐఐ విక్రయాలు: రూ.2,151 కోట్లు
డీఐఐ కొనుగోళ్లు: రూ.1,130 కోట్లు

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) పరపతి విధాన సమీక్ష నిర్ణయాలు శుక్రవారం (నేడు) వెలువడనున్న నేపథ్యంలో, గురువారం మదుపర్లు అప్రమత్తతతో లావాదేవీలు నిర్వహించారు. విదేశీయ అమ్మకాలూ ప్రభావం చూపాయి. ఫలితంగా సూచీల మూడు రోజుల వరుస లాభాలకు అడ్డుకట్ట పడింది. లోహ, ఐటీ, యంత్ర పరికరాల షేర్లకు అమ్మకాలు వెల్లువెత్తడం సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. అమెరికా- ఇరాన్ ఉద్రిక్తతలు ప్రతికూల ప్రభావం చూపాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి 13 పైసలు పెరిగి 90.34 వద్ద ముగిసింది. బ్యారెల్ ముడిచమురు 1.32% నష్టంతో 68.54 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లలో హాంకాంగ్ లాభపడగా, మిగతావి నష్టపోయాయి. ఐరోపా సూచీలు నష్టాల్లో ట్రేడయ్యాయి.
✦ బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.2.46 లక్షల కోట్లు తగ్గి రూ.466.70 లక్షల కోట్ల (5.16 లక్షల కోట్ల డాలర్ల)కు చేరింది.
✦ సెన్సెక్స్ ఉదయం 60 పాయింట్ల (క్రితం ముగింపు 83,817.69) నష్టంతో 83,757.54 పాయింట్ల వద్ద ప్రారంభమైంది. అమ్మకాలు స్థిరంగా కొనసాగడంతో రోజంతా నష్టాల్లోనే కదలాడిన సూచీ, ఇంట్రాడేలో 83,151.62 వద్ద కనిష్ఠాన్ని తాకింది. చివరకు 503.76 పాయింట్ల నష్టంతో 83,313.93 వద్ద ముగిసింది. నిఫ్టీ 133.20 పాయింట్లు తగ్గి 25,642.80 దగ్గర స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 25,579.50- 25,757.65 పాయింట్ల మధ్య కదలాడింది.
✦ అనైతిక వ్యాపార విధానాలు పాటిస్తోందన్న ఆరోపణలపై, దర్యాప్తునకు కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ఆదేశించడంతో ఇండిగో షేరు ఇంట్రాడేలో రూ.4,782.45 వద్ద కనిష్ఠాన్ని తాకింది. చివరకు 0.60% నష్టంతో రూ.4,933.95 వద్ద ముగిసింది.
✦ సెన్సెక్స్ 30 షేర్లలో 24 డీలాపడ్డాయి. ఎటర్నల్ 2.50%, భారతీ ఎయిర్‌టెల్ 1.65%, బీఈఎల్ 1.42%, ఐటీసీ 1.15%, ఇన్ఫోసిస్ 1.05%, టైటన్ 0.93%, బజాజ్ ఫిన్‌సర్వ్ 0.92%, రిలయన్స్ 0.91% నష్టపోయాయి. ట్రెంట్ 2.95%, టాటా స్టీల్ 1.23%, ఎస్‌బీఐ 0.50% లాభపడ్డాయి. రంగాల వారీ సూచీల్లో.. యంత్ర పరికరాలు 1.07%, లోహ 1.05%, మన్నికైన వినిమయ వస్తువులు 0.88%, ఫోకస్డ్ ఐటీ 0.78%, ఐటీ 0.76%, టెలికాం 0.72% తగ్గాయి. పీఎస్‌యూ బ్యాంక్, చమురు-గ్యాస్ రాణించాయి. బీఎస్ఈలో 2504 షేర్లు నష్టపోగా, 1690 స్క్రిప్‌లు లాభపడ్డాయి. 154 షేర్లలో ఎటువంటి మార్పులేదు.
✦ అస్సాంలో తయారీ ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు రూ.500 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు సన్ ఫార్మా ముఖ్య కార్యదర్శి రవి కోటా తెలిపారు. దీంతో 500 మందికి పైగా ప్రత్యక్ష ఉపాధి లభిస్తుందన్నారు.

ఈసీబీ వడ్డీ రేట్లలో మార్పులేదు

యూరోను కరెన్సీగా వినియోగించే 21 దేశాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఐరోపా కేంద్ర బ్యాంక్ (ఈసీబీ) కూడా కీలక వడ్డీ రేట్లలో ఎటువంటి మార్పుచేయలేదు. ప్రామాణిక వడ్డీ రేటును 2% వద్ద యథాతథంగా ఉంచింది. గతేడాది జూన్ నుంచి వడ్డీ రేట్లలో ఈ బ్యాంక్ మార్చలేదు. 2024 మధ్యలో వడ్డీరేటు 4 శాతంగా ఉండేది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సుంకాలు విధించడంతో వృద్ధి నెమ్మదించినా.. ఆర్థిక వ్యవస్థ బలంగా ఉందని ఈసీబీ పేర్కొంది.

బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్ వడ్డీ రేట్లు యథాతథం

బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్ కీలక వడ్డీ రేటును 3.75% వద్ద యథాతథంగా ఉంచింది. బ్రిటన్ ద్రవ్యోల్బణం లక్ష్యం కంటే ఎగువన ఉండటం, ఆర్థికాభివృద్ధి పుంజుకున్న సంకేతాల నేపథ్యంలోనే.. వడ్డీ రేట్లలో మార్పులు చేయలేదు. 9 మంది సభ్యులు కలిగిన రేట్ల ప్యానెల్‌లో అయిదుగురు కీలక రేట్లను యథాతథంగా ఉంచాలని ఓటేశారు. మిగతా నలుగురు మాత్రం 0.25% రేట్ల కోతకు మొగ్గుచూపారు.

అక్టోబరు-డిసెంబరు త్రైమాసిక ఫలితాలు (రూ.కోట్లలో)

కంపెనీ	నికర లాభం/(నష్టం) 2025-26	నికర లాభం/(నష్టం) 2024-25	మొత్తం ఆదాయం 2025-26	మొత్తం ఆదాయం 2024-25
మ్యాక్స్ హెల్త్‌కేర్	344.00	316.00	2608.00	2381.00
ఫిజిక్స్‌వాలా	102.27	76.72	1082.41	809.67
నైకా	63.31	26.12	2873.26	2267.21
ఏషియన్ గ్రానైటో ఇండియా	4.45	1.13	268.42	257.98
హిందుస్థాన్ కాపర్	156.30	62.87	687.34	327.77
ఆర్సెలర్‌మిత్తల్ ★	177.00	(390)	14971.00	14714.00
పేజ్ ఇండస్ట్రీస్	189.53	204.65	1386.75	1313.05
పీవీఆర్ ఐనాక్స్	95.40	35.50	1879.80	1717.30
సుజ్లాన్	445.00	388.00	4228.00	2969.00
యునో మిండా	300.48	254.37	5018.06	4183.99
పరాగ్ మిల్క్ ఫుడ్స్	32.57	37.66	1021.62	890.08
జేఎస్‌డబ్ల్యూ సిమెంట్	(80.22)	(33.66)	1621.22	1432.74
పీఎఫ్‌సీ ★★	8211.90	7759.56	29140.57	26821.84
థామస్‌కుక్	44.87	46.66	2145.68	2061.00
హిటాచీ ఎనర్జీ	261.40	137.40	2168.00	1672.40
ధనూకా అగ్రిటెక్	40.00	55.04	418.04	452.28
జేకే పేపర్	27.53	65.29	1781.65	1654.25
ఆదిత్య బిర్లా ఫ్యాషన్	137.30	102.68	2373.66	2200.52

★ మిలియన్ డాలర్లలో.. ★★ మధ్యంతర డివిడెండ్ రూ.4

ప్రాక్టీస్ బిట్స్

ఇండియన్ ఎకానమీ

1. 2025లో ఆర్‌బీఐ ప్రాధాన్యతా రంగ రుణాల (పీఎస్ఎల్) విధానం ప్రకారం, కింది వాటిలో దేన్ని ఇందులో చేర్చలేదు?
   1) విద్యారుణాలు
   2) పునరుత్పాదక ఇంధన వనరుల ప్రాజెక్టులు
   3) మెట్రో ప్రాంతాలకు గృహరుణ పరిమితులు
   4) వ్యవసాయ రుణాలు
2. ప్రభుత్వరంగ బ్యాంకుల సామర్థ్యాన్ని మెరుగుపరిచే లక్ష్యంతో 'ఇంద్రధనుస్సు' కార్యక్రమాన్ని ఎప్పుడు ప్రారంభించారు?
   1) 2020 2) 2015 3) 2017 4) 2021
3. భారతదేశంలో ఏర్పాటు చేసిన బ్యాంకింగ్ వ్యవస్థ ఏ రూపానికి చెందింది?
   1) యూనిట్ బ్యాంకింగ్
   2) మిశ్రమ బ్యాంకింగ్
   3) బ్రాంచ్ బ్యాంకింగ్
   4) లీడ్ బ్యాంకింగ్
4. ప్రస్తుతం ఇండియాలో అత్యధిక శాఖలున్న విదేశీ బ్యాంకును గుర్తించండి.
   1) సిటీ బ్యాంకు
   2) స్టాండర్డ్ చార్టర్డ్ బ్యాంకు
   3) హెచ్ఎస్‌బీసీ
   4) డీబీఎస్ బ్యాంకు
5. 'బ్యాంకులు నగదును ఒకరి నుంచి మరొకరికి మార్చే సంస్థలు మాత్రమే కాదు, అవి ద్రవ్యాన్ని సృష్టించే సంస్థలు కూడా' అని చెప్పిన ఆర్థికవేత్త?
   1) ఆర్.ఎస్. సేయర్స్
   2) ఎం. నరసింహం
   3) ఆర్.ఎస్. ఖాన్
   4) అశోక్ కుమార్ లహరి

సమాధానాలు: 1-4, 2-2, 3-3, 4-2, 5-1.

శక్తి నిల్వలకు సులువైన సాధనాలు!






రసాయన శక్తిని విద్యుత్తు శక్తిగా మార్చి, స్థిరమైన విద్యుత్తు ప్రవాహాన్ని అందించగలిగే పరికరాలే విద్యుత్తు ఘటాలు. టార్చిలైట్లు, రిమోట్‌లు, గడియారాలు, సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, ఎలక్ట్రిక్ వాహనాల్లో వినియోగించే వివిధ రకాల బ్యాటరీలన్నీ అలాంటివే. వీటిలో రసాయన శక్తి రూపంలో విద్యుత్తు నిల్వ ఉంటుంది. విద్యుత్తు వలయంలోని రసాయన చర్యల ద్వారా ఇవి ఎలక్ట్రాన్ల ప్రవాహాన్ని సృష్టిస్తాయి. చిన్న ఎలక్ట్రానిక్ పరికరాల నుంచి భారీ యంత్రాల వరకు ఎక్కడైనా సులువుగా వినియోగించుకునే సౌలభ్యం ఉన్న ఈ విద్యుత్తు ఘటాల నిర్మాణంపై పోటీ పరీక్షార్థులకు ప్రాథమిక పరిజ్ఞానం ఉండాలి. వాటిలో రకాలు, ఉపయోగాలు, అందులో ఎలక్ట్రోడ్‌లుగా, విద్యుత్తు విశ్లేష్యాలుగా వినియోగించే పలు పదార్థాల గురించి తెలుసుకోవాలి.

జనరల్ స్టడీస్ – భౌతిక శాస్త్రం

విద్యుత్తు ఘటాలు

విద్యుదావేశాన్ని నిల్వ చేయడానికి అనేక పరికరాలు ఉన్నాయి. అందులో విద్యుత్తు ఘటాలు ఒకటి. ఇవి రసాయన శక్తిని విద్యుచ్ఛక్తిగా మారుస్తాయి. విద్యుత్తు ఘటాన్ని మొదట అలెగ్జాండ్రో వోల్టా కనుక్కున్నాడు. విద్యుత్తు ఘటంలో రెండు వాహక కడ్డీలు/పలకలు ఉంటాయి. ఇవి ధన, రుణ విద్యుదావేశాలు ప్రసరించడానికి వీలుగా ఉంటాయి.

◆ రుణ, ధనావేశం ప్రసరించే వాహకాలను 'ఎలక్ట్రోడ్‌లు' అంటారు.
◆ ధన ఎలక్ట్రోడ్‌ను 'ఆనోడ్', రుణ ఎలక్ట్రోడ్‌ను 'క్యాథోడ్' అంటారు.
◆ దీనిలో విద్యుత్తు ఉత్పత్తికి వాడే రసాయన పదార్థం ఉంటుంది. దీన్నే 'విద్యుత్తు విశ్లేష్యం' అంటారు. ◆ సాధారణంగా విద్యుత్తు వాహకాల్లో ధన అయాన్లు (ధనావేశ కణాలు), రుణ అయాన్లు (రుణావేశ కణాలు) చలిస్తాయి. ◆ సాధారణంగా ద్రవ విద్యుత్తు విశ్లేష్యాల్లో ధన, రుణ అయాన్లు పరస్పరం వ్యతిరేక దిశలో చలిస్తాయని మైకేల్ ఫారడే తెలిపాడు. ◆ రెండు ఎలక్ట్రోడ్‌ల మధ్య ఉండే విద్యుత్తు విశ్లేష్యంలో కణాలు కదిలించడానికి ఉపయోగపడే బలమే రసాయన బలం (కెమికల్ ఫోర్స్) Fc. ◆ ధనావేశ కణాలు పోగయ్యే పలకను 'ధన ఎలక్ట్రోడ్', రుణావేశ కణాలు పోగయ్యే పలకను 'రుణ ఎలక్ట్రోడ్' అంటారు.
◆ ఎలక్ట్రోడ్ (పలకల)పై అయాన్లు పోగవడం వల్ల వీటిని కలిగి ఉండే బలమే విద్యుత్తు బలం Fe. ◆ Fc = Fe సమానమయ్యే స్థితిని ఘటం 'సంతృప్త స్థితి' అంటారు. ఈ స్థితిలో ఘటాలను అందరూ కొని వినియోగించుకుంటారు. ◆ విద్యుత్తు బల పరిమాణం పలకలపై పోగయ్యే ఆవేశం మీద ఆధారపడుతుంది. ◆ ఘటాలను వలయంలో కలిపేటప్పుడు దానిలో పొటెన్షియల్ భేదం ఏర్పడుతుంది.
◆ ఏకాంక ధనావేశాన్ని ధన ధ్రువం నుంచి రుణ ధ్రువానికి కదల్చడానికి రసాయన బలం చేసే పనినే విద్యుచ్ఛాలక బలం (emf = electro motive force) అంటారు.
◆ విద్యుచ్ఛాలక బలానికి ప్రమాణం వోల్ట్.




విద్యుత్తు ఘటాలు-రకాలు

ప్రాథమిక ఘటాలు: 1) వోల్టా ఘటం 2) లెక్లాంచి ఘటం 3) నిర్జల ఘటం 4) బైక్రోమేట్ ఘటం
◆ ఇవి ఉపయోగానికి వీలుగా ఉండి, రీఛార్జ్ చేయలేని ఘటాలు.
◆ వీటిలో రసాయనిక చర్యల ద్వారా శక్తి విడుదలవుతుంది.

గౌణ ఘటాలు: 1) రీఛార్జ్ బ్యాటరీలు 2) లిథియం - అయాన్ 3) లెడ్-యాసిడ్ ఘటాలు 4) నికెల్-కాడ్మియం బ్యాటరీలు
◆ ఇవి అనేకసార్లు ఉపయోగించడానికి వీలుగా ఉండి, రీఛార్జ్ చేసుకోడానికి వీలుగా ఉండేవి.
◆ వీటిలో రసాయనిక ప్రతిచర్యలు జరిగి విద్యుచ్ఛక్తి ఉత్పత్తి అవుతుంది.

1) వోల్టా ఘటం: ఈ ఘటాన్ని మొదట అలెగ్జాండ్రో వోల్టా 1800లో కనుక్కున్నాడు. ఇందులో ఎలక్ట్రోడ్‌లుగా కాపర్ కడ్డీ (ధన ఎలక్ట్రోడ్‌గా), జింక్ కడ్డీ (రుణ ఎలక్ట్రోడ్‌గా); సజల సల్ఫ్యూరిక్ ఆమ్లాన్ని (H_2SO_4) విద్యుత్తు విశ్లేష్యంగా ఉపయోగించాడు. దీనినే 'గాల్వానిక్ సెల్' అంటారు. దీనిలో ఆకస్మిక ఆక్సీకరణ తగ్గింపు చర్య వల్ల విద్యుత్తు ప్రవాహం ఉత్పత్తి అవుతుంది. ఈ ఘటాన్ని రెండు ఎలక్ట్రోడ్‌లు, బల్బుతో కలిపితే బల్బు వెలిగింది. కానీ కొంతసేపటికి అది ఆరిపోయింది. ఈ ఘటంలో రెండు లోపాలు కనిపించాయి. అవి 1) స్థానిక చర్య 2) ధ్రువకరణం.



స్థానిక చర్య: ఈ ఘటంలో జింక్, సజల సల్ఫ్యూరిక్ ఆమ్లంతో చర్య జరిపి కరుగుతుంది. అప్పుడు ఇనుము, కార్బన్ లాంటి మలినాలు విడుదలవుతాయి. ఇవి ఆ విద్యుత్తు విశ్లేష్యంలో చిన్న చిన్న వోల్టా ఘటాలుగా మారతాయి. దీనినే 'స్థానిక చర్య' అంటారు. దీని నివారణ కోసం జింక్‌కు పాదరసం పూస్తారు..

ధ్రువకరణం: సాధారణంగా జింక్ కడ్డీ సజల సల్ఫ్యూరిక్ ఆమ్లంతో చర్య జరిపి హైడ్రోజన్ వాయువును విడుదల చేస్తుంది. ఈ వాయువు పక్కనే ఉన్న ధన ఎలక్ట్రోడ్ రాగి కడ్డీ వద్ద పూత మాదిరి చేరుతుంది. ఆ పూత నుంచి వెళ్లే ధనావేశాన్ని ఆపివేస్తుంది. దీనినే 'ధ్రువకరణం' అంటారు.


2) లెక్లాంచి ఘటం: దీనిని మొదట జార్జి లెక్లాంచి 1857లో కనుక్కున్నాడు. దీనిలో ధన ఎలక్ట్రోడ్‌గా కార్బన్ కడ్డీ, రుణ ఎలక్ట్రోడ్‌గా పాదరసాన్ని పూసిన జింక్ పలకను ఉపయోగించాడు. దీనిలో విద్యుత్తు విశ్లేష్యంగా అమ్మోనియం క్లోరైడ్ ద్రావణాన్ని వాడారు. ఈ ఘటంలో ఆక్సీకరణిగా మాంగనీస్ డై ఆక్సైడ్, కార్బన్ పొడి మిశ్రమాన్ని ఉపయోగించారు. ఈ ఘటాన్ని విరామం ఇస్తూ ఉపయోగించాలి. అది ఇచ్చే విద్యుచ్ఛాలక బలం - 1.46 v.

3) అనార్ద్ర (నిర్జల) ఘటం: దీనిని లెక్లాంచి ఘటానికి రూపాంతరంగా పేర్కొంటారు. దీనిలో ధన ఎలక్ట్రోడ్‌గా కార్బన్ కడ్డీ, రుణ ఎలక్ట్రోడ్‌గా పాదరస పూత ఉన్న జింక్ డబ్బాను వాడతారు. విద్యుత్తు విశ్లేష్యంగా అమ్మోనియం క్లోరైడ్ పేస్టు వినియోగిస్తారు. ఆక్సీకరణిగా MnO_2, C పొడి పేస్టు ఉపయోగిస్తారు. దీనిని ధన ఎలక్ట్రోడ్ కార్బన్ చుట్టూ వాడతారు. దీనిని సాధారణ బ్యాటరీ అంటారు. రేడియో, రిమోట్, గడియారం, కెమెరా లాంటి వాటిలో వినియోగిస్తారు. ఈ ఘటం ఇచ్చే విద్యుచ్ఛాలక బలం (emf) = 1.46 v (1.5 v) గా ఉంటుంది.

4) బైక్రోమేట్ ఘటం: దీనినే బైక్రోమేట్ సెల్ అని కూడా అంటారు. దీనిలో ధన ఎలక్ట్రోడ్‌గా కార్బన్ కడ్డీలు వాడతారు. రుణ ఎలక్ట్రోడ్‌గా జింక్ పలక (పాదరస పూత ఉన్నది)ను ఉపయోగిస్తారు. దీనిలో పదార్థం(విద్యుత్తు విశ్లేష్యం)గా పొటాషియం డైక్రోమేట్ ($K_2Cr_2O_7$), సజల సల్ఫ్యూరిక్ ఆమ్లం (Dil H_2SO_4) వినియోగిస్తారు. దీనిలో ఆక్సీకరణిగా సజల H_2SO_4 ఉంటుంది. ఇది ఇచ్చే విద్యుచ్ఛాలక బలం (emf) - 2 v గా ఉంటుంది. దీనిని పరిశ్రమలో ఎక్కువ విద్యుత్తు కోసం వాడతారు.

లిథియం అయాన్ బ్యాటరీ

ఇది అనేకసార్లు రీఛార్జ్ చేసుకోగలిగిన బ్యాటరీ. ఇందులో అధిక శక్తి సాంద్రత ఉంటుంది. బరువు తక్కువ. ఛార్జింగ్ సమయంలో లిథియం అయాన్లు క్యాథోడ్ నుంచి ఆనోడ్ వైపు ప్రయాణించి నిల్వ అవుతాయి. డిశ్చార్జ్ సమయంలో తిరిగి క్యాథోడ్ వైపు కదులుతాయి. దీనిలో లిథియం కోబాల్ట్ ఆక్సైడ్ లేదా లిథియం, ఐరన్ ఫాస్ఫేట్ లాంటి పదార్థాలను వాడతారు. వీటిని ల్యాప్‌టాప్, హ్యాండీ కెమెరా, కార్లు, స్కూటర్లు లాంటి ఎలక్ట్రిక్ వాహనాల్లో ఉపయోగిస్తారు.



లెడ్-యాసిడ్ ఘటాలు

వీటిని మొదట గాస్టన్ ప్లాంటే 1859లో కనుక్కున్నాడు. అనేక సార్లు రీఛార్జ్ చేసుకోవడానికి వీలుగా ఉంటాయి. కానీ తక్కువకాలం పాటు పనిచేస్తాయి. తయారుచేయడం సులభం. చౌకగా లభిస్తాయి. దీనిలో ధన ఎలక్ట్రోడ్‌గా లెడ్ డై ఆక్సైడ్ (PbO_2) ను, రుణ ఎలక్ట్రోడ్‌గా మెత్తని లెడ్‌ను వాడతారు. దీనిలో విద్యుత్తు విశ్లేష్యంగా నీరు, సజల H_2SO_4 ను వాడతారు. దీనిని వాహనాల్లో, ఇన్వర్టర్ బ్యాటరీలుగా వినియోగిస్తారు.



రచయిత: ఎస్.వై.నాయుడు

జూనియర్ ఇంటర్ – తెలుగు
మంచి ముత్యాలు

ఫైనల్ పరీక్షలు - 2026 – ముఖ్యమైన ప్రశ్నలు - జవాబులు

6 మార్కులు

1. శతక ప్రక్రియ విశిష్టతను తెలపండి.

జ: తెనుగు సాహిత్యంలో ప్రత్యేకత కలిగింది శతక రచన. ఇది పండితులు, పామరులు, బాలురు, వృద్ధులందరినీ రంజింప చేసే శక్తిమంతమై ప్రక్రియ. ప్రసిద్ధ కవుల నుంచి ఎందరో మహామహులు శతక రచన చేసి తరించిన వారే. అందుకే తెలుగులో వేలాదిగా శతకాలున్నాయి. శతకాలు కథ ప్రధానాలు కావు. వర్ణనా ప్రధానాలు కావు. వీటిని 'ముక్తకాలు' అంటారు. ఏ పద్యానికదే స్వతంత్రగా ఉంటాయి. కాబట్టి 'ముక్తకాలు' అని అంటారు. సులభ శైలితో ఉంటాయి. కవి ఆత్మానుభావం ఈ శతకాల్లో వ్యక్తమవుతుంది.

ఈ శతక పద్యాలు 100 లేదా 108 ఉండాలి. శతకంలో ప్రతి పద్యంలో ఒకే విధమైన 'మకుటం' ఉండాలి. ఈ మకుటం ఒక పదం లేదా ఒక వాక్యం లేదా రెండూ రాయవచ్చు.

3 మార్కులు

1. ఒక్కడే చాలు నిశ్చల బలోన్నతుడు.

జ: **పరిచయం:** మారద వెంకయ్య రచించిన భాస్కర శతకం నుంచి గ్రహించిన 'మంచి ముత్యాలు' అనే పాఠంలోనిది.

సందర్భం: ఉత్తర గో గ్రహణం చేసిన కౌరవులను, అర్జునుడు ఒక్కడే వారందరిని జయించాడని చెబుతూ కవి పలికిన సందర్భం లోనిది.

భావం: దృఢ చిత్తం ఉన్నవాడు ఒక్కడే చాలు ఎంతటి పనినైనా నెరవేర్చగలడని భావం.

2. తాటి క్రింద పాలు త్రాగిన చందమౌ.

జ: **పరిచయం:** ఈ వాక్యం వేమన రచించిన 'వేమన శతకం' నుంచి గ్రహించిన 'మంచి ముత్యాలు' అనే పాఠంలోనిది.


సందర్భం: గౌరవం లేని నీచుడితో స్నేహం చేయరాదని విశ్లేషిస్తూ వేమన పలికిన సందర్భం లోనిది.

భావం: తాటిచెట్టు కింద నిలబడి పాలు తాగితే లోకం కల్లు తాగాడనే మాట్లాడుకుంటుంది.

3. సుమతి శతకకర్త తెలిపిన నీతిని రాయండి.

జ: నీరు తాగే గుర్రాన్నీ, బలిసి ఉన్న మదపుటేనుగును, ఎద పట్టిన గోవు వద్ద ఉన్న ఆబోతును, విద్యలేని నీచబుద్ధి ఉన్నవాడితో స్నేహం చేయరాదు. భార్యతో ఏనాడు తగవులాడరాదు. ఆమెలో దోషం లేదని తెలిసి కూడా దోషాన్ని ఆపాదించకూడదు. ఏ ఇంట్లో స్త్రీ కన్నీరు కార్చాల్సి వస్తుందో ఆ ఇంట్లో సంపదలు ఉండవు. పాముకు విషం శిరస్సులో, తేలుకు తోకలో ఉంటుంది. కానీ దుష్టుడికి శరీరమంతా ఉంటుంది.

ముఖ్యమైన ప్రశ్నలు-జవాబులు



రచయిత: మండ్ల మహేశ్వర నాయుడు

ఆ దేశంలో బయటపడిన అతి పురాతన చిత్రకళ!

పొగమంచు కారణంగా జరిగిన విమాన ప్రమాదంలో మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ దుర్మరణం చెందారు. ఎగుమతి సంసిద్ధత సూచీలో దేశంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు వరుసగా అయిదు, ఎనిమిది స్థానాల్లో నిలిచాయి. తాజాగా వ్యర్థాలు లేని నగరంగా ఉత్తర్‌ప్రదేశ్‌లోని లఖ్‌నవూ, జీవ సంతోష జిల్లాగా అరుణాచల్‌ప్రదేశ్‌లోని కెయిపన్యోర్ గుర్తింపు పొందాయి. వేల ఏళ్ల నాటి అతిపురాతన చిత్రకళ ఇండోనేసియాలో వెలుగు చూసింది. దేశంలో జరిగే క్రికెట్ టీ-20 ప్రపంచకప్ నుంచి బంగ్లాదేశ్ వైదొలగడంతో ఆ స్థానంలో స్కాట్లాండ్ టోర్నీకి ఎంపికైంది. వివిధ రంగాల్లో స్థానిక, జాతీయ, అంతర్జాతీయ ప్రాధాన్యం ఉన్న ఇలాంటి వర్తమాన వ్యవహారాలను పోటీ పరీక్షార్థులు నిత్యం తెలుసుకుంటూ ఉండాలి. ఇటీవల దిల్లీలో జరిగిన గణతంత్ర సంబరాల విశేషాలు, పద్మ అవార్డు విజేతల వివరాలు, ముఖ్యమైన జాతీయ సదస్సులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధాన నిర్ణయాలు, వార్తల్లోని వ్యక్తులను గుర్తుంచుకోవాలి.



పద్మవిభూషణ్ పతకం

కరెంట్ అఫైర్స్


మాదిరి ప్రశ్నలు

1. కింది వాటిలో సరైంది?



భవనీశ్ కుమార్

   ఎ) 2026 రిపబ్లిక్ డే పరేడ్‌కు కమాండర్ లెఫ్టినెంట్ జనరల్ భవనీశ్ కుమార్ నేతృత్వం వహించారు.
   బి) 2026 రిపబ్లిక్ డే వేడుకల పరేడ్‌లో తొలిసారి పాల్గొన్న భిన్న స్కౌట్ యూనిట్ల కవాతుకు లెఫ్టినెంట్ అమిత్ చౌదరి నాయకత్వం వహించారు.
   సి) ఫిరంగుల కోసం ప్రత్యేకంగా తీర్చిదిద్దిన శక్తి బన్ రెజిమెంట్ తొలిసారి పరేడ్‌లో పాల్గొంది.
   డి) ఈ రిపబ్లిక్ డే పరేడ్‌లో తొలిసారి రెండు మూపురాల ఒంటెలు, జన్‌స్కార్ పోనీలు పాల్గొన్నాయి.
   ఇ) 2026 రిపబ్లిక్ డే పరేడ్ థీమ్‌గా 150 ఏళ్ల వందేమాతరాన్ని ఎంచుకున్నారు.
   1) ఎ, బి, ఇ 2) ఎ, బి, సి, డి
   3) ఎ, బి, సి, డి, ఇ 4) బి, సి, డి
2. శాంతి కాలంలో ఇచ్చే దేశ అత్యున్నత శౌర్య పురస్కారం 'అశోక చక్ర'ను 2026, గణతంత్ర దినోత్సవం రోజు ఎవరు పొందారు?
   1) హర్షత రాఘవ్ 2) అనిల్ చౌహాన్
   3) శుభాంశు శుక్లా 4) అమర్‌ప్రీత్ సింగ్
3. కింది వాటిలో సరైనవి?




గ్రాకా మాచెల్

   ఎ) 2025కు ఇందిరా గాంధీ శాంతి పురస్కారం మొజాంబిక్ మానవ హక్కుల కార్యకర్త, దక్షిణాఫ్రికా మాజీ అధ్యక్షుడు నెల్సన్ మండేలా రెండో భార్య గ్రాకా మాచెల్‌కు వచ్చింది.
   బి) ఇందిరా గాంధీ శాంతి బహుమతికి రూ.కోటి నగదు ఇస్తారు.
   సి) ఇందిరా గాంధీ శాంతి బహుమతిని 1986లో ప్రారంభించారు.
   డి) 2024కి ఈ బహుమతి చిలీ మాజీ అధ్యక్షురాలు మిచెల్ బాచెలెట్‌కు వచ్చింది.
   1) ఎ, బి, సి, డి 2) ఎ, బి, సి
   3) బి, సి, డి 4) ఎ, సి, డి
4. జాతీయ ఓటర్ల దినోత్సవం (జనవరి 25) 2026 థీమ్?



   1) మై ఇండియా, మై ఓట్
   2) నథింగ్ లైక్ ఓటింగ్, ఐ ఓట్ ఫర్ ష్యూర్
   3) మై ఓట్ మై డ్యూటీ
   4) యువర్ ఓట్ యువర్ వాయిస్
5. కింది వారిలో ఎవరికి 2026 సంవత్సరానికి పద్మవిభూషణ్ అవార్డు రాలేదు?
   1) వీఎస్ అచ్యుతానందన్ 2) పి.నారాయణన్
   3) ఎన్. రాజం 4) డాక్టర్ నోరి దత్తాత్రేయుడు
6. బనారస్ సాహిత్య ఉత్సవం 2026లో ఎవరికి భరతేందు హరిశ్చంద్ర లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు వచ్చింది?




నమితా గోఖలే

   1) అరుణ్‌దత్ రాయ్
   2) నమితా గోఖలే
   3) సల్మాన్ రష్దీ
   4) అమితవ్ ఘోష్

2026 పద్మ విభూషణ్ అవార్డులు - 5		
పేరు	రంగం	రాష్ట్రం
1)ధర్మేంద్ర	కళలు	మహారాష్ట్ర
2)కె.టి.థామస్	ప్రజావ్యవహారాలు	కేరళ
3)ఎన్.రాజం	కళలు	ఉత్తర్‌ప్రదేశ్
4)పి.నారాయణన్	సాహిత్యం, విద్య	కేరళ
5)వి.ఎస్.అచ్యుతానందన్	ప్రజావ్యవహారాలు	కేరళ

7. ఉత్తర్‌ప్రదేశ్‌లోని మొదటి సున్నా తాజా వ్యర్థాల డంప్ నగరంగా ఏది నిలిచింది?
   1) లఖ్‌నవూ 2) మధుర
   3) వారణాసి 4) అలహాబాద్
8. కింది వాటిలో సరైంది?
   ఎ) నీతి ఆయోగ్ విడుదల చేసిన ఎగుమతి సంసిద్ధత సూచీ-2024లో అత్యుత్తమ పనితీరు కనబరిచిన పెద్ద రాష్ట్రాల జాబితాలో మహారాష్ట్ర మొదటి స్థానంలో నిలిచింది.
   బి) తమిళనాడు, గుజరాత్, ఉత్తర్‌ప్రదేశ్ 2, 3, 4 స్థానాల్లో నిలిచాయి.
   సి) ఆంధ్రప్రదేశ్ 5, తెలంగాణ 8వ స్థానాల్లో నిలిచాయి.
   డి) చిన్న రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల విభాగంలో ఉత్తరాఖండ్ మొదటి, జమ్ము-కశ్మీర్ రెండో, నాగాలాండ్ మూడో స్థానంలో నిలిచాయి.
   1) ఎ, బి, సి 2) బి, సి, డి
   3) ఎ, సి, డి 4) ఎ, బి, సి, డి
9. దేశంలోనే తొలిసారి డ్రైవర్ రహిత మెట్రోరైలు ట్రయల్ రన్‌ను ఏ నగరంలో చేపట్టారు?
   1) హైదరాబాద్ 2) ముంబయి
   3) చెన్నై 4) దిల్లీ
10. కామన్వెల్త్ దేశాల సభాపతుల 28వ సమావేశం ఎక్కడ జరిగింది?



   1) ముంబయి 2) న్యూదిల్లీ
   3) అమరావతి 4) చెన్నై
11. దేశంలో తొలి జీవ-సంతోష (బయో హ్యాపీ) జిల్లాగా నిలిచిన కెయిపన్యోర్ ఏ రాష్ట్రంలో ఉంది?
   1) అరుణాచల్‌ప్రదేశ్ 2) మణిపుర్
   3) మిజోరం 4) నాగాలాండ్
12. టైలర్ ప్రైజ్-2026 (పర్యావరణంలో నోబెల్ స్థాయి బహుమతిగా భావిస్తారు) ఎవరికి ప్రకటించారు?
   1) టోబీకీర్స్ 2) సాండ్రా డియాజ్
   3) ఎడ్వర్డో బ్రాంటిజియో 4) డేనియల్ పౌలీ
13. కింది వారిలో ఎవరికి 2026లో క్రీడల విభాగంలో పద్మభూషణ్ వచ్చింది?
   1) రోహిత్ శర్మ 2) విజయ్ అమృత్‌రాజ్
   3) భగవందాస్ రైక్వార్ 4) బాలదేవ్ సింగ్

నోట్: 2026 సంవత్సరానికి 13 మందికి పద్మభూషణ్ అవార్డులు వచ్చాయి.

2026 పద్మభూషణ్ అవార్డులు - 13		
పేరు	రంగం	రాష్ట్రం/దేశం
అల్కా యాగ్నిక్	కళలు	మహారాష్ట్ర
శ్రీ భగత్ సింగ్ కోశ్యారీ	ప్రజావ్యవహారాలు	ఉత్తరాఖండ్
కల్లిపట్టి రామసామి పళనిస్వామి	వైద్యం	తమిళనాడు
మమ్ముట్టి	కళలు	కేరళ
డా. నోరి దత్తాత్రేయుడు	వైద్యం	యూఎస్ఏ
పీయూష్ పాండే (మరణానంతరం)	కళలు	మహారాష్ట్ర
ఎస్‌కేఎం మెయిలానందన్	సామాజిక సేవ	తమిళనాడు
శతావధాని ఆర్.గణేశ్	కళలు	కర్ణాటక
శిబూ సోరెన్ (మరణానంతరం)	ప్రజావ్యవహారాలు	ఝార్ఖండ్
ఉదయ్ కొటక్	వాణిజ్యం-పరిశ్రమలు	మహారాష్ట్ర
వీకే మల్హోత్రా (మరణానంతరం)	ప్రజావ్యవహారాలు	దిల్లీ
వెల్లప్పల్లి నటేశన్	ప్రజావ్యవహారాలు	కేరళ
విజయ్ అమృత్‌రాజ్	క్రీడలు	అమెరికా


14. కింది వాటిలో సరైంది?
   ఎ) 2026 ఏడాదిలో మొత్తం 131 పద్మ అవార్డులు ప్రకటించారు.
   బి) 2026 సంవత్సరంలో 5 పద్మవిభూషణ్, 13 పద్మ భూషణ్, 113 పద్మశ్రీ పురస్కారాలు ప్రకటించారు.
   సి) 2026 పద్మ పురస్కారాల్లో 19 మంది మహిళలు ఉన్నారు.
   డి) 2026 పద్మ పురస్కారాల్లో 16 మందికి మరణానంతరం వచ్చింది.
   1) ఎ, బి, సి 2) బి, సి, డి
   3) ఎ, బి, సి, డి 4) ఎ, బి, డి
15. 67,800 సంవత్సరాల నాటి అతి పురాతన కళను చరిత్రకారులు ఏ దేశంలో గుర్తించారు?
   1) రష్యా 2) కెనడా
   3) ఇండోనేసియా 4) ఇండియా
16. అసంఘటిత రంగ కార్మికులకు ఉద్దేశించిన అటల్ పెన్షన్ యోజన (ఏపీవై) పథకాన్ని ఇంకా ఎన్నేళ్లు కొనసాగించాలని కేంద్ర కేబినెట్ నిర్ణయించింది?
   1) 10 2) 15 3) 5 4) 25

నోట్: 1) 2015, మే 9న ఈ పథకం ప్రారంభించారు.
2) 2026, జనవరి 19 నాటికి 8.66 కోట్ల మంది చందాదారులు ఈ పథకంలో చేరారు.
3) అసంఘటిత రంగంలో పనిచేసే కార్మికులకు 60 ఏళ్లు దాటాక పెన్షన్ అందాలనే ఉద్దేశంతో కేంద్రం ఈ పథకాన్ని తీసుకొచ్చింది.
4) ఈ పథకం కింద నెలకు రూ.1000 - రూ.5000 వరకు పింఛన్ అందుతుంది.
5) 18-40 మధ్య వయసున్నవారు దీనిలో చేరవచ్చు.

17. భారతీయ - అమెరికన్ వ్యోమగామి సునీతా విలియమ్స్ ఇటీవల పదవీ విరమణ చేశారు. అయితే ఆమె ఎన్ని రోజుల పాటు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో ఉన్నారు?
   1) 608 2) 700 3) 840 4) 630
18. ఏ రాష్ట్రంలో 'ఆపరేషన్ మేఘబురు' పేరిట నక్సలైట్, మావోయిస్ట్ నిర్మూలనకు భద్రతా దళాలు ఆపరేషన్ చేపట్టాయి?
   1) ఛత్తీస్‌గఢ్ 2) ఝార్ఖండ్
   3) తెలంగాణ 4) దిల్లీ

నోట్: ఆపరేషన్ బ్లాక్ ఫారెస్ట్ (ఆపరేషన్ కాగర్ అని కూడా అంటారు) అనేది ఛత్తీస్‌గఢ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య ఉన్న ప్రాంతంలో నక్సలైట్-మావోయిస్ట్‌లపై భారత భద్రతా దళాలు నిర్వహించిన ఆపరేషన్.

19. భారత రైల్వే ఏ రైల్వేస్టేషన్‌లో హ్యూమనాయిడ్ రోబో ఏఎస్‌సీ అర్జున్‌ను ఏర్పాటు చేసింది?



   1) కాకినాడ 2) పిఠాపురం
   3) విశాఖపట్నం 4) విజయవాడ
20. ఇటీవల మరణించిన మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్ ఏ నియోజకవర్గం నుంచి ఎనిమిది సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు?
   1) పుణె 2) దక్షిణ ముంబయి
   3) బారామతి 4) నాగ్‌పూర్
21. భారతదేశంలో జాతీయ పర్యాటక దినోత్సవాన్ని ఏ తేదీన నిర్వహిస్తారు?
   1) జనవరి 24 2) జనవరి 25
   3) జనవరి 27 4) జనవరి 28
22. ప్రతి జిల్లా నుంచి స్థానిక రుచికరమైన వంటకాలను ప్రాచుర్యంలోకి తీసుకురావడానికి ఏ రాష్ట్ర ప్రభుత్వం ఒక జిల్లా - ఒక వంటకం పథకాన్ని ప్రారంభించింది?
   1) తెలంగాణ 2) గోవా
   3) ఉత్తర్‌ప్రదేశ్ 4) కర్ణాటక
23. భారత్‌లో జరిగే టీ-20 పురుషుల ప్రపంచకప్‌లో బంగ్లాదేశ్ పాల్గొనకపోవడంతో ఆ దేశం స్థానంలో వచ్చిన జట్టు ఏది?
   1) కెన్యా 2) అంగోలా 3) స్కాట్లాండ్ 4) ఐర్లాండ్
24. దేశంలో తొలి ఇంటిగ్రేటెడ్ ప్రైవేట్ శాటిలైట్ ప్లాంట్‌కు ఇటీవల ఎక్కడ శంకుస్థాపన జరిగింది?
   1) గుజరాత్ 2) ఆంధ్రప్రదేశ్
   3) కర్ణాటక 4) కేరళ




రచయిత: బి. ధన్‌మోహన్ రెడ్డి

సమాధానాలు

1-3; 2-3; 3-1; 4-1; 5-4; 6-2; 7-1; 8-4; 9-3; 10-2; 11-1; 12-1; 13-2; 14-3; 15-3; 16-3; 17-1; 18-2; 19-3; 20-3; 21-2; 22-3; 23-3; 24-1.

చుట్టూ ఆవరించి ఉన్న పరిసరాల వ్యవస్థనే పర్యావరణ వ్యవస్థ అంటారు. ప్రాణుల మనుగడకు అవసరమయ్యే అన్ని పరిస్థితులు ఇందులో సహజ కారకాలుగా ఉంటాయి. పారిశ్రామికీకరణ, వ్యవసాయంలో పురుగుమందుల అధిక వినియోగం, ఆధునిక సాంకేతికత లాంటి మానవ చర్యల కారణంగా పర్యావరణానికి తీవ్ర నష్టం వాటిల్లుతోంది. ఫలితంగా జీవకోటికి ముప్పు ఏర్పడుతోంది. వీటిని అరికట్టి పర్యావరణాన్ని, అంతరిస్తోన్న జీవ జాతుల్ని రక్షించేందుకు ప్రభుత్వాలు అనేక కార్యక్రమాలు చేపట్టాయి. అందులో భాగంగానే జాతీయ ఉద్యానవనాలు, టైగర్ రిజర్వ్‌లు, అభయారణ్యాలు ఏర్పాటయ్యాయి. పోటీ పరీక్షల నేపథ్యంలో ఇటీవల వార్తల్లో నిలిచిన ముఖ్యమైన పర్యావరణ అంశాలు గురించి తెలుసుకోవడం అవసరం.



సరప్ చూ కన్జర్వేషన్ రిజర్వ్ (Tsarap Chu Conservation Reserve)

దీన్ని హిమాచల్ ప్రభుత్వం 2025, మే 7న అధికారికంగా ప్రకటించింది. ఇది స్పితి లోయలో 1585 చ.కి.మీ. విస్తీర్ణంలో ఉంది. వన్యప్రాణి సంరక్షణ చట్టం, 1972లోని సెక్షన్ 36A(1) ఆధారంగా దీన్ని కన్జర్వేషన్ రిజర్వ్‌గా గుర్తించారు. ఇది భారత్‌లోనే అతిపెద్ద కన్జర్వేషన్ రిజర్వ్‌గా పేరొందింది.

■ ఇందులో మంచు చిరుతలు అధికంగా ఉన్నాయి. వీటితో పాటు టిబెట్ తోడేళ్లు, బరాల్ (బ్లూ షీప్), హిమాలయన్ ఐబెక్స్, వైల్డ్ ఆస్ మొదలైనవి ఉన్నాయి. పక్షి జాతుల్లో రోజ్ ఫించ్, టిబెటన్ రావెన్, ఎల్లో బిల్డ్ చౌ మొదలైనవి ఉన్నాయి.

మహుదానర్ తోడేళ్ల అభయారణ్యం (Mahuadanr Wolf Sanctuary)

ఝార్ఖండ్‌లోని లతేహార్ జిల్లాలో 1976లో ఏర్పాటు చేశారు. భారతీయ తోడేళ్ల (కానిస్ లూపస్ పల్లిపెస్) జనాభాను పరిరక్షించేందుకు ప్రత్యేకంగా దీన్ని రక్షిత ప్రాంతంగా ప్రకటించారు. ఇది దేశంలోనే ఏకైక తోడేళ్ల అభయారణ్యంగా గుర్తింపు పొందింది.

■ పలామౌ టైగర్ రిజర్వ్‌లో భాగంగా ఈ అభయారణ్యం విస్తరించి ఉంది.

■ మహుదానర్ లోయ ప్రాంతంలో బుర్హానది ప్రవహిస్తుంది. ఈ ప్రాంతంలో నివసించే కొండ జాతుల ప్రజలు సర్నా ధర్మాన్ని ఆచరిస్తారు. ఇందులో ప్రకృతి ఆరాధన ప్రముఖంగా కనిపిస్తుంది.

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం
సైన్స్ అండ్ టెక్నాలజీ

అంతరిస్తోన్న జీవులను.. సంరక్షించే ఆవాసాలు!

ముఖ్యమైన పర్యావరణ వ్యవస్థలు

కజిరంగ నేషనల్ పార్క్ అండ్ టైగర్ రిజర్వ్

ఇది అస్సాంలో ఉంది. 1974, ఫిబ్రవరి 11న ప్రభుత్వం దీన్ని జాతీయ ఉద్యానవనంగా ప్రకటించింది. 2006లో టైగర్ రిజర్వ్‌గా గుర్తించింది.

❖ ఇటీవల ఈ పార్క్‌లో మొదటిసారిగా గడ్డి మైదాన పక్షుల ధ్వని ఆధారిత జనగణన (ఎకౌస్టిక్ మానిటరింగ్) ద్వారా పక్షుల గణన చేపట్టారు. ఈ ప్రక్రియ ద్వారా ఆయా ఆవరణ వ్యవస్థల్లో అంతరించిపోతున్న పక్షులను గుర్తిస్తారు. ఆయా పక్షి జాతుల ఉనికి, వైవిధ్యం, ఆవాసం, వాటి క్షీణతను అంచనా వేస్తారు.

❖ ఏవియన్ జాతికి (Avian Species) చెందిన గడ్డి మైదాన పక్షులు గడ్డి ఆవాసాల్లో విస్తరించి ఉంటాయి. ఇవి ఆయా ఆవరణ వ్యవస్థల పరిరక్షణ స్థాయిలను అంచనా వేసేందుకు కావాల్సిన సూచికలుగా (ఇండికేటర్స్) వ్యవహరిస్తాయి.

ఉదా: బెంగాల్ ఫ్లోరికాన్, ఇండియన్ కర్సర్, గ్రేట్ ఇండియన్ బస్టర్డ్ మొదలైనవి.

☛ ఆయా ఆవరణ వ్యవస్థల్లో సంభవించే వాతావరణ మార్పులు లేదా ఆవరణ వ్యవస్థల క్షీణత వల్ల ఈ పక్షులు అంతరించే ప్రమాదంలో ఉన్నాయి. అందుకే వీటిని కాపాడుకోవడం తప్పనిసరైంది. గతంలో వీటిని సంప్రదాయ దృశ్య గణన ప్రక్రియ ద్వారా లెక్కించేవారు. ఎకౌస్టిక్ మానిటరింగ్‌లో మరింత ప్రభావవంతమైన ఫలితాలు ఉంటాయనే ఉద్దేశంతో ఈసారి ఈ పద్ధతిలో గణన చేపట్టారు.

☛ ఈ ప్రక్రియలో మెషిన్ లెర్నింగ్ పరికరాల ఆధారంగా 'బర్డ్ నెట్'ను ఉపయోగించి ఆయా పక్షుల కూతలు, రికార్డెడ్ ఆడియోల ద్వారా స్పెక్ట్రోగ్రామ్‌లను విశ్లేషిస్తారు. ఈ విధానంలో అత్యంత అరుదుగా కనిపించే పక్షులను కూడా గుర్తించవచ్చు.

☛ బ్రహ్మపుత్ర నది మైదానాలకే పరిమితమైన అత్యంత అరుదైన 'ఫిన్స్ వీవర్' జాతి పక్షులను ఇలానే కనుక్కున్నారు. కజిరంగ ప్రాంతంలోని పక్షుల ఆవాస ప్రాంతాన్ని 'బర్డ్ ఇంటర్నేషనల్' సంస్థ 'ఇంపార్టెంట్ బర్డ్ ఏరియా'గా గుర్తించింది.

సాల్ఖాన్ ఫాసిల్ పార్క్/ సోనభద్ర ఫాసిల్ పార్క్

ఉత్తర్ ప్రదేశ్‌లో ఉంది. 2002, ఆగస్టు 8న ఏర్పాటు చేశారు. ఇందులో ప్రొటెరోజోయిక్ కాలానికి (2.5 బిలియన్ నుంచి 541 మిలియన్ సంవత్సరాల కాలం) చెందిన స్ట్రోమాటోలైట్ల అవశేష నిర్మాణాలు ఉన్నాయి.

▼ 2025లో ఇది యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశాల తాత్కాలిక జాబితా (UNESCO's tentative list of World Heritage Sites)లో చోటు సంపాదించింది.

▼ ఇంటర్నేషనల్ యూనియన్ ఫర్ కన్జర్వేషన్ ఆఫ్ నేచర్ (ఐయూసీఎన్) 2020 మార్గదర్శకాలు (ఎవల్యూషన్ ఆఫ్ లైఫ్) అనుగుణంగా ఉండటం వల్ల దీని 'జియో హెరిటేజ్ సైట్'గానూ గుర్తింపు పొందింది.

▼ అలాగే యునెస్కో 2021 మార్గదర్శకాలైన 'ఎర్త్ హిస్టరీ అండ్ లైఫ్ ఎవల్యూషన్' ప్రమాణాల ఆధారంగా 'యునెస్కో ప్రపంచ వారసత్వ సంపద'గా పేరొందింది.

సుందర్బన్స్ టైగర్ రిజర్వ్

ప్రాజెక్ట్ టైగర్‌లో భాగంగా 1973లో పశ్చిమ బెంగాల్‌లో దీన్ని ఏర్పాటు చేశారు. 1984, మే 4న దీన్ని జాతీయ ఉద్యానవనంగా ప్రకటించారు. 1987లో ఇది యునెస్కో వారసత్వ ప్రదేశంగా గుర్తింపు పొందింది. 2019 నుంచి రామ్‌సర్ సైట్‌గా ఉంది.

◆ నేషనల్ బోర్డ్ ఫర్ వైల్డ్ లైఫ్ సంస్థ సుందర్బన్స్ టైగర్ రిజర్వ్‌ను భారతదేశంలోనే రెండో అతిపెద్ద టైగర్ రిజర్వ్‌గా (3,629.57 చ.కి.మీ.) గుర్తింపు ఇచ్చింది. మన దేశంలో విస్తీర్ణపరంగా అతిపెద్ద టైగర్ రిజర్వ్ 'నాగార్జునసాగర్ - శ్రీశైలం టైగర్ రిజర్వ్' (3,728 చ.కి.మీ.).

◆ గతంలో విస్తీర్ణపరంగా సుందర్బన్ టైగర్ రిజర్వ్ ఏడో స్థానంలో ఉంది. ఈ పార్క్ విస్తీర్ణాన్ని పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం 2025, ఆగస్టులో పెంచడం ద్వారా రెండో స్థానానికి ఎగబాకింది. వైల్డ్ లైఫ్ ప్రొటెక్షన్ యాక్ట్ 1972 సెక్షన్ 38V ఆధారంగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ◆ ప్రపంచంలోనే అత్యధిక సంఖ్యలో పులుల జనాభా కలిగిన మడ అడవిగానూ సుందర్బన్స్ గుర్తింపు పొందింది.

దుద్వా టైగర్ రిజర్వ్

ఉత్తర్ ప్రదేశ్‌లో ఉన్న దీన్ని ప్రభుత్వం 1977లో జాతీయ ఉద్యానవనంగా ప్రకటించింది. 1987లో టైగర్ రిజర్వ్‌గా మార్చింది.

▲ ఈ టైగర్ రిజర్వ్‌లో 2022లో 92గా ఉన్న పులుల సంఖ్య 2025 నాటికి 275కి చేరింది. వృద్ధి 198.91 శాతంగా నమోదైంది. ఈ ప్రాంతంలో చేపట్టిన పరిరక్షణ కార్యక్రమాలు, ఆవాస నిర్వహణ మొదలైనవి వృద్ధికి ప్రధాన కారణాలుగా ఉన్నాయి.

▲ దుద్వా టైగర్ రిజర్వ్‌లో 2025 జూన్‌లో మూడు రోజుల పాటు నిర్వహించిన 'అక్యులర్ సర్వే' ఆధారంగా పులుల గణన చేశారు.

▲ యూనివర్సిటీ ఆఫ్ లక్నో ఈ టైగర్ రిజర్వ్‌లో అధ్యయనం చేసి సీతాకోక చిలుకల జాతులు 45 నుంచి 110కి పెరిగినట్లు పేర్కొంది. ఇందులో మొత్తం 180 జాతుల సీతాకోక చిలుకలు ఉన్నట్లు అంచనా వేసింది.

సిమ్లిపాల్ నేషనల్ పార్క్

ఒడిశాలోని మయూర్‌భంజ్ ప్రాంతంలో ఉంది. 1979లో వన్యప్రాణుల అభయారణ్యంగా ప్రకటించారు. 1980లో నేషనల్ పార్క్‌గా మార్చారు.

● 845.70 చ.కి.మీ. విస్తీర్ణంతో ఒడిశాలో రెండో అతిపెద్ద నేషనల్ పార్క్‌గా గుర్తింపు పొందింది. ఇందులో 40 రాయల్ బెంగాల్ టైగర్లు ఉన్నాయి. ఒడిశాలోని మొత్తం ఏనుగుల జనాభాలో దాదాపు 25 శాతంతోపాటు 104 ఆర్కిడ్ జాతులు, అనేక స్వదేశీ జీవులకు ఇది ఆవాసంగా ఉంది.

● ఈ ఉద్యానవనంలో సాల్ వృక్షాలు, తడి ఆకురాల్చే వృక్ష జాతులు, సమశీతోష్ణ సతత హరిత వృక్షాలు మొదలైనవి ఉన్నాయి.

సహ్యాద్రి టైగర్ రిజర్వ్

ఇది మహారాష్ట్రలో ఉంది. 2010 జనవరి 5న దీన్ని అధికారికంగా టైగర్ రిజర్వ్‌గా ప్రకటించారు. కోయినా వన్యప్రాణుల అభయారణ్యం, చాందోలీ జాతీయ ఉద్యానవనాన్ని కలిపి 1,165.57 చ.కి.మీ. విస్తీర్ణంలో ఈ రక్షిత ప్రాంతాన్ని ఏర్పాటు చేశారు.

◗ భారత పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ 'వైల్డ్ లైఫ్ ప్రొటెక్షన్ యాక్ట్ 1972' ప్రకారం తడోబా అంధారి టైగర్ రిజర్వ్, పెంచ్ టైగర్ రిజర్వ్‌ల నుంచి 8 పులులను సహ్యాద్రి టైగర్ రిజర్వ్ ప్రాంతానికి తరలించటానికి 2025, సెప్టెంబరులో అనుమతి ఇచ్చింది. వీటిలో మూడు మగ, ఐదు ఆడవి.

◗ పశ్చిమ కనుమల్లోని ఉత్తర ప్రాంతంలో అంతరించిపోతున్న పులుల సంఖ్యను పెంచడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం.

◗ భారతదేశంలో పులుల తరలింపు (ట్రాన్స్ లోకేషన్ ఆఫ్ టైగర్స్) కార్యక్రమాన్ని 2005లో ఏర్పాటైన 'నేషనల్ టైగర్ కన్జర్వేషన్ అథారిటీ' నిర్వహిస్తుంది.

◗ సహ్యాద్రి టైగర్ రిజర్వ్‌లో అంజని, జంబుల్, పిసా మొదలైన వృక్షజాతులు ఉండగా; వైల్డ్ డాగ్, చిరుతలు, గౌర్, నాలుగు కొమ్ముల కలిగిన ఆంటిలోప్స్, మౌస్ డీర్, జెయింట్ స్క్విరల్ మొదలైన జంతు జాతులు ఉన్నాయి.

◗ కోయినా నదిపై నిర్మించిన శివ సాగర్ రిజర్వాయర్, వర్ల నదిపై కట్టిన వసంత సాగర్ రిజర్వాయర్లు ఈ ప్రాంతంలోనే ఉన్నాయి.



రచయిత
రేమల్లి సౌజన్య
విషయ నిపుణులు

Word of the Day

913

Apprehend

Telugu meaning: అర్థం చేసుకోవడం, పట్టుకోవడం

English meaning: The word 'apprehend' (అప్రెహెండ్) is a verb that means to understand something or to arrest someone by legal authority.

Synonyms: Understand, Grasp; ***Antonyms:*** Misunderstand, Release

Usage: 1. It took him several readings to apprehend the complex legal document fully.

2. The police were able to apprehend the thief after a long and careful investigation.

పోటీ పరీక్షల్లో వర్తమాన అంశాలు ఎంతో కీలకం. ఈనాడు ఈప్రతిభ వెబ్‌సైట్/ యాప్ 'మంత్లీ కరెంట్ అఫైర్స్'ను వీడియో రూపంలో యూట్యూబ్ ఛానెల్‌లో అందుబాటులో ఉంచింది. వీటితోపాటు జనరల్ స్టడీస్ సంబంధించిన మరిన్ని పాఠాలూ ఉన్నాయి. టాపిక్‌పై అవగాహన పెంచుకోవడానికి, సులభంగా నేర్చుకోవడానికి ఇవి మీకు సాయం చేస్తాయి.

☛ కన్ఫ్యూజ్ చేసే ప్రశ్నలకు పోల్స్ రూపంలో క్లారిటీ ఇస్తూ.. క్విజ్‌లతోపాటు జాబ్ నోటిఫికేషన్స్ సమాచారాన్ని రీల్స్‌గా... ముఖ్యమైన జనరల్ నాలెడ్జ్ కంటెంట్‌ను షార్ట్స్ రూపంలో అందిస్తూ మీ సన్నద్ధతకు తోడుగా, సరైన సమాచారానికి వేదికగా ఈనాడు ఈప్రతిభ యూట్యూబ్ ఛానెల్ నిలుస్తోంది. మీరు జాబ్ కొట్టాలని బలంగా కోరుకుంటే ఇప్పుడే మా ఛానెల్‌ను సబ్‌స్క్రైబ్ చేసుకోండి.

నోటిఫికేషన్స్

బీఈసీఐఎల్‌లో ఉద్యోగాలు

నోయిడాలోని బ్రాడ్ కాస్ట్ ఇంజినీరింగ్ కన్సల్టెంట్స్ ఇండియా లిమిటెడ్ (బీఈసీఐఎల్) ఒప్పంద ప్రాతిపదికన వివిధ విభాగాల్లో జూనియర్ టెక్నీషియన్, ఏఈ, సెక్యూరిటీ ఆఫీసర్ మొదలైన పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. మొత్తం పోస్టుల సంఖ్య 154. దరఖాస్తు ఫీజు రూ.295. అర్హులైన అభ్యర్థులు 2026 ఫిబ్రవరి 18లోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.

తెలంగాణ హైకోర్టులో ఉద్యోగాలు

తెలంగాణ హైకోర్టు (టీజీహెచ్‌సీ) డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన ఆఫీస్ సబార్డినేట్, డ్రైవర్ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. మొత్తం పోస్టుల సంఖ్య 43. దరఖాస్తు ఫీజు రూ.500. అర్హులైన అభ్యర్థులు 2026 ఫిబ్రవరి 28లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

దరఖాస్తు చేశారా..? కింది ఉద్యోగాలకు నేడే (ఫిబ్రవరి 6) చివరి తేదీ

☛ నాబార్డ్ కన్సల్టెన్సీ సర్వీస్‌లో ప్రాజెక్ట్ అసిస్టెంట్ ఉద్యోగాలు. బ్యాచిలర్ డిగ్రీ, మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం ఉన్నవారు అర్హులు.


☛ ఎన్ఐవీలో రిసెర్చ్ అసోసియేట్-1 ఉద్యోగాలు. పీహెచ్‌డీతో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉన్నవారు అర్హులు.

పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

శాస్త్రవేత్తలు విశేషాలు

జోసెఫ్ ప్రీస్ట్‌లీ

ఈయన ఇంగ్లండ్‌కు చెందిన ప్రముఖ భౌతిక, రసాయన శాస్త్రవేత్త. ప్రయోగాత్మక రసాయనశాస్త్రం (experimental chemistry), విద్యుత్ - వాయువుల రసాయనశాస్త్ర రంగంలో చేసిన పరిశోధనలతో జోసెఫ్ ప్రీస్ట్‌లీ ప్రసిద్ధి చెందారు. ఆక్సిజన్, కార్బన్ డైఆక్సైడ్ లాంటి వాయువులను కనుక్కోవడంతోపాటు వాటిని ప్రయోగాలతో కృత్రిమంగా తయారు చేశారు. 150 కంటే ఎక్కువ పరిశోధన పత్రాలను ప్రచురించారు. ఆధునిక రసాయనశాస్త్రానికి పునాది వేసిన ముఖ్యుల్లో ఒకరిగా నిలిచారు. ఫిబ్రవరి 6న జోసెఫ్ వర్ధంతి సందర్భంగా ఆయన జీవితంలోని ముఖ్య విషయాల గురించి తెలుసుకుందాం..!



బాల్యం - వృత్తి జీవితం

జోసెఫ్ ప్రీస్ట్‌లీ 1733, మార్చి 24న ఇంగ్లండ్‌లోని బిర్‌స్టాల్‌లో జన్మించారు. చిన్నతనం నుంచే ఆయన తెలివైనవాడిగా అందరిలో గుర్తింపు పొందారు.

■ మొదట స్థానిక పాఠశాలలో చేరి గ్రీక్, లాటిన్, హిబ్రూ నేర్చుకున్నారు. అదే సమయంలోనే ఆయనకు సైన్స్ విషయాల పట్ల ఆసక్తి కలిగింది.

■ 1749లో ఆయన తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. దీంతో ఇంటికే పరిమితం కావాల్సి వచ్చింది. అప్పుడు యార్క్‌షైర్‌లోని హెక్మండ్‌వైక్ కాంగ్రిగేషనల్ మినిస్టర్ అయిన రెవరెండ్ జార్జ్ హాగర్‌స్టన్ ఈయనకు గణితం, సహజ తత్వశాస్త్రం, తర్కం, మెటాఫిజిక్స్‌లో శిక్షణ ఇచ్చారు. ఆయన జోసెఫ్‌కు జాన్ లాక్ (ప్రముఖ ఆంగ్ల తత్వవేత్త), ఐజాక్ వాట్స్ (వేదాంతవేత్త), విల్లెం గ్రేవ్‌సాండే (గణిత శాస్త్రవేత్త) లాంటి ప్రముఖుల రచనలను ఇచ్చారు. అవి జోసెఫ్‌పై ఎంతో ప్రభావం చూపాయి.

జోసెఫ్ ప్రీస్ట్‌లీ చేసిన ముఖ్యమైన పరిశోధనలు - ఆవిష్కరణలు, పొందిన గౌరవాలు, గతంలో అడిగిన ప్రశ్నలు - జవాబుల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

ఇండియన్ ఎకానమీ

మౌలిక వసతులు - పట్టణాల ఆర్థికాభివృద్ధి

గ్రామీణ ప్రాంతాల నుంచి అధిక జనాభా పట్టణాలకు వలస వెళ్లడాన్ని పట్టణీకరణగా పేర్కొంటారు. అభివృద్ధి ప్రక్రియలో ఇది ఒక పరిణామం. పట్టణాలు, వాటి చుట్టుపక్కల ప్రాంతాల్లో అధిక పారిశ్రామికీకరణ, సాంకేతిక ప్రగతి సాధ్యమవుతాయి. దీంతో వ్యవసాయ రంగంలోని మిగులు శ్రామికులు ఉపాధి కోసం పట్టణాల బాట పడుతున్నారు. పట్టణీకరణ వేగవంతం కావడానికి ఇదే కారణం. నగరాలు నానాటికీ విస్తరిస్తుండటంతో అందులో నివసించే ప్రజలకు మౌలిక వసతులు కల్పించడం, అవసరాలు తీర్చడం అంతే ముఖ్యం. ఇందుకోసమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టణాల అభివృద్ధికి వివిధ కార్యక్రమాలు, పథకాలను ప్రవేశపెడుతున్నాయి. వీటి గురించి పోటీపరీక్షార్థులు తెలుసుకోవడం అవసరం.



మార్టిన్ అండర్సన్ విశ్లేషణ

"పట్టణీకరణ అంటే ప్రజలు నగరాలకు వలస వెళ్లడమే కాదు.. వారి దృక్పథాలు, విశ్వాసాలు, విలువలు, ప్రవర్తనల్లో మార్పులు సంభవించడం." - అమెరికా ఆర్థికవేత్త మార్టిన్ అండర్సన్

✦ పట్టణీకరణకు ఐదు లక్షణాలు ఉంటాయని అండర్సన్ వివరించారు. అవి: 1. ద్రవ్య ఆర్థిక వ్యవస్థ 2. పౌర పరిపాలన 3. సాంకేతిక మార్పులు 4. లిఖిత రికార్డులు 5. నవకల్పనలు

పట్టణీకరణ – ఆర్థికాభివృద్ధి

పట్టణీకరణ, ఆర్థికాభివృద్ధి మధ్య సన్నిహిత సంబంధం ఉంటుంది. తలసరి ఆదాయం, జీవన ప్రమాణాల్లో పెరుగుదలను ఆర్థికాభివృద్ధి సూచిస్తుంది.

ప్రభుత్వ పథకాలు/ కార్యక్రమాలు - హృదయ్, అమృత్, పీఎంఏవైయూ, స్వచ్ఛభారత్ మిషన్, నేషనల్ స్మార్ట్ గ్రిడ్ మిషన్, జాతీయ పట్టణ జీవనోపాధి మిషన్, జేఎన్ఎన్‌యూఆర్ఎం, స్మార్ట్ సిటీస్ మిషన్ మొదలైన అంశాలతోపాటు పూర్తి సమాచారం ఈనాడు ఈప్రతిభ వెబ్‌సైట్‌లో 'జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సుల్లో ఈ-బుక్ రూపంలో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Current Affairs

The Padma Awards were instituted in...

1. Which of the following statements is correct regarding India's first 'State Bacterium' initiative?

A) Tamil Nadu is set to become the first state to declare a state bacterium to promote biotechnology.

B) Kerala is set to become the first state in India to declare a state bacterium to highlight the importance of beneficial microbes.

C) The Central Government has declared a national bacterium under the Ministry of Health.

D) Maharashtra declared a state bacterium focusing on industrial fermentation.

2. Which of the following statements is correct regarding the One District One Product (ODOP) initiative?

A) ODOP was launched to replace large-scale industries with imports.

B) The initiative focuses only on agricultural crops and excludes handicrafts.

C) ODOP is a centrally sponsored scheme launched in 2024.

D) The One District One Product (ODOP) initiative has completed 8 years by promoting traditional industries and local products.

3. Which of the following statements is correct regarding the Padma Awards in India?

A) The Padma Awards were instituted in 1954, initially as a single category, and were restructured in 1955 into three levels; 131 Padma Awards were approved on the event of Republic Day 2026.

B) The Padma Awards were started in 1962 and have always existed in four categories.

C) The awards are announced only once every five years by the Prime Minister.

D) The Padma Awards are conferred exclusively for achievements in sports.

SSC Exams Special

General Awareness

History

4. Which of the following statements correctly describes the Pushyabhuti (Vardhana) dynasty?

A) It ruled Southern India with its capital at Kanchipuram and declined after the Chalukyas.

B) Its core territory lay in present-day Bengal, with Pataliputra as its capital.

C) It emerged during the Mauryan period and reached its peak under Samudragupta.

D) It ruled Northern India in the 6th–7th centuries with Sthanishvara (Thaneshwar) as its capital and reached its zenith under Harsha Vardhana.

5. Which of the following statements correctly describes Fatehpur Sikri?

A) Fatehpur Sikri, located near Agra in Uttar Pradesh, was built by Mughal Emperor Akbar between 1571 and 1585 and was declared a UNESCO World Heritage Site in 1986.

B) Fatehpur Sikri was constructed by Jahangir in the early 17th century and declared a World Heritage Site in 1978.

C) It is located in Delhi and was built during the reign of Shah Jahan.

D) Fatehpur Sikri was primarily a British-era administrative town near Agra.

6. Which of the following statements correctly describes the Battle of Wandiwash?

A) It was fought in Arcot in 1757 during the Second Carnatic War.

B) It was fought at Vandavasi (Wandiwash) in Tamil Nadu in 1760 during the Third Carnatic War, where the British defeated the French.

C) It was a naval battle between the British and the Dutch in 1764.

D) It marked a French victory that strengthened their control over the Carnatic region

Polity

7. Which of the following features of the Indian Constitution is most closely associated with the existence of the All India Services?

A) Unitary bias of the Constitution

B) Federal structure with a strong Centre

C) Parliamentary form of government

D) Secular character of the State

8. Which of the following statements correctly describes the concept of martial law?

A) Martial law is clearly defined and codified in the Indian Constitution.

B) Martial law refers to suspension of ordinary law and administration by military tribunals, though it is not defined in the Constitution.

C) Martial law can be imposed only during a National Emergency under Article 352.

D) Martial law is equivalent to President's Rule in a State.

General Science

9. Which of the following statements correctly describes the functions or movements of different cell types?

A) White blood cells move by amoeboid movement using pseudopodia to cross capillary walls by diapedesis.

B) Red blood cells use pseudopodia to engulf pathogens at infection sites.

C) Guard cells transport oxygen in plants through stomata.

D) Red blood cells control the opening and closing of stomata.

Scan the QR code for Key

These model questions were prepared by subject experts.



సంతకాల వేళ నాగాలాండ్ సంప్రదాయ వేషధారణలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా

నాగాలాండ్ త్రైపాక్షిక ఒప్పందంపై సంతకం

దిల్లీ: తూర్పు నాగాలాండ్ సమస్యల పరిష్కారంలో భాగంగా 'ఫ్రంటియర్ నాగాలాండ్ టెరిటోరియల్ అథారిటీ' (ఎఫ్ఎన్‌టీఏ) ఏర్పాటుకు నాగాలాండ్ ప్రభుత్వం, ఈస్టర్న్ నాగాలాండ్ పీపుల్స్ ఆర్గనైజేషన్లతో కలిసి గురువారం కేంద్ర ప్రభుత్వం ఓ త్రైపాక్షిక ఒప్పందంపై సంతకాలు చేసింది. రాష్ట్రంలో కొత్త పాలనావ్యవస్థ ఏర్పాటుకు ఈ డిమాండు చాలాకాలంగా వినిపిస్తూ వచ్చింది. నాగాలాండ్ ముఖ్యమంత్రి నెఫ్యూ రియో, కేంద్ర హోంమంత్రి అమిత్ షాల సమక్షంలో ఈ సంతకాలు జరిగాయి. మినీ సచివాలయంతో ఆరు జిల్లాల సమస్యల పరిష్కారంపై ఈ ఒప్పందం ప్రత్యేకదృష్టి పెట్టనుంది.

ఆన్‌లైన్ అక్రమ ఫార్మసీల గుట్టురట్టు

న్యూయార్క్: భారత్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న అంతర్జాతీయ ఆన్‌లైన్ అక్రమ ఫార్మసీ ముఠాపై అమెరికా ఫెడరల్ అధికారులు ఉక్కుపాదం మోపారు. వాటిద్వారా ప్రాణాంతక ఔషధాలను విక్రయిస్తున్న సుమారు 200కుపైగా వెబ్‌సైట్ డొమైన్లను అమెరికా డ్రగ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అడ్మినిస్ట్రేషన్ (డీఈఏ) సీజ్ చేసింది. ఆపరేషన్ మెల్ట్‌డౌన్ పేరిట డీఈఏ చేపట్టిన ఈ దాడుల్లో నలుగురు నిందితులను అరెస్టు చేయడంతోపాటు పలువురికి నోటీసులు జారీ చేశారు. ఈ ముఠాలు వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండానే లక్షల ఆర్డర్లను అమెరికా వినియోగదారులకు చేరవేస్తున్నట్లు దర్యాప్తులో తేలింది.

కశ్మీర్ పాక్‌లో అంతర్భాగం అవుతుంది: షెహబాజ్ షరీఫ్

ఇస్లామాబాద్: కశ్మీర్ విషయంలో పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ప్రేలాపనలు చేశారు. ఈ ప్రాంతం తమ దేశంలో అంతర్భాగం అవుతుందన్నారు. కశ్మీర్ సంఘీభావ దినోత్సవం సందర్భంగా ముజఫ్ఫరాబాద్‌లోని పీవోకే అసెంబ్లీని ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. గతేడాది మే నెలలో ఇరు దేశాల మధ్య జరిగిన ఘర్షణల అనంతరం.. కశ్మీర్ వివాదం దౌత్యపరంగా మళ్లీ రాజుకుందని చెప్పారు. భారత్ ఉగ్రవాదాన్ని పరోక్షంగా ఎగదోస్తోందంటూ నోరు పారేసుకున్నారు. "కశ్మీర్ ప్రజల ఆకాంక్షలను గౌరవించడం, ఐరాస భద్రతా మండలి తీర్మానాలను అమలుచేయడమే.. జమ్మూకశ్మీర్ వివాదానికి సరైన పరిష్కారం. మేం శాంతి స్థాపనను కోరుకుంటున్నాం. కశ్మీర్‌ను పాకిస్థాన్ జీవనాడిగా జిన్నా ప్రకటించారు. అది ఇప్పటికీ మా విదేశాంగ విధానానికి ఆధారంగా ఉంది" అని షరీఫ్ తెలిపారు. భారత్ బలగాల చేతిలో హతమైన హిజ్బుల్ కమాండర్ బుర్హాన్ వానీ, వేర్పాటువాద నేత సయ్యద్ అలీ గిలానీ తదితరుల పేర్లను పాక్ ప్రధాని ప్రస్తావించడం గమనార్హం.

'జడ్జీల నియామకాల ప్రక్రియ పునర్వ్యవస్థీకరణ పరిశీలనలో ఉంది'

దిల్లీ: అత్యున్నత స్థాయి జడ్జీల నియామక ప్రక్రియ పునర్వ్యవస్థీకరణ పరిశీలనలో ఉందని గురువారం రాజ్యసభలో కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్‌వాల్ తెలిపారు. అఖిల భారత జ్యుడీషియల్ సర్వీస్ ఏర్పాటు ఎలా ఉండాలన్న దానిపై చర్చలు జరుగుతున్నాయని వివరించారు.

ఎయిరిండియా విమానం ల్యాండింగ్ విఫలం

- మరోసారి గాల్లోకి తీసుకెళ్లిన పైలట్
- రెండో యత్నంలో సఫలం

జైపుర్: ముంబయి నుంచి జైపుర్ విమానాశ్రయానికి వచ్చిన ఓ ఎయిరిండియా విమానానికి ల్యాండింగ్ సమయంలో ఇబ్బంది ఎదురైంది. దీంతో మళ్లీ గాల్లోకి లేచి కాసేపు చక్కర్లు కొట్టింది. అయితే రెండో ప్రయత్నంలో విమానం సురక్షితంగా ల్యాండ్ అయ్యింది. ఏఐ-2781 విమానం గురువారం జైపుర్ అంతర్జాతీయ విమానాశ్రయానికి వచ్చింది. ల్యాండింగ్ సమయంలో పైలట్ ప్రామాణిక వేగం, ఎత్తును అనుసరించలేకపోవడంతో(అన్‌స్టేబుల్ అప్రోచ్) విమానం రన్‌వేకు తాకిన తర్వాత మళ్లీ గాల్లోకి తీసుకెళ్లాడు. సుమారు 10 నిమిషాలు చక్కర్లు కొట్టిన తర్వాత విమానాన్ని సురక్షితంగా ల్యాండ్ చేసినట్లు అధికారులు తెలిపారు.

72 శాతం ఎయిరిండియా విమానాల్లో తరచూ లోపాలు

ముంబయి: ఎయిరిండియాకు చెందిన దాదాపు 72 శాతం విమానాల్లో పదే పదే సాంకేతిక లోపాలు కనిపిస్తున్నట్లు ప్రభుత్వ గణాంకాలు చెబుతున్నాయి. మరోవైపు ఇండిగోకు సంబంధించి సుమారు 33 శాతం విమానాల్లో ఈ పరిస్థితి ఉన్నట్లు ప్రభుత్వ నివేదిక చెబుతోంది. గతేడాది జనవరి నుంచి చేపట్టిన తనిఖీల ఆధారంగా ఈ నివేదికను రూపొందించినట్లు ప్రభుత్వం తెలిపింది. ఈ నివేదికను గురువారం లోక్‌సభకు సమర్పించారు.

ఫ్లాట్‌ను లీజుకు ఇచ్చినంతమాత్రాన 'వినియోగదారు' కాదనలేం: సుప్రీంకోర్టు



దిల్లీ: రెసిడెన్షియల్ ఫ్లాటును లీజు/అద్దెకు ఇచ్చినంత మాత్రాన.. దాని కొనుగోలుదారు 'వినియోగదారుడు' నిర్వచనం పరిధిలోకి రాకుండా పోడని సుప్రీంకోర్టు పేర్కొంది. వినియోగదారుల పరిరక్షణ చట్టం కింద తను కూడా హక్కులు కలిగి ఉంటాడని స్పష్టం చేసింది. వినిత్ బహ్రీ అనే వ్యక్తి 2005లో ఎంజీఎఫ్ డెవలపర్స్ లిమిటెడ్ అనే స్థిరాస్తి గ్రూపు గురుగ్రామ్ సెక్టార్-25లో ప్రారంభించిన హౌజింగ్ ప్రాజెక్టులో ఫ్లాట్ కొనుగోలు చేశారు. 2005 మార్చిలో రూ.15 లక్షలు చెల్లించడంతో.. అదే ఏడాది సెప్టెంబరు 2న ఆ ప్రాజెక్టు టవర్-సి గ్రౌండ్‌ఫ్లోర్‌లోని ఓ యూనిట్‌ను ఆయనకు కేటాయించారు. అనంతరం స్థిరాస్తి గ్రూపు లేఅవుట్ ప్లాన్‌ను మార్చి.. తనను పలు దఫాలు అదనపు డబ్బు డిమాండ్ చేసినట్లు వినిత్ ఆరోపించారు. తీవ్ర నిరసన తెలుపుతూ తాను అదనపు సొమ్ము చెల్లించానని.. ఎట్టకేలకు 2015 జనవరి 8న తనకు ఫ్లాట్ అప్పగించారని తెలిపారు. ఫ్లాట్ అప్పగింతలో జాప్యం చేయడంతో పాటు అదనపు డబ్బు అడిగినందుకు తనకు పరిహారం ఇప్పించాలని వినిత్ జాతీయ వినియోగదారుల వివాద పరిష్కార కమిషన్ (ఎన్‌సీడీఆర్‌సీ)ను ఆశ్రయించారు. అయితే ఆయన వాణిజ్యపరమైన వినియోగం కోసం ఫ్లాట్ కొనుగోలు చేశారని, 2015 మార్చి నుంచే వేరేవారికి దాన్ని అద్దెకు ఇచ్చారని బిల్డర్ (స్థిరాస్తి గ్రూపు) ఆరోపించారు. కాబట్టి వినిత్ 'వినియోగదారుడు' అనే నిర్వచనం పరిధిలోకి రారని, ఆయన పిటిషన్‌ను కొట్టివేయాలని కోరారు. దీంతో- వినిత్ పిటిషన్‌ను ఎన్‌సీడీఆర్‌సీ తోసిపుచ్చింది. దీనిపై ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించగా.. జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్ర, జస్టిస్ ఎన్.వి.అంజారియాల ధర్మాసనం విచారణ నిర్వహించింది. ఫ్లాట్ కొనుగోలు వెనుక వినిత్ ప్రధాన ఉద్దేశం వాణిజ్యపరమైన వినియోగమేనని బిల్డర్ బలమైన ఆధారాలు చూపించకున్నా ఎన్‌సీడీఆర్‌సీ తొందరపడి పిటిషన్‌ను కొట్టివేసిందని అభిప్రాయపడింది. ఫ్లాటును లీజు/అద్దెకు ఇచ్చినంత మాత్రాన దాని కొనుగోలుదారుకు 'వినియోగదారు' హక్కులు వర్తించవనడం సరికాదని పేర్కొంది. ఈ కేసును చట్టప్రకారం మరోసారి పరిశీలించాలని ఎన్‌సీడీఆర్‌సీని బుధవారం ఆదేశించింది. వినిత్ వాణిజ్య వినియోగం కోసం లేదా తిరిగి అమ్మేందుకే ఫ్లాట్ తీసుకున్నారని పక్కాగా నిరూపించాల్సిన బాధ్యత బిల్డర్‌దేనని స్పష్టం చేసింది.

నిందితులకు ముందే న్యాయ సహాయం అందాలి

క్రిమినల్ కేసుల్లోని నిందితులు సొంతంగా న్యాయవాదిని నియమించుకోలేకపోతే అలాంటి వారికి విచారణ ప్రారంభానికి ముందే కోర్టులు న్యాయ సహాయం అందించాలని సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది. కోర్టు సమకూర్చిన న్యాయవాది ద్వారా విచారణ మొదలుకావడానికి ముందే నిందితుల స్పందనను నమోదు చేయాలని జస్టిస్ సంజయ్‌కుమార్, జస్టిస్ కె.వినోద్‌చంద్రన్ ధర్మాసనం తెలిపింది. ఈ ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలని ట్రయల్ కోర్టులకు గురువారం ఓ కేసు విచారణ సందర్భంగా స్పష్టం చేసింది.

బెంగాల్‌లో 'సర్' అధికారులకు వేధింపులు.. ఈసీ అఫిడవిట్

ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ 'సర్' కసరత్తులో పాల్గొంటున్న అధికారులు, సిబ్బందికి పశ్చిమ బెంగాల్‌లో అడుగడుగునా వేధింపులు, అవరోధాలు ఎదురవుతున్నాయని సుప్రీంకోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో ఎన్నికల సంఘం ఆరోపించింది. 'సర్' కసరత్తుపై వివిధ రాష్ట్రాల్లో వ్యతిరేకత వ్యక్తమయినప్పటికీ బెంగాల్‌లో మాదిరిగా వేధింపులు, ధర్నాలు మరెక్కడా జరగలేదని తెలిపింది. ఆయా ఘటనలపై ఫిర్యాదు చేసినా రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం, పోలీసులు పట్టించుకోలేదని పేర్కొంది. ఈసీ ఆదేశాలను రాష్ట్రప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే నిర్లక్ష్యం చేసిందని తెలిపింది. 2025లో రూపొందించిన ఎన్నికల జాబితాలను రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో వినియోగించరాదని స్పష్టం చేసింది. 58 లక్షల మంది ఓటర్ల ఆచూకీ లభించకపోవడం/మృతి చెందడం లేదా ఇతర ప్రాంతాలకు తరలివెళ్లడమో జరిగిందని గుర్తించినట్లు ఈసీ వివరించింది.

'సంబంధాలు దెబ్బతినడంతో పెట్టిన రేప్ కేసు ఇది'

పెళ్లి చేసుకుంటానని నమ్మించి తనను మోసం చేశాడంటూ ఓ న్యాయవాదిపై మహిళా న్యాయవాది దాఖలు చేసిన ఎఫ్ఐఆర్‌ను సుప్రీంకోర్టు గురువారం కొట్టివేసింది. పరస్పర సమ్మతితో సంబంధం కొనసాగించి.. తర్వాత సంబంధాలు దెబ్బతినడంతో పెట్టిన రేప్ కేసుగా ఇది స్పష్టంగా కనిపిస్తోందని తెలిపింది. తమ వ్యక్తిగత వైరంలోకి వ్యవస్థను లాగకుండా బాధ్యతగా నడుచుకొని ఉండాల్సిందంటూ ఇరుపక్షాలనూ జస్టిస్ బి.వి.నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌ల ధర్మాసనం మందలించింది. పెళ్లి చేసుకుంటానన్న హామీపై శారీరక సంబంధం కొనసాగించిన ప్రతి కేసులోనూ.. సంబంధాలు దెబ్బతిన్న తర్వాత ఆ వ్యవహారాన్ని అత్యాచారంగా చూడలేమని స్పష్టం చేసింది. ఈ కేసులో ఛత్తీస్‌గఢ్ హైకోర్టు గతంలో జారీ చేసిన ఉత్తర్వులను పక్కనపెట్టి.. ఎఫ్ఐఆర్‌ను కొట్టివేసింది. ప్రస్తుత వ్యవహారంలో ఫిర్యాదుదారు విడాకులు మంజూరు కాకముందే.. భర్తకు దూరంగా ఉంటూ నిందితుడితో సంబంధం కలిగి ఉండటాన్ని గుర్తుచేసింది.

ట్రంప్ పదవీకాలం ముగిసేదాకా వేచిచూస్తామన్నారు

- చర్చల కోసం అజిత్ డోభాల్ గత సెప్టెంబరులో అమెరికా వెళ్లారు
- 'బ్లూమ్‌బర్గ్' కథనం
- ఖండించిన భారత్

దిల్లీ: వాణిజ్య ఒప్పందం చర్చల్లో భాగంగా భారత జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోభాల్ నిరుడు సెప్టెంబరులో అమెరికాకు వెళ్లారని 'బ్లూమ్‌బర్గ్' వార్తా సంస్థ తాజాగా ఓ కథనంలో పేర్కొంది. అప్పుడు అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో తదితరులతో డోభాల్ సమావేశమవగా.. భారత ప్రభుత్వంపై, ప్రధాని మోదీపై అమెరికా ఉన్నతాధికారులు నోరుపారేసుకున్నారని తెలిపింది. అయితే అది నిరాధార కథనం అంటూ భారత్ ఖండించింది. అసలు అందులో పేర్కొన్నట్టు డోభాల్ అమెరికా పర్యటనకు వెళ్లనే లేదని స్పష్టం చేసింది. విదేశీ వ్యవహారాల శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జయస్వాల్ గురువారం విలేకర్ల సమావేశంలో ఈ మేరకు మాట్లాడారు. వాణిజ్య ఒప్పందంపై చర్చల కోసం రూబియోతో డోభాల్‌తో భేటీ కాలేదని చెప్పారు. అమెరికా అధికారులు ఒత్తిడి చేసినప్పటికీ నాటి సమావేశంలో డోభాల్ తలొగ్గలేదని.. వాణిజ్య ఒప్పందం కోసం అవసరమైతే అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ పదవీకాలం పూర్తయ్యేవరకూ వేచి చూస్తామని ఆయన వ్యాఖ్యానించారని బ్లూమ్‌బర్గ్ తన కథనంలో వివరించడం గమనార్హం. మరోవైపు- 140 కోట్ల మంది భారతీయుల ఇంధన భద్రతకే ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యమిస్తుందని విలేకర్ల సమావేశంలో రణధీర్ జయస్వాల్ స్పష్టం చేశారు. రష్యా నుంచి ముడిచమురు కొనుగోలును పూర్తిగా నిలిపివేసే ఆలోచనలేవీ భారత్‌కు లేవని తెలుస్తోంది.

✦ మరోవైపు- నిరుడు డిసెంబరులో ఇరాన్ స్వాధీనం చేసుకున్న వాణిజ్య నౌకలోని 16 మంది భారతీయ సిబ్బందిలో ఎనిమిది మంది ఇప్పటికే విడుదలయ్యారని రణధీర్ జయస్వాల్ తెలిపారు. లాంఛనాలన్నీ పూర్తయ్యాక వారు స్వదేశానికి తిరిగొస్తారని పేర్కొన్నారు. ఇరాన్ అదుపులో ఉన్న మిగిలిన 8 మంది భారతీయ సిబ్బంది విడుదల కోసం ప్రయత్నాలు కొనసాగిస్తున్నట్లు చెప్పారు.

మార్కో రూబియోతో జైశంకర్ భేటీ

అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియోతో భారత విదేశీ వ్యవహారాల మంత్రి ఎస్.జైశంకర్ వాషింగ్టన్‌లో గురువారం భేటీ అయ్యారు. పలు ద్వైపాక్షిక అంశాలపై చర్చలు జరిపారు. ఇరు దేశాల మధ్య చరిత్రాత్మక వాణిజ్య ఒప్పందం చర్చలు తుది దశలో ఉన్నాయని.. చాలా త్వరలోనే అవి ముగియనున్నాయని జైశంకర్ పేర్కొన్నారు. ద్వైపాక్షిక బంధంలో కొత్త దశకు వాణిజ్య ఒప్పందం శ్రీకారం చుడుతుందన్నారు.

ఐరాస సాధారణ బడ్జెట్‌కు రూ.317 కోట్లు చెల్లించిన భారత్

ఐరాస: అంతర్జాతీయ ఉమ్మడి వేదిక అయిన ఐక్య రాజ్యసమితి (ఐరాస) సాధారణ బడ్జెట్‌కు భారత్ తన వంతుగా రూ.317 కోట్లను చెల్లించింది. ఈ చెల్లింపును ఈ నెల 3వ తేదీ నాటికి పూర్తి చేయడంతో సకాలంలో నిధులు అందించిన 47 సభ్య దేశాల గౌరవ జాబితాలో భారత్ చోటు సంపాదించుకుంది. సాధారణ బడ్జెట్‌ను సమయానికి చెల్లించే దేశాల్లో భారత్ ముందు వరుసలో ఉంటోందని ఐరాస సెక్రెటరీ జనరల్ ఆంటోనియో గుటెరెస్ ప్రశంసించారు.

వందేభారత్ ఎక్స్‌ప్రెస్ చక్రాల నుంచి పొగ

చక్రధర్‌పుర్: వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు చక్రాల నుంచి పొగ వస్తున్న విషయాన్ని సకాలంలో గుర్తించడంతో ముప్పు తప్పింది. ఝార్ఖండ్‌లో గురువారం ఈ ఘటన చోటుచేసుకుంది. రైలు హావ్‌డా నుంచి రౌర్కెలా వెళ్తుండగా, తునియా స్టేషన్ సమీపంలో చక్రాల నుంచి పొగ వెలువడుతున్న విషయాన్ని రైల్వే సిబ్బంది గమనించారు. మరమ్మతులు అవసరమని తేలడంతో ప్రయాణాన్ని రద్దు చేశారు. రైలులోని 250 మంది ప్రయాణికులను మరో రైలులో తరలించారు.

10 రోజుల ముందే సోషల్ మీడియా ఖాతాల తొలగింపు

- అక్కాచెల్లెళ్ల ఆత్మహత్య కేసులో మరిన్ని వివరాల వెల్లడి

గాజియాబాద్: 'కొరియానే మా ప్రాణం. మా జీవితం. మమ్మల్ని ఇక్కడి వారికిచ్చి పెళ్లి చేయాలనుకుంటున్నారు. కానీ అది ఎప్పటికీ జరగదు. మీరు కొట్టే దెబ్బలకన్నా చావే ఉత్తమం. అందుకే ఆత్మహత్య చేసుకుంటున్నాం. మమ్మల్ని క్షమించు నాన్న' అంటూ ఉత్తర్ ప్రదేశ్‌లోని గాజియాబాద్‌లో ఆత్మహత్య చేసుకున్న ముగ్గురు అక్కాచెల్లెళ్లు డైరీలో రాసుకున్నారు. దిల్లీలోని నిగమ్ బోధ్ ఘాట్‌లో బుధవారం రాత్రి వారి అంత్యక్రియలు పూర్తి చేశారు. వీరు సోషల్ మీడియాలో కొరియన్ పేర్లతో ఖాతాలు తెరిచినట్లు విచారణలో పోలీసులు గుర్తించారు. ఆత్మహత్యకు 10 రోజుల ముందే వారి సోషల్ మీడియా ఖాతాలను బాలికల తండ్రి తొలగించినట్లు తెలిసింది. మొబైల్ ఫోన్లను లాగేసుకున్నారని పోలీసులు గుర్తించారు. ఈ ముగ్గురు బాలికలు సోషల్ మీడియాలో మరియా, అలీజా, సిండీ అనే కొరియన్ పేర్లతో ఖాతాలు తెరిచారు. ఇంట్లో వీరు అదే పేర్లతో పిలుచుకునేవారట. ఇక, చేతన్‌కు రూ.2 కోట్ల వరకూ అప్పులున్నాయి. విద్యుత్ బిల్లును చెల్లించేందుకు అమ్మాయిల ఫోన్లలో ఒకదాన్ని ఆయన విక్రయించినట్లు పోలీసులు వెల్లడించారు. తండ్రి తమ సోషల్ మీడియా ఖాతాలను డిలిట్ చేయడం, ఫోన్లు అందుబాటులో లేక గేమ్‌లు, కె-డ్రామా సిరీస్‌లు చూడలేకపోవడంతో ఆ ముగ్గురు అమ్మాయిలు తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. అందుకే ఆత్మహత్య చేసుకున్నట్లు డైరీలో పేర్కొన్నారు. గత రెండేళ్ల నుంచి ఈ అమ్మాయిలు స్కూల్‌కు వెళ్లట్లేదని పోలీసులు తెలిపారు. కుటుంబ సభ్యులు వారిని స్కూల్‌కు పంపించే ప్రయత్నం చేయకపోవడం గమనార్హం.

ట్రంప్ ఔషధ దుకాణం!

న్యూయార్క్: ట్రంప్ ఔషధ దుకాణం పెట్టారు. అవును మీరు వింటున్నది నిజమే. కాకపోతే ఆ దుకాణం ఆన్‌లైన్‌లో నడవనుంది. రోగులకు తక్కువ ధరలకు ఔషధాలను అందించేందుకు ట్రంప్ యంత్రాంగం.. ట్రంప్‌ఆర్‌ఎక్స్ అనే వెబ్‌సైట్‌ను గురువారం ప్రారంభించింది. దీనిద్వారా ఔషధాలను నేరుగా తయారీదారుల నుంచే రోగులకు సరఫరా చేయనుంది. ఈ వెబ్‌సైట్ తయారీదారులకు, వినియోగదారులకు మధ్య వారధిగా నిలవనుంది.

యూపీఎస్సీ ప్రిలిమ్స్‌లో ముఖ గుర్తింపు

దిల్లీ: యూపీఎస్సీ ప్రిలిమ్స్ పరీక్షలో అభ్యర్థుల ముఖ గుర్తింపు విధానాన్ని అమలు చేయనున్నారు. మే 24వ తేదీన ఈ పరీక్ష జరగనుంది. పరీక్షా కేంద్రాల్లో ఫేస్ రికగ్నిషన్ ద్వారానే అభ్యర్థులను అనుమతిస్తారు. గురువారం విడుదల చేసిన యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్ (సీఎస్ఈ) 2026 నోటిఫికేషన్‌లో ఈ వివరాలున్నాయి. ఈ ఏడాది సివిల్ సర్వీసుల్లో 933 ఖాళీలను భర్తీ చేయనున్నట్లు యూపీఎస్సీ పేర్కొంది. దరఖాస్తుదారులు ఆధార్ కార్డులను గుర్తింపు కార్డులుగా వినియోగించాలని, దీనివల్ల వెరిఫికేషన్ సులభంగా జరుగుతుందని వెల్లడించింది. ప్రస్తుతం ఐఏఎస్, ఐఎఫ్ఎస్ సర్వీసుల్లో ఉన్నవారు 2026 పరీక్షకు అర్హులు కాదని తెలిపింది.

నైజీరియాలో ఊచకోత.. 200కు పెరిగిన మృతుల సంఖ్య

సొకొటో: నైజీరియాలోని వొరో, నుకు గ్రామాల్లో సాయుధమూకలు సృష్టించిన నరమేధంలో మృతుల సంఖ్య 200కి చేరింది. వీధుల్లో మృతదేహాలు చెల్లాచెదురుగా పడిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. ఇటీవల నైజీరియా సైన్యం ఉగ్రవాదులకు వ్యతిరేకంగా ఈ ప్రాంతంలో ఆపరేషన్లు నిర్వహించి 150 మందిని మట్టుబెట్టింది. ఆ సైనిక చర్యకు ప్రతిస్పందనగానే తాజా దాడులు జరిగాయని క్వారా గవర్నర్ అబ్దుల్ రెహమాన్ తెలిపారు. దీన్ని పిరికిపంద చర్యగా అభివర్ణించారు. కాట్సినా రాష్ట్రంలో కూడా దుండగులు దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో 21 మంది ప్రాణాలు కోల్పోయారని స్థానిక పోలీసులు తెలిపారు.

అల్ ఫలా విశ్వవిద్యాలయ ఛైర్మన్ అరెస్టు

దిల్లీ: వర్సిటీ గుర్తింపు విషయంలో తప్పుడు సమాచారం ఇచ్చి విద్యార్థులను మోసం చేశారనే ఆరోపణలపై హరియాణాలోని అల్ ఫలా విశ్వవిద్యాలయ ఛైర్మన్ జావాద్ అహ్మద్ సిద్దిఖీని దిల్లీ పోలీసులు అరెస్టు చేశారు. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) ఫిర్యాదు ఆధారంగా ఈ చర్య తీసుకున్నట్లు దిల్లీ నేర విభాగం అధికారులు తెలిపారు. అల్ ఫలా అక్రిడిటేషన్ 2018లోనే ముగిసినప్పటికీ ఆ విషయాన్ని దాచిపెట్టి విద్యార్థులను చేర్చుకున్నారని వెల్లడైంది. జావాద్‌ను దిల్లీ కోర్టులో హాజరుపరచగా నాలుగు రోజుల పోలీసు కస్టడీకి పంపించినట్లు అధికారులు తెలిపారు. ఎర్రకోట వద్ద పేలుడు అనంతరం.. అల్ ఫలా విశ్వవిద్యాలయ అక్రమాలపై నేర విభాగం కేసులు నమోదు చేసింది.





బొస్నియాలోని విసెగ్రాడ్‌లో టన్నుల కొద్దీ వ్యర్థాలతో పేరుకుపోయిన డ్రీనా నదిని శుభ్రం చేస్తున్న సిబ్బంది



బడ్జెట్ సమావేశాల సందర్భంగా బుధవారం పార్లమెంటు భవన సముదాయంలో కిందపడి కాలికి గాయం కావడంతో గురువారం చక్రాల కుర్చీలో సభకు వచ్చిన కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్

నాగరికత, ఆధ్యాత్మిక బంధాలతో భారత్, శ్రీలంకలు ముడిపడి ఉన్నాయి: మోదీ

దిల్లీ: లోతైన నాగరికత, ఆధ్యాత్మిక సంబంధాలతో భారత్, శ్రీలంకలు అనుసంధానమై ఉన్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. బుద్ధుడి పవిత్ర అవశేషాలను ప్రదర్శనకు ఉంచేందుకు శ్రీలంకలోని కొలంబోలో ఉన్న గంగరామయ ఆలయంలో చేపట్టిన కార్యక్రమాన్ని శ్రీలంక అధ్యక్షుడు అనూర కుమార దిస్సనాయకే బుధవారం ప్రారంభించారు. ఈ నేపథ్యంలో గురువారం 'ఎక్స్' వేదికగా ఆయనకు మోదీ కృతజ్ఞతలు తెలిపారు. గుజరాత్‌లోని అరావళీ జిల్లాలో ఉన్న దేవ్నీమోరి బౌద్ధ పురావస్తు ప్రదేశానికి చెందిన ఈ బుద్ధుడి అస్థికలను అంతర్జాతీయంగా ప్రదర్శనకు ఉంచడం ఇదే తొలిసారి. గతేడాది ఏప్రిల్‌లో ప్రధాని మోదీ శ్రీలంకకు వెళ్లినప్పుడే బుద్ధుడి అస్థికలను ప్రదర్శనకు ఉంచాలన్న నిర్ణయం తీసుకున్నట్లు కొలంబోలో ఉన్న భారత హైకమిషన్ పేర్కొంది. ఈ నెల 11 వరకు ప్రజల సందర్శనార్థం వీటిని ఉంచనున్నారు.

నిజానికి ప్రధాని భయపడుతున్నారు

- అందుకే అబద్ధాలను ఆశ్రయించారు: రాహుల్

దిల్లీ: నిజానికి ప్రధాని మోదీ భయపడుతున్నారని, అందుకే అబద్ధాలను ఆశ్రయించారని కాంగ్రెస్ అగ్ర నేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ విమర్శించారు. కొన్ని ప్రశ్నలకే ఆయన ఎందుకంత భయపడుతున్నారని నిలదీశారు. తాను అనుకున్నదే నిజమని ఆయన అనుకుంటున్నారని ఎక్స్‌లో రాహుల్ వ్యాఖ్యానించారు. రాజ్యసభలో మోదీ ప్రసంగం ఎన్నికల ప్రచార సభలో చేసినట్లుగా ఉందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ విమర్శించారు. దాడులు, విమర్శలు, అవమానాలు, వక్రీకరణలు, నాటకాలతో నిండిపోయిందని వ్యాఖ్యానించారు.

విధానపరమైన అవకతవకలు

రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ సందర్భంగా లోక్‌సభలో ప్రధాని మోదీ ప్రసంగం లేకపోవడాన్ని విధానపరమైన అవకతవకలుగా కాంగ్రెస్ అభివర్ణించింది. దీనిపై సభకు వివరణ ఇవ్వాలని స్పీకర్ ఓం బిర్లాను కోరింది. ఈ మేరకు స్పీకర్‌కు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ లేఖ రాశారు.

ప్రభుత్వంలో భాగం కావొద్దు

- కుకీ ఎమ్మెల్యేలకు పలు సంఘాల హెచ్చరిక
- ముగ్గురు శాసనసభ్యులపై సామాజిక బహిష్కరణ

ఇంఫాల్: మణిపుర్‌లో కొత్తగా ఏర్పడిన ప్రభుత్వంలో చేరకూడదని కుకీ తెగ ఎమ్మెల్యేలకు ఆ వర్గానికి చెందిన పలు సంఘాలు హెచ్చరిక జారీ చేశాయి. మెయితీ, కుకీ తెగల మధ్య నెలల పాటు ఘర్షణ జరగడంతో ఏడాది కిందట రాష్ట్రపతి పాలనను ప్రకటించిన విషయం తెలిసిందే. తాజాగా బుధవారం భాజపా ఎమ్మెల్యే యమ్నం ఖేమ్‌చంద్ సింగ్ ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. కుకీ వర్గానికి చెందిన నెమ్చా కిప్‌జెన్, నాగా పీపుల్స్ ఫ్రంట్‌కు చెందిన ఎల్ డిఖో ఉపముఖ్యమంత్రులుగా బాధ్యతలు స్వీకరించారు. నెమ్చా కిప్‌జెన్‌తో పాటు, మెయితీ వర్గ ఎమ్మెల్యేలతో కలిసి ఇంఫాల్‌కు వెళ్లిన కుకీ ఎమ్మెల్యేలు ఎల్.ఎం.ఖవుతే, ఎన్‌గుర్సంగ్లుర్ సనాతెలను సామాజికంగా బహిష్కరిస్తున్నట్లు కుకీ సంఘాలు ప్రకటించాయి. దీంతోపాటు చురచంద్‌పుర్‌లో గిరిజన సంస్థ జాయింట్ ఫోరం ఆఫ్ సెవెన్ (జేఎఫ్7) శుక్రవారం ఉదయం 6 నుంచి సాయంత్రం 6 వరకు సంపూర్ణ జిల్లా బంద్‌కు పిలుపునిచ్చింది. ప్రత్యేక కుకీ పరిపాలనా వ్యవస్థను డిమాండ్ చేస్తూ గ్రామగ్రామానా ప్రజాస్వామ్య పద్ధతుల్లో నిరసనల్లో పాల్గొనాలని సూచించింది.

మణిపుర్ కాంగ్రెస్ చీఫ్‌గా మాజీ సీఎం ఒక్రాం ఇబోబి సింగ్

దిల్లీ: మణిపుర్ కాంగ్రెస్ చీఫ్‌గా మాజీ సీఎం ఒక్రాం ఇబోబి సింగ్ నియమితులయ్యారు. ఇప్పటివరకూ ఆయన కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ నేతగా కొనసాగారు. పార్టీ ప్రస్తుత అధ్యక్షుడు కె.మేఘచంద్రను కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ నేతగా నియమించారు.

పాక్ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే మా వీసాలు అడ్డుకుంటోంది

- లండన్‌లోని ఇమ్రాన్‌ఖాన్ కుమారుడు మండిపాటు

లాహోర్: పాకిస్థాన్ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే తమ వీసాలు తిరస్కరిస్తోందని ఆ దేశ మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ మొదటి భార్య కుమారుడు, లండన్‌లో నివసిస్తున్న కాసీం ఖాన్ మండిపడ్డారు. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా ఆయన పోస్టు పెట్టారు. "కొన్ని నెలల నుంచి జైల్లో ఉంటున్న మా తండ్రి ఆరోగ్యం క్షీణిస్తోంది. ఆయనకు చికిత్స అందించకుండా ప్రభుత్వం అడ్డుకుంటోంది. ఇది క్రూరత్వం. ఈ క్రమంలో ఆయన్ను చూడాలని పాకిస్థాన్ వెళ్లేందుకు లండన్‌లో ఉంటున్న నేను, నా సోదరుడు సులేమాన్ ఖాన్ వీసాల కోసం ప్రయత్నిస్తున్నాం. అంతర్జాతీయ మానవ హక్కుల సంస్థలు దీనిపై స్పందించాలి" అని కోరారు.

అంతరిక్షంలో డేటా సెంటర్లు.. 10లక్షల ఉపగ్రహాలు

- మస్క్ కొత్త ప్రణాళిక



ఇంటర్నెట్ డెస్క్: ప్రపంచ అపర కుబేరుడు, టెస్లా, స్పేస్‌ఎక్స్ సంస్థల అధినేత ఎలాన్ మస్క్ తన వ్యాపార సామ్రాజ్యాన్ని మరింత విస్తరించేందుకు కొత్త ప్రణాళికలను ప్రకటించారు. అంతరిక్షంలో డేటా సెంటర్లు ఏర్పాటుచేయాలని యోచిస్తున్నట్లు తెలిపారు. ఇక, కక్ష్యలోకి 10 లక్షల ఉపగ్రహాలను పంపడమే తన లక్ష్యమని వెల్లడించారు. ఈ ప్రణాళికలకు ఆర్థిక సహకారం కోసం ఇటీవల స్పేస్‌ఎక్స్ సంస్థలో తన ఏఐ వ్యాపారాన్ని విలీనం చేశారు. ఈ రెండింటితో కలిసి ఏర్పాటైన సంస్థ త్వరలోనే ఐపీఓకు వెళ్లనున్నట్లు ప్రకటించారు. మస్క్ ప్రణాళికలకు సాంకేతికంగా, ఆర్థికంగా సవాళ్లు ఎదురయ్యే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు, పరిశ్రమ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

కృత్రిమ మేధపై ఐరాస కమిటీలో ఐఐటీ మద్రాస్ ప్రొఫెసర్‌కు చోటు

ఐక్యరాజ్యసమితి: అంతర్జాతీయ స్థాయిలో 40 మంది నిపుణులతో కృత్రిమ మేధపై ఐక్యరాజ్యసమితి కొత్తగా ఏర్పాటు చేయనున్న స్వతంత్ర శాస్త్రీయ కమిటీకి ఐఐటీ-మద్రాస్ ప్రొఫెసర్ ఎంపికయ్యారు. ఈ జాబితాలోని నిపుణులను ఐరాస సెక్రెటరీ జనరల్ ఆంటోనియో గుటెరెస్ స్వయంగా సిఫార్సు చేశారు. మూడేళ్ల పాటు ఈ కమిటీ కొనసాగుతుంది. ఐఐటీ మద్రాస్‌లో డేటా సైన్స్, కృత్రిమ మేధ విభాగం, 'సెంటర్ ఫర్ రెస్పాన్సిబుల్ ఏఐ' అధిపతిగా ఉన్న బలరామన్ రవీంద్రన్, అమెరికాలో ప్రొఫెసర్‌గా పని చేస్తోన్న విపిన్ కుమార్ ఈ జాబితాలో ఉన్నారు. ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ ఆమోదం తర్వాత నిపుణుల కమిటీ మనుగడలోకి వస్తుంది. శాస్త్ర విజ్ఞానాన్ని మరింత ముందుకుతీసుకుపోవడానికి ఏఐని ఎలా ఉపయోగించాలో స్వతంత్ర కమిటీ సూచనలు చేస్తుంది.

దిల్లీ ఏఐ సభకు గుటెరెస్: కృత్రిమ మేధ (ఏఐ)పై ఈ నెల 19-20 తేదీలలో దిల్లీలో అంతర్జాతీయ శిఖరాగ్ర సభను నిర్వహిస్తున్న భారతదేశాన్ని అభినందిస్తున్నట్లు ఐరాస సెక్రెటరీ జనరల్ ఆంటోనియో గుటెరెస్ తెలిపారు. తానూ ఆ సభలో పాల్గొంటున్నట్లు తెలిపారు.

బ్రహ్మంగారి మఠాన్ని వారసత్వ స్మారక కేంద్రాల జాబితాలో చేర్చండి

యునెస్కోకు ఎంపీ పుట్టా మహేష్ వినతి

ఈనాడు, దిల్లీ: కాలజ్ఞాని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి సమాధి అయిన బ్రహ్మంగారి మఠాన్ని ప్రపంచ వారసత్వ స్మారక కేంద్రాల జాబితాలో చేర్చాలని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ యునెస్కోకు విజ్ఞప్తి చేశారు. గురువారం ఆయన ఇక్కడ యునెస్కో అధికారి ఆనంద్‌కాంత్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. "బ్రహ్మంగారు కాలజ్ఞానం ద్వారా సమానత్వం, మానవ విలువలు, సామాజిక సామరస్యాన్ని బోధించారు. ఆ మహనీయుడి బోధనలు విస్తృత ప్రచారం కల్పించేందుకు బ్రహ్మంగారి మఠాన్ని యునెస్కో జాబితాలో చేర్చండి" అని ఎంపీ వివరించారు. ఇందుకు సానుకూల స్పందన వచ్చినట్లు మహేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

ఆయిల్‌పామ్ రైతులకు టన్నుకి రూ.224 అదనపు ధర

మంత్రి అచ్చెన్నాయుడు

ఈనాడు, అమరావతి: ఆయిల్‌పామ్ రైతులకు ఈ నెల గతంలో కంటే టన్నుకు రూ.224 అదనపు ధర చెల్లిస్తున్నామని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. 2025-26 నూనె సంవత్సరంలో 20.01% ఆయిల్ ఎక్స్‌ట్రాక్షన్ రేషియో (ఓఈఆర్)ను ప్రభుత్వం ప్రకటించిందని వెల్లడించారు. దీంతో టన్నుకి రూ.20,680 ధర లభించిందని తెలిపారు. జనవరికి సంబంధించి ధరతో పోలిస్తే ఆయిల్‌పామ్ రైతులకు టన్నుకి రూ.20,456 ధర వచ్చినట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో అధిక ధర లభించడంపై ఆయిల్‌పామ్ రైతుల సంఘం సభ్యులు విజయవాడలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో అచ్చెన్నాయుడిని గురువారం కలిసి ధన్యవాదాలు తెలిపారు.

ఆయుష్ శాఖలో సీనియర్ వైద్యాధికారులకు పదోన్నతులు

ఈనాడు, అమరావతి: ఆయుష్ శాఖ పరిధిలో ఆయుర్వేదం విభాగంలో సీనియర్ వైద్యాధికారులకు ప్రభుత్వం పదోన్నతులు కల్పించింది. 2025-26 ప్యానెల్ సంవత్సరానికి డిపార్ట్‌మెంటల్ పదోన్నతుల కమిటీ(డీపీసీ) సిఫార్సుల మేరకు ప్రభుత్వం ఐదుగురికి పదోన్నతులతోపాటు వివిధ ప్రాంతాల్లో పోస్టింగులు ఇచ్చింది. ఏలూరు ఆయుష్ ప్రాంతీయ ఉప సంచాలకులుగా పి.కృష్ణవేణి, ఒంగోలు ఆయుష్ ప్రాంతీయ ఉప సంచాలకులుగా ఎం.శేఖర్‌బాబు, ఆయుష్ సంచాలకుల కార్యాలయంలో జాయింట్ డైరెక్టర్‌గా... ఆల్ ఇండియా మెడిసిన్ ఇన్‌స్పెక్టర్‌గా డి.రూన్సీల్లక్ష్మీబాయి, విజయవాడలోని డాక్టర్ ఎన్ఆర్ఎస్ ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా పి.జగదీష్, కాకినాడలో నూతనంగా నిర్మించిన ఇంటిగ్రేటెడ్ ఆయుష్ ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా ఎస్.సునీతను నియమిస్తూ గురువారం ఉత్తర్వులు జారీచేసింది.

ఐటీ సంస్థలకు ప్రోత్సాహకాల కింద రూ.75 కోట్లు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో ఐటీ పాలసీ కింద ఏర్పాటు చేసిన కంపెనీలకు ప్రోత్సాహకాలు చెల్లించేందుకు రూ.75 కోట్లు విడుదల చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మొత్తాన్ని ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ అసోసియేషన్ ద్వారా చెల్లించేందుకు అనుమతించింది.

ప్రైవేట్ జూనియర్ కళాశాలల ఏర్పాటుకు నోటిఫికేషన్

ఈనాడు, అమరావతి: వచ్చే విద్యా సంవత్సరంలో కొత్తగా ప్రైవేట్ జూనియర్ కళాశాలల ఏర్పాటుకు ఇంటర్మీడియట్ విద్యామండలి నోటిఫికేషన్ జారీ చేసింది. రాష్ట్రంలో 26 మండలాల్లో 32, రెండు పురపాలికల్లో ఆరు కొత్త కళాశాలల ఏర్పాటుకు యాజమాన్యాలకు అవకాశం కల్పించింది. ఆన్‌లైన్‌లో ఈ నెల 25లోపు దరఖాస్తులు సమర్పించాలని కార్యదర్శి రంజిత్ బాషా తెలిపారు.

కుటుంబ సంక్షేమ శాఖకు రూ.36.65 కోట్లు

ఈనాడు, అమరావతి: వైద్యారోగ్య-కుటుంబ సంక్షేమ శాఖకు కేంద్ర ప్రభుత్వ నిధులకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం వాటా నిధులు రూ.36.65 కోట్లు మంజూరు చేసింది. జాతీయ ఆరోగ్య మిషన్(ఎన్‌హెచ్ఎం) కింద ఆరోగ్య వ్యవస్థ బలోపేతానికి ఈ అదనపు నిధులు వినియోగించేలా పరిపాలన అనుమతిస్తూ గురువారం ఉత్తర్వులు జారీచేసింది.

సెకండరీ హెల్త్ డిప్యూటీ కమిషనర్‌గా సుజాత

ఈనాడు, అమరావతి: సెకండరీ హెల్త్ సంచాలకుల పరిధిలో డిప్యూటీ కమిషనర్‌గా డాక్టర్ పి.సుజాత నియమితులయ్యారు. కడప జిల్లా ప్రొద్దుటూరు జిల్లా ఆసుపత్రిలో సీనియర్ స్పెషలిస్ట్ హోదాలో ఉన్న ఆమెను సెలక్షన్ కమిటీ సిఫార్సు మేరకు ప్రభుత్వం పదోన్నతి కల్పిస్తూ.. వైద్యారోగ్యశాఖ గురువారం ఉత్తర్వులు జారీచేసింది.

9న ఏపీ వైద్య మండలి ఎన్నికలు

13 స్థానాలకు 84 మంది అభ్యర్థుల పోటీ

ఈనాడు, అమరావతి: ఏపీ వైద్య మండలి (ఏపీఎంసీ)కి 20 ఏళ్ల తర్వాత ఎన్నికలు జరుగుతుండటంతో వైద్య వర్గాల్లో ఆసక్తి నెలకొంది. 13 మంది సభ్యుల ఎంపిక కోసం నిర్వహిస్తున్న ఈ ప్రక్రియలో నామినేషన్ల పరిశీలన అనంతరం 84 మంది అభ్యర్థులు పోటీలో నిలిచారు. మూడు ప్యానళ్లుగా 13 మంది చొప్పున పోటీ చేస్తుండగా.. మిగిలిన అభ్యర్థులు విడిగా రంగంలోకి దిగారు. ఈ నెల 9న ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తారు. 10న ఫలితాలు వెల్లడిస్తారు. మండలిలో అర్హులైన వైద్య నిపుణులు 55,504 మంది ఉన్నారు. వీరు కంప్యూటర్/మొబైల్‌లో ఎక్కడి నుంచైనా ఓటు హక్కు వినియోగించుకునేలా తొలిసారిగా ఈ-ఓటింగ్ పద్ధతిలో ఆన్‌లైన్ ద్వారా ఎన్నికలు నిర్వహించనున్నారు.

లాభాలు ఆశ చూపి రూ.6 కోట్లకు టోకరా

ఈనాడు, అమరావతి: తన వద్ద పెట్టుబడులు పెడితే భారీగా లాభాలొస్తాయని ఆశ చూపి ప్రజల నుంచి రూ.ఆరు కోట్ల వరకు వసూలు చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని పల్నాడు జిల్లా కారంపూడికి చెందిన గుండా శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో గురువారం ఫిర్యాదు చేశారు. ఆర్‌ఎండ్‌బీ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, పల్నాడు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఛైర్మన్ చిరుమామిళ్ల మధుబాబు బాధితుల నుంచి వివిధ సమస్యలపై సంబంధిత వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు.

మార్చి నాటికి చినఆవుటపల్లి-గొల్లపూడి బైపాస్ నిర్మాణం పూర్తి

ఈనాడు, దిల్లీ: జాతీయ రహదారి-16లోని విజయవాడ-గుండుగొలను సెక్షన్‌లో భాగంగా చినఆవుటపల్లి-గొల్లపూడి మధ్య 30 కిలోమీటర్ల మేర తలపెట్టిన ఆరు వరుసల విజయవాడ బైపాస్ రోడ్డు నిర్మాణాన్ని మార్చి 31 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు కేంద్ర రహదారి, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. గురువారం లోక్‌సభలో జనసేన ఎంపీ వల్లభనేని బాలశౌరి అడిగిన ప్రశ్నకు ఈ మేరకు ఆయన సమాధానం ఇచ్చారు. రూ.1,148.40 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన ఈ రహదారి పనులు 2021 ఫిబ్రవరి 18 నుంచి మొదలయ్యాయని తెలిపారు. ఇప్పటివరకు 29.57 కిలోమీటర్లు పూర్తయినట్లు వెల్లడించారు. మిగిలిన 0.43 కి.మీ. పనులను మార్చి 31 కల్లా పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు.

డిస్కంల నష్టాలు రూ.29 వేల కోట్లు... అప్పులు రూ.77 వేల కోట్లు

ఆంధ్రప్రదేశ్‌లోని మూడు డిస్కంలకు 2025 మార్చి 31 నాటికి రూ.29,420 కోట్ల నష్టాలున్నట్లు కేంద్ర విద్యుత్తు శాఖ సహాయమంత్రి శ్రీపాద యశోనాయక్ తెలిపారు. అప్పటికి డిస్కంల అప్పులు రూ.77,583 కోట్ల మేర ఉన్నట్లు చెప్పారు. లోక్‌సభలో ఒక ప్రశ్నకు ఈ మేరకు ఆయన సమాధానం ఇచ్చారు. రాష్ట్రంలోని డిస్కంల సగటు సరఫరా, వాణిజ్య నష్టాలు 7.87% ఉన్నట్లు చెప్పారు. 2021 జులైలో ప్రారంభించిన రీవ్యాంప్‌డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీం (ఆర్‌డీఎస్ఎస్)ని అనుసరించి 28 రాష్ట్రాల్లోని 45 డిస్కంలకు స్మార్ట్ మీటరింగ్ పనులు మంజూరుచేసినట్లు తెలిపారు. 2026 జనవరి 1 నాటికి దేశవ్యాప్తంగా 4.19 కోట్ల స్మార్ట్‌మీటర్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఏపీలో 56,08,846 మీటర్లకు గాను 22,88,414 మీటర్లు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

1,629 బస్సు ప్రమాదాలు

ఆంధ్రప్రదేశ్‌లో 2020-2024 మధ్య కాలంలో 1,629 బస్సు ప్రమాదాలు జరిగినట్లు కేంద్ర రహదారి, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. బస్సు ప్రమాదాలపై ఏలూరు లోక్‌సభ సభ్యుడు పుట్టా మహేష్ కుమార్ అడిగిన ప్రశ్నకు ఆయన బదులిచ్చారు. ఇదే సమయంలో దేశ వ్యాప్తంగా 58,987 ప్రమాదాలు జరిగినట్లు చెప్పారు.

◆ ఆంధ్రప్రదేశ్‌లో గత ఆరేళ్లలో 3,443 కిలోమీటర్ల జాతీయ రహదారుల నిర్మాణం జరిగిందని మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. ఇదే సమయంలో రాష్ట్రంలో కొత్తగా 34 టోల్ ప్లాజాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

తూర్పులో హడలెత్తిస్తున్న బెబ్బులి

ఆరు రోజుల్లో 8 పశువులను చంపిన వ్యాఘ్రం

ఈనాడు-రాజమహేంద్రవరం, న్యూస్‌టుడే-రాజానగరం: పెద్దపులి సంచారంతో రాజమహేంద్రవరం పరిసర ప్రాంతాల ప్రజలకు కంటిమీద కునుకు లేకుండాపోయింది. ఆరు రోజుల్లో వివిధ ప్రాంతాల్లో 5 ఆవులు, ఒక గేదె, రెండు దూడలను వ్యాఘ్రం చంపేసింది. దీంతో రాజమహేంద్రవరం శివారు, రాజానగరం మండల ప్రజలు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. బుధవారం అర్ధరాత్రి రాజానగరం మండలం భూపాలపట్నం పరిధిలోని పామాయిల్ తోటలో ఒక ఆవును పులి చంపింది. అక్కడి నుంచి జి.యర్రంపాలెం పరిధిలోని పామాయిల్ తోటలో రెండు ఆవులను చంపడంతో పాటు ఒక దూడను సగం తిని వదిలేసింది. గురువారం అటవీశాఖ అధికారులు అక్కడకు వెళ్లి పరిశీలించారు. దానిని బంధించేందుకు రెస్క్యూ బృందం పుణె నుంచి వచ్చినట్లు తెలిపారు. జి.యర్రంపాలెంలోని కృష్ణారావు కాలనీలో పులి పాద ముద్రలు గుర్తించినట్లు వారు తెలిపారు. కలెక్టర్ కీర్తి చేకూరి, ఎస్పీ నరసింహకిషోర్, సీసీఎఫ్ బి.ఎన్.ఎన్. మూర్తి, డీఎఫ్‌వో ప్రభాకర్‌రావు, ఎఫ్ఆర్వో దావీదు రాజు పామాయిల్ తోటల్లోకి వెళ్లి పరిశీలించారు. ప్రజలు ఆందోళనకు గురికావొద్దని సూచించారు. గురువారం రాత్రికి జి.యర్రంపాలెం, కేశవరం మధ్యలో కొండలపై, ఓ పరిశ్రమ ప్రాంతాల్లో పులి సంచరించినట్లు అధికారులు గుర్తించారు.

◆ పులి కడుపు నిండడంతో తోటల్లో విశ్రాంతి తీసుకునే అవకాశం ఉందని అటవీశాఖ అధికారులు భావిస్తున్నారు. అది చంపిన పశువుల కళేబరాల కోసం ఆ ప్రాంతానికి తిరిగి వచ్చే అవకాశం ఉందని చెబుతున్నారు. జనాలు ఆ ప్రాంతాల్లో ఎక్కువగా తిరగడంతో దాని దిశను మార్చుకుంటోందన్నారు. అది తిరిగే ప్రాంతాలు, పొలాలను పసిగట్టేలా థర్మల్ డ్రోన్ పంపేందుకు ఏర్పాట్లు చేశామని అటవీశాఖ అధికారులు తెలిపారు. అది ఏ స్థితిలో ఉందో గమనించి, మత్తు ఇచ్చి బంధిస్తామన్నారు. పుణె నిపుణుల బృందం, పశు వైద్య నిపుణులు కలిసి రాత్రి 8.30 గంటల సమయంలో తమ ఆపరేషన్ ప్రారంభించినట్లు చెప్పారు.

తెలంగాణలో రెండో వాహనానికి 2% అదనపు పన్ను రద్దు!

- గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన సీఎం...



ఈనాడు, హైదరాబాద్: రెండో వాహనం కొనుగోలు చేసేవారికి 2% అదనపు లైఫ్‌ట్యాక్స్ నుంచి తెలంగాణ ప్రభుత్వం త్వరలో ఉపశమనం కల్పించనుంది. ఈ పన్ను ఎత్తివేతపై రవాణాశాఖ ప్రతిపాదనకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గ్రీన్‌సిగ్నల్ ఇవ్వగా.. త్వరలో ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉందని తెలుస్తోంది. రాష్ట్రంలో ఏటా సగటున 7 లక్షల కొత్త బైకులు, 2.57 లక్షల కార్ల కొనుగోళ్లు జరుగుతున్నాయి. ఇందులో 1.91 లక్షల వరకు 'రెండో' కొనుగోళ్లు ఉంటున్నాయి. వీరంతా అదనపు లైఫ్‌ట్యాక్స్ చెల్లిస్తున్నారు. రెండో వాహనంగా రూ.1.20 లక్షల విలువైన బైక్ కొంటే అదనపు లైఫ్‌ట్యాక్స్ 2% కింద రూ.2,400 కడుతున్నారు. దీని ద్వారా రవాణాశాఖకు ఏటా రూ.80 కోట్ల నుంచి రూ.100 కోట్ల ఆదాయం వస్తోంది. ప్రభుత్వ తాజా నిర్ణయం అమల్లోకి వస్తే ఆ మేరకు ప్రజలపై భారం తగ్గనుంది. కాలుష్య నియంత్రణలో భాగంగా రెండో వాహనం కొనుగోళ్లను తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అదనపు లైఫ్‌ట్యాక్స్‌ను తీసుకొచ్చింది. దీన్ని తప్పించుకునేందుకు చాలామంది తమ కుటుంబసభ్యుల్లోని మహిళల పేరుపై రిజిస్ట్రేషన్ చేయిస్తున్నారు. ఇది బీమా క్లెయిమ్ వంటి సందర్భాల్లో ఇబ్బందులకు కారణమవుతోంది. మరోవైపు జాతీయస్థాయి డిజిటల్ ప్లాట్‌ఫామ్ 'వాహన్'లో చేరాలని రాష్ట్ర ప్రభుత్వం కొంతకాలం క్రితమే నిర్ణయించింది. అందులో అదనపు లైఫ్‌ట్యాక్స్ ఆప్షన్ లేకపోవడంతో.. కొనేవారి పేరు మీద గతంలో వాహనం ఉందా? అన్న విషయాన్ని వెతకడం కష్టమవుతోంది. దీన్ని అరికట్టాలంటే ప్రత్యేక సాఫ్ట్‌వేర్ తయారు చేయించాలి. ఈ వ్యయప్రయాసల్ని రవాణా శాఖ సీఎం దృష్టికి తీసుకెళ్లడంతోపాటు కొన్ని రాష్ట్రాల్లో రెండో వాహనానికి అదనపు పన్ను లేదని వివరించినట్లు సమాచారం. దీంతో దాన్ని తొలగించేందుకు నిర్ణయించినట్లు తెలిసింది.

సర్వ ధర్మ సమ భావనే భాజపా సిద్ధాంతం

పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్



కార్యక్రమంలో భారతమాత చిత్రపటం వద్ద పూలు జల్లుతున్న భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్. చిత్రంలో శాసనమండలి డిప్యూటీ ఛైర్మన్ జకియా ఖానుమ్, మైనారిటీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ బాషా తదితరులు

ఈనాడు, అమరావతి: సర్వ ధర్మ సమ భావనే భాజపా మూల సిద్ధాంతమని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. మైనారిటీలకు భాజపా వ్యతిరేకమనే ముద్ర చెరిపేయాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. విజయవాడలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో గురువారం మైనారిటీ మోర్చా రాష్ట్ర నూతన పదాధికారులు, కార్యవర్గ సమావేశాల్లో మాధవ్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. 'మైనారిటీలంతా దేశ ప్రయోజనాలే పరమావధిగా జాతీయ భావాలు పెంపొందించుకోవాలి. రాష్ట్రంలో అన్ని విభాగాల్లో కంటే మైనారిటీ మోర్చా అత్యంత క్రియాశీలకంగా పనిచేస్తూ ప్రథమ స్థానంలో నిలవడం అభినందనీయం. భాజపా అధికారంలో ఉన్న 20 రాష్ట్రాల్లో మైనారిటీలపై ఎక్కడా దమనకాండ జరగలేదు. గుజరాత్ లాంటి రాష్ట్రాల్లో మైనారిటీలు అభివృద్ధిలో భాగస్వాములు అవుతున్నారు' అని మాధవ్ పేర్కొన్నారు. మైనారిటీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ బాషా అధ్యక్షతన జరిగిన సమావేశంలో శాసన మండలి డిప్యూటీ ఛైర్మన్ జకియా ఖానుమ్, మైనారిటీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు సాదిక్ బాషా, నన్నఫ్ హుసేన్, ఫిరోజ్, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు పి.సురేష్, రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి జయప్రకాశ్, సమన్వయకర్త పాతూరి నాగభూషణం, మీడియా కోఆర్డినేటర్ కిలారు దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

కోరం లేక వక్ఫ్‌బోర్డు భేటీ వాయిదా

ఈనాడు, అమరావతి: సభ్యులు గైర్హాజరవడంతో గురువారం జరగాల్సిన రాష్ట్ర వక్ఫ్‌బోర్డు 13వ సమావేశం వాయిదా పడింది. మొత్తం 11 మంది సభ్యుల్లో ఇద్దరు వైకాపాకు చెందిన వారితో పాటు మరో ఇద్దరు తెదేపాకు చెందిన సభ్యులు, కలెక్టర్ హాజరు కాలేదు. ఇంకో ఇద్దరు సభ్యులు అనారోగ్యం కారణంగా రాలేమంటూ ముందుగానే బోర్డుకు సమాచారమిచ్చారు. దీంతో కోరానికి సరిపడా సభ్యులు లేనందున సమావేశం వాయిదా చేశారు. ఎజెండా ప్రతులు సకాలంలో అందకపోవడంతో ఇద్దరు తెదేపా సభ్యులు గైర్హాజరైనట్లు తెలిసింది. వక్ఫ్ బోర్డు ఛైర్మన్, సభ్యులు, అధికారుల మధ్య సమన్వయం లోపించిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. బోర్డు భేటీ సమాచారం, ఎజెండాను 10 రోజుల ముందే సభ్యులకు ఇవ్వాల్సి ఉండగా, అప్పటికప్పుడు కీలకాంశాలు చేర్చి, బుధవారం రాత్రి అందించారు. దీంతో పలువురు సభ్యులు దూరంగా ఉన్నట్లు తెలిసింది. దీనిపై ఛైర్మన్ అబ్దుల్ అజీజ్ గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. 'వక్ఫ్ బోర్డు ప్రతిష్ఠను దెబ్బతీయాలని కొందరు కుట్రపన్నారు. సామాజిక మాధ్యమాల్లో అసత్య ప్రచారం చేస్తున్నారు. అత్యవసర పరిస్థితుల కారణంగానే పలువురు సభ్యులు రాలేదు. సభ్యులందరికీ వీలైన రోజే సమావేశం నిర్వహించాలని నిర్ణయించి వాయిదా వేశామ'ని తెలిపారు.

జగన్ పర్యటనలో నిబంధనల ఉల్లంఘనపై ఐదు కేసులు

ఈనాడు, అమరావతి: వైకాపా అధినేత జగన్ పర్యటన నేపథ్యంలో అడుగడుగునా నిబంధనలు ఉల్లంఘించడంపై గుంటూరు జిల్లాలోని వేర్వేరు పోలీస్ స్టేషన్లలో ఐదు కేసులు నమోదయ్యాయి. తాడేపల్లి పోలీస్ స్టేషన్‌లో దొంతిరెడ్డి వేమారెడ్డిపై, పెదకాకాని ఠాణాలో నూనె ఉమామహేశ్వరరెడ్డిపై, నగరపాలెం స్టేషన్‌లో నూరి ఫాతిమాపై, నల్లపాడు ఠాణాలో బలసాని కిరణ్ కుమార్‌పై, పట్టాభిపురం స్టేషన్‌లో అంబటి మురళీకృష్ణపై పోలీసులు గురువారం కేసులు నమోదు చేశారు. జిల్లాలో పోలీస్ యాక్ట్-30 అమల్లో ఉందని, రాజకీయ ర్యాలీలు, ప్రదర్శనలకు అనుమతి లేదని పోలీసులు ముందుగానే సూచించారు. అయితే బుధవారం జగన్ పర్యటన అడుగడుగునా నిబంధనలు అతిక్రమిస్తూ సాగింది. దీనిపై ర్యాలీలో పాల్గొన్న వైకాపా నేతలపై ఆయా పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదు చేశారు.

ఏపీ సర్క్యులర్ ఎకానమీ పాలసీ మార్గదర్శకాల ఖరారు

ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

ఈనాడు, అమరావతి: ఏపీ సర్క్యులర్ ఎకానమీ అండ్ వేస్ట్ రీసైక్లింగ్ పాలసీ-4.0 అమలు మార్గదర్శకాలను ఖరారుచేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. పాలసీ నిబంధనలు 2025-30 మధ్య అమలవుతాయని పేర్కొంది. పరిశ్రమల శాఖ డైరెక్టర్, ఏపీఐఐసీ వీసీఎండీ, పీసీబీ ఎండీ, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్, వివిధ శాఖల అధికారులు పాలసీ అమలు మార్గదర్శకాలకు అనుగుణంగా వ్యవహరించాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. రాష్ట్రంలో ఐదు ప్రాంతీయ సర్క్యులర్ ఎకానమీ క్లస్టర్లను అభివృద్ధి చేయాలని, అందులో ఉండాల్సిన మౌలిక సదుపాయాల గురించి పాలసీలో ప్రభుత్వం నిర్దేశించింది. అనంతపురం-శ్రీసత్యసాయి, కర్నూలు-కడప, విశాఖపట్నం-విజయనగరం, కృష్ణా-గోదావరి, శ్రీసిటీ-తిరుపతిలో వాటిని ఏర్పాటుచేసేలా ప్రతిపాదించింది. దీంతో పాటు ఉత్తరాంధ్ర, రాయలసీమలో ప్రాంతీయ పార్కులు ఏర్పాటుచేయాలని పేర్కొంది. ఈ పార్కుల్లో అడ్వాన్స్‌డ్ రీసైక్లింగ్, కో-ప్రాసెసింగ్ లింకేజీలు, ప్లగ్ అండ్ ప్లే సేవలు ఉండాలని సూచించింది.

◆ సర్క్యులర్ ఎకానమీ పార్కుల ఏర్పాటు, నిర్వహణ, పర్యవేక్షణకు అనుసరించాల్సిన విధానాలు.. వ్యర్థాల రికవరీ, రీసైక్లింగ్ కేంద్రాలు, నిల్వ విధానాలు, డిస్పోజల్ సదుపాయాలు, వాహనాల నమోదు లాంటి సౌకర్యాలను కల్పించేందుకు విధివిధానాలను నిర్దేశించింది.

◆ రాష్ట్రంలో బల్క్‌డ్రగ్స్, ఫార్మాస్యూటికల్స్, టెక్స్‌టైల్స్, సిమెంట్, స్టీలు, కెమికల్స్, ఇంజినీరింగ్, ఫుడ్‌ప్రాసెసింగ్, మైనింగ్ రంగాలు వేగంగా విస్తరిస్తున్నాయి. రాష్ట్రంలో 4వేలకు పైగా పరిశ్రమలు ప్రమాదకరమైన, ప్రమాదరహిత వ్యర్థాలను విడుదల చేస్తున్నాయని పీసీబీ నివేదికలో పేర్కొంది.

ఎఫ్‌పీవోలను స్వయం సమృద్ధిగా తీర్చిదిద్దాలి

మంత్రి కొండపల్లి శ్రీనివాస్

ఈనాడు, అమరావతి: రైతు ఉత్పత్తిదారు సంఘాలను (ఎఫ్‌పీవో) స్వయం సమృద్ధి సంస్థలుగా తీర్చిదిద్దాలని సెర్ప్ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. గ్రామీణ జీవనోపాధి అభివృద్ధి కింద కేంద్ర ప్రభుత్వం అమలు చేసే కార్యక్రమాలను ఎఫ్‌పీవోలతో అనుసంధానించాలని ఆదేశించారు. విజయవాడలోని సెర్ప్ కార్యాలయంలో ఆయన గురువారం సమీక్ష నిర్వహించారు. ఎఫ్‌పీవోల అభివృద్ధికి నెల వారీగా రోడ్ మ్యాప్ సిద్ధం చేయాలన్నారు. ఇందులో ఎన్‌జీవోలను భాగస్వామ్యం చేయాలని సూచించారు.

పెట్టుబడుల ఆకర్షణలో ఏపీకి మొదటి స్థానం

తెదేపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్

ఈనాడు, అమరావతి: పెట్టుబడుల ఆకర్షణలో ఏపీ దేశంలో మొదటి స్థానంలో ఉందని తెదేపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ తెలిపారు. ఏ సర్వే చూసినా.. గణాంకాల్ని పరిశీలించినా ఈ విషయం స్పష్టమవుతోందన్నారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. "జగన్ ప్రభుత్వంలో పెట్టుబడిదారులు, పారిశ్రామికవేత్తలు రాష్ట్రాన్ని వదిలి పారిపోయారు. ఇప్పుడు పోటీపడి వస్తున్నారు. కూటమి ప్రభుత్వంపై వారికున్న నమ్మకానికి ఇదో నిదర్శనం. గతంతో పోలిస్తే తలసరి ఆదాయం 12 శాతం పెరిగింది'' అని పేర్కొన్నారు.

ఎమ్మెల్యే అరవ శ్రీధర్‌కు నోటీసులిచ్చి వివరణ తీసుకోండి

రైల్వేకోడూరు పోలీసులకు హైకోర్టు ఆదేశం

ఈనాడు, అమరావతి: తనపై నమోదు చేసిన లైంగిక వేధింపుల కేసును కొట్టేయాలని కోరుతూ రైల్వేకోడూరు జనసేన ఎమ్మెల్యే అరవ శ్రీధర్ అత్యవసరంగా దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు విచారణ జరిపింది. పోలీసులు నమోదు చేసిన సెక్షన్లన్నీ ఏడేళ్లలోపు జైలు శిక్షకు వీలున్న నేపథ్యంలో శ్రీధర్‌కు నోటీసు ఇచ్చి వివరణ తీసుకోవాలని పోలీసులను ఆదేశించింది. వ్యాజ్యాన్ని పరిష్కరించింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి గురువారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చారు. తనను వివాహం చేసుకుంటానని నమ్మించి శారీరకంగా వాడుకుని మోసం చేశారంటూ ఓ మహిళ.. అరవ శ్రీధర్‌పై పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీని ఆధారంగా ఎమ్మెల్యే శ్రీధర్‌పై తిరుపతి జిల్లా రైల్వేకోడూరు పోలీసులు కేసు నమోదు చేశారు. దీన్ని కొట్టేయాలని కోరుతూ శ్రీధర్. హైకోర్టులో పిటిషన్ వేశారు. శ్రీధర్ తరఫున న్యాయవాది టి.నాగార్జునరెడ్డి వాదనలు వినిపించారు.

20 నుంచి పాఠశాలల్లో ఆర్టీఈ ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

ఈనాడు, అమరావతి: విద్యా హక్కు చట్టం కింద 2026-27 విద్యా సంవత్సరానికి ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం కోటా సీట్ల ప్రవేశాలకు సమగ్ర శిక్షా అభియాన్ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరావు షెడ్యూల్ విడుదల చేశారు. ఒకటో తరగతిలో ప్రవేశానికి ఈనెల 20 నుంచి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. http://cse.ap.gov.in వెబ్‌సైట్ ద్వారాగాని, గ్రామ, వార్డు సచివాలయాలు, మండల విద్యా వనరుల కేంద్రం, సంబంధిత పాఠశాల నుంచి దరఖాస్తులు సమర్పించవచ్చు. సందేహాలుంటే టోల్‌ఫ్రీ నంబరు 18004258599 ద్వారా సంప్రదించవచ్చు. ప్రస్తుత చిరునామా ధ్రువీకరణకు తల్లిదండ్రుల ఆధార్, ఓటరు, రేషన్ కార్డులు, భూమి హక్కుల పత్రం, ఉపాధి హామీ జాబ్ కార్డు, డ్రైవింగ్ లైసెన్సు, విద్యుత్తు బిల్లు, అద్దె ఒప్పంద కాపీని ప్రామాణికంగా తీసుకుంటారు. పిల్లల వయసు ధ్రువీకరణ పత్రం సమర్పించాల్సి ఉంటుంది. సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ, ఐబీ పాఠశాలల్లో ప్రవేశాలకు 2020 ఏప్రిల్ 2 నుంచి 2021 మార్చి 31లోపు జన్మించి, ఐదేళ్ల వయసు నిండిన ఉండాలి. రాష్ట్ర సిలబస్ పాఠశాలల్లో ప్రవేశాలకు 2020 జూన్ 2 నుంచి 2021 మే 31 మధ్య జన్మించి ఉండాలి. ప్రవేశాలకు శుక్రవారం ప్రకటన విడుదల చేస్తారు. ◆ ఈ నెల 7 నుంచి 16 వరకు ప్రైవేటు పాఠశాలలు వివరాలను వెబ్‌సైట్‌లో నమోదు చేయాలి ◆ 20 నుంచి మార్చి 10 వరకు విద్యార్థుల ఆన్‌లైన్ వివరాల నమోదు ◆మార్చి 17న గ్రామ, వార్డు సచివాలయాల డేటా ఆధారంగా ప్రవేశాలకు విద్యార్థుల అర్హత నిర్ధారణ ◆ 25న మొదటి విడత సీట్ల కేటాయింపు ◆మార్చి 6 నుంచి ఏప్రిల్ 7 వరకు ప్రవేశాల ధ్రువీకరణ

◆ ఏప్రిల్ 12న రెండో విడత సీట్ల కేటాయింపు

*ఏప్రిల్ 13 నుంచి 23 వరకు పాఠశాలల ద్వారా విద్యార్థుల ప్రవేశాల ధ్రువీకరణ

నిరంతర నిఘాతో అక్రమ మద్యం తయారీని అడ్డుకున్నాం

- నవోదయం 2.0తో సత్ఫలితాలు
- సమీక్షలో ఎక్సైజ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్ర

ఈనాడు, అమరావతి: నవోదయం 2.0 కార్యక్రమంతో రాష్ట్రాన్ని అక్రమ మద్యం తయారీ (ఇలిసిట్ డిస్టిలేషన్(ఐడీ)) రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దామని ఎక్సైజ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. అక్రమ మద్యంతో ప్రజల ఆరోగ్యం, భద్రతకు కలిగే నష్టాన్ని దృష్టిలో ఉంచుకుని 2025 ఫిబ్రవరిలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు పేర్కొన్నారు. కఠిన చర్యల ఫలితంగా 2025 డిసెంబర్ నాటికి రాష్ట్రం ఐడీ రహితంగా నిలిచిందని వెల్లడించారు. భవిష్యత్తులోనూ ఇదే స్థాయిలో నిరంతర నిఘా కొనసాగించాలని అధికారుల్ని ఆదేశించారు. సచివాలయంలో ఎక్సైజ్‌శాఖ పనితీరుపై గురువారం ఆయన సమీక్షించారు. ఆదాయం కంటే ప్రజా సంక్షేమం ముఖ్యమని స్పష్టం చేశారు. ఎక్సైజ్ పాలసీ కింద బార్‌ల కేటాయింపులపై స్పందిస్తూ ఓపెన్ కేటగిరీలో 840 బార్‌లు, గీత కులాలకు 84 బార్‌లు నోటిఫై చేసినట్లు తెలిపారు. మూడు దశల్లో బార్‌లు కేటాయించగా మిగిలిన 107 బార్‌లను త్వరలో నోటిఫై చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఎక్సైజ్, గనులశాఖ ముఖ్యకార్యదర్శి ముకేశ్‌కుమార్ మీనా, ఎక్సైజ్, ప్రొహిబిషన్ డైరెక్టర్ చామకూరి శ్రీధర్, అదనపు కమిషనర్ ఎం.దేవకుమార్, ఏపీఎస్‌బీసీఎల్ జనరల్ మేనేజర్ అనసూయ దేవి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ ఉపప్రణాళిక నిధుల్ని 100 శాతం ఖర్చు చేయాలి: మంత్రి డోలా

ఈనాడు, అమరావతి: ఎస్సీ ఉపప్రణాళిక కింద ప్రభుత్వం కేటాయించిన నిధుల వినియోగంలో జాప్యం ఉండకూడదని, నిర్దేశిత సమయానికి 100 శాతం ఖర్చు చేయాలని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి ఆదేశించారు. పీఎం అజయ్ కింద చేపడుతున్న నూతన వసతిగృహాల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. సచివాలయంలో ఆయన గురువారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. 'అద్దె భవనాల్లో నిర్వహిస్తున్న వసతిగృహాలకు శాశ్వత భవనాల నిర్మాణానికి చర్యలు చేపట్టాలి. వసతిగృహాలు, గురుకులాల్లో త్వరితగతిన సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలి' అని పేర్కొన్నారు.

త్వరలో విద్యుత్తు ఛార్జీల తగ్గింపు

మంత్రి గొట్టిపాటి రవికుమార్



మండపేటలో విద్యుత్తు సబ్‌స్టేషన్‌ను ప్రారంభించిన మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, అధికారులు

మండపేట, న్యూస్‌టుడే: ఎన్నికల ముందు హామీ ఇచ్చినట్లు త్వరలోనే విద్యుత్తు ఛార్జీలు తగ్గిస్తామని ఆ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రకటించారు. యూనిట్‌పై 40 పైసలు తగ్గించాలని నిర్ణయించామని, తొలి విడతలో ఇప్పటికే 13 పైసల తగ్గింపు వర్తింపజేశామన్నారు. త్వరలోనే మిగిలిన మొత్తం తగ్గించి వినియోగదారులకు ప్రయోజనం కల్పిస్తామని పేర్కొన్నారు. తూర్పుగోదావరి జిల్లా మండపేట పట్టణంతో పాటు టేకి గ్రామంలో నిర్మించిన రెండు సబ్‌స్టేషన్లను గురువారం ప్రాంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ట్రూ అప్ ఛార్జీల నుంచి ట్రూ డౌన్ ఛార్జీలు అమలు చేస్తున్నామన్నారు. ఒక్క రూపాయీ ఛార్జీ పెంచకుండా పనిచేస్తున్నామన్నారు. వ్యవసాయదారులకు రాష్ట్రవ్యాప్తంగా 75 వేల కొత్త కనెక్షన్లు ఇచ్చామని, 200 సబ్‌స్టేషన్ల నిర్మాణం ప్రారంభించామని వివరించారు. అసెంబ్లీకి రాకుండా పరామర్శల పేరుతో జనాల్లో తిరగడం జగన్మోహన్‌రెడ్డికే చెల్లిందని ఎద్దేవా చేశారు. ఏదైనా మాట్లాడాలంటే అసెంబ్లీకి రావాలని హితవు పలికారు. కార్యక్రమంలో మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కేంద్రంలో ఓబీసీ మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయాలి

రాజ్యసభలో ఎంపీ ఆర్.కృష్ణయ్య డిమాండ్



ఆర్.కృష్ణయ్య

ఈనాడు, దిల్లీ: దేశంలో 56% జనాభా ఉన్న ఓబీసీల సంక్షేమం చూడటానికి కేంద్రంలో ఓబీసీ మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయాలని భాజపా ఎంపీ ఆర్.కృష్ణయ్య కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయన గురువారం రాజ్యసభ జీరో అవర్‌లో దీని గురించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, మహిళల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రత్యేక మంత్రిత్వ శాఖలు ఉన్నట్లు గుర్తుచేశారు. ఇటీవలి కాలంలో మత్స్య, నైపుణ్యాభివృద్ధి, సహకారశాఖలు ఏర్పాటు చేశారని, కానీ 56% జనాభా ఉన్న ఓబీసీలకు ప్రత్యేక మంత్రిత్వశాఖ లేకపోవడం న్యాయబద్ధం కాదని పేర్కొన్నారు.


ఒమన్‌లో చిక్కుకున్న మహిళకు.. ఎన్నారై తెదేపా అండ

స్వదేశానికి వచ్చేందుకు ఆర్థిక సాయం

ఈనాడు, అమరావతి: ఉపాధి కోసం గల్ఫ్ దేశం ఒమన్‌కు వెళ్లిన అనంతపురం జిల్లా ధర్మవరానికి చెందిన షేక్ అబిదాబేగంను ఎన్నారై తెదేపా ప్రతినిధులు ఆదుకున్నారు. స్థానిక డెక్కన్ వింగ్ సహకారంతో ఆమెకు చికిత్స అందించడంతో పాటు స్వస్థలానికి రావడానికి ఆర్థిక సహాయం అందించారు. కుటుంబ పోషణ నిమిత్తం ఒమన్‌లో పనిచేసేందుకు అబిదాబేగం విజిట్ వీసాపై వెళ్లారు. ప్రయాణ సమయంలోనే తీవ్ర అస్వస్థతకు గురవ్వడంతో విమానాశ్రయ అధికారులు ఆమెను ఆసుపత్రిలో చేర్చారు. 15 రోజుల చికిత్స తర్వాత కోలుకున్నారు. విషయం తెలుసుకున్న ఒమన్ ఎన్నారై తెదేపా ప్రతినిధులు అబిదాకు సహాయం అందించి స్వదేశానికి పంపించారు. ఏజెంట్ తనను మోసం చేసి వర్క్ వీసాకు బదులు విజిట్ వీసాపై ఆ దేశం పంపాడని, తెదేపా ఎన్నారై విభాగం సహాయంతో తాను స్వదేశానికి తిరిగి వచ్చానని ఆమె ఓ ప్రకటనలో తెలిపారు.

ఇన్‌సర్వీస్ ఉద్యోగులకు టెట్ రద్దు చేయాలి

అఖిల భారత ఉపాధ్యాయ సంఘాల ధర్నాలో డిమాండు



దిల్లీలో నిర్వహించిన ధర్నాలో ఏపీ నుంచి పాల్గొన్న ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు

ఈనాడు, దిల్లీ: ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ ఉత్తీర్ణత నుంచి మినహాయింపు ఇవ్వాలని అఖిల భారత టీచర్ల సంయుక్త కార్యాచరణ సమితి గురువారం ఇక్కడి జంతర్ మంతర్‌లో ధర్నా నిర్వహించాయి. విద్యాహక్కు చట్టం అమల్లోకి రాకముందు నియమితులైన ఉపాధ్యాయులు రెండేళ్లలో టెట్ పాస్ కావాలని సుప్రీంకోర్టు తీర్పు వెలువరించిన నేపథ్యంలో ఇప్పటికే విధుల్లో ఉన్న టీచర్లు ఇబ్బందులు పడుతున్నారని, దాన్నుంచి మినహాయింపునిచ్చేలా చట్టం చేయాలని సంఘాల నేతలు డిమాండు చేశారు. తీర్పు వెలువడి 5 నెలలైనా కేంద్రం స్పందించకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తంచేశారు. పాత పింఛను విధానాన్ని అమలు చేయాలని, జాతీయ విద్యా విధానాన్ని ఉపసంహరించాలని, ఏకోపాధ్యాయ పాఠశాలల్లో కనీసం ఇద్దరు టీచర్లు ఉండేలా చూడాలని డిమాండ్ చేశారు. పాఠశాలల మూసివేత, విలీన కార్యక్రమాన్ని నిలిపేయాలని కోరారు. ధర్నాలో ఎస్‌టీయూ ఏపీ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మల్లు రఘునాథరెడ్డి, ఎల్.సాయిశ్రీనివాస్, ఏఐఎస్టీఎఫ్ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు కత్తి నరసింహారెడ్డి, జాతీయ ప్రధాన కార్యదర్శి సదానంద గౌడ్, జాతీయ ఆర్థిక కార్యదర్శి జోసెఫ్ సుధీర్‌బాబు పాల్గొన్నారు.